లక్ష్మీకల్యాణం

పొత్తూరి విజయలక్ష్మి

pustaka.co.in

ఎమెస్కో

లక్ష్మీ కళ్యాణం
శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి

ముద్రణ
జులై, 2008

వెల : **60/-**

ISBN 978-81-906856-2-7

Printing : VAASU OFFSET, VJA-2. Ph : 2438324

ప్రచురణ
ఎమెస్కోబుక్స్
29-13-53, కాళేశ్వరరావు రోడ్డు,
సూర్యారావు పేట, విజయవాడ-2
ఫోన్స్ : 0866-2436643, 98499 92890
www.emescobooks.com
e-mail : emescobooks@yahoo.com

gudachari.com

లక్ష్మీ కళ్యాణం

ఆరోజు ఆదివారం. ఉదయం తొమ్మిది గంటలైంది. అవడానికి ఆగష్టునెలే అయినా ఎండ పేల్చేస్తోంది. టి.వి.లు వున్నవాళ్ళు వాటి ముందు కూర్చున్నారు. లేనివాళ్లు పొద్దుటి పనులు చక్కబెట్టుకుంటూ బిజీగా వున్నారు.

సగటున చదరపు అడుగుకి ఆరుగురు నివసించే ఆ లొకాల్టీలో ఓ రూములో మంచం అనబడే పదార్థంమీద కూర్చుని వున్నాడు ప్రైవేట్ డిటెక్టివ్ సింహం. అలా తీరిగ్గా కూర్చోడానికి అతనేం పనీపాటా లేనివాడు కాడు. సోమరిపోతు అంతకంటే కాడు.

అసలా మాటకొస్తే మహా చురుకైన మనిషి. అతను వృత్తిరీత్యా డిటెక్టివ్ అయినా ఆ పనీ ఈ పనీ అని తేడా లేకుండా చాలా ఉద్యోగాలు చేస్తూ వుంటాడు. మరలాటి ఏక్టివ్ పర్సన్ అంత తీరిగ్గా వుండడానికి బలమైన కారణం వుంది. ఎటువంటి సమస్యనైనా చిటికెలో పరిష్కరించే సింహాన్ని అంతలా ఆలోచింపజేస్తోంది అంటే సమస్య పెద్దదే.

ఆ సమస్యకి కారణం షర్టు.

షర్టు తెలుగులో వాడబడే ఆంగ్లపదం. అర్థంకోసం నిఘంటువులో చూస్తే ఒంటిపై ధరించు వస్త్రము, చొక్కా అని రాసి వుంటుంది.

పూర్వకాలంలో ఈ షర్టులు లేవు. ఫాహియాన్, హుయాన్‌త్సాంగ్ మొదలైన యాత్రీకులు చాలా ఏళ్ల క్రిందట మనదేశాన్ని సందర్శించి సంతోషించి గ్రంథాలు రాశారు.

భారతీయులు కుట్టని వస్త్రములు ధరింతురు అని రాశారు. అంటే చొక్కాలు లేవన్న మాటేగా. మనదేశంలో ఈ షర్టు వాడకం ఎప్పటినుంచీ మొదలయిందో అంతుబట్టక ఆలోచిస్తున్నాడు సింహం.

బహుశ బ్రిటీషువారు వెంట తీసుకొచ్చారా? జాతిపిత గాంధీగారు మొదట్లో షర్టు వేసుకునేవారు. ఆ తరువాత ఎంతోమంది కట్టుబట్టలు లేక అలమటిస్తూ వుంటే అంత బట్ట ఒక్క మనిషే ధరించడం అన్యాయంగా తోచిందాయనకి. అందుకే షర్టు వేసుకోవడం మానేశారు. అయితే ఆ అలవాటు ఆయనకే పరిమితం అయిపోయింది.

మళ్ళీ ఆయన అనుచరుడు నెహ్రూగారు మాత్రం బోలెడంత బట్ట వెచ్చించి కుట్టించిన కోటు తప్ప వేసుకునేవారు కారు. కోటేసుకోవాలంటే బోలెడంత డబ్బుండాలి. అందుకే మామూలువాళ్లు కోట్లేసుకోరు. షర్టులే వేసుకుంటారు. ప్రతి మగాడి దగ్గరా అయిదో, పదో, పదిహేనో, పాతికో షర్టులుంటాయి.

సింహం దగ్గర కూడా మూడు షర్టులున్నాయి. అంటే ప్రస్తుతం లేవు. రెండ్రోజుల క్రిందట దాకా వుండాలి.

ఒకటి తెల్లది. రెండోది ఎర్రది. చివరిది గళ్ళది. తెల్లషర్టు మరీ ఛండాలంగా మాసిపోతే, ఉతుక్కోడానికి సబ్బూ నీళ్ళూ లేక జీవితంలో తొలిసారి చాకలికి వేశాడు. తెల్లారేసరికి ఇస్తాను అని వాగ్దానం చేసిన చాకలి ఎవరో బంధువులు టపా కట్టేస్తే రాత్రికి రాత్రే కొట్టు కట్టేసి వెళ్ళిపోయాడు.

ఎర్రషర్టు మరీ చిరిగిపోయింది. ఇక పనికిరాదని పడేస్తే దారినపోయే గాడిద తినేసింది.

అందుకే చాలా సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు సింహం. కింకర్తవ్యం? అందులోనూ అతను అర్జంట్‌గా వెళ్ళాలి కూడానూ. అదే పారిస్సో, బొంబాయో అయితే అలాగే వెళ్ళిపోయి వుండేవాడు. జనం విరగబడి చూసి అదేదో కొత్త ఫేషన్ అనుకుని వాళ్ళు కూడా షర్టులు పీకిపారేసి అతనిలాగా తిరిగేవారు.

కానీ అది ఆంధ్రదేశంలో ఇంకా సంప్రదాయాలు పట్టుకుని పాకులాడే వాళ్ళు నివసించే ఊరు. అక్కడ అలాటి వెర్రిమొర్రి పన్లు చేస్తే పట్టుకుని తంతారు. ఏం చెయ్యడమా అని దీర్ఘంగా ఆలోచిస్తూ దేవుడిని ప్రార్థించాడు.

దేవుడు కరుణామయుడు. నమ్మినవాళ్ళను కంట కనిపెట్టే వుంటాడు. ఊరికి వెళ్ళిన చాకలి తిరిగి వచ్చేసి కుర్రాడిచేత సింహం షర్టు పంపేశాడు. అది అందుకుని లాటరీ దొరికినంత ఆనందపడిపోయాడు సింహం. వెంటనే షర్టు తొడిగేసుకున్నాడు. సమస్య పరిష్కారం అయిపోయింది తాత్కాలికంగా. శాశ్వతంగా పరిష్కరించాలంటే మరో షర్టు కొనుక్కోవాలి. అంటే డబ్బు కావాలి.

సింహం మరీ అంత బీదవాడేం కాదు. అతని దగ్గరా డబ్బులున్నాయి. ముప్ఫై ఏడు రూపాయల డెబ్భై పైసలు. ఆ డబ్బు వెచ్చించి షర్టు కొనేసుకుంటే తిండి - తీర్థం గడవాలి. అందుకే వెనుతీశాడు.

అతనికెలాగూ డబ్బు రావాలి. అది రాగానే కొనుక్కోవచ్చు. అతనికి ప్రస్తుతం ఓ బ్రహ్మాండమైన కేస్ దొరికింది. చెరువు వీధిలో వుండే సీతారామయ్యగారింట్లో దొంగతనం జరిగింది.

ఆయన భార్య మెడలోని గొలుసు పోయింది. ఆ కేసు చేపట్టాడు సింహం.

చాలా ఈజీకేసు. వాళ్ళింట్లో పనిచేసే అప్పలమ్మే దొంగ. ఏమంత కష్టపడకుండా ఆ విషయం కనిపెట్టేశాడు.

అప్పలమ్మ మీద పోలీసు రిపోర్టు ఇచ్చారు సీతారామయ్యగారు. వాళ్ళు అప్పలమ్మని అరెస్ట్‌చేసి తీసికెళ్ళారు క్రితం రోజే.

ఈ కేస్‌కి ఎడ్వాన్స్‌గా యాభై రూపాయలిచ్చాడాయన. నగ దొరికితే ఇంకా ఇస్తానని కూడా చెప్పాడు. దొంగ దొరికింది కాబట్టి నగా దొరికే వుంటుంది. వెళ్ళి కనుక్కురావాలి. షర్టువల్ల ఆలస్యం అయిపోయింది.

షర్టు వేసుకుని బయలుదేరుతూ వుండగా మాధవ్ వచ్చాడు. బయటికి వెళ్తూ వుండగా వచ్చిన మనిషిమీద కోపంరాలేదు సరికదా ఆనందం వేసింది. ఎందుకంటే వచ్చినవాడు మరెవరో కాదు. అతని ప్రాణంలో ప్రాణం అయిన మాధవ్.

వాళ్ళిద్దరికీ స్వభావాలకి హస్తిమశకాంతరం.

ఎటువంటి పరిస్థితులలోను ధైర్యం కోల్పోని ధీశాలి సింహం. కాస్త అటూ ఇటూ అయితే బెంబేలెత్తి గుడ్లనీళ్ళు కక్కుకునే మెతక మనిషి మాధవ్.

తగాదాలలో తలదూర్చి పరిష్కరించే అలవాటు సింహానిది. ఆపదకు ఆమడ దూరం పారిపోయే పిరికితనం మాధవ్‌ది.

చాతనైతే నాలుగు తన్నులు తిని అయినా ఇతర్లకు సాయం చెయ్యాలనే నిర్ణయం సింహానిది. ఎవరి గొడవలో మనకెందుకు? మన బ్రతుకు మనం బ్రతికితే చాలు అనే ఆలోచన మాధవ్‌ది.

వారి ఆలోచనల్లో ఇన్ని తేడాలున్నా వారిద్దరికీ అంత ప్రాణస్నేహం కలవడానికి కారణం అయిన సిమిలారిటీస్ కూడా చాలా వున్నాయి. ఇద్దరూ పుట్టుకతో అనాథలు. ఇద్దరికీ పెద్ద చదువులు, డిగ్రీలు లేవు. ఇద్దరికీ తుమ్మితే ఊడిపోయే అణాకానీ ఉద్యోగాలే.

కాబట్టి వారి స్నేహం దినదిన ప్రవర్ధమానంగా నడిచిపోతోంది. ఇద్దరూ చెరో రూమ్‌లోనూ వుంటారు. ప్రతిరోజూ ఏదో ఓ సమయంలో కలుసుకుంటూ వుంటారు. కష్టసుఖాలు మాట్లాడుకుంటూ వుంటారు.

స్నేహితుడిని చూడగానే చాటంత మొహం చేసుకుని ఆహ్వానించాడు సింహం. "రారా సమయానికి వచ్చావు. పద, సీతారామయ్యగారింటికి వెళ్దాం" అన్నాడు. ఆ సీతారామయ్యగారి కేసు గురించి మాధవ్‌కి చిరపరిచితమే.

audachan.com

నిజానికి అతనికి ఆ కేసులూ గట్రా అంటే తలనెప్పి, భయం. అయినా స్నేహితుడికి చాలారోజుల తర్వాత దొరికిన కేసుకాబట్టి అతని ఉత్సాహం పాడుచెయ్యటం ఇష్టంలేక జాగ్రత్తగా విన్నాడు.

సీతారామయ్యగారింట్లో దొంగతనం జరిగింది. ఆయన భార్య ఉదయం పదిగంటలకి ఎవరింట్లోనో సత్యనారాయణ వ్రతానికి పిలిస్తే వెళ్ళాలనే ప్రయత్నంలో బీరువాలోంచి పట్టుచీరె, జాకెట్టు, చంద్రహారం తీసి మంచంమీద పెట్టి తిరిగి వచ్చి చూసేసరికి చీర, జాకెట్టు భద్రంగా వున్నాయి. గొలుసు మిస్సింగ్.

కేసు టేకప్ చేసిన సింహం అందర్నీ ప్రశ్నించి వివరాలు రాబట్టాడు. మంచానికి కాస్త దూరంలో కిటికీ వుంది. ఆ కిటికీలో ఆవకాయ మరకలున్నాయి.

ఆ క్లూని ఆధారంగా తీసుకుని పరిశోధించి ఇంటికి వెళ్ళబోతూ ఆవకాయ అడిగి తీసుకున్న అప్పలమ్మ కిటికీలోనించి గొలుసు దొంగిలించిందని కనిపెట్టేశాడు సింహం.

ఇదంతా మాధవ్‌కి కూడా జ్ఞాపకం వుంది. అందుకే సింహం సీతారామయ్య గారింటికి వెళ్దాంఅంటే మారు మాట్లాడకుండా అంగీకరించాడు. అంతేకాదు మరోసారి మిత్రుడిని మెచ్చుకున్నాడు.

"ఈ కేస్ సక్సెస్ అయితే డబ్బుతో బాటు పేరు కూడా వస్తుంది నాకు. ఇలా నలుగురికీ తెలిసి నాలుగుకేసులొస్తే ఇక డబ్బుకి లోటుండదు. మనం కూడా దర్జాగా బ్రతకొచ్చు." అంటూ భవిష్యత్తుని తల్చుకుని ఆనందపడిపోయాడు సింహం.

'పద వెళ్దాం!' అంటూ మిత్రుడిని తొందర పెట్టేశాడు. అంతలోనే వాకిట్లోంచి ఎవరో పిల్చారు. వాకిట్లోకి వెళ్ళారు ఇద్దరూ.

ఒడ్డూ, పొడుగూ ఆబోతులా వున్నాడు ఒక మనిషి. "ఇక్కడ దొంగల్ని పట్టే ఆయన వున్నాడుట. ఎక్కడుంటాడో తెలుసా" అంటూ ప్రశ్నించాడు. కళకళలాడింది సింహం మొహం. సీతారామయ్యగారు పంపించి వుంటారు నాకోసం అంటూ మిత్రుడి దగ్గర గుసగుసలాడి ఉత్సాహంగా ముందుకి వెళ్ళాడు.

"అవును నేనే ఆ మనిషిని. నిన్ను సీతారామయ్యగారు పంపించారా?" హుషారుషారుగా ప్రశ్నించాడు.

మరుక్షణం సింహం కాలరు ఆ ఆబోతు చేతుల్లో చిక్కుకుంది. కాళ్ళు గాల్లోకి తేలిపోయాయి.

"ఎవడ్రా నువ్వు, నా పెళ్ళానికి దొంగతనం అంటగడతావా? ఈ హనుమాన్లు సంగతి నీకు తెలీదు. మక్కెలిరగదన్నేస్తాను. ఏ కీలుకాకీలు విరిచి అవతల పారేస్తాను.

నువ్వు చూశావుట్రా నా పెళ్ళం దొంగతనం చెయ్యడం?" రంకెలు వేస్తూ నాలుగు తగిలించాడు.

ఇదంతా చూస్తున్న మాధవ్ బెదిరిపోయి రోడ్డుమీదికి పరిగెట్టి 'రక్షించండి నాయనోయ్ చంపేస్తున్నాడు బాబోయ్' అంటూ శోకాలు మొదలుపెట్టాడు.

జనం పోగయ్యారు. హనుమాన్లు చేతుల్లోంచి సింహాన్ని విడిపించారు.

"ఏమిటయ్యా! ఎందుకతన్ని కొడుతున్నావ్?" అని ప్రశ్నించారు.

"వీడు ఓ వెధవ. అన్యాయంగా నా ఇంటిదానికి దొంగతనం అంటగట్టి పోలీసులకి అప్పజెప్పాడు. అదసలే నిప్పులాంటిది. ఏనాడూ దొంగతనం ఎరగం. వీడిని నరికేస్తా" అంటూ ఆవేశంగా చెప్పసాగాడు హనుమాన్లు.

తన షర్టు కాలరు అతని చేతుల్లోంచి బయటపడగానే బోలెడంత ధైర్యం వచ్చింది సింహానికి. మెరుపులా జనం నుంచి తప్పించుకుని వేగంగా పరిగెట్టాడు. ఏడుపు ఆపుకుంటూ అతడిని అనుసరించాడు మాధవ్.

వాళ్ళు పరిగెడుతున్నారని గమనించి వెంటబడ్డాడు హనుమాన్లు. కానీ అప్పటికే ఆలస్యం అయిపోయింది. "నా దగ్గరున్నుంచి తప్పించుకుని పోలేర్రోయ్. వెతికి పట్టుకుని ఎముకలు విరిచేస్తా" అంటూ రంకెలు వేస్తున్న హనుమాన్లు గొంతు క్రమ క్రమంగా దూరం అయిపోయింది.

సందులూ గొందులూ తిరుగుతూ పరిగెట్టి వాడు తమ వెంట రావడంలేదని రూఢి చేసుకుని ఆగారు మిత్రులిద్దరూ. పార్కులోకి పోయి చెట్టు చాటున కూలబడ్డారు. కాస్త ఆయాసం తీర్చుకుని కంఠం విప్పాడు సింహం.

"ఒరే మాధవా! వాడొచ్చి నన్ను పట్టుకుని వాయించేస్తూ వుంటే అలా నిలబడి పోయావేంరా?" నిలదీశాడు సింహం.

"ఏం చెయ్యమంటావ్. అసలు వాడినీ, వాడి ఆకారాన్నీ చూడగానే నా పై ప్రాణం పైనే పోయింది. వాడలా నీపీక పట్టుకుని గాల్లోకి ఎగరేసేసరికి కళ్ళు తిరిగాయి. అప్పటికీ తెలివి తెచ్చుకుని కేకలు వేశాను" - చెప్పాడు మాధవ్.

"ఏడవలేకపోయావ్. అలా ఏడిచి జనాన్ని పోగుచేసే బదులు నాకు సాయం వస్తే ఇద్దరం కలిసి వాడిని పచ్చడి చేసేవాళ్ళం!"

"ఆ! చేసేవాళ్ళమే పచ్చడి! వాడి చేతుల్లో పచ్చడి కాలేదు. అదే పదివేలు" అంటూ గాల్లోకి నమస్కారం చేశాడు మాధవ్.

gudachari.com

"ఆ వాడి మొహం. మన వృత్తికి ఇవన్నీ సర్వసాధారణం. దొంగని దొంగ అంటే కోపం రాదూ మరి. అందుకే ఆవేశంలో అలా విరుచుకుపడ్డాడు" తేలిగ్గా తేల్చేసాడు సింహం.

"ఆ ఆవేశం తాత్కాలికం అయితే ఫర్వాలేదు. వాడేమో ఎముకలన్నీ విరగ్గొట్టేసి గానీ వదలనని ఘంటాపదంగా చెప్తున్నాడు మరి. ఏం చేద్దాం? ఎన్నాళ్ళని తప్పుకు తిరుగుతావ్?" అడిగాడు మాధవ్.

"తప్పుకు తిరగాల్సిన ఖర్మ మనకేవిట్రా! ఈ సమస్యకు పరిష్కారం అప్పుడే ఆలోచించేశాను. విను. అసలీ హనుమాన్లు ఎవడు? సీతారామయ్యగారింట్లో పనిచేసే అప్పలమ్మకి భర్త. ఒకవిధంగా చూస్తే ఇతడూ సీతారామయ్యగారికి నౌకరే. ఆయనంటే భయభక్తులు వుండే వుంటాయి.

కాబట్టి సీతారామయ్యగారి దగ్గరకు వెళ్ళి ఇదండీ విషయం అని చెప్దాం. ఆయన వెంటనే వీడిని పిలిపించి మొహం వాచేలా చీవాట్లు వేస్తారు. దాంతో వాడి ఆట కట్టు.

చేసిన వెధవ పనికి మనకు క్షమాపణ చెప్పుకుంటాడు. మనం హుందాగా క్షమించేద్దాం. ఆ తర్వాత ఫీజు అందుకుని దర్జాగా హోటల్లో భోజనం చేసి వద్దాం", అంటూ, దివ్యమైన ఉపాయం చెప్పాడు సింహం.

మాధవ్‌కి కాస్త భయం తగ్గింది. "మరైతే ఆలస్యం ఎందుకు పద!" అన్నాడు. ఇద్దరూ కలిసి చుట్టూ చూస్తూ జాగ్రత్తగా సీతారామయ్య గారింటికి చేరారు.

తలుపు తీసే వుంది. వాకిలి దగ్గర ఆగి "సీతారామయ్యగారూ" అంటూ రెండు మూడు సార్లు పిలిచారు. లోపలినుంచి సమాధానం రాలేదు. ఇంట్లో నాలుగైదు గొంతులు కలగాపులగంగా మాట్లాడుకోడం వినిపిస్తోంది.

"పద లోపలికి వెళ్దాం!" లోపలికి దారితీసాడు సింహం.

ముందుగది ఖాళీగా వుంది. దాని పక్కగదిలోంచి మూలుగు వినిపిస్తుంటే అటు వెళ్ళారు ఇద్దరూ. అక్కడ దృశ్యం చూసి కంగారు పడిపోయాడు సింహం.

సీతారామయ్యగారి బావమరిది మంచం మీద పడుకుని వున్నాడు. నుదుటి మీద ఇంటూ ఆకారంతో ఓ ప్లాస్టరూ, బుగ్గమీద మైనస్ ఆకారంతో ఓ ప్లాస్టరూ అంటించి వున్నాయి. మూతి వాచిపోయి వుంది. గడ్డంమీద ప్లస్ ఆకారంతో ఓప్లాస్టరుంది. అసలతను అతనే అని గుర్తుపట్టడం కష్టం. సింహం డిటెక్టివ్ కాబట్టి గుర్తించగలిగాడు.

సింహాన్ని చూడగానే అతని మొహంలో చెప్పలేనంత మార్పు వచ్చింది. ఏదో మాట్లాడాలని ప్రయత్నించాడు కానీ సాధ్యంకాక మూలిగాడు.

"ఏమిటండీ? ఏం జరిగింది? ఏక్సిడెంటా? స్కూటర్ మీది నుంచి పడ్డారా? హెల్మెట్ వేసుకోలేదూ!" కంగారుగా అడిగాడు సింహం.

సమాధానంగా హెచ్చుస్థాయిలో మూలిగాడాయన. ఇతడిని ఏం అడిగినా మూలగడం తప్ప మాట్లాడలేడని గ్రహించాడు మాధవ్.

"అసలే ఆయనలా బాధపడుతుంటే ప్రశ్నలేసి మరింత బాధపెడతావేం? ఇంకెవరినైనా అడుగుదాం పద", అన్నాడు మాధవ్. తలాడించాడు సింహం.

ఇద్దరూ కలిసి మాటలు వినిపిస్తున్న గదిలోకి వెళ్ళారు. మరి అడుగు ముందుకి పడలేదు. అక్కడ పరిస్థితి మరింత గంభీరంగా వుంది.

ఇంటి యజమాని సీతారామయ్యగారు మంచంమీద పవళించి వున్నారు. కుడిచేతికి, కుడికాలికి బేండేజీలు కట్టి వున్నాయి. కాస్త దూరంలో ఆయన భార్య కూర్చుని ఏడుస్తోంది. పక్కనున్న ఆడవాళ్ళు ఓదారుస్తున్నారు.

సీతారామయ్యగారి కాలూ చెయ్యీ విరిగాయి కాని, నోరు చండప్రచండంలా పనిచేస్తోంది. సింహాన్ని చూడగానే నోరు విప్పాడాయన.

"ఏం నాయనా వచ్చేవా? పొద్దుటి నించీ నిన్నే తల్చుకుంటున్నాను" అన్నాడు.

"ఎందుకండి!! దొరికిందా?" ఆత్రంగా అడిగాడు సింహం.

"దొరికింది నాయనా దొరికింది. మంచం నవారులో పడివుంది. నీ పరిశోధన పుణ్యమా అని పోలీసులకి పట్టించామా అప్పలమ్మని!"

నిన్నరాత్రి దాని మొగుడొచ్చి నా పెళ్ళానికి దొంగతనం అంటగడతారా అని నన్ను ఇదిగో ఇలా వాయించేశాడు. అడ్డం వచ్చిన నా బావమరిది మొహం పచ్చడిచేశాడు.

ఇవాళ పొద్దున్నే పోలీసులొచ్చి మా పీకల మీద కూర్చున్నారు. గొలుసు మీ ఇంట్లోనే పెట్టుకుని అనవసరంగా మమ్మల్ని ఇబ్బంది పెడతారా అని పోలీసు భాషలో తిట్టారు. స్టేషనుకి రమ్మని గొడవ పెడుతుంటే అయిదొందలు ముడుపు చెల్లించి ఎలాగో వదిలించుకున్నాను.

నీ మొహం మండ. ఇదేం పరిశోధనయ్యా మహానుభావా, బుద్ధి గడ్డితిని నిన్ను పిలిపించాను", అంటూ జరిగినదంతా చెప్పి కుయ్యో మొర్రోమని మూలగడం మొదలుపెట్టాడు.

gudachari.com

ఆ పరిస్థితిలో ఆయనకు తన సానుభూతిని చూపించడం వల్ల గానీ, ఆయనతో తనొచ్చిన పని చెప్పటం వల్లగానీ పెద్దగా ప్రయోజనం వుండదేమో అనిపించింది సింహానికి.

అందుకే తలొంచుకొని వెనుదిరిగాడు. తోకలా అతని వెంటే బయలుదేరాడు మాధవ్. వెనుకనించి పిలిచింది ఆ ఇంటి ఇల్లాలు.

"ఆ మొరటు వెధవ నిన్నెక్కడున్నా వెతికి పట్టుకుని ప్రాణాలు తీస్తానని ప్రతిజ్ఞ చేసి పోయాడు. ఎందుకైనా మంచిది నీ జాగ్రత్తలో నువ్వుండు" ఆడమనసు. అందుకే జాగ్రత్త చెప్పింది. బుద్ధిగా తలాడించాడు సింహం.

ఇద్దరూ మళ్ళీ పార్కుకి చేరారు. వెల్లికిలా పడుకుని ఆకాశం వంక చూస్తూ దీర్ఘాలోచనలో మునిగిపోయాడు సింహం. అతన్నలా చూసేసరికి జాలివేసింది మాధవ్‌కి.

"ఒరే సింహం, నువ్వేం బాధపడకురా!" ఓదార్చబోయాడు.

నవ్వేశాడు సింహం. "నామొహంలా వుంది. ఇందులో బాధపడాల్సిన విషయం ఏముందీ? నేనోరకంగా అనుకున్నాను. అదింకోరకంగా అయింది. అంతేగా! అసలైనా నా వృత్తిలో ఇలాటివన్నీ మామూలే. ఇలాటి సంఘటనలు ఎదురౌతూ వుంటే మరింత అనుభవం వస్తుంది నాకు" అన్నాడు.

అతని నిబ్బరం చూస్తే ఆశ్చర్యం వేసింది మాధవ్‌కి.

"సింహం! నీకు భయం వెయ్యడంలేదుట్రా! అవతల ఆ హనుమాన్లు నీ ప్రాణం తీస్తానని ప్రతిజ్ఞ చేశాడు. వాడసలే మొరటు వెధవ. పాపం ఆ బావమరుదులిద్దరికీ ఏ గతిపట్టించాడో చూశావుగా!" గుర్తు చేశాడు.

అయినా ఏమీ చెదరలేదు సింహం. "ఆ వాడి మొహం. ఇందాక వచ్చాడుగా నామీదికి! ఏం చెయ్యగలిగాడు? ఒక్కటి వేసేసరికి తప్పించుకుని వచ్చేశాను నేను" గర్వంగా చెప్పాడు.

ఇంకేం చెప్పాలో తెలియక ఊరుకున్నాడు మాధవ్. ఆ పగలంతా అక్కడే గడిపేశారు మిత్రులు. రాత్రి పొద్దుపోయాక హోటల్లో ఏదో కాస్త తిని ఇంటి దారి పట్టారు.

"నిన్ను దించి వెళ్తాను పద" అన్నాడు మాధవ్. సింహం రూమ్ ఇంకా అంత దూరం వుండగానే మాటలూ నడకా ఆపేసి నిలబడిపోయారు మిత్రులిద్దరు. రూమ్ బయట కూర్చుని సిగరెట్ కాలుస్తున్న వ్యక్తి హనుమాన్లని స్పష్టంగా తెలిసిపోయింది.

ముచ్చెమటలు పట్టాయి మాధవ్‌కి. "వాడు నాకోసం కాపు వేశాడు. ఇప్పుడు అక్కడికి వెళ్ళడం అంత సేఫ్ కాదు. పద నీ రూమ్‌కి వెళ్దాం!" మెల్లిగా చెప్పాడు సింహం.

తలాడించాడు మాధవ్. ఇద్దరూ నిశ్శబ్దంగా వెనక్కి తిరిగారు.

మాధవ్ గదికి చేరారు. చెరో గ్లాసూ మంచినీళ్ళు తాగి చాప పరుచుకుని పడుకున్నారు.

"చూస్తుంటే వాడు తన ప్రతిజ్ఞ నెరవేర్చుకోవాలని గట్టి పట్టు బట్టినట్లు వున్నాడు. ఎలారా సింహం!" గద్గద కంఠంతో ప్రశ్నించాడు మాధవ్.

"ఆ వాడి తలకాయ. పన్లన్నీ మానుకొని నాకోసం ఎన్నాళ్ళు కూర్చుంటాడు? ఒకరోజు కూర్చుంటాడు. రెండ్రోజులు కూర్చుంటాడు. తరువాత విసుగేసి వాడే మానేస్తాడు. ఆ నాల్రోజులూ నేనిక్కడే అజ్ఞాతవాసం చేస్తాను. ఇక ఆ విషయం వదిలెయ్. నిద్రొస్తోంది పడుకో" అనేసి గుర్రెట్టి నిద్రపోయాడు సింహం.

మాధవ్‌కి మాత్రం నిద్ర రాలేదు. ఏమాత్రం అలికిడి అయినా అదిరిపడి లేస్తూ జాగారం చేశాడు. తెల్లవారుతూ వుండగా కునుకు పట్టింది.

దబదబ శబ్దం అయింది. సడన్‌గా జరిగింది అంతా గుర్తొచ్చి చచ్చేంత భయం వేసింది మాధవ్‌కి. ఎవరు? ఎవరది? ప్రశ్నించాడు. సమాధానం రాలేదు. మరింత గట్టిగా శబ్దం అయింది. మాధవ్ గుండె దడదడలాడింది. మెల్లిగా సింహాన్ని లేపి పరిస్థితి టూకీగా వివరించాడు.

అనుమానంగా చూశాడు సింహం. ఎవరూ? ఏం కావాలి? అంటూ గట్టిగా అరిచాడు.

సమాధానంగా హెచ్చుస్థాయికి తలుపు శబ్దం అయింది. సింహానికి కూడా అనుమానం వచ్చింది. వెంటనే ఎలర్ట్ అయిపోయాడు.

"ఒరేయ్! ఇక మనం భయపడి లాభం లేదు. ఎదురు తిరగాల్సిందే" అని అప్పటికప్పుడే ఒక ప్లాన్ తయారుచేసి ఏం చెయ్యాలో మాధవ్‌కి సూచనలు ఇచ్చాడు.

"నా వల్లకాదు, నాకు భయం" అన్నాడు మాధవ్.

"భయపడుతూ కూర్చోడానికి టైమ్ లేదు. అంతగా కావలిస్తే పనయిపోయాక భయపడు. ప్రస్తుతానికి పద" అంటూ రెక్క పట్టి లేవదీసి వెనక తలుపు తీసుకొని చల్లగా బయటికొచ్చి ఇంటిమీదికి చిరతలా ఎక్కేశాడు సింహం.

అతను ఆదేశించిన ప్రకారం మూలనున్న కర్ర తీసుకుని తలుపు దగ్గరకు వచ్చి కర్ర పట్టుకుని రెడీగా నిలబడ్డాడు.

gudachari.com

మళ్ళీ తలుపు శబ్దం అయింది. మెరుపులా తలుపుతీసి ధైర్యం తెచ్చుకుని కర్ర ఎత్తి ఎదుటి వ్యక్తి తలమీద కొట్టబోతూ కెవ్వున అరిచాడు మాధవ్.

ఎదురుగా ఇంటి ఓనరు రావుగారు.

అదే క్షణంలో ఇంటిమీద ఎక్కిన సింహం హనుమంతుడిలా రావుగారి మీదికి దూకేశాడు. అంత లావు మనిషి అమాంతం మీద పడేసరికి కీచుమని అరిచాడు రావుగారు.

క్షణంలో అంతా జరిగిపోయింది. తను ఎటాక్ చేసిన మనిషి హనుమాన్లు కాదని తెలుసుకుని చాలా చింతించాడు సింహం. ఆయన్ని లేవదీశాడు.

అప్పటికి కాస్త తేరుకున్నాడు మాధవ్. "వీరు మా ఇంటి ఓనర్ రావుగారు. సార్! వీడు నా స్నేహితుడు సింహం" కర్ర అవతల పారేసి పరిచయం చెయ్యబోయాడు సింహం.

ఆయనకు తిక్క రేగింది. అసలే ఆయనకు ముక్కు మీదుంటుంది కోపం. మాట్లాడితే కోపం. అసలు మాట్లాడకపోతే మరీ చిరాకు. సవాలక్ష రూల్స్ పెట్టి టెనెంట్స్‌ని కాల్చుకు తింటాడు. అసలాయనకు భయపడి ఆమడదూరాన వుంటాడు మాధవ్.

ఆయన తెల్లారాక స్నానం ముగించి వాకిట్లో పచార్లు చేస్తుండగా మధ్య గది తలుపు శబ్దం వినిపించింది. ఆయనకి కోపం వచ్చింది. ఎవరో వచ్చి తలుపులు విరిగేలా బాదేస్తుంటే ఎంతకీ తలుపు తియ్యడేం ? మరి కాస్త వుంటే ఆ తలుపు కాస్తా విరిగిపోతుంది. అప్పుడు తనకే బోలెడంత ఖర్చు. చిరాగ్గా అటు వెళ్తుండగానే మరో ఆశ్చర్యకరమైన దృశ్యం కనిపించింది. వెనక తలుపు తెరుచుకుని ఎవరో ఆగంతకుడు గదిలోంచి వచ్చి ఇంటిమీదకి ఎక్కాడు.

మరింత కోపం వచ్చిందాయనకి. చరచరా గది దగ్గరకు వెళ్ళాడు. అక్కడ ఓ పదేళ్ల కుర్రాడు నిలబడి వున్నాడు. మళ్ళీ తలుపు తట్టబోతున్న వాడిని వారించి తనే మెల్లిగా తలుపు తట్టాడు.

వెంటనే తలుపు తెరుచుకుంది. అమాంతం బయటికి వచ్చి కర్రతో తల బద్దలు గొట్టబోయాడు అద్దెకున్న మాధవ్. అదేమిటని అడిగేలోపలే బియ్యం బస్తాలా మీద పడిపోయాడు ఆ ఆగంతకుడు. మెడా, నడుమూ విరిగినంత పనైంది.

ఇంతా చేసి ఏమీ ఎరగనట్లు ఇతగాడు నా స్నేహితుడు అంటూ తీరిగ్గా పరిచయం చేస్తుంటే పట్టరానంత కోపం వచ్చింది.

"ఏమిటయ్యా? ఏమిటిదంతా?" అని గర్జించాడు.

అసలాయన అలా ఎదురయేసరికి బెదిరిపోయిన మాధవ్ ఆయన గర్జించే సరికి మరీ బెదిరిపోయాడు.

"ఏం లేదండీ వీడు నా ఫ్రెండ్! పేరు సింహం!" అన్నాడు.

"సింహమో చిరతపులో నాకనవసరం. అసలు నన్నడక్కుండా నా పర్మిషన్ లేకుండా ఇంకో మనిషిని గదిలోకి ఎందుకు తీసుకొచ్చావ్? ఆ వచ్చిన మనిషి తిన్నగా వుండక ఇంటిమీదకి ఎందుకెక్కాడు ? ఎక్కినవాడు అంతటితో ఆగక నా మీదికి ఎందుకు దూకాడు ? అవన్నీ అలా వుండగా నువ్వు కర్ర తీసుకుని నా మీదికి ఎందుకు వచ్చావ్? చెప్పు?" మరింత గర్జించాడు.

"అదికాదండీ. సీతారామయ్యగారిని హనుమాన్లు కొట్టేడండీ. సీతారామయ్య గారు వీడిని తిట్టారండీ. మేము హనుమాన్లుని కొడదామనుకుంటే మధ్యలో మీరొచ్చేశారండీ!" తడబడిపోయాడు మాధవ్.

"ఏవిటా సంధి ప్రేలాపన? సీతారామయ్య ఎవడు? హనుమాన్లు ఎవడు?" మళ్ళీ అరిచాడు. సీతారామయ్యగారి పనిమనిషి మొగుడు. 'వాడి భార్య దొంగని' మా సింహం అన్నాడండీ. సీతారామయ్యగారు కూడా అదే దొంగని నమ్మేసి పోలీసు రిపోర్టు ఇచ్చేశారండీ. పోలీసులేమో దాన్ని పట్టుకు పోయారండి. తీరా చూస్తే అదేమో దొంగ కాదుట. అందుకని వాడు వీడిని చంపేస్తానంటున్నాడు. అందుకే వీడు మీ ఇంటిమీదకి ఎక్కి మీమీద దూకేశాడండీ!" వీలైనంత వివరంగా చెప్పాడు మాధవ్.

కానీ ఆయనకేమీ అర్థం కాలేదు. ఏమిటయ్యా ఈ దొంగలగోల. నాకేమీ అంతు పట్టడం లేదు. విసుక్కున్నాడు.

"అంతు పట్టడానికి అసలు దొంగలు లేరు కదండీ. వున్నది సింహం, హనుమాన్లు అంతేనండీ!"

తలాతోకా లేని ఈ సంభాషణ విని విసుగెత్తిపోయిన సింహం స్నేహితుడ్ని వారించి అసలు విషయం వివరించాడు.

అంతా విని రపా రపా గుండె బాదుకున్నాడాయన. "ఓయమ్మో ఓయమ్మో ఈ దొంగలేవిటి? పోలీసులేవిటీ! రౌడీ వచ్చి కాళ్ళూ చేతులూ విరిచేయడం ఏమిటి? అసలే ఆడపిల్లలున్న ఇల్లు నాది. ఏదో బుద్ధిమంతుడని గది అద్దెకిస్తే ఇదా నువ్వు చేసే నిర్వాకం?

gurucharan.com

ఏవయ్యోయ్ మాధవ్! జరిగిన భాగవతం చాలుగానీ సాయంత్రానికల్లా గది ఖాళీ చేసేయ్. లేకపోతే మర్యాద దక్కదు. నీ సామాన్లు బయట పారేస్తాను." అని వార్నింగ్ ఇచ్చి చరచరా వెళ్ళిపోయాడు.

నీరసంగా కూర్చుండిపోయాడు మాధవ్.

అయోమయంగా నిలబడిపోయిన సింహం చెయ్యి పట్టి గుంజాడు ఆ తలుపు తట్టిన కుర్రాడు. అతడి చేతిలో ఓ కాయితం పెట్టాడు.

దానిలో ఇలా రాసి వుంది. "నేను పుట్టుకతోనే మూగవాడిని. చెవుడు కూడాను. మా అమ్మకి కళ్ళు లేవు. మా నాన్నకి కాళ్ళు లేవు. మా అక్కకి బుర్రలేదు. కాబట్టి మీరంతా అర్జెంటుగా ధనసహాయం చేసి ఆదుకోండి."

పట్టరానంత కోపం వచ్చింది సింహానికి. "శనివెధవా. అసలీ గోలంతా నీవల్లే. తలుపు దడదడ లాడించడం తప్ప ఎంత అరిచినా సమాధానం చెప్పి చావలేదేం?" అని అరిచాడు.

ఆ కుర్రాడికి కూడా కోపం వచ్చింది. "ఎలా చెప్తానండీ? నాకు చెవుడు. పైగా మూగవాడిని." అనేసి మరుక్షణం నాలిక కొరుక్కుని సింహం చేతుల్లోంచి కాగితం లాక్కుని తూనీగలా పారిపోయాడు.

చాలా కోపం వచ్చేసింది సింహానికి. ఆకోపం అంతా నెత్తిన చేతులు పెట్టుకుని కూర్చున్న మిత్రుడి మీద చూపించాడు.

"ఏమిటా అవతారం?" కసిరాడు.

"ఆయన ఇల్లు ఖాళీ చెయ్యమని వార్నింగ్ ఇచ్చాడు." నీరసంగా చెప్పాడు మాధవ్.

"అవును చెప్పాడు. నేనూ విన్నాను. అందుకని నెత్తిన చేతులు పెట్టుకుని గుడ్లనీళ్ళు కక్కుకుంటే మళ్ళీ వచ్చి ఖాళీ చెయ్యొద్దని చెప్పి వెళ్తాడా? ఏడుపు మొహం వేసుకుని కూర్చోకు. దర్జాగా ఖాళీచేసి నా రూమ్‌కి పోదాం పద!" చెప్పేశాడు సింహం.

"మరి హనుమాన్లున్నాడుగా!" గుర్తు చేశాడు మాధవ్.

"పాయింటే!" అంటూ ఆలోచించాడు సింహం. "ఓ పని చేద్దాం. రెండు గదులూ ఖాళీ చేసేసి వేరో చోట గది తీసుకుందాం!"

ఆ సలహా మాధవ్‌కి కూడా నచ్చింది. "మరో సమస్య వుంది. నా ఉద్యోగం పోయింది. ఈ కేసిలా బెడిసికొట్టింది కాబట్టి కొన్నాళ్ళపాటు కేసులు రావు. కాబట్టి

అర్జెంటుగా ఓ ఉద్యోగం చూసుకోవాలి. మీ షాపులో ఖాళీ వుందన్నావుగా. నన్ను నీతో తీసుకువెళ్ళు" అడిగాడు సింహం.

"అలాగే వెళ్దాం. ఖాళీ అయితే వుంది. తీసుకువెళ్ళి పరిచయం చేస్తాను" అన్నాడు మాధవ్.

"ఆ తర్వాత విషయం నేను చూసుకుంటాను. ఆయన్ని బుట్టలో వేసేసి పని సంపాదించుకుంటాను," హామీ ఇచ్చాడు సింహం.

ఇద్దరూ తయారై బయలుదేరారు. మాధవ్ పనిచేసే బట్టలషాప్‌కి చేరేసరికి పదింబావు అయింది. మామూలుగా షాప్ పదింటికే తెరుస్తారు. అంతకు పదినిముషాల ముందే రావాలని సేఠ్‌గారి ఆదేశం. అలాగే వస్తారు అందరూ.

ఆవేళ గొడవలో పడి ఆలస్యం అయింది. అప్పటికే షాప్ తెరిచి లక్ష్మీదేవి పఠానికి, ఇనప్పెట్టెకీ పూజ ముగించి పరుపు మీద కూర్చున్నాడు సేఠ్.

లేట్ అయినందుకు కంగారుగా వెళ్ళి సలామ్ పెట్టాడు మాధవ్. మామూలుగా అయితే ఆలస్యం అయినందుకు చిరాకుపడతాడు సేఠ్. "ఏమిటయ్యాఇది? మీ ఇష్టం వచ్చినప్పుడు తీరిగ్గా రావడానికి ఇదేమైనా గవర్నమెంట్ ఆఫీసా?" అని తిడతాడు.

కానీ ఆవేళ అలా తిట్టలేదు సరికదా చిన్నగా నవ్వాడు. అదిచూసి ఆనందపడిపోయాడు మాధవ్. పన్లోపనిగా మిత్రుడిని పరిచయం చేశాడు.

వినయంగా నమస్కారం పెట్టాడు సింహం. సేఠ్ సంతోషించాడు. ఫర్వాలేదు. ఈయన మంచివాడిలానే వున్నాడు. ఇక వచ్చినపని బయట పెట్టొచ్చు అనుకుని సింహం నోరిప్పబోతుండగానే సేఠ్ మాట్లాడ్డం మొదలుపెట్టాడు.

తన వ్యాపారం ఏడేళ్ల క్రిందట మొదలైందని చెప్పాడు. అప్పటికీ, ఇప్పటికీ చాలా అభివృద్ధి పొందిందని చెప్పాడు. అయితే తను తృప్తి పడలేదనీ, ఇంకా ఇంకా ఇంప్రూవ్ చెయ్యాలనీ చెప్పాడు. అందుకోసం తను ఎన్నో ప్లాన్లు వేశానని చెప్పాడు. అందులో మొదటిది సేల్స్‌మెన్స్‌ని తీసేసి సేల్స్‌గర్ల్స్‌ని ఎప్పాయింట్ చెయ్యడం అన్నాడు. అందర్లోకీ జూనియర్ అయిన మాధవ్‌కి ఉధ్వాసన చెప్పడంతో ఆ బృహత్ కార్యాన్ని ప్రారంభించదలచానని చెప్పాడు.

ఆ తర్వాత కూడా ఆయన చాలా చెప్పాడు. కానీ వీళ్ళ బుర్రలు పనిచెయ్యడం మానెయ్యడం వల్ల వీళ్లకి వినపడలేదు. అలా కాసేపు చెప్పి మాధవ్‌కి రావలసిన డబ్బు లెక్కచూసి ఇచ్చి ఇక వెళ్ళి రండి అని చెప్పాడు.

gudachari.com

ఇద్దరూ రోడ్డు మీదికి వచ్చారు. "భలే తమాషాగా వుంది కదూ! కొండనాలికకి వైద్యం చేస్తే ఉన్న నాలిక వూడిపోయిందని నాకు ఉద్యోగం రాలేదు సరికదా నీదికూడా పోయింది" అన్నాడు సింహం.

"ఏవిటో వెధవ జీవితం. ఉద్యోగం పోయింది. అవతలాయనేమో ఇల్లు ఖాళీ చెయ్యమన్నాడు. ఎలాగో ఏవిటో!" ఇకా తర్వాత మాట్లాడలేకపోయాడు మాధవ్.

"ఇది మరీ బావుందిరా! బోడి అద్దెకొంప. వెధవ టెంపరరీ ఉద్యోగం పోతే నీ ఆస్తి అంతా గవర్నమెంట్లో కలిసిపోయినట్లు బాధపడతావేం? ఏం ఫర్వాలేదు. ఆ దేవుడే ఏదో ఓ దారి చూపించకపోడు. నువ్వు దర్జాగా వుండు.

అసలైనా సమస్యలు ఎదురైనప్పుడు డీలా పడిపోయి వున్న తెలివి కూడా వూడగొట్టుకోకురా అని లక్షసార్లు చెప్పాను. విని ఏడవవు" మందలించాడు సింహం.

ఒళ్ళు మండింది మాధవ్‌కి. "అసలే ఆపదలో వుండి నేనఘోరిస్తుంటే నీ గొడవొకటి. జరిగినదానికి ఏడవక డాన్స్ చెయ్యమంటావా? ఉక్రోషంగా అడిగాడు.

"డాన్సు చెయ్యక్కర్లేదు. హాయిగా రిలాక్సింగ్‌గా వుంటే చాలు. మెదడు పనిచేస్తుంది. సమస్యకు తగిన పరిష్కారం కనిపిస్తుంది. అందుకని నా మిత్రమా! ప్రస్తుతం మనకు కావలసింది రిక్రియేషన్. పద కాసేపలా తిరిగొద్దాం!" అంటూ లాక్కుపోయాడు. ఊరంతా ఉద్యోగాల కోసం తిరిగారు. భోజనం చేసి పార్కులో కూర్చున్నారు. మళ్ళీ కాసేపు ఉద్యోగాల కోసం వేటాడి ఎక్కడా ఫలించక పోయేసరికి 'ఇవాల్టికి చాల్లే. అసలు ఇవాళ మనకేం కలిసి రావడంలేదు. రేపు వెతుక్కుందాం.' అన్నాడు సింహం.

నాలుగింటికి ఇద్దరూ మాధవ్ రూమ్‌కి చేరారు. వరండాలో కూర్చుని మెడకి అయొడెక్స్ రాసుకుంటున్న రావుగారు వీళ్ళను చూడగానే గబగబ వచ్చేశారు.

"ఏవయ్యా, గది ఖాళీ చెయ్యమన్నాను కదా! ఆ విషయం ఏం చేశావ్?" నిలదీశాడు.

ఆయనలా వాకిట్లోనే నిలబెట్టి అడగడం సింహానికి ఏమాత్రం నచ్చలేదు. "ఖాళీ చెయ్యమన్నారు చేస్తాడు. సాయంత్రం దాకా టైమిచ్చారు కదా! మళ్ళీ మళ్ళీ చెప్పి విసిగిస్తారేం" విసుక్కున్నాడు.

ఆయనక్కూడా చాలా కోపం వచ్చేసింది, "ఖాళీ చేస్తారని గారంటీఏవిటీ. పొద్దునపోయి ఇప్పుడొచ్చాడు. మళ్ళీ నా కంట పడకుండా పోయి ఎప్పుడో వస్తే నేనేం చేసేది? అందుకే మరోసారి చెప్పి పోదామని వచ్చాను. అయినా నాలుగైపోయింది. ఇంకా సాయంకాలం ఎప్పుడో వుందన్నట్లు మాట్లాడతావేం.

త్వరగా ఖాళీ చెయ్యండి" అంటూ కచ్చితంగా చెప్పేసి వెళ్ళిపోయాడు మెడ రాసుకుంటూ.

"పదరా ఖాళీ చేసేద్దాం. ఇంతోటి బోడి కొంప ఈయనకి మాత్రమే వుంది. నా రూమ్‌కి పోదాం. కాదనుకుంటే చెట్టుక్రింద వుందాం. అంతేగానీ ఆయన పొమ్మంటూ వుంటే పట్టుకుని వేల్లాడ్డానికి మనకేం పౌరుషం లేదా! పద. సామాన్లు సర్దు." అన్నాడు సింహం.

ఏదో చెప్పబోయిన మాధవ్ సింహం కోపం గమనించి మానేశాడు. తలుపు తీసి లోపలికి వెళ్ళి సామాన్లు సర్దడం మొదలుపెట్టాడు.

అలమార్లో వున్న పుస్తకాలు తీసి పెట్లో పెడుతూ వుండగా సింహానికి కనిపించిందో పుత్తరం. తీసి చూశాడు. ఓపెన్ చెయ్యని ఇన్‌లేండ్ కవర్. అడ్రెస్ అదే. కానీ పేరు మాత్రం మాధవ్‌ది కాదు.

"మాధవ్, ఈ లెటర్ ఏమిట్రా?" అడిగాడు.

తలతిప్పి చూశాడు మాధవ్. "అదా! అది నాది కాదురా! నాకు ముందు ఈ గదిలో వుండే రామకృష్ణది," చెప్పేసి పన్లో మునిగిపోయాడు.

"మరైతే ఇక్కడ పారేశావేం?"

"ఏం చెయ్యను? అతని అడ్రెస్ పోస్ట్‌మేన్‌కి తెలియదుట. రావుగారికీ తెలియదు.

ఆ సమాధానం విని నొచ్చుకున్నాడు సింహం. "అంతమాత్రాన ఇలా పారేయడం తప్పుకదుట్రా. ఇందులో ముఖ్యమైన సమాచారం ఏమైనా వుందేమో. ఈ ఉత్తరం అందకపోతే అతనికేదైనా నష్టం కలుగుతుందేమో!"

విసుగేసింది మాధవ్‌కి. "వెధవ సొద. అడ్రెస్ తెలియకపోతే నేనేం చెయ్యను? అంత ఇంపార్టెంట్ కబురు ఏమైనా వుంటే మరో లెటర్ రాసే వుంటారు ఆ రాసినవాళ్లు" అన్నాడు.

అతని సమాధానం విని కూడ సమాధాన పడలేదు సింహం. కాసేపు ఆలోచించి "పోనీ ఓ పని చేద్దాం. ఈ లెటర్ తీసి చూద్దాం. ఇందులో ఏదైనా ఇన్ఫర్‌మేషన్ వుంటే లెటరు రీడైరెక్ట్ చేద్దాం. డెడ్ లెటర్ ఆఫీసులో వాళ్ళు చేసే పని కూడా ఇదే." అన్నాడు.

"సరే ఏదో చెయ్ నీ ఇష్టం" తల తిప్పకుండానే సమాధానం చెప్పాడు మాధవ్.

ఉత్తరం చింపకుండా తిరిగి అంటించేందుకు వీలుగా తడిచేసి భద్రంగా ఓపెన్ చేశాడు సింహం.

gudachari.com

"ఒరే సింహం ఆ తాడు ఇలా ఇవ్వు పక్క కట్టేస్తాను" అంటూ మిత్రుడి వైపు చూసిన మాధవ్ అదిరిపడ్డాడు.

ఉత్తరంలోకి తీక్షణంగా చూస్తున్నాడు సింహం. మొహం అంతా చెమటలు పట్టి వుంది. కళ్ళు ఎర్రగా వున్నాయి. పాములా బుసకొడుతున్నాడు.

"ఏవిట్రా? ఏమైంది?" కంగారుగా మిత్రుడి దగ్గరగా వెళ్ళాడు మాధవ్.

"ఏమైందా? నువ్వే చూడు" అంటూ ఆ ఉత్తరాన్ని అతని మొహాన విసిరికొట్టాడు సింహం. అయోమయంగా అందుకున్నాడు మాధవ్.

ఆ ఉత్తరంలో రాత గజిబిజి గందరగోళంగా వుంది. చదవడం కష్టం అనిపించేలా వుంది. అయినా శ్రమపడి చదివాడు.

హల్లో కృష్ణా! చార్లోజులైంది నువ్వు లెటర్ రాసి! నిన్ననడం అనవసరం. నేనే సమాధానం రాయలేదు నీకు. ఏమిటో ఈ వ్యవహారంలో తలదూర్చాక తీరిక దొరకడంలేదు. నీకు తెలుసుగా. ఇకపోతే అసలు విషయంలోకి వద్దాం.

నీ సలహా గురించి చాలా ఆలోచించాను. ముందు వద్దనుకున్నా ఆలోచిస్తే అదే మంచిదనిపిస్తోంది. నీ సలహా ప్రకారం లక్ష్మిని చంపెయ్యడమే మంచిదనే నిర్ణయానికి వచ్చాను.

అదెంత కష్టమో నీకూ తెలుసు. నాక్కూడా తెలుసు. కష్టమో, నిష్ఠూరమో లక్ష్మిని చంపేస్తేనే బాగుంటుందనుకుంటున్నాను. నీ సలహాకి కృతజ్ఞుడిని. పని పూర్తవగానే నీకు రాస్తాను.

వుంటాను మరి.

నీ

వెంకటి.

చదవటం ముగించిన మాధవ్‌కి అసలేమీ అంతుబట్టలేదు.

"ఏవిట్రా ఇది! ఇదేం ఉత్తరం" అన్నాడు అయోమయంగా.

"ఏముంది! అలవాటైపోయిన గొడవే. ఏదో కట్నం గురించి పేచీ వచ్చి వుంటుంది. కాబట్టి ఈ వెధవ సలహా ఇస్తే ఆ వెధవ ఇంతటి ఘోరానికి పూనుకున్నాడు."

సింహం ఆగ్రహం అవధులు దాటుతోంది.

"ఛ్చ్...ఏవిటో వెధవ ప్రపంచం. రాన్రాను మనుషుల్లో మానవత్వం నశించి పోతోంది. ముందు ముందు ఇంకెంత అన్యాయంగా వుంటుందో ఊహించు కుంటేనే

భయంగా వుంది" అనుకుంటూ వర్తమానాన్ని గురించి, భవిష్యత్తు గురించి ఏకకాలంలో బాధపడిపోయి తన పన్లో పడిపోయాడు మాధవ్.

సింహం మాత్రం ఆ ఉత్తరం పట్టుకుని అమిత సీరియస్‌గా ఆలోచించటం మొదలుపెట్టాడు.

"మాధవ్, ఆ లెటర్ వచ్చి ఎన్నాళ్లైందిరా?" అడిగాడు.

"వారంరోజులైంది!"

"రామకృష్ణ గురించి నీకేం తెలియదా?"

"ఊహూ, నాకేం తెలియదు. నేనొచ్చేసరికి గది ఖాళీగా వుంది."

"నువ్వీ రూమ్‌కి మారి ఎన్నాళ్లైంది. నెల్రోజులైందా?"

"నెలెక్కడా. వచ్చే గురువారానికి ఇరవై ఒక్క రోజులవుతుంది. ఏమిటో మంచి గది దొరికిందని ఆనంద పడినంతసేపు పట్టలేదు. అప్పుడే ఋణంతీరి పోయింది" కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు మాధవ్.

తల పంకించి లేచాడు సింహం. ఆ లెటర్ జేబులో పెట్టుకుని బయలుదేరాడు. ఇంటాయన దగ్గరకి వెళ్ళి చూశాడు. ఆ తరువాత ఇరుగుపొరుగు వారిని అడిగి చూశాడు. రామకృష్ణ మెకానిక్‌గా ఏదో మిల్‌లో పనిచేసేవాడనీ, ఆ ఉద్యోగం పోవడంతో గది ఖాళీ చేసి వెళ్ళిపోయాడనీ, ఎవరితోనూ మాట్లాడేవాడు కాడనీ తెలిసింది. కానీ అసలు విషయం ప్రస్తుతం అతనెక్కడున్నాడో ఎవరూ చెప్పలేక పోయారు. ఓపిగ్గా తిరిగాడు సింహం. తిరగ్గా తిరగ్గా ఆ వీధి చివరున్న ఇంటివారి అబ్బాయి రామకృష్ణని చూశాడని తెలిసింది.

ఓ వారం రోజుల క్రిందట ఇతడు బాంబే టూర్ నిమిత్తం వెళ్ళినప్పుడు నారీమన్ పాయింట్ దగ్గర రామకృష్ణ కనిపించాడనీ, దుబాయ్ వెళ్తున్నట్లు చెప్పాడనీ చెప్పాడు.

నిట్టూర్చి వెనక్కి తిరిగాడు సింహం.

ఆరుగంటలు అవుతూండగా తిరిగొచ్చిన మిత్రుడి మీద విరుచుకుపడ్డాడు మాధవ్. "ఎక్కడికి పోయావ్‌రా? అవతల ఆయన కాలుగాలిన పిల్లిలా తిరిగేస్తున్నాడు. నువ్వేమో అయిపూ అజాలేవు. అసలెక్కడి కెళ్ళావ్?"

"అబ్బ చెప్తానుందరా!" అంటూ వెళ్ళి గ్లాసెడు నీళ్ళు తాగి వచ్చాడు సింహం. గోడకానుకుని కూర్చున్నాడు.

"పని ముగించుకుని వచ్చేసరికి కాస్త ఆలస్యం అయింది. ఆ రామకృష్ణ గురించి ఆచూకి తెలుస్తుందేమో అని ప్రయత్నించాను. కానీ లాభం లేకపోయింది. అతను

sudachar.com

దొరకటం అసంభవం. ఉత్తరం అందుకోవలసిన రామకృష్ణ దొరకలేదు. కాబట్టి ఉత్తరం రాసిన వ్యక్తిని అంటే సదరు వెంకటిని వెతకాలి.

అదృష్టవశాత్తూ ఉత్తరం మీద ఊరిపేరూ పిన్‌కోడ్ వున్నాయి కాబట్టి అతని ఆచూకి తెలుసుకోవడం అంత కష్టం కాదు. కాబట్టి ఆ వెంకటాపురం వెళ్ళి వెంకటి గాడిని పట్టుకుని తగిన శాస్తి చెయ్యాలి.

వింటున్న మాధవ్ స్టన్ అయిపోయాడు. తన మిత్రుడు చెప్పింది ఏమిటో అర్థం అయ్యేసరికి నవ్వూ, కోపం ముంచుకొచ్చాయి.

"నిన్ను పిచ్చికుక్క గానీ కరిచిందిట్రా? ఏవిటా ప్రేలాపన? నువ్వు మాట్లాడే దానిలోఏమైనా అర్థం వుందా? తలాతోకాలేని ఆలోచనలూ నువ్వూను" అన్నాడు.

"నాకేం పిచ్చి పట్టలేదు. బాగా ఆలోచించి మరీ నిర్ణయానికి వచ్చాను"

"ఏడవలేక పోయావ్. వెధవ ఐడియాలు ఇక చాలుగానీ ముందు, గది ఖాళీ చెయ్యాలి లే!" విసుక్కున్నాడు మాధవ్.

మిత్రుడి చెయ్యి పట్టుకుని పక్కన కూర్చోబెట్టుకున్నాడు సింహం.

"అసలు విషయం అర్థం చేసుకోకుండా వూరికే విసుక్కుంటావేంరా? కాస్త నిదానంగా ఆలోచించు. నువ్వూ చదివావు కదా ఆ ఉత్తరం. ఎంత అన్యాయమో చూడు. సాటి మనిషిని చీమలాగానో దోమలాగానో చంపేసినంత తేలిగ్గా చంపేయడానికి చూస్తున్నాడా దుర్మార్గుడు. మనకు తెలిసి తెలిసి ఘోరం జరిగిపోతుంటే చూస్తూ ఎలా వూరుకుంటాం చెప్పు" నచ్చచెప్పచూశాడు.

"వూరుకోక వురేసుకుందామా? అసలా రాసినవాడెవడో తెలియదు. వాడెక్కడుంటాడో తెలియదు. ఆ లక్ష్మి ఎవరో ముందే తెలియదు. ఎవడో ఏట్లో రామనాథం ఎవర్నో చంపాలనుకుంటే మాత్రం మనకెందుకు? నా మాట విను. ఇప్పటికైనా ఈ వెర్రిమొర్రి ఆలోచన్లు మానేయ్. ఆ పుత్తరం చించి అవతల పారేయ్" హితవు చెప్పాడు మాధవ్.

అదోలా నవ్వేడు సింహం. "ఇదేరా మన దౌర్భాగ్యం! మనకెందుకు? ఎవరేమైపోతే మనకెందుకు? ఇలా అనుకుని ఎవరికి వారు కళ్ళూ చెవులూ మూసుకుని కూర్చోబట్టే మనం ఇలా తగలడ్డాం. మన సమాజం ఇలా పాడైపోయింది.

"పోతే పోయింది. సమాజాన్ని నువ్వూ నేనూ కలిసి బాగుచెయ్యగలమా? నలుగురితో నడవాలి గానీ అతి తెలివికి పోతే పళ్ళురాల్తాయి." విసుక్కున్నాడు మాధవ్.

"నేను అంగీకరించను. అన్యాయం జరుగుతూ వుంటే ఎదిరించడం మానవ కర్తవ్యం" రీవిగా చెప్పాడు సింహం.

"సరే మహాప్రభో. ఇంతకీ ఇప్పుడేం చేద్దామంటావ్?" సూటిగా ప్రశ్నించాడు.

"అలా అడిగావ్ బావుంది. చెప్తా విను. ఆ వెంకటాపురం ఎక్కడుందో కనుక్కున్నాను. వెంకటాపురం వెళ్ళి ఆ వెంకటి గాడిని వెతికి పట్టుకుని పోలీసులకి అప్పజెప్పాలి. ఇదే నా నిర్ణయం!" ఆవేశంగా చెప్పాడు సింహం.

నవ్వాపుకున్నాడు మాధవ్. "సరేనయ్యా! నువ్వు చెప్పిన ప్రకారం వెళ్ళామే అనుకో. ఆ వెంకటి బస్టాండులో నిన్ను రిసీవ్ చేసుకుని రండి రండి నేనే ఆ ఉత్తరం రాసింది. పట్టి బంధించండి అని చెప్తాడా?" వ్యంగ్యంగా అడిగాడు.

"వాడు రానక్కర్లేదు. నేనే వెతికి పట్టుకుంటాను. డిటెక్టివ్‌ని. ఆఫ్ట్రాల్ నాకదెంత పని?"

ఫకాల్న నవ్వేశాడు మాధవ్. "మండినట్లే వుంది నీ డిటెక్షన్. ఈ సీతారామయ్యగారి కేసు, హనుమాన్లు గొడవ చూశాం కదా! అలాటిది నువ్వు వెళ్ళి పొరుగూర్లో పరిశోధించి పట్టుకుంటావ్. వూరికే కబుర్లు చెప్పకు. ఇకా డిటెక్షన్ గురించి మర్చిపో".

"బావుందిరా నువ్వు చెప్పేది. ఏదో ఒకటి ఫెయిల్ అయింది కదా అని ఇకా పనే మానేస్తానా?. ఒక పేషెంట్ చనిపోగానే డాక్టర్ వైద్యవృత్తి మానేస్తాడా? అపోలో పదమూడు తరువాత అమెరికా వాళ్ళు అంతరిక్ష నౌకలు పంపడం ఆపెయ్యలేదే. ఇదీ అంతే. ఓటమినుండి పాఠం నేర్చుకుని ధైర్యంగా ముందుకి సాగాలిగానీ ఓడిపోయినంత మాత్రాన నిరాశపడితే ఇక జీవితం ఏముంది?"

"అది కాదురా! ఆ దొంగతనం కేసుతోనే చావుతప్పి కన్ను లొట్టపోయినంత పని అయింది. ఇది హత్యకేసు. అదీ పొరుగూర్లో. ఏమైనా ప్రమాదం జరిగితే!" భయపెట్టాలని చూశాడు మాధవ్.

నవ్వేశాడు సింహం. "ఏం జరిగితే? ఏమైపోతుంది? మనం బ్రతికుంటే ఎవరికి లాభం? చస్తే ఎవరికి నష్టం? ఎవరూ లేని అనాథ వెధవలం. ఇక మనకేం భయం.? ఈ ఉత్తరం – బాధ్యతలతో మునిగితేలే ఇంకో వ్యక్తి చేతుల్లోనో పడివుంటే నువ్వు చెప్పినట్లే ఓ నిముషం బాధపడి వూరుకునే వాడేమో. అదృష్టవశాత్తూ నా చేతుల్లో పడింది".

"మనకు మాత్రం బాధ్యతలు లేవా ఏం? రూము వెతుక్కోవాలి. ఉద్యోగం వెతుక్కోవాలి." ఉక్రోషంగా చెప్పాడు మాధవ్.

gudachari.com

"మరేం ఫర్వాలేదు. ఈ వెతుక్కునేది ఏదో ఆ ఊళ్ళోనే వెతుక్కుందాము. అంతమంది బ్రతికే ఆ ఊళ్ళో మనకూ ఏదో జీవనాధారం దొరక్కపోదు" సమాధానం చెప్పాడు సింహం.

ప్రతీ మాటకీ సమాధానం చెప్తూ మొండితనం చేస్తున్న మిత్రుడిని చూస్తే ఒళ్ళు మండింది మాధవ్‌కి.

"అయితే ఫో. పోయి గంగలో దూకు. నేను మాత్రం రాను" అన్నాడు.

అల్లరిగా నవ్వేడు సింహం. "రాకు- మహరాజులా ఇక్కడే వుండు. నేను పోతాను. ఆ తర్వాత హనుమాన్లు నిన్ను పట్టుకుని నా ఆచూకి చెప్పమని చాకిరేవు పెట్టేస్తాడు."

మాధవ్ గుండె ఠారుమంది. "ఒరే సింహం. ఇది నీకు న్యాయం కాదురా! నా మాట వినరా!" చెప్పబోతున్న మిత్రుడిని వారించాడు సింహం.

"నేను ఏ విషయంలో నైనా ఆలోచించి నిర్ణయం తీసుకుంటాను. ఒకసారి నిర్ణయించుకున్న తరువాత ఇక వెనక్కి తగ్గను. ఇప్పుడీ విషయంలో కూడా అంతే. నేను వెంకటాపురం వెళ్తాను. వెళ్తున్నాను. నువ్వు కూడా నావెంట వస్తే నాకు కొండంత ధైర్యం వుంటుంది. అలా అని నిన్ను రమ్మని బలవంతపెట్టను. నీ ఇష్టం. ఆలోచించుకుని చెప్పు". తను చెప్పవలసింది స్పష్టంగా చెప్పేసి లేచి వెళ్ళిపోయాడు సింహం.

అయోమయంగా కూర్చుండి పోయాడు మాధవ్. ముందుకెళ్తే నుయ్యి. వెనక చూస్తే గొయ్యి. ఏం చెయ్యడంరా భగవంతుడా! అనుకుంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

బాగా చీకటి పడింది. వీధి దీపాలు వెలిగాయి. రోడ్డు మీద వాహనాల రొద ఎక్కువైంది. దోమలు పీకేస్తున్నాయి.

* * *

వెంకటాపురంలో వాతావరణం ఆహ్లాదంగా వుంది. చందమామ పైకి వచ్చాడు. చెరువులోని కలువలన్నీ విచ్చుకున్నాయి. కాస్త దూరంలో వున్న గుడిలో నుండి గంట శబ్దం వినిపిస్తోంది. చెరువు గట్టున కూర్చున్నారు శ్యామల, లక్ష్మి.

ఉత్సాహంగా కబుర్లు చెప్తోంది శ్యామల. పరధ్యానంగా వింటూ వుండి పోయింది లక్ష్మి.

కామాలూ ఫుల్‌స్టాపులూ లేకుండా మాట్లాడుతున్న శ్యామలకి హఠాత్తుగా అనుమానం వచ్చి లక్ష్మి వంక చూసింది. "ఏమిటా యోగనిద్ర? నేను చెప్పేది వింటున్నావా?"

అంత గట్టిగా అరిచేసరికి ఉలిక్కిపడింది లక్ష్మి. "ఏమిటే ఏవిటి చెప్తున్నావ్?" అడిగింది కంగారుగా.

తలబాదుకుంది శ్యామల. "అయితే ఇందాకటి నించీ నా కంఠశోష తప్ప నువ్వేం వినడం లేదా?"

"నా మూడ్ బాగాలేదు శ్యామా!"

పరికించి చూసింది. లక్ష్మి మొహం వాడిపోయింది. "అలా ఉన్నావేం లక్ష్మీ" ఆప్యాయంగా అడిగింది.

"రేపు నా పెళ్ళిచూపులు" తలవంచుకుని దీనంగా సమాధానం చెప్పింది. శ్యామలకి ఆపుకుందామనుకున్నా ఆగలేదు నిట్టూర్పు.

"ఓ అవును కదా! ఆ విషయమే మర్చిపోయాను. ఇంతకీ రాబోయే రాజకుమారుడు ఎవరో! నాయకుడా, గాయకుడా?" లేని ఉత్సాహం తెచ్చిపెట్టుకుని హాస్యం చేసింది.

చివాల్న తలెత్తింది లక్ష్మి. "నీకూ నవ్వులాటగా అయిపోయిందా శ్యామా?"

"ఏమిటో పెళ్ళిచూపుల పేరెత్తితేనే కంపరం వేస్తోంది. ఇప్పటికిది పన్నెండోసారి. వాళ్ళు రావడం నేను ఎదురుగా కూర్చోవడం. ఎప్పటికప్పుడే ఇదే ఆఖరు. ఈ సంబంధం తప్పక సెటిల్ అయిపోతుందని నాన్నగారు ఆనందపడటం, తీరా అది కాస్తా బెడిసికొట్టడం. ఇదో రొటీన్ అయిపోయింది.

మళ్ళీ మొదలు. సాయంత్రం కలిసి రాలేదని పొద్దుట పెళ్ళిచూపులు. పట్టుచీరె అచ్చిరాలేదని పాలియెస్టర్ చీరె. పూలజడైతే నచ్చలేదని వాలుజడ. రకరకాల వేషాలు వేసివేసి నా ప్రాణం విసిగిపోతోంది. దానికి సాయం పెళ్ళిచూపులనగానే ఇంట్లో అష్టాష్టపోరు.

ఇక నావల్ల కావడంలేదు శ్యామా! ఈ అల్లరీ ఆగం తప్పిపోతే బాగుండు ననిపిస్తోంది" లక్ష్మి కంఠం బరువెక్కింది.

జాలిగా లక్ష్మి వంక చూసింది శ్యామల. లక్ష్మి పెళ్ళి విషయంలో జరుగుతున్న జాప్యం చూస్తుంటే అందరికీ ఆశ్చర్యంగానే వుంది. లక్ష్మి బంగారు బొమ్మలా వుంటుంది. చదువుకుంది. బోలెడంత ఆస్థి వుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఏ

gudachari.com

మగవాడైనా కావాలని కలలుగనే ఆడపిల్ల లక్ష్మి. అలాటి లక్ష్మి పెళ్ళి ఇలా సమస్య అవుతుందని ఎవరూ కలలో కూడా అనుకోలేదు.

ఒకరు కాదు. ఇద్దరు కాదు. ఇప్పటికి పదకొండుసార్లు పెళ్ళిచూపులు జరిగాయి. ప్రతిసారీ ఇది తప్పకుండా అయిపోతుందని అనుకోడం, వాళ్ళు వెళ్ళి ఏదో కుంటిసాకు చెప్తూ ఉత్తరం రాయడం. ఇదంతా విచిత్రంగా వుంది అందరికీ. ఎవరికి తోచిన సలహాలు వారు చెప్తున్నారు. జాలిపడుతున్నారు. ఓదారుస్తున్నారు.

ఇంత హంగామాకి గురైన లక్ష్మిని చూస్తుంటే ఏ ఆడపిల్లకీ ఇలాటి బాధ వద్దు భగవంతుడా అనిపిస్తుంది లక్ష్మి ప్రాణ స్నేహితురాలైన శ్యామలకి. అయినా తన బాధ కనపడనీకుండా స్నేహితురాలికి ధైర్యం చెప్తూ వుంటుంది.

"భలేదానివే! అయినా నీలాటి రాజకుమార్తెకు తగిన వరుడు దొరకడం అంటే మాటలా! నీకు తగిన రాజకుమారుడే రావాలి. సమయం వచ్చినప్పుడు వెతుక్కుంటూ వస్తాడు నీకోసం. నేను చెప్తున్నాను. నా మాటనమ్ము. నీక్కాబోయే భర్త రేపు నీ ఎదుటికి వస్తాడు." అని చెప్పింది.

గుడిలోంచి గంటలు ఒక్కసారి మ్రోగాయి. "పద హారతి ఇస్తున్నారు" అంటూ లేచింది శ్యామల. ఇద్దరూ గుళ్ళోకి వెళ్ళారు.

* * *

వసంతలక్ష్మి వాకిట్లోంచి ఇంట్లోకి, ఇంట్లోనించి వాకిట్లోకి కాలుగాలిన పిల్లిలా తిరిగేస్తోంది. సాయంత్రం అయిందింటికి రావలసిన భర్త నట్‌బోల్ట్ వెంకటేశ్వర్రావ్ ఇంకా ఇంటికి రాలేదు. అసలా వేళ పొద్దుట్నించి వసంతలక్ష్మి మనసేం బాగాలేదు. భర్త అటు వెళ్ళాడో లేదో, గాలి దుమారంలా వచ్చింది పక్కింటావిడ.

క్రిందటిరోజు వీళ్ళ దగ్గర అడిగి తీసుకెళ్ళిన టేప్‌రికార్డర్ మొహాన విసిరికొట్టి నానా మాటలూ అని వెళ్ళింది. దాంతో వసంతలక్ష్మికి భర్త మీద పీకలదాకా కోపం వచ్చింది. ఇవాళ అటో ఇటో తేల్చుకుందాం అని అతనొచ్చే టైముకి వాకిట్లో కాపలా వేసింది. అయిదింటికే రావలసిన అతగాడు ఆరైనా రాకపోయేసరికి కోపం కాస్తా కంగారుగా మారింది. ఏడు దాటేసరికి ఏడుపొచ్చినంత పనైంది.

అంతలో ఎదురింటి కాంతమ్మ వీళ్ళింటికొచ్చింది. "అమ్మాయ్ పనైందా?" అంటూ పలకరించింది. కంగారుగా అసలు విషయం చెప్పింది వసంత.

"నీ ఇల్లు బంగారం గానూ! మనిషింకా ఇంటికి రాకపోతే ఇలా పచార్లు చేస్తూ కూర్చుంటే సరిపోతుందా? పక్కింటబ్బాయికి చెప్పి టెలిఫోను చేయించలేక పోయావా?" సలహా చెప్పింది.

వసంతకి మరింత దుఃఖం వచ్చింది. "వాళ్ళకీ మాకూ పోట్లాట వచ్చింది పిన్నిగారూ!" దీనంగా చెప్పింది.

"ఏవిటేవిటీ? గంగిగోవుల్లాటివారు మీతో పోట్లాటా?" ఆశ్చర్యపోతూ పెద్ద గొంతేసుకుని అరిచిందావిడ. పక్కింటావిడ వాకిట్లోనే వుంది. కాంతమ్మ మాట వినగానే రయ్‌మని వచ్చేసింది.

"అను వదినా అను. అక్కడకి వాళ్ళు గంగిగోవులు. మేము పోట్లగిత్తలం. వూరికే మేము మాత్రం ఎందుకంటాం. జరిగింది విని అప్పుడు చెప్పు." అంది ఆవేశంగా.

"ఏమైంది చెప్పు వింటాను." వినడానికి సిద్ధమైంది కాంతమ్మ.

"ఏం చెప్పమంటావ్? నిన్న మా అల్లుడిని ఏడాది లోపల తీసుకొచ్చాం. మావియ్యపురాలు పెళ్ళిలో తిన్నగా మర్యాదలు జరగలేదని మొహం ముడుచుకుంది నీకూ తెలుసుగా. ఈసారి మర్యాదలు బాగా చెయ్యాలని అన్ని ఏర్పాట్లు చేసుకున్నాం. ఆవిడకి పాటలూ, పద్యాలూ చాలా ఇష్టం.

మా ఇంట్లో టేప్‌రికార్డర్ లేదుగా. ఎక్కడినించైనా తీసుకుందాం అనుకుంటూ వుంటే వీళ్ళాయన వచ్చి బలవంతం చేసి మరీ ఇచ్చి వెళ్ళాడు. మంచి భక్తి పాటల కేసెట్లు ఇమ్మన్నాం. భగవద్గీత విష్ణు సహస్రం అంటూ ఇచ్చి వెళ్ళాడు.

నిన్న బస్సు బాగా లేటయిందిట. రావటమే ధుమధుమలాడుతూ వచ్చింది మా వియ్యపురాలు. సరే కాఫీ టిఫెను పెట్టి వీళ్ళిచ్చిన పాటలు పెట్టాం. భగవద్గీతా లేదు. బండలూ లేదు.

గుండాబత్తుల బుచ్చమ్మా ఎండాకాలం మంటమ్మా అంటూ పాట మొదలైంది. అందరం కంగారు పడిపోయాం. ఆపుదామంటే ఆగితేనా. అదంతా కావాలని చేశాం అని మండిపడిపోయిందావిడ." చెప్పింది.

"ఓస్ ఇంతేనా? నేనింకేవిటో అనుకున్నాను. పొరబాటున ఒకదాని బదులు మరొకటి ఇచ్చారు కాబోలు. అయినా విచిత్రం కాకపోతే ఆవిడకంత కోపం ఎందుకొచ్చిందట?' అంది కాంతమ్మ.

ఆవిడగారి అసలుపేరు బుచ్చమ్మట. ఫేషనుగా వుంటుందని భువనేశ్వరి అని మార్చుకుందిట. మాకేం తెలుసు? రాత్రంతా నానా హంగామా చేసి తెల్లారేసరికి వెళ్ళిపోయారు వాళ్ళు. పిల్లనిచ్చుకున్నవాళ్ళం. దాన్నెక్కడ సాధిస్తారో అని భయంగా వుంది." దీనంగా చెప్పిందావిడ.

gubcham.com

"ఏం భయంలేదులే. నాల్రోజులు పోతే వాళ్ళే మర్చిపోతారు" అంటూ ఆవిడకి ధైర్యం చెప్పి "అమ్మాయి అలాటి అవకతవక వస్తువులు అరువు ఇవ్వచ్చా తప్పుకదూ!" అంటూ వసంతని మందలించింది.

"మీకు తెలుసు కదా ఆయన సంగతి". అంది వసంత దీనంగా.

ఆయన ప్రసక్తి వచ్చేసరికి అందరికీ ఆయన గుర్తొచ్చాడు.

"అయిపోయిందేదో అయిపోయింది. వాళ్ళు కావాలని చెయ్యలేదుగా. అన్నీ మర్చిపోండి. అతనింకా రాలేదుట. కాస్త మీ అబ్బాయిని పంపించి టెలిఫోన్ చేయించు". రాజీ కుదిర్చింది కాంతమ్మ.

"అబ్బాయింట్లో లేడు. రాగానే పంపిస్తాను" అందావిడ. ముగ్గురూ అబ్బాయికోసం చూస్తూ వుండగానే వచ్చేశాడు వెంకటేశ్వరరావు.

వంటరిగా రాలేదు. స్కూటరొకటి తోసుకుంటూ తీసికొచ్చాడు. పాతకాలంనాటి లాంబ్రెట్టా స్కూటరది. ఇంజన్ కవర్లు రెండు లేవు. బోడిగా వుంది.

"ఏమిటీ అవతారం? ఎందుకింత ఆలస్యం అయింది?" కంగారుగా అడిగింది వసంత.

"రోజూ బస్‌లో వచ్చేవాడిని. ఇవాళ స్కూటర్ కదా అందుకే ఆలస్యం అయింది." చెప్పాడు.

"ఎవరిది స్కూటరు?" అనుమానంగా అడిగింది.

"ఇంకెవరిదో అయితే నేనెందుకు తీసుకొస్తాను మనదే!" గర్వంగా చెప్పాడు.

"మనదా?"

"అవును కొన్నాను. నా ఫ్రెండొహడు చౌగ్గా అమ్మేస్తున్నాడని కొనేశాను. పదిహేనొందలు."

"ఈ మొద్దుకి అంతపోసి కొన్నారా? ఎందుకు పనికొస్తుంది ఇదీ?"

"బండికేం బ్రహ్మాండంగా వుంది. కొంచెం మైనర్ రిపేర్లున్నాయ్ అవి నేనే చేసేగల్ను. ఆ తర్వాత పెయింటింగ్ చేయించేస్తే విమానంలా నడుస్తుంది" గర్వంగా చెప్పాడు.

"ఆ నడిచే లాగానే వుంది దీని మొహం చూస్తుంటే! ఎన్నో సార్లు చెప్పాను ఈ అణాకానీ వస్తువులు వద్దండీ అని వింటారా! వీటితో నా ప్రాణం విసిగిపోతోంది. ఇవాళ ఎంత రభస అయిపోయిందో తెలుసా" అంటూ జరిగిందంతా వివరించింది.

"ఇది మరీ బావుంది. టేప్‌రికార్డర్ ఇచ్చేటప్పుడే అదేలా వాడాలో స్పష్టంగా చెప్పాను. ఒక స్టాప్ స్విచ్ మాత్రమే నొక్కితే ఆగదండీ, స్టాపూ ఎజెక్ట్ రెండు

స్విచ్‌లూ కలిపి నొక్కితే చాలు అని చిలక్కి చెప్పినట్లు చెప్పాను. చెప్పింది సరిగ్గా వినకుండా అవస్థ పడిపోయి మనమీదికి దండయాత్ర చేస్తే ఎలా?" విసుక్కున్నాడు.

పక్కింటావిడకి కోపం వచ్చింది. "ఏమో నాయనా! ఇలాటి మహత్తరమైన వస్తువుల వాడకం గురించి మాలాటి సామాన్యులకు ఒక పట్టాన అర్థం అవుతుందా? ఎందుకైనా మంచిది ఈ స్కూటర్ మాత్రం ఎవరికీ అరువు ఇవ్వకు బాబూ!" అనేసి వెళ్ళిపోయింది.

వసంతకు కోపం వచ్చేసి భర్తతో పోట్లాటకి దిగింది. అతనూ గట్టిగానే పోట్లాడాడు. ఇద్దరూ హోరాహోరీ యుద్ధం మొదలుపెట్టారు.

* * *

మొదటి ఆట సినిమా వదిలారు. హాల్లోంచి బయటకు వచ్చారు వెంకటేశ్వర్లు, వెంకటాచలం. తాపీగా నడుచుకుంటూ వెళ్ళి రోడ్డు పక్కనున్న బండమీద కూర్చున్నారు.

సిగరెట్లు ముట్టించారు ఇద్దరూ. "రేపే కదూ వాళ్ళొచ్చేది?" అడిగాడు చలం.

"అవును. రేపే రావాలి. కానీ రారులే. ఈసారి ఉత్తరం బాగా ఘాటుగా రాశాను. నా అంచనా ప్రకారం నిన్నో, ఇవాళో వాళ్ళకి చేరే వుంటుంది" అన్నాడు వెంకటేశ్వర్లు.

"ఎందుకొచ్చిన తలనెప్పి ఇదంతా. నామాటవిని నేను చెప్పినపని చేస్తే సరిపోయేది. ఈపాటికి అంతా సెటిలైపోయి దర్జాగా వుండేవాళ్ళం". విసుక్కున్నాడు చలం.

"నీకేం సలహాలు బాగానే చెప్తావు. పాపం పుణ్యం, కష్టం సుఖం ఆలోచించాల్సిన వాడిని నేను." గొణిగాడు వెంకటేశ్వర్లు.

"సింగినాదం. అలా నిమిషాలు లెక్కపెడుతూ కూర్చుంటే అయినట్లే. జీవితంలో సుఖపడాలంటే తెగించాలి మరి. మన జీవితం బాగా గడవడం కోసం ఏం చేసినా తప్పుకాదు. నా మాట విను." హితబోధ మొదలుపెట్టాడు చలం.

అంతా విని తలపంకించాడు వెంకటేశ్వర్లు. "నువ్వు చెప్పింది నిజమే. ఇక ఆలస్యం చెయ్యను. ఏదో ఒకటి తేల్చి పారేస్తాను." అన్నాడు. మరి కాసేపు సీరియస్‌గా మాట్లాడుకుని ఇంటిదారి పట్టారు ఇద్దరూ.

* * *

gudachari.com

సింహం చెప్పిన ప్రకారం తెల్లవారుఝామున నాలుగు గంటలకే నిద్ర లేపేశాడు. లాడ్జీ కుర్రాడు. అనేక తర్జనభర్జనల అనంతరం, మాధవ్ కూడా సింహంతో వెళ్తానని నిర్ణయించుకున్న తర్వాత వారిద్దరూ ప్రయాణ సన్నాహాలు సాగించారు.

సింహం గది ఖాళీ చేశారు. అదృష్టవశాత్తూ ఆ సమయంలో హనుమాన్లు అక్కడ లేదు. అయితే అప్పటిదాకా అక్కడే కాపలా వేశాడనీ, తిండికో తీర్థానికో వెళ్ళుంటాడని చెప్పారు చూసినవాళ్ళు.

గబగబ పనిముగించుకుని బయటపడ్డారు ఇద్దరూ. చరాస్తుల్లో చాలావరకు అమ్మిపారేసి డబ్బు చేసుకున్నారు. రావుగారి రూమ్ కూడా ఖాళీ చేసేసి ఏదో కొంచెం తిని ఓ లాడ్జీకి వెళ్ళి చెరో మడత మంచం అద్దెకి తీసుకుని పడుకున్నారు.

లాడ్జీకుర్రాడు లేపగానే లేచి అయిదు నిముషాల్లో తయారైపోయి ఎయిర్ బాగులు భుజానికి తగిలించుకుని బయలుదేరారు. బస్టాండ్‌కి వెళ్ళి కాఫీ తాగి ఫస్ట్‌బస్ పట్టుకున్నారు. రెండు బస్సులు మారి మూడో బస్సు దగ్గరికి వచ్చేసరికి పదిగంటలైంది. ఎండ మిడమిడలాడిపోతోంది.

ఒక్క బస్ కోసం నాలుగు బస్‌లకు సరిపడా జనం వున్నారు. అసలే ఆ రూట్‌లో బస్సులు తక్కువట. అందులోనూ ఆరోజు సంతట. బుట్టలూ తట్టలూ పట్టుకుని హడావిడిగా వున్నారు జనం.

బస్ రాగానే ఈగల్లా ముసిరిపోయారు. అందరికంటే ముందు స్నేహితుడి కిటికీలోంచి తోసేసి తనూ దూరిపోయాడు సింహం. అరగంట తర్వాత కదిలింది బస్. కిటికీ పక్కన కూర్చున్న సింహం బాగానే వున్నాడు గానీ సీటు చివర కూర్చున్న మాధవ్ పరిస్థితి దయనీయంగా వుంది.

ఓ ఇల్లాలు సంసారసమేతంగా బస్సెక్కింది. మాధవ్ ఒడిలో ఓ పిల్లనీ అతని కాళ్ళ దగ్గర ఇంకో పిల్లనీ కూర్చోబెట్టింది. అతని భుజానికి ఓ బుట్ట తగిలించి నాలుగు కోళ్ళ కట్ట అతని నెత్తిన ఆనుకునేలా పట్టుకుని నిలబడింది.

సీతారామయ్యగార్నీ, అప్పలమ్మనీ, హనుమాన్లనీ, సింహాన్ని హోల్‌సేల్‌గా తిట్టుకుంటూ కూర్చున్నాడు మాధవ్. కాస్సేపటికి ఆ రద్దీ కొంచెం తగ్గింది.

"మరో అరగంటలో వెళ్ళిపోతాం!" అన్నాడు సింహం ఆనందంగా.

చిర్రెత్తుకొచ్చింది మాధవ్‌కి. "ఏదో పెళ్ళికి వెళ్తున్నట్లు మహా సరదా పడిపోతున్నావ్. నువ్వెంత ప్రమాదంలో తలదూరుస్తున్నావో నీకేం అర్థం కావడం లేదు."

చిద్విలాసంగా నవ్వాడు సింహం.

"చూడ్రా మాధవ్. మానవాతీతమైన శక్తి ఒకటుందని, అందర్నీ చదరంగంలో పావుల్లా ఆడించేవాడు పైన వున్నాడని ప్రగాఢంగా నమ్మేవారిలో నేనొకడిని.

ఆ కేసు ఫెయిలవ్వడం, నీ ఉద్యోగం పోవడం, ఆయన నిన్ను రూము ఖాళీ చేసి పొమ్మనడం, ఆ తర్వాత ఆ ఉత్తరం దొరకటం ఇదంతా ఆలోచిస్తుంటే వింతగా లేదూ! పరిష్టంగా ప్లాన్ ప్రకారం జరుగుతున్నట్లుగా అనిపించడం లేదూ!

నీకు చిరాగ్గా వున్నా నాకు మాత్రం భలే థ్రిల్లింగ్‌గా వుంది. ఇక ప్రమాదం సింగినాదం అంటావా? అక్కడెక్కడో వున్న నన్ను తీసుకొచ్చి వెంకటాపురంలో పడేస్తున్న ఆపైవాడే నాకు అండగా వుంటాడు" అన్నాడు పరవశంగా.

విసురుగా మొహం తిప్పేసుకున్నాడు మాధవ్. "గాల్లో దీపం పెట్టి దేవుడా నీ మహిమ అంటే ఇదే" గొణుక్కున్నాడు.

బస్ గమ్యం చేరింది. "వెంకటాపురం దిగండి" అంటూ అరిచాడు కండక్టర్. ఇద్దరూ బస్ దిగారు. బస్ వెళ్ళిపోయింది. కుతూహలంగా చుట్టూ చూశాడు సింహం. ఊరు ముమారుగా వుంది. బజారంతా ఆ రోడ్డు మీదే వుందేమో అనేలా వుంది. కొంచెం దూరంలో రెండు మూడు కాఫీ హోటళ్ళు దానికి కాస్త దూరంలో సినిమా హాలు. పాత 'రాముడు- భీముడు' సినిమా ఆడుతోంది.

ఇంకాస్త ముందుకి వెళ్తే రరకాల దుకాణాలు వరుసగా వున్నాయి. కొంచెం దూరంలో ఊరు కనిపిస్తూ వుంది.

బస్సాగిన శబ్దం విని హోటల్లోంచి బయటికి వచ్చాడు ఓ మనిషి. వీళ్ళను చూడగానే పరిగెట్టుకుంటూ వీళ్ళ దగ్గరికి వచ్చేశాడు.

"రండి! రండి! మీ కోసమే చూస్తున్నా!" అన్నాడు బొంగురు గొంతుతో. తెల్లబోయారు మిత్రద్వయం. హఠాత్తుగా ప్రత్యక్షం అయిన ఆ శాల్తీని ఎగాదిగా చూశారు.

మనిషి దిట్టంగా వున్నాడు. చేతుల బనీన్. గిరజాల జుట్టుకి ఆవదం రాసుకుని దువ్వుకున్నాడు. మెళ్ళో ఆంజనేయస్వామి బిళ్ళ. జబ్బకి తావీదు. ఎర్రటి కళ్ళు. బుర్రమీసాలు.

"రండి మీకోసం పొద్దుటి నించి ఇక్కడే కూర్చున్నాను" రెట్టించాడు.

మాధవ్ గుండె ఠారుమంది. "ఒరే వీడూ వీడి గెటప్పూ ఆ హనుమాన్లకి తమ్ముడులా లేడూ!" భయంగా గుసగుసలాడాడు.

gudachari.com

"మాకోసం వచ్చావా? అసలు నువ్వెవరు?" అడిగాడు సింహం.

"నా పేరు హనుమంతుడు"

కీచుమంటూ అరిచి పారిపోబోయాడు మాధవ్. గభాల్న అతడిని దొరకబుచ్చుకున్నాడు సింహం.

"హనుమంతూ నువ్వు" అంటూ మాట్లాడబోయిన సింహాన్ని వారించాడు హనుమంతు. "మీర్రాగానే కబుర్లేసుకుని కూర్చోకుండా వెంట తీసుకురమ్మని చెప్పారు. పదండి వెళ్దాం." అంటూ ఇద్దరి చేతుల్లోంచి బాగులు జబర్దస్తీగా లాక్కున్నాడు. చెరో భుజానికీ తగిలించేసుకుని "ఇక పదండి!" అంటూ నడక ప్రారంభించాడు.

సింహం వారిస్తున్నా వినిపించుకోలేదు. "ఇదెక్కడి గొడవరా! వీడెవడో వాడి తాతలా వున్నాడే. అసలు వాడికీ వీడికీ సంబంధం గానీ లేదు కదా! నాకేదో భయం వేస్తోంది." తడబడిపోయాడు మాధవ్.

"ఛ నోర్ముయ్. వెధవ అనుమానాలూ నువ్వూను. మనల్ని చూసి మరెవరో అనుకున్నాడు. వాడి వెంట వెళ్దాం. ఎవరితోనైనా పరిచయం అవుతుంది పద." అన్నాడు సింహం.

అప్పటికే అంత దూరం వెళ్ళిపోయాడు హనుమంతు. అతని వెంట పడ్డారిద్దరూ గబగబా అంగలు వేసుకుంటూ వెళ్ళిపోతున్న హనుమంతుని ఫాలో అవడానికి దాదాపు పరిగెట్టాల్సి వచ్చింది వీరిద్దరికీ.

వెళ్ళివెళ్ళి ఓ ఇంట్లోకి వెళ్ళిపోయాడు హనుమంతు. వెనకాలే వెళ్ళారు వీళ్ళిద్దరూ. ఎండ, టెన్షన్, దానికి సాయం పరుగు. అన్నీ ఏకం అయి ఆయాసం వచ్చింది ఇద్దరికీ. అందులోనూ ఎండలోంచి చీకట్లోకి వెళ్ళేసరికి కళ్ళు కనిపించడం మానేశాయి.

వీళ్ళు కాస్త సర్దుకునేలోపలే నలుగురైదుగురు మగవాళ్ళు ఎదురొచ్చి వీళ్ళని ఆహ్వానించి కాళ్ళు కడిగించి లోపలికి తీసుకువెళ్ళి చెరో చెక్క కుర్చీలోనూ కూలేశారు.

మంచినీళ్ళు తెచ్చి ఇచ్చారు. గటగట రెండు గ్లాసుల నీళ్ళు తాగి కాస్త తేరుకున్నారు ఇద్దరూ. వీళ్ళని చూసి ఆప్యాయంగా నవ్వేరు వాళ్ళు. వీళ్ళు కూడా కృతజ్ఞతగా నవ్వేరు.

ఈయన సుబ్బారావు. ఈయన వెంకట్రావు అంటూ పరిచయం చేశారు ఒకాయన. పరిచయం చేశాక నమస్కారం పెట్టాలి కాబట్టి అందరికీ నమస్కారాలు పెట్టారు సింహం, మాధవ్. ఇక తమని పరిచయం చేసుకుందాం అనుకుంటూ వుండగానే నోరిప్పాడు పరిచయాలు చేసినాయన.

"మేనమామ అంటే వయసులో పెద్దవారేమో అనుకున్నాం. తీరా చూస్తే ఇద్దరూ ఒకే వయసులో వున్నారు. ఇంతకీ మీ ఇద్దరిలో ఎవరు మేనమామ?" అడిగాడు.

నోరావలించాడు మాధవ్. "మేనమామా? అలాటివారెవరూ లేరు. మేమిద్దరం స్నేహితులం." చెప్పాడు సింహం.

"ఓ! అదా సంగతీ? అయితే గోవిందరాజులుగారు రాలేదన్నమాట!"

"గోవిందరాజులుగారెవరండీ?"

"అరె. ఆశ్చర్యంగా వుందే. మీకు గోవిందరాజులుగారు తెలియదా? వ్యాసమూర్తి గారి మేనమామగారు!"

"వ్యాసమూర్తి గారెవరండీ?"

"అదే మేమూ అడుగుతున్నాం. మీలో వ్యాసమూర్తి ఎవరూ అని?"

"మాలో వ్యాసమూర్తి ఎవరూ లేరండీ! నా పేరు సింహం. వీడి పేరు మాధవ్"

"ఇది మరీ బాగుందండీ! గోవిందరాజులుగారు రాలేదు సరే. కానీ వ్యాసమూర్తిగారు కూడా రాకుండా మిమ్మల్ని పంపడం! ఇదేం మర్యాద చెప్పండి!" నిష్ఠూరంగా అడిగాడాయన.

వీళ్ళిలా తికమకపడుతూ వుండగానే వాకిలి దగ్గర కలకలం వినిపించింది. అమ్మాయిని తీసుకొచ్చారు ఇద్దరు ఆడవాళ్ళు.

అనుకోని సంఘటన ఎదురయేసరికి అదిరిపడి లేచి నుంచున్నారు మిత్రులిద్దరూ.

ఒక విధంగా పెళ్ళిచూపుల తతాంగానికి అలవాటు పడిపోయిన లక్ష్మి హాల్లోకి రాగానే తలెత్తి చూసింది. సింపుల్‌గా వుండి తను రాగానే లేచి నిలబడి బుద్ధిగా తలొంచుకున్న మాధవ్ చూడగానే నచ్చాడు.

"మన్నించాలి. మీరు పొరబాటు పడ్డారు. మేము పెళ్ళి చూపులకోసం రాలేదు". తడబడుతూ చెప్పేశాడు సింహం.

అప్పటివరకూ ప్రసన్నంగా వున్న అందరి మొహాలు ఎర్రబడ్డాయి. అందర్లోకి పెద్దవాడైన వెంకట్రావు లేచి నిలబడ్డాడు.

"లక్ష్మిని లోపలికి తీసుకువెళ్ళండి." కసిరాడు.

పక్కన బాంబు పడ్డట్లు అదిరిపడ్డాడు సింహం. "లక్ష్మీ!" గిర్రున వెనక్కి తిరిగి చూశాడు. అప్పటికే గడపదాటి వెళ్ళిపోతోంది.

"మీరు పెళ్ళిచూపులకి రాలేదా? అసలెవరు మీరు? మా ఇంటికి ఎందుకొచ్చారు." నిలదీసి అడిగాడు వెంకట్రావు.

audachan.com

అందరూ తమ వంక చూస్తున్న చూపులు సూదుల్లా గుచ్చుకున్నాయి మాధవ్‌కి. పిచ్చిచూపులు చూస్తూ నిలబడిపోయిన మిత్రుడి మీద పీకలదాకా కోపం వచ్చింది. అటువంటి అసహ్యకరమైన పరిస్థితిలో ఇరుక్కున్నందుకు దుఃఖం వచ్చింది.

"ఎందుకొచ్చాం అంటే మాఖర్మ. వద్దురా అంటే విన్నాడా ఈ వెధవ. ఛీ. నాకేడుపొస్తోంది. ఇంకొక్క క్షణం కూడా ఇక్కడ వుండను. బస్సెక్కి వెళ్ళిపోతాను." గద్గదకంఠంతో సమాధానం చెప్పి వాకిట్లోకి దూసుకుపోయాడు.

అనుకోని సంఘటన ఎదురయేసరికి ఏం చెయ్యాలా అని ఆలోచించసాగాడు సింహం. అసలతనిలోని గొప్పతనం అదే. ఏదైనా ప్రమాదం ఎదురైతే కంగారు పుట్టి వున్న తెలివి కూడా వూడిపోతుంది అందరికీ. అతనికలా కాదు. బుర్ర మరింత చురుగ్గా పనిచేస్తుంది. ప్రస్తుత పరిస్థితిలో కూడా అలాగే పనిచేసింది. అప్పటికప్పుడే చక్కటి పథకం తయారు చేసుకున్నాడు.

"అడుగుతుంటే సమాధానం చెప్పవేం? అసలెవర్నువ్వు? మా ఇంటికి ఎందుకొచ్చావ్?" ఏకవచనంలోకి దిగిపోయాడు వెంకట్రావు.

"మేము మా స్వంతపనిమీద వచ్చాం."

ఆ సమాధానం విన్న లక్ష్మి తండ్రి సుబ్బారావుకి ఒళ్ళు మండింది.

"స్వంత పనిమీద వచ్చిన వాళ్లైతే మా ఇంటికెందు కొచ్చారు?" కఠినంగా ప్రశ్నించాడు.

"మాకై మేము రాలేదండీ. బస్ దిగగానే మీ పనివాడు వచ్చి మేము చెప్పేది వినకుండా మా సంచీలు లాక్కుని పరిగెడుతూ వుంటే విధిలేక అతని వెంటబడి వచ్చేశాం. ఇక్కడికి రాగానే మీరంతా కంగారు పెట్టేసి కాళ్ళు కడిగేసి లోపలికి లాక్కొచ్చేశారు" వినయంగా సమాధానం చెప్పాడు.

అతని మాటల్లోని నిజాన్ని గ్రహించారు శ్రోతలు. కాస్త శాంతించారు. గబగబ వాకిట్లోకి వెళ్ళాడు సుబ్బారావ్. హనుమంతుని పిల్చి చీవాట్లు వేసి మళ్ళీ బస్టాండుకి పంపించాడు.

"ఇంతకీ మీరెవరు? ఎవరింటికి వచ్చారు"? సింహాన్ని ప్రశ్నించాడు వెంకట్రావ్.

"ఏం చెప్పమంటారండీ. చెప్పాలంటే అదో పెద్ద కథ. మా స్నేహితుడు ఓ నెల్రోజుల క్రిందటిదాకా నిక్షేపంలా వుండేవాడు. హఠాత్తుగా ఆరోగ్యం పాడైపోయింది. డాక్టర్ల చుట్టూ తిరిగితే అన్ని పరీక్షలూ చేసి వ్యాధి నిర్ణయం చేశారు.

అదేవిటో కొత్తరకం జబ్బుట. ఇజ్రాయిల్ నుండి దిగుమతి అయిందిట. ఈ జబ్బుకి మందులేవీ పనిచెయ్యవట. గాలిమార్పు నీటిమార్పు కావాలని చెప్పారు. అందుకనే వాడిని తీసుకొని ఇలా వచ్చాను." చెప్పాడు సింహం.

అంతా మొహమొహాలు చూసుకున్నారు. ఈ జబ్బు అంటువ్యాధా? అందరు గోలగా చెప్పుకుంటున్నారు. ఇదీ అదీ ఒకటేనా?" భయంగా అడిగాడు సుబ్బారావు.

"ఛఛ. అదికాదు. అది ఇంగ్లీషు జబ్బు. ఇది ఇజ్రాయిల్ జబ్బు." చెప్పాడు.

"ఈ వ్యాధి లక్షణాలు ఏమిటి?" మరో ప్రశ్న.

బుర్ర గోక్కున్నాడు సింహం. "చెప్పుకోదగ్గ లక్షణాలేం లేవండీ. మామూలుగా బాగానే వుంటాడు. వుండుండి విచిత్రంగా ప్రవర్తిస్తుంటాడు".

"అంటే మీదపడి రక్కడం గట్రా చేస్తాడా?" అడిగాడు వెంకట్రావు.

"అబ్బే అలాటివేం చెయ్యడండీ. కాస్త మొండితనం చేస్తాడు. చెప్పినా వినిపించుకోడు. తను చెయ్యదల్చుకున్నది చేస్తాడు. గట్టిగా చెప్తే కళ్ళనీళ్ళు పెట్టుకుంటాడు. అకస్మాత్తుగా బయలుదేరి బస్సెక్కి వెళ్ళిపోతా రైలెక్కి వెళ్ళిపోతా అంటూ వుంటాడు. అలాటి సమయాల్లో నయానా భయానా చెప్పి దార్లోకి తెచ్చుకోవాలి. కాకపోతే నీకు ఇజ్రాయిల్ జబ్బు అంటే మాత్రం ఈడ్చి తంతాడు" దీనంగా చెప్పాడు.

శ్రోతలకు కాస్త జాలి కలిగింది.

"సరే మరి బాగానే వుంది. అంతగా మార్పు కావాలనుకుంటే ఏ బంధువుల ఇళ్ళకో పంపించక ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చారు?" అడిగారు.

పేలవంగా నవ్వాడు సింహం. "మాకు బంధువులు ఎవరూ లేరు. అనాథ వెధవలం".

అప్పటిదాకా గుమ్మం దగ్గర నిలబడి ఇదంతా చూస్తున్న వెంకట్రావుగారి భార్య శాంతమ్మ అదిరిపడింది. ఒక్క అంగలో సింహం దగ్గరికి వచ్చేసింది.

"ఏమన్నావ్? నువ్వు అనాథవా?" ఆత్రంగా అడిగింది.

"అవునండీ. మాకెవ్వరూ లేరు. తల్లిదండ్రులూ, అన్నదమ్ములూ ఎవరూలేరు. అనాథలం".

గభాల్న అతనిచేతులు పట్టుకుంది ఆవిడ. "విరంగా చెప్పు బాబూ నీ పేరేమిటి? నీ చిన్నతనం ఏమైనా గుర్తుందా?" నిలువెల్లా వణికిపోతూ ప్రశ్నించింది.

వెంకట్రావు వేగంగా దగ్గరికి వచ్చాడు. "ఏమిటి నీ వెర్రి వదులు." భార్య చేతుల్లోంచి అతని చేతులు విడిపించాలని ప్రయత్నించాడు. కానీ ఆవిడ వదలేదు.

gudachari.com

"చెప్పు బాబూ! నేనడిగినదానికి సమాధానం చెప్పు"

"ఏం చెప్పమంటారమ్మా. బుద్ధి తెలిసేసరికే అనాథ శరణాలయంలో వున్నాను. నేను పసికందుగా వున్నప్పుడే శరణాలయం వాకిట్లో వదిలేసి పోయారుట." సమాధానం చెప్పాడు సింహం.

అతని చేతులు వదిలేసింది శాంతమ్మ. "మరి నీ స్నేహితుడు?" ఇంకా ఆ తీరక అడిగింది.

"వాడూ అంతే!"

ఆవిడ మొహంలో కాంతి ఎగిరిపోయింది. నీరసంగా వెళ్ళి గోడకు ఆనుకుని కూర్చుని కళ్ళు మూసుకుంది. కన్నీళ్ళు చెంపలమీదికి జారాయి. అంతా ఆవిడ వంక జాలిగా చూస్తూ వుండిపోయారు. ఆవిడ మనసులోని గాయం మళ్ళీ రేగింది. అది మానాలంటే కొంతకాలం పడుతుంది.

ఒకదానివెంట ఒకటిగా ఎదురౌతున్న విచిత్ర సంఘటనలతో ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు సింహం. త్వరగా అక్కడినుంచి బయటపడిపోతే బాగుండు అనిపించింది. అందరికీ చేతులు జోడించాడు.

"మారాక వల్ల మీ అందరికీ ఇబ్బంది కలిగింది. క్షమించండి. మాకంటూ ఎవరూ లేరు. ఏ ఊరైనా ఒకటే అని ఈ ఊరు ఎంచుకున్నాను. ఇది చిన్న ఊరు. నా స్నేహితుడితో ఇక్కడ కాలక్షేపం చేయొచ్చని వచ్చాను. మీరు శెలవిప్పిస్తే ఊర్లోకి వెళ్ళి వుండడానికి ఇల్లు వెతుక్కుంటాను." అన్నాడు వినయంగా.

చివాల్న తల ఎత్తింది శాంతమ్మ. "వెతుక్కోవడం ఎందుకు? మా ఇంట్లో వుండండి." అనేసింది.

"శాంతా!" వారించారు వెంకట్రావుగారు. అది గమనించి సింహం కూడా వద్దన్నాడు. ఎవరి మాటా వినలేదావిడ.

"మరేం ఫర్వాలేదు. పాపం కష్టంలో వున్నారు. నాల్రోజులు మనింట్లో ఆశ్రయం ఇచ్చినంత మాత్రాన మా ఆస్తేం తరిగిపోదు. వీళ్ళు మా ఇంట్లోనే వుండాలి" అని పట్టుబట్టింది.

అంగీకరింపక తప్పలేదు అందరికీ.

"మీరు ఇక్కడే వుండి పనయ్యాక రండి. నేను వీళ్ళని తీసికెళ్తాను. భోజనం ఏర్పాట్లు చూడాలిగా!" అంటూ అప్పటికప్పుడే బయలుదేరింది.

"మాధవ్‌ని తీసుకురావాలి కదమ్మా మీరు వెళ్ళండి. నేను వాడిని తీసుకొస్తాను" అన్నాడు సింహం. మాధవ్ బస్టాండ్‌కి వెళ్ళుంటాడు. వెళ్ళి పట్టుకుని నాలుగు తిట్టి తీసుకురావాలని అతడి ఆలోచన.

కానీ ఆవిడ ఒప్పుకోలేదు. "నేను మనిషిని పంపిస్తాను. ఎండలో మళ్ళీ నువ్వేం వెళ్తావు గానీ పద!" అంటూ బలవంతపెట్టేసింది. ఆవిడ వెంట బయలుదేరాడు సింహం.

ఆవిడ ఆదేశానుసారం పనివాడు రాములు మాధవ్ కోసం వెళ్లాడు. అనుకున్నట్లే బస్టాండులోనే వున్నాడు మాధవ్. పెళ్ళివారిని రిసీవ్ చేసుకోడానికి వచ్చిన హనుమంతు కూడా అక్కడే వున్నాడు. రాముల్ని చూడగానే దగ్గరికి వచ్చాడు. "ఏమిటిలా వచ్చావ్?" అంటూ అడిగాడు.

"అబ్బాయిగార్ని తీసికెళ్ళడానికి వచ్చాను." చెప్పేసి మాధవ్ దగ్గరికి వెళ్ళాడు. "పదండి బాబూ వెళ్దాం." అన్నాడు ప్రేమగా.

'నేనాను ఫో' విసుక్కున్నాడు మాధవ్.

"ఇలా పేచీ పెట్టకూడదు. చక్కగా మాట వినాలి. పదండి వెళ్దాం." బుజ్జగించాడు.

"నేను చచ్చినారాను." మొండికేశాడు మాధవ్.

ఇదంతా గమనిస్తున్న హనుమంతు" వద్దురా రాములూ. ఇందాక నేనూ ఇలాగే బలవంతం చేసి తీసుకెళ్ళాను వీళ్ళని. అయ్యగారు ముక్క చివాట్లు వేశారు." తన అనుభవం చెప్పాడు.

"కాదులే. అమ్మగారు మరీమరీ చెప్పి పంపించారు. ఎలాగైనా సరే వెనక్కి తీసుకురమ్మన్నారు." అన్నాడు రాములు.

ఇదంతా వింటున్న మాధవ్ మరింత బెదిరిపోయాడు. "నేనాను. బస్ రాగానే అందులో ఎక్కి వెళ్ళిపోతా! మా ఊరు వెళ్ళిపోతా! అంటూ గోల పెట్టేశాడు.

ఇలా చేస్తాడని అమ్మగారు ముందే చెప్పడం వల్ల రాములు అతనిగోల వినిపించుకోలేదు. రెక్క పుచ్చుకుని బరబరా లాక్కుపోవడం మొదలుపెట్టాడు.

బిక్కచచ్చిపోయాడు మాధవ్. అక్కడేదో గొడవ అయింది. తీసికెళ్ళి తంతారు కాబోలు. దుఃఖం తన్నుకొచ్చింది. "నన్నొదిలి పెట్టండి. ప్లీజ్" కన్నీళ్ళతో బ్రతిమాలుతూ వున్నా వినకుండా తీసికెళ్లి ఇంటికి చేరాక అప్పుడు వదిలాడు రాములు.

ఏం ప్రమాదం ఎదురవుతుందో అని భయపడిన మాధవ్‌కి ఆదరంగా ఎదురొచ్చిన శాంతమ్మని చూడగానే సగం మతిపోయింది. గదిలో మంచం మీద

gudachari.com

పవళించి చిద్విలాసంగా చిరునవ్వులు చిందిస్తూ వున్న సింహాన్ని చూశాక పూర్తి మతిపోయింది.

* * *

గదిలో కుర్చీలో కూర్చుని వుంది లక్ష్మి. జరిగిన సంఘటనతో మనసంతా పాడైపోయింది. క్రిందటిరోజు శ్యామల చెప్పిన తర్వాత తనక్కూడా కాబోయే భర్త ఇవాళ వస్తాడనే అనిపించింది. అందుకే వెళ్ళగానే అతడిని చూసింది. ఏనాడూ లేనిది ఏదో వింత అనుభూతి కూడా కలిగింది. తీరా చూస్తే అతగాడు ఇంకెవరోట.

ముందూ వెనకా ఎవరూ లేని అనాథట. అంతేకాదు. అదేవిటో ఇజ్రాయిల్ జబ్బు కూడా వుందిట. ఎందుకో చెప్పలేనంత నిరాశ అనిపించింది.

చామంతి పూల జడ బరువుగా వుంది. మెడ నొప్పెడుతోంది. కూర్చుని కూర్చుని విసుగొస్తోంది. "ఏమిటో వెధవ మేళం. ఆ వచ్చేవాళ్ళు చెప్పిన టైముకి రాకూడదా!" విసుక్కుంది.

ఎదురుగా కూర్చున్న శ్యామలకు కూడా చాలా విసుగ్గా వుంది. పొద్దున తొమ్మిది కొట్టేసరికల్లా వచ్చేసి లక్ష్మిని తయారు చేసింది. పదింటి బస్‌లో వస్తాం అన్న పెళ్ళివారు పన్నెండైనా అయిపూ అజా లేరు.

అంతలోనే హఠాత్తుగా హడావిడి. వాళ్ళొచ్చేశారని పరుగులు. తీరా చూస్తే వాళ్ళు పెళ్ళివారు కాదుట. ఇదంతా చూస్తుంటే చెడ్డ చిరాకు వేసింది శ్యామలకి. వూరికే కూర్చుని ఆవులింతలూ కునికిపాట్లూ.

మరో గంట అలా కునికిపాట్లు పడిన తరువాత మళ్ళీ సందడి మొదలైంది. "వాళ్ళు వచ్చినట్లున్నారు. చూసొస్తానాగు." అంటూ అటు వెళ్ళింది శ్యామల.

వాళ్ళు రాలేదు. పోస్ట్‌మేన్ వచ్చి ఉత్తరం ఇచ్చి వెళ్ళాడు. పెళ్ళికొడుకు మేనమామ రాశాడు. కొన్ని అనివార్య కారణాల వల్ల మేనల్లుడి పెళ్ళి వాయిదా వేస్తున్నట్లు తెలియజేసి వీరిని వేరే సంబంధం చూసుకోమని కోరుతూ నాలుగు ముక్కల్లో ముగించాడు.

హతాశుడై పోయాడు సుబ్బారావు. ఆనందం దాచుకుని గంభీరత నటించాడు వెంకటేశ్వర్లు.

"సరిపోయింది సంబరం. ఇదీ బెడిసి కొట్టింది. వారంరోజుల్నించీ నానా ఆర్భాటం చేశారు. వాళ్ళకోసం నిన్నంతా కూర్చుని నడుము పడిపోయేలా పిండివంటలు వండాను. తీరా చూస్తే వాకిట్లోకైనా రాలేదు వాళ్ళు. ఇంకా ఎన్నాళ్ళు

ఎంతమందికీ చాకిరీ చెయ్యాలో. ఈవిడగారి సంబంధం నేను బ్రతికుండగా కుదిరేలా లేదు.

ఒక్కొక్కరి తలరాత అంతే. ఈవిడ కంటే ఏడాది వెనకాల మొదలు పెట్టాం మా చెల్లి పెళ్ళిప్రయత్నాలు. అదప్పుడే పురిటికి వచ్చేసింది. ఈ మహాతల్లికి మాత్రం ఎక్కడా కుదరడంలేదు" - బాహాటంగానే విసుక్కుంది వెంకటేశ్వర్లు భార్య సావిత్రి.

"అమ్మాయ్! ఏమిటా మాటలు. తప్పంతా దానిదే అయినట్లు మాట్లాడతావేమిటి? పాపం అదేం చేస్తుంది. దానికి రాసిపెట్టున్న వాడెవడో రావాలి కదా! ఇంకా కళ్యాణఘడియ రాలేదు. వస్తే ఎవరం శ్రమ పడకుండానే పెళ్ళయిపోతుంది. స్వయానా దాని వదినవి. తల్లిలాటిదానివి. నువ్విలా మాట్లాడ్డం ఏమీ బాగాలేదు." మందలించాడు వెంకట్రావు.

మొహం ఇంత చేసుకుని రుసరుసలాడుతూ వెళ్ళిపోయింది సావిత్రి. వెంకటేశ్వర్లుకి కోపం వచ్చింది.

"అదన్నమాటలో తప్పేముంది మావయ్యా? దాని బాధ దానిది. ఇంట్లో కూర్చునే నాన్నకీ, మీకూ ఏం తెలుస్తుంది? నలుగుర్లోకీ వెళ్ళాలంటే చచ్చేంత మొహమాటంగా వుంది మాకు. ఏవయ్యా చెట్టంత అన్నగారివి వున్నావ్. నీ చెల్లెలికి పెళ్ళి చెయ్యవా అని మొహానే అడుగుతున్నారు. మేము ఏం చెప్పినా ఈయనకి అర్థం కాదు.

ఊళ్ళో అందరి సలహాలు కచ్చితంగా పాటిస్తారే తప్ప నేను మంచి చెప్పినా అర్థం చేసుకోరు. కానీండి మా ఖర్మ. ఏం చేస్తాం?" విసురుగా సమాధానం చెప్పేసి భార్య వెనకాలే లోపలికి వెళ్ళిపోయాడు.

అక్కడున్న వాళ్ళందరూ మొహమొహాలు చూసుకున్నారు. జాలిగా సుబ్బారావు వంక చూశారు. ఈ ఇంటి పరిస్థితి, ఆ ఇంట్లో ఆయన ఎదుర్కుంటున్న చికాకులు ఆత్మీయులందరికీ తెలుసు. సానుభూతి చూపడం తప్ప ఎవరేం చెయ్యగలరు?

ఈ రభసంతటికీ కారణం అయిన లక్ష్మి దిగాలు పడిపోయింది. స్నేహితురాల్ని ఆ స్థితిలో చూసి బాధపడింది శ్యామల. నాలుగు ముక్కల్లో ధైర్యం చెప్పి "నేను వెళ్తాను లక్ష్మీ!" అనేసి బయటపడింది.

స్నేహితురాలు అంత కష్టంలో వుంటే అలా వదిలేసి ఆదరాబాదరా వచ్చేసిన శ్యామల అలా చెయ్యడానికి కారణం వుంది.

ఆవిడ కొంతకాలం క్రిందట ప్రేమలో పడింది. అనుకోకుండా ఒక పెళ్ళిలో ఎదురైన చిన్నవాడిని గాఢంగా ప్రేమించింది. అతను కూడా శ్యామలని ప్రేమించాడు.

gudachari.com

శ్యామల తండ్రి ఏకదంతం. తల్లి సుభద్ర. ఆ దంపతులకు శ్యామల ఏకైక సంతానం. ఏకదంతం పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తున్నాడు.

మంచి పర్సనాల్టీతో వుండే ఏకదంతానికి తనను చూసి అందరూ భయభక్తులతో మెలగాలనీ, అందరూ నీ అంతటివాడు ఈ భూమ్మీద లేరు అని మెచ్చుకుని మేకతోలు కప్పాలనీ, డిపార్ట్‌మెంట్లో తన పేరు ప్రఖ్యాతులు మారుమ్రోగాలని ఎంతో కోరిక.

అదేం ఖర్మమో చిన్నతనం నుండీ నిరాశ ఎదురౌతూనే వచ్చింది. తల్లిదండ్రులు, ఆ తరువాత స్కూలు టీచర్లు, ఉద్యోగంలో చేరాక స్టాఫ్, పెళ్ళయ్యాక భార్య అందరూ ఆయన చెవులకు తాటాకులు కట్టి ఆడించేశారు.

ఆయన సబ్ ఇనస్పెక్టరుగా ఉద్యోగంలో జేరాడు. అలాగే వున్నాడు. అదే పోస్ట్‌లో రిటైరైపోతాడు. ఆయనంటే డిపార్ట్‌మెంట్‌లో అందరికీ చులకనే.

ఈ భూ ప్రపంచంలో ఆయన పట్ల గౌరవం కలిగిన ఏకైక వ్యక్తి పీతాంబరం. పీతాంబరం ఆయన మేనల్లుడు. ఆ పీతాంబరానికి తల్లి పోయింది. చిన్నతనం నుండి మేనమామ పంచనే పడి వున్నాడు. అతనికి ఏకదంతం మాట వేదవాక్కు. అతడే ఇతనికి దైవం. ఆ మేనల్లుడంటే నేచురల్‌గా ఏకదంతానికి బోలెడంత ఇష్టం. అతనికి కూతుర్ని ఇచ్చి పెళ్ళి చెయ్యాలని నిర్ణయించుకుని ఇంట్లో ఆ విషయం చెప్పాడు.

తాడెత్తున లేచింది సుభద్ర. అసలైనా దాని పెళ్ళి విషయంలో మీ పెత్తనం ఏమిటీ? దానికెలాటివాడు కావాలో అదే చూసుకుంటుంది అంది. ఆవిడ మాటవరసకి అలా అన్నదేమో అనుకున్నాడు ఆయన. కాదని కూతురు నిజంగానే ఎవర్నో ప్రేమిస్తోందని, ఆ కుర్రాడు తను ఇంట్లో లేని సమయంలో ఇంటికొచ్చి భార్యకి కనపడి వెళ్ళాడని, కాలేజీకి వస్తూ పోతూ వుంటాడని తెలిసింది.

చిన్నతనం నుండి అన్నింటా ఓటమి చవిచూస్తున్న ఏకదంతం ఈ సంఘటనకి పిచ్చివాడైపోయాడు. ఎలాగైనా తన మాట నెగ్గాలనే పట్టుదలతో కూతుర్ని కాలేజీ మాన్పించి ఇంట్లో కూర్చోబెట్టాడు.

అలా చేస్తే క్రమంగా శ్యామల అతడిని మర్చిపోతుంది. అప్పుడు పీతాంబరానికి ఇచ్చి పెళ్లి చెయ్యొచ్చని అనుకున్నాడు. కానీ వాళ్ళిద్దరూ ఉత్తరాలు రాసుకుంటున్నారని తెలిసివచ్చింది. మండిపడ్డాడు. పీతాంబరం అతడిని శాంతింపజేసాడు. "ఈసారి ఆ ఉత్తరం చేజిక్కించుకుందాం. దాన్ని బట్టి అసలు వాళ్ళేం చేయాలనుకున్నారో, వాళ్ళ దెరం ఏమిటో తెలుస్తుంది" అన్నాడు.

అవకాశం కోసం ఎదురుచూస్తూ వుంటే ఆవేళ కుదిరింది. శ్యామల లక్ష్మి ఇంటికి వెళ్ళింది. అమ్మాయిగారు ఉత్తరం ఇంకెవరికీ ఇవ్వద్దన్నారు అంటూ పోస్ట్‌మేన్ గొడవ పెడుతున్నా వినకుండా వాడిని బెదిరించి మరీ లాక్కున్నాడు ఏకదంతం.

లోపలికి వెళ్ళి తలుపులు మూసుకుని మరీ చదివారు ఇద్దరూ.

ముందుగా శ్యామలను కలుసుకోలేక తనెంత బాధపడుతున్నదీ వివరించాడు. ఆ తర్వాత శ్యామల తండ్రిని శాపనార్థాలు పెట్టాడు. నువ్వేం భయపడకు. మంచి ప్లాన్ వేశాను. త్వరలోనే మీ ఊరు వస్తాను. మీ నాన్నని కలుసుకుని బుట్టలో వేసేసి మనపెళ్ళి జరిగేలా చూస్తాను" అంటూ ధైర్యం చెప్తూ ముగించాడు.

అది చూసి నిప్పు తొక్కిన కోతిలా గంతులేసాడు ఏకదంతం. ఇంటికొచ్చిన కూతుర్ని పట్టుకుని తిట్టాడు. సుభద్ర భర్తని తిట్టింది.

మేనమామకి ధైర్యం చెప్పాడు పీతాంబరం. "నువ్వేం కంగారుపడకు, వాడొస్తానని రాశాడు కదా! రానీ. అప్పుడు చూసుకుందాం. నిన్ను బుట్టలో వెయ్యడం అంత తేలికా?" అన్నాడు.

ధైర్యం తెచ్చుకున్నాడు ఏకదంతం.

* * *

శాంతమ్మ కమ్మగా వండి పెడితే తిని సుఖంగా నిద్రపోయాడు సింహం. లేచాక కాఫీ తాగి ఊరిమీద పడ్డాడు. ఊరంతా తిరిగి చూశాడు.

ఊరు ఓ మాదిరిగా వుంది. స్టేట్ బాంకు వుంది. గవర్నమెంట్ స్కూలు వుంది. మనుషుల ఆస్పత్రీ, పశువుల ఆస్పత్రీ వున్నాయి. పుస్తకాలు లేని లైబ్రరీ వుంది. మొక్కలు లేని పార్కు వుంది. జనం హాయిగా నిశ్చింతగా తిరుగుతున్నారు. ఓ మాదిరి బజారు వుంది. ఊరంతా ఓ చక్కర్ కొట్టి కాఫీ హోటల్లో కూర్చున్నాడు సింహం.

కాఫీతాగి అయ్యర్‌తో పరిచయం చేసుకున్నాడు. ఇలాటి కాఫీ నా జన్మలో తాగలేదు అని పొగిడి మాటల్లో పెట్టాడు. " ఈ ఊర్లో ఎంత కాలంగా ఉంటున్నావ్?" అని అడిగాడు. చాలాకాలంగా వుంటున్నాడని తెలిసి సంతోషించాడు.

"ఈ ఊళ్ళో హత్యలవీ జరుగుతాయా?" అని అడిగాడు. గుండె బాదుకున్నాడు అయ్యరు. ససేమిరా జరగవని హామీ ఇచ్చాడు. నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నాడు సింహం.

"ఈ ఊర్లో వెంకటి అని ఎవరైనా వున్నారా?" అడిగాడు.

బుర్ర గోక్కున్నాడు అయ్యరు. "వెంకటి ఎవరూ లేరండీ!" అన్నాడు.

puchani.com

పుసూరుమన్నాడు సింహం. ఆదిలోనే హంసపాదు. అంతలోనే మెరుపులా తట్టింది. తను పొరబాటు పడ్డాడు. అలాటి తప్పుడు పనులకు తలపడిన వాడెప్పుడూ అసలు పేరుతో ఉత్తరం రాయడు. కుదించి రాస్తాడు. కాబట్టి అతడి పేరు వెంకటేశ్వర్రావో, వెంకట్రావో అయి వుంటుంది.

"ఆహా సర్లే. పోనీ వెంకట్రావు లేదా వెంకటేశ్వర్రావు అని పేరు గలవాళ్ళెవరైనా వున్నారా?" అడిగాడు.

అడగడం ఆలస్యం ఆనందపడిపోయాడు అయ్యరు. బోలెడుమంది వున్నారు. చింతచెట్టు వెంకట్రావు, సినిమాహాలు వెంకట్రావు, సిటీ వెంకట్రావు, గుండు వెంకటేశ్వర్రావు, నట్‌బోల్ట్ (Nut & bolt) వెంకటేశ్వర్రావు, పప్పు వెంకటేశ్వర్రావు అంటూ ఓ పెద్ద లిస్ట్ చదివాడు.

వింటున్న సింహానికి నీరసం వచ్చింది. "ఇదంత అర్రీ బుర్రీగా తేలే వ్యవహారంలా కాదనిపించింది. నిదానంగా ఆలోచించాలి" అనుకుంటూ ఇంటిదారి పట్టాడు.

* * *

ముందు గదిలో కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు గుండు వెంకటేశ్వర్రావు. చెమట పోస్తోంది. దోమలు కుడుతున్నాయి. చచ్చేంత చిరాగ్గా వుంది అతనికి. భార్య మీద పీకలదాకా కోపంగా వుంది.

దీని మొహమాటం కాదుగానీ చచ్చే చావుగా వుంది నాకు. విసుగ్గా జుట్టు పీక్కున్నాడు. అతగాడి భార్య ఆదిలక్ష్మి అతి మంచిది. అమిత మొహమాటస్థురాలు. మహా మెతక మనిషి. ఆవిడ మెత్తదనాన్ని కనిపెట్టి ఆవిడ నెత్తినెక్కి స్వారీ చేస్తుంటారు ఇరుగుపొరుగులు.

ఉప్పు, పప్పు, కాఫీ పొడి దగ్గర్నుంచి పచ్చళ్ళూ, కూరలు మాత్రమే కాక ఫేన్లు, కుర్చీలు మొదలైన వస్తువుల దాకా సర్వం అడిగి పట్టుకుపోతుంటారు. తిరిగి ఇవ్వరు. అడగడానికి ఆదిలక్ష్మికి మొహమాటం. ఏమనుకుంటారో అని భయం. నాలుగిళ్ళ అవతల వుండే మేష్టారి ఇంటివాళ్ళు వాళ్ళ అమ్మాయి శోభనం అంటూ వీళ్ళ టేబిల్ ఫాన్ పట్టుకుపోయారు. వారంరోజులైనా తిరిగి ఇవ్వలేదు. వెళ్ళి అడిగిరా అని రోజూ గుర్తు చేస్తున్నాడు. తను వెళ్ళదు, భర్తని అడగనివ్వదు.

"ఉక్కపోసి చస్తుంటే ఫేను వుండీ లేకుండా అయిపోయింది. దీని తెలివి తక్కువతనం తగలబడిపోనూ." అంటూ నూటడెబ్భయ్యవసారి విసుక్కున్నాడు.

అంతలోనే వచ్చింది ఓ పిల్ల. "మా అమ్మ పాత చింతకాయ పచ్చడి తెమ్మన్నదండీ" అంటూ అడిగింది.

అసలే కోపంగా వున్న వెంకటేశ్వర్రావుకి మరింత చిర్రెత్తుకొచ్చింది. "మా ఇంట్లో లేదు ఫో." విసుక్కున్నాడు.

'మీ ఇంట్లోంచే తెమ్మని చెప్పిందండీ మా అమ్మ. గుండు వెంకటేశ్వర్రావు గారింట్లోంచి అని స్పష్టంగా చెప్పింది." మరింత మండి పడ్డాడు వెంకటేశ్వర్రావు.

మూడేళ్ళ క్రిందట ఆ ఊరు ప్రమోషన్ మీద వస్తూ తిరపతి వెళ్లి తలనీలాలు అర్పించుకుని వచ్చి డ్యూటీలో చేరాడు. ఆవూళ్ళో అప్పటికే కొంతమంది వెంకటేశ్వరరావులు వుండటం వల్ల తమ సౌకర్యార్థం ఇతగాడిని గుండు వెంకటేశ్వర్రావుగా వ్యవహరించడం మొదలుపెట్టారు. అసలు గుండు రెండు నెలలకే మాయం అయిపోయింది గానీ పేరులోని గుండు మాత్రం శాశ్వతంగా వుండిపోయింది.

తననెవరైనా అలా పిలిస్తే చిరాకుగా వుంటుంది అతనికి. వద్దని చెప్తూనే వుంటాడు. అయినా ఎవరూ లెక్కచెయ్యరు. అతనలా మండిపడుతూవుండగానే ఆ పిల్ల లోపలికి వెళ్ళి పాత చింతకాయ పచ్చడి తీసుకుని వెళ్ళిపోయింది. వెంటనే లేచి లోపలికి వెళ్ళి భార్యతో దెబ్బలాట వేసుకున్నారు.

"వాళ్ళేమో నన్ను గుండు, గుండు అంటూ ఏడిపిస్తూ వుంటే వాళ్ళకి అరువులు ఇచ్చి ఆదరించి నెత్తినెక్కించుకో. నువ్విలా చేస్తూ వుంటే నా మీద ఏం గౌరవం వుంటుంది వూళ్ళోవాళ్ళకి" అంటూ చీవాట్లు పెట్టాడు.

ఇక్కడ గుండు వెంకటేశ్వర్రావు భార్యను మందలిస్తున్న సమయంలోనే మాధవ్ సింహాన్ని గట్టిగా మందలిస్తున్నాడు. ఊరంతా బలాదూరు తిరిగివచ్చి సుష్ఠుగా భోజనం చేసి పవళించిన మిత్రుడిని చూస్తే ఆగ్రహం అవధులు దాటింది అతనికి.

"నువు చేసేపనికి ఏమైనా అర్థం వుందా? అబద్ధాలు చెప్పి వీళ్ళింట్లో ఆశ్రయం సంపాదించి, దున్నపోతుల్లా తినడం ఏమైనా బాగుందా? పెద్దవాళ్ళు వాళ్ళని మోసం చెయ్యడానికి సిగ్గుగా లేదా నీకు? నా మాట విను. చేసింది చాలు వెళ్ళిపోదాం పద". అన్నాడు అమిత సీరియస్‌గా.

అతనంత కచ్చితంగా చెప్పినా ఏమాత్రం తొణకలేదు సింహం. "మనం వచ్చిన పని కాస్తైనా కాలేదు. అది అయేదాకా కదిలే ప్రసక్తే లేదు. ఇక అబద్ధాలు చెప్పడం అంటావా? మనం తలపెట్టినది ఒక సత్కార్యం. దానికోసం అబద్ధం చెప్పినా తప్పేమీలేదు. వీళ్ళు బాగా డబ్బున్నవాళ్ళే. మనం నాల్రోజులు వున్నంత మాత్రాన

audachari.com

వీళ్ళకి భారంకాము. అంతగా వూరికే తినడం మొహమాటం అయితే వీళ్ళకీ ఏదో విధంగా సాయపడదాం.

మరోమాట స్పష్టంగా చెప్తున్నాను. చేతనైతే నాకు సహాయం చెయ్యి లేదా నోరు మూసుకుని వూరుకో. అంతేగానీ ఇలా చీటికీ మాటికీ నాకు అడ్డు తగలకు" సీరియస్‌గానే చెప్పాడు.

మాధవ్‌కి చాలా కోపం వచ్చింది స్నేహితుడి మీద. కానీ తనేం చెయ్యలేడు. సాయంత్రం కూడా వెళ్ళిపోవాలని ప్రయత్నించాడు కానీ పనివాడు అడ్డంపడి వెళ్ళనీయకుండా ఆపేశాడు. కాబట్టి సమయం కోసం ఎదురు చూడడం తప్ప మరో మార్గం లేదు. ఎలా తప్పించుకొని పోవడమా అని ఆలోచన మొదలుపెట్టాడు.

సింహం కూడా దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ప్రస్తుతం అతన్ని వేధిస్తున్నది ఆర్థిక సమస్య. దగ్గర వున్న డబ్బులు మరో పదిరోజులకంటే రావు. ఆలోగానే ఏదైనా పని చూసుకోవాలి. ఆ సమస్య పరిష్కారం అయితే అసలు రంగంలోకి దూకాలి. ఎవరిని అడగాలి? తనకి పరిచయం అయినవారు వెంకట్రావుగారు, సుబ్బారావు. వెంకట్రావుగారు ఆశ్రయం ఇచ్చి ఆదుకున్నారు. ఇంకా ఉద్యోగం కోసం కూడా వేధించడం బాగుండదు. కాబట్టి సుబ్బారావుగారినే అడగాలి.

* * *

మర్నాడు పొద్దున్నే సుబ్బారావు గారింటికి వెళ్ళాడు. ఆదరంగానే ఆహ్వానించాడు ఆయన. కుశలం అడిగారు. కాఫీ ఇప్పించారు. తను వచ్చిన పని చల్లగా బయట పెట్టాడు సింహం.

"మేము అతి సామాన్యులం. అవసరం పడి ఇలా పొరుగూరు వచ్చాం. వెంకట్రావుగారు దయతో ఆశ్రయం ఇచ్చారు. అదే చాలా గొప్ప విషయం. ఈ ఊళ్ళో ఎన్నాళ్ళు వుండాల్సి వస్తుందో తెలియదు. ఏదో ఒకరోజు రెండ్రోజులు అయితే ఫర్వాలేదు గానీ ఎల్లకాలం వాళ్ళింట్లో వూరికే పడి తినడం ఏం మర్యాద? అందుకే ఉద్యోగం ఏదైనా చూసుకోవాలి అనుకుంటున్నాను. మీరు సాయం చెయ్యగలరా నాకు?" అతి మర్యాదగా అడిగాడు.

బుర్ర గోక్కున్నాడు సుబ్బారావు. "ఈ ఊళ్ళో ఉద్యోగాలు ఏమున్నాయి? ఈ ఊరి వాళ్ళే టౌన్‌కి వెళ్తున్నారు." అన్నాడు.

సింహం మొహం వాడిపోయింది. "నాల్రోజులు ఆలస్యం అయినా సరే, ఏదో ఓ పని చూసిపెట్టండి. ఎంత చిన్నదైనా ఫర్వాలేదు." బ్రతిమాలాడు.

సుబ్బారావుకి జాలివేసింది. "సర్లేండి అలాగే చూద్దాం. ఇంతకు ముందు మీరు ఏం పని చేసేవారు?" అడిగాడు.

"నేను డిటెక్టివ్‌ని. ఏదో కనిపించిన పనల్లా చేసేవాడిని."

"డిటెక్టివ్ అంటే?" ఆయనకి సరిగా అర్థం కాలేదు.

"దొంగతనం జరిగినా, మరేదైనా నేరం జరిగినా, పరిశోధించి దొంగ ఎవరో పట్టుకోడం." వివరంగా చెప్పాడు సింహం. సుబ్బారావు మొహం కాంతివంతం అయింది.

"నిజంగానే. అయితే కూరగాయ తోటల్లో ఈ మధ్య బాగా దొంగతనం జరుగుతోంది. మీరు కనిపెట్టగలరా?" ఆశగా ప్రశ్నించాడు.

ఈసారి సింహం మొహం వెలిగిపోయింది. "కనిపెట్టలేకపోవడమా? అసలు నా వృత్తే అది. వివరాలు చెప్పండి." ఉత్సాహంగా అడిగాడు.

ఆయన దగ్గర పేపరు పెన్ అడిగి తీసుకుని ఆయన చెప్పినదంతా వివరంగా రాసుకున్నాడు. ఒకటికి పదిసార్లు తనకు కావలసిన వివరాలు అడిగాడు. ఓపిగ్గా చెప్పాడాయన. "సరే నేను ప్రయత్నించి దొంగలెవరో కనిపెడతాను" అన్నాడు చివరగా.

"ఆ ఉపకారం చేసి పెట్టాలే గానీ మీ కష్టం వుంచుకోను" అన్నాడు సుబ్బారావు. ఆయన దగ్గర శలవు తీసుకుని బయలుదేరాడు సింహం. అతనికి ఎంతో హుషారుగా వుంది. పనికోసం బయలుదేరితే వెంటనే దొరికింది. అది కూడా ఏదో అల్లాటప్పా వ్యవహారం కాదు. తనకెంతో ఇష్టమైన పని. మనసులోనే భగవంతుడికి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. ఇక ముందు కూడా తనకు సహాయపడమని వేడుకున్నాడు. అక్కడి నుండి తిన్నగా సుబ్బారావుగారి తోటలవైపు వెళ్ళాడు. ఆ ఊరి నేల చాలా సారవంతమైనది. కూరలు పండించి పక్కనున్న టౌన్‌కి తీసుకువెళ్ళి అమ్మడం ద్వారా ఆ ఊరి రైతులు జీవనం సాగిస్తున్నారు.

సుబ్బారావు గారికి కూడా అదే జీవనం. ఎకరాల కొద్దీ నేలలో వివిధ రకాల కూరలు పండిస్తున్నారు. కూలీలు నీళ్ళు పెట్టడం, మందుజల్లటం, కలుపు తియ్యడం మొదలైన పన్లు చేస్తున్నారు. అక్కడే చాలాసేపు కూర్చుని వాళ్ళ ద్వారా వివరాలు సేకరించాడు సింహం. అతనికి ఏదో అనుమానం కలిగింది. అంతా అయోమయంగా తోచింది.

చుట్టుపక్కల వారి తోటల్లో దొంగతనం జరగడంలేదు. కేవలం వీరి తోటలో మాత్రమే జరుగుతోంది. అదీ పరిష్కారంగా పకడ్బందీగా తోటల్లో కూరలు సమృద్ధిగా

gudachari.com

వున్నప్పుడే జరుగుతోంది. ప్రతిసారీ దొంగలు కాపలా పడుకున్న వాళ్ళని కట్టేసి నోట్లో గుడ్డలు కూరి తమ పని చేసుకుపోతున్నారు. వాళ్ళు సహాయం కోసం అరిచినా ఎవరికి వినిపించడం లేదు.

ఇదంతా తమాషాగా అనిపించింది సింహానికి. వెంటనే బయలుదేరి టౌన్‌కి వెళ్ళాడు. కూరగాయల మార్కెట్‌కి వెళ్ళాడు. ఊరివారు తెచ్చిన కూరలు అక్కడి వ్యాపారస్థులు హోల్‌సేల్‌మీద కొని పక్క ఊళ్ళోకి సరఫరా చేస్తారు.

అక్కడికి వెళ్ళి తన డిటెక్టివ్ బుద్ధినంతా ఉపయోగించి చీకట్లోకి ఓ రాయి విసిరాడు. అది వెళ్ళి సూటిగా లక్ష్యానికి తగిలింది. ఆనందమూ బాధా ఏకకాలంలో కలిగాయి అతనికి. డబ్బు ఎంత పాపిష్ఠిది! అనిపించింది.

పనంతా ముగిసేసరికి సాయంత్రం ఆరు అయింది. బస్టాండుకి వెళ్ళాడు. బస్ ఏమీ లేదు. ఓలారీ వెళ్తోంది అటువైపు. జనాన్ని ఎక్కించుకుంటున్నారు. అదైనా తన ఊరిదాకా వెళ్ళదు. రెండు మైళ్లదూరంలో పక్కకి తిరిగి వెళ్ళిపోతుంది. అందులోనే ఎక్కాడు సింహం. దడదడమంటూ తీసికెళ్ళి రోడ్డుమీద దించేసి వెళ్ళిపోయింది లారీ.

దిగి నడక మొదలు పెట్టాడు సింహం. అతని మనసునిండా ఎన్నో ఆలోచనలు. ఆలోచిస్తూ తనదారిన తను తలొంచుకు పోతున్నవాడల్లా కాస్త దూరంలో కనిపించిన మనిషిని చూసి నడకవేగం తగ్గించాడు.

దూరం నుండి చూస్తే మగవాడిలా వున్నా దగ్గరికి వచ్చేసరికి ఆడపిల్లే అని తెలిసింది. జీన్స్ వేసుకుంది. పైన బ్యాగీ షర్టు. ఆగిపోయిన స్కూటర్‌ని రిపేరు చేసుకుంటోంది. దగ్గరికి వెళ్ళి 'సాయం కావాలా' అని అడిగాడు.

"నో థాంక్స్" అనబోతూనే తిరిగి చూసి ఏమనుకుందో ఏమో చేతిలో వున్న టూల్స్ అతని చేతికిచ్చి పక్కకి తప్పుకుంది. దేవుడిని తల్చుకుని పని ప్రారంభించాడు సింహం. అతని అదృష్టం బాగుంది. స్కూటర్ మాట విని బుద్ధిగా స్టార్ట్ అయింది.

థాంక్స్ చెప్పింది. "ఎటు వెళ్తున్నారు" అని అడిగింది మర్యాదపూర్వకంగా. చెప్పాడు సింహం" నేనూ అక్కడికే. రండి డ్రాప్ చేస్తాను." అంది. మొహమాటపడ్డాడు సింహం. ఫర్వాలేదంటూ బలవంతం చేసింది. అంగీకరించాడు సింహం. ఇద్దరూ బయలుదేరారు. అయిదు నిముషాల్లోనే గమ్యం చేరారు. స్కూటర్ దిగి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు సింహం.

"మరేం ఫర్వాలేదు. న్యాయంగా మీకే నేను థాంక్స్ చెప్పుకోవాలి. బైదిబై మిమ్మల్నెపుడూ చూడలేదు. కొత్తగా వచ్చారా?" అడిగింది.

"అవునండీ నిన్ననే వచ్చాను. నాపేరు సింహం." పరిచయం చేసుకున్నాడు.

"సింహమా?" ఆశ్చర్యపోయింది.

"అదే. నరసింహం. షార్ట్‌కట్‌లో సింహం." వివరించాడు. "ఓ.కే. బై" అంటూ వెళ్ళిపోయింది. వెనక్కి తిరిగిన సింహానికి గుర్తు వచ్చింది. అరె! ఆవిడ పేరేమిటో అడగనేలేదే అనుకున్నాడు. కానీ వెంటనే ఆ విషయం మర్చిపోయాడు.

ఇంటికి చేరేసరికి అందరూ ఇతనికోసం ఎదురు చూస్తున్నారు. ఏ వ్యవహారంలో తలదూర్చి తన్నులు తిన్నాడో అని మాధవ్ భయం. ఇంటికొచ్చిన అతిథి కబురూ కాకరకాయా లేకుండా ఎక్కడికి పోయాడో అని శాంతమ్మ ఆదుర్దా.

తియ్య తియ్యగా మాటలు చెప్పి ఈ ఇజ్రాయిల్ జబ్బు కుర్రాడిని తమ నెత్తి మీద పడిలిపెట్టి తను చల్లగా జారుకున్నాడేమోనని వెంకట్రావుగారి అనుమానం.

సింహాన్ని చూడగానే మాధవ్ చివాట్లేశాడు. వెంకట్రావుగారు నిష్ఠూరాలు ఆడారు. శాంతమ్మ మందలించింది. "అర్జెంట్‌గా పనిమీద వెళ్ళాల్సి వచ్చింది. క్షమించండి" అంటూ క్షమాపణలు చెప్పుకున్నాడు సింహం.

"సర్లే పద. అన్నం పెడతాను. మొహం చూస్తుంటే పొద్దుటి నుండి ఏమీ తిన్నట్టు లేదు." అంది శాంతమ్మ. లోపలికి వెళ్ళాడు సింహం.

మాధవ్ పెట్రోమేక్స్ లైటు ముందు కూర్చుని మధ్యలో ఆపేసిన రిపేరు కొనసాగించాడు. అసలా మాటకొస్తే పొద్దుటినించీ అలా పనిచేస్తూనే వున్నాడతను.

తెల్లారేసరికి సింహం వెళ్లిపోయాడు. శాంతమ్మ కమ్మగా టిఫెన్ చేసి దగ్గర కూర్చుని ఆదరంగా బలవంతం చేసి తినిపించేసరికి అతనికి ఆవేశం వచ్చేసింది. ఇక లాభంలేదు. ఏదో విధంగా వీరి రుణం తీర్చుకోవాల్సిందే అని గట్టిగా నిర్ణయించుకుని రంగంలోకి దిగాడు. నీళ్ళు తోడుతున్న శాంతమ్మ దగ్గరకు వెళ్ళి మీరు వుండండమ్మా అంటూ ఆవిడ చేతిలోంచి బలవంతంగా చాంతాడు లాక్కుని నీళ్ళు తోడి పోశాడు. ఇల్లంతా బూజులు దులిపాడు. సీలింగ్ ఫాన్లు మెరిసేలా తుడిచాడు. కిర్రుకిర్రుమంటున్న పడక్కుర్చీ బాగుచేశాడు. లూజ్‌కనెక్షన్‌లతో ఇబ్బంది పెడుతున్న స్విచ్‌లను బాగుచేశాడు.

శాంతమ్మ గోల పెట్టేసింది. 'నీకెందుకు నాయనా ఈ పన్లన్నీ' అని వారించినా వినిపించుకోలేదు.

వెంకట్రావుగారికి కూడా అతనలా పనిచెయ్యడం నచ్చలేదు. వద్దన్నా వినకుండా పనిచెయ్యడం ఇజ్రాయిల్ జబ్బు లక్షణమో, లేక ఇంటి ఆనూపానూ కనిపెట్టి తన పని చక్కబెట్టుకునే పన్నాగమో అర్థంకాలేదాయనకి. మాధవ్‌ని వంటరిగా వదలకుండా వెంట వెంట తిరుగుతూనే వున్నాడు రోజంతా.

pustaham.com

ఏది ఏమైనా భార్య వాళ్ళకి ఆశ్రయం ఇవ్వడం అతనికే మాత్రం నచ్చలే
నాల్రోజులు చూసి మెల్లిగా సాగనంపాలి అనుకున్నాడు.

సింహానికి భోజనం వడ్డిస్తూ మరోమారు అడిగింది శాంతమ్మ. "రోజం
ఎక్కడికి వెళ్ళావు" అంటూ.

సమాధానం చెప్పాడు సింహం. ఆవిడ చాలా సంతోషించింది.

"అలాగా! చాలా సంతోషం. పాపం సుబ్బారావుకీ ఎటు చూసినా చికాకుల
వయసొచ్చిన ఆడపిల్ల ఇంట్లో వుంది. ఎన్ని ప్రయత్నాలు చేసినా పెళ్ళి కుదరడంలే
ఆ కొడుకు ఓ మొండి వెధవ. కోడలు పెడసరం మనిషి. ఆరోగ్యం కూడా అంత
మాత్రం. ఈ దొంగల బెడద కూడా తోడైందేమో మనిషి కృంగిపోతున్నాడు. స్వం
తమ్ముడిలా వుంటాడు నాకు. అతడు అన్ని అవస్థలు పడుతూ వుంటే బాధ
వుంటుంది నాకు. అయినా కష్టాలు కలకాలం వుండవులే! అన్నీ తీరిపోతాయి.
దొంగల విషయంలో సాయం చేస్తివా? అతనికి ఉపకారం చేసినవాడివి అవుతావ
అంది మరికాస్త నెయ్యి వడ్డిస్తూ.

"నా శాయశక్తులా ప్రయత్నిస్తానమ్మా! దొంగతనం జరగకుండా చూస్తాన
దృఢంగానే చెప్పాడు సింహం.

భోజనం చేసి కాసేపు విశ్రాంతి తీసుకుని టార్చిలైటూ వగైరా సామాగ్రి అం
ఒక సంచీలో సర్దుకుని సుబ్బారావుగారి పొలం దగ్గరికి వెళ్ళాడు. అక్కడ హనుమంత
సోమయ్య వున్నారు. వాళ్ళే రోజూ పొలానికి కాపలా వుంటారు.

అప్పటికే కాస్త పట్టించి నులక మంచం మీద కూర్చుని బీడీలు తాగుత
కబుర్లు చెప్పుకుంటున్న ఆ ఇద్దరూ సింహాన్ని చూసి తెల్లబోయారు.

"ఏమిటీ బాబు ఇలా వచ్చారు?" అడిగాడు సోమయ్య.

దొంగలను పట్టేపని తనకి అప్పజెప్పిన వైనం తెలియజేసి తనుకూడా కాప
వుంటానని చెప్పాడు సింహం. వాళ్ళిద్దరూ పడీపడీ నవ్వేరు.

"అదేమైనా తేలికైన పనా? ఎద్దుల్లా వున్నాం. మమ్మల్నే చావచితకకొట్టి కాళ్
చేతులు కట్టేసి దోచుకుపోతున్నారు. సన్నగా పుల్లల్లా వున్నారు. మీరెంత?" అన్నా
హనుమంతు.

వాళ్ళ మాటలకు కదుప్పట్టుకుని నవ్వాడు సింహం.

"మీ మొహంలా వుంది. ఇలాటి విషయాల్లో కావల్సింది కండబలంకా
గుండెబలం. అది నాకు పుష్కలంగా వుంది. అదీగాక నాదగ్గర దొంగలను
పరికరాలున్నాయి. వాటి సాయంతో గతంలో నేను బోలెడుసార్లు చాలామం
దొంగలను పట్టుకున్నాను" అన్నాడు.

వాళ్ళు నమ్మలేదు. "దొంగలను పట్టే పనిముట్లా?" అన్నారు అపనమ్మకంగా.

"అవును. మీకు మచ్చుకి ఒకటి చూపిస్తాను. నా దగ్గరికి ఎవరైనా దొంగవస్తే
నాకు తెలిసిపోతుంది." అన్నాడు. ఇద్దరూ నమ్మలేనట్లు చూశారు.

డిమాన్స్ట్రేషన్‌కి పూనుకున్నాడు సింహం. హనుమంతుని మంచం పక్కనే
కూర్చోపెట్టాడు. సోమయ్యని అంత దూరం వెళ్ళి మెల్లిగా చప్పుడు చెయ్యకుండా
రమ్మన్నాడు. తను నులకమంచం మీద సోమయ్య వచ్చే వైపు వీపు పెట్టి పడుకున్నాడు.
హనుమంతు వూపిరి బిగబట్టి చూస్తున్నాడు. సోమయ్య మెల్లిగా నడుచుకుంటూ
మంచం దగ్గరికి వచ్చాడు. అతడు రెండడుగులు దూరాన వుండగానే సింహం
జేబులోంచి పీప్‌పీప్‌పీప్‌పీప్ మంటూ సన్నగా అలారం వినిపించడం మొదలైంది.

ఉలిక్కిపడ్డారు సోమయ్య, హనుమంతు. జేబులోని ఎలక్ట్రానిక్ వాచీ అలారం
తీసేసి చిరునవ్వుతో లేచాడు సింహం. "చూశారా" అన్నాడు.

"సరే. మీరు లేచారు అనుకోండి. వాళ్ళు మిమ్మల్ని తన్ని కాళ్ళు చేతులూ
కట్టేస్తే ఏం చేస్తారు"? అడిగాడు సోమయ్య.

వాళ్ళిద్దరి వంక సీరియస్‌గా చూశాడు సింహం. "ఎవరికీ చెప్పకుండా
వుంటానంటే చెప్తాను." అన్నాడు. "చెప్పం" అన్నారిద్దరూ ముక్త కంఠంతో.
అలాచెప్పనని వాళ్ళచేత ఒకటికి నాలుగుసార్లు చెప్పించి అప్పుడు చెప్పాడు సింహం.

"నాదగ్గర పిస్తోలు వుంది. అలారమ్ వినిపించగానే పిస్తోలు తీసేసి కనబడిన
వాళ్ళందర్నీ కాల్చేస్తాను." గుసగుసగా చెప్పాడు.

వాళ్ళు అదిరిపడ్డారు.

"అలా చంపేస్తే పాపం కదూ! పోలీసులు పట్టుకోరా మిమ్మల్ని" సోమయ్య
అడిగాడు భయపడుతూనే.

"ఎందుకు పట్టుకుంటారు? నా పిస్తోలుకి లైసెన్సు వుంది. అదీగాక వాళ్ళని
చంపేలా కాల్చనుగా. రెండు కాళ్ళ మీదా కాలుస్తాను. దాంతో పరిగెత్తలేక
పడిపోతారు. నాదగ్గర ఇంకో మిషన్ కూడా వుంది. దాని మీట నొక్కితే
పోలీస్‌స్టేషన్‌లో ఇందాక మోగినట్లుగా అలారం మోగుతుంది. వాళ్ళు వచ్చి దొంగల్ని
పట్టుకుపోతారు" రహస్యంగా చెప్పాడు సింహం.

"పట్టుకుపోయి ఏం చేస్తారు బాబూ?" దీనంగా అడిగాడు హనుమంతు.

"ఏవుంది? ఆకాళ్ళు ఎలాగూ పనికిరావు. కాళ్ళు రెండూ నరికేసి జైల్లో పడేస్తారు.
ఏ ఏడేళ్ళో జైల్లో వుండి తిరిగివచ్చి అడుక్కుంటూ బ్రతుకు గడుపుతారు!" అన్నాడు
గంభీరంగా.

Sudachari.com

వాళ్ళిద్దరికీ గుండె ఠారుమంది. మత్తూ ఎగిరిపోయింది. భయంగా అ
వంక చూశారు.

"ఇకనుండీ నేను కాపలా వుంటాను. మీరు నిశ్చింతగా పడుకోండి. ఏ
భయంలేదు." వాళ్ళకు హామీ ఇచ్చాడు సింహం. అతను వద్దని వారిస్తున్నా వినకుం
అతనికో మంచం ఇచ్చారు. వాళ్ళిద్దరూ కలిసి ఒక మంచం మీద సర్దుకున్నార
సింహం హాయిగా నిద్రపోయాడు గానీ వాళ్ళకు మాత్రం కంటి మీద కునుకులేద
కదిల్తే ఎక్కడ అలారం మోగుతుందో అని బెదిరిపోతూ కట్టెల్లా అలాగే పడుకున్నా
కదలకుండా.

తెల్లవారుతూనే చిన్న యజమాని దగ్గరకు పరిగెట్టాడు హనుమంతు. జరిగిన
అంతా వివరంగా చెప్పాడు. వెంకటేశ్వర్లు మొహం ఎర్రబడింది. "ఏడిశా
వెధవల్లారా! ఎవరేది చెప్తే అది నమ్మేయడమే? అంతా బూటకం" అంటూ చీవా
వేశాడు.

కానీ హనుమంతు తను కళ్ళారా చూసినది అంతా మరోసారి చెప్పేసరి
అతనికి కూడా లోలోపల బెదురుగా అనిపించింది. "ఏం ఫర్వాలేదు. వాడి బండా
నేను బయట పెడతాను." అని కసిరి పంపించేశాడు. వెంటనే తండ్రి దగ్గర
వెళ్ళి అడిగాడు.

"ఏమిటి? తోటకి ఎవర్నో కాపలా పెట్టారుట?" అన్నాడు.

"అవున్రా" అంటూ మొదలుపెట్టి సింహం గురించి అతను చెప్పినదానికన్
మరికాస్త ఎక్కువగా చెప్పాడు. "ఏదో అతని ధర్మమా అని దొంగలు పట్టుబడి
అంతకంటే ఇంకేం కావాలీ?" అన్నాడు.

వెంకటేశ్వర్లుకి కాళ్ళూ, చేతులూ ఆడలేదు. వున్నపాటున వెంకటాచలాన్
పక్కకు లాక్కెళ్ళాడు. "మొన్న పొరబాటుగా ఇంటికి పెళ్ళిచూపులకు వచ్చాడ
చెప్పానే వాడేదో పెద్ద డిటెక్టివ్‌ట. దొంగలని పట్టడంలో ప్రవీణుడట. ఆధుని
పరికరాలవీ వున్నాయట. పోలీసులతో లావాదేవాలు వున్నాయట. తోట
దొంగతనం జరక్కుండా చూస్తానని చెప్పాడుట." అంటూ ఏకధాటిన చెప్పుక
పోయాడు.

"అంతా అబద్ధం. ఇదేదో దొంగెత్తు. మీ నాన్నగారిని వెర్రివాడిని చేసి డబ్బుకోస
ఆడుతున్న నాటకం" అన్నాడు.

"అంత తేలిగ్గా తీసేయకు. ఏ పుట్టలో ఏ పాముందో. ఓ పనిచెయ్! నువ్వు
వాడిని ఓ కంట కనిపెట్టి వుండు. నేనే ఆపని చెయ్యొచ్చుగానీ నన్నతను చూసేశాడు.
గుర్తు పడితే కష్టం" అన్నాడు.

అతనికా సలహా నచ్చింది. "అలాగేలే. అతనికి తెలియకుండా ఫాలో అవుతాను.
ఓ రెండ్రోజులు చూస్తే అసలు విషయం తెలిసిపోతుంది." అన్నాడు.

"ఆలస్యం చేయకు. వెంటనే పని మొదలుపెట్టు." చెప్పేసి వెళ్ళిపోయాడు
వెంకటేశ్వర్లు.

* * *

స్నానం టిఫెనూ ముగించి మళ్ళీ ఊరిమీద పడ్డాడు సింహం. అంతక్రితం
వెళ్ళిన టీ కొట్టు దగ్గరకే వెళ్ళి కాసేపు కబుర్లు చెప్పాడు. కాసేపు అటూ ఇటూ
తిరిగాడు. హఠాత్తుగా గుర్తు వచ్చింది అతనికి. పోలీసుల గురించి మర్చేపోయాడు
తను. ఎప్పుడు వాళ్ళతో పని పడుతుందో అప్పుడు వెళ్ళి హడావిడిపడడం కంటే
ముందుగానే వెళ్ళి పరిచయం చేసుకుంటే బాగుంటుంది అనిపించింది. వెంటనే
బయలుదేరి పోలీస్ స్టేషన్‌కి వెళ్ళాడు. ఎస్.ఐ గారు లేరు. ఇంటికి వెళ్ళారు అని
చెప్పాడు. అక్కడి వాళ్ళందర్నీ పరిచయం చేసుకుని కాసేపు బాతాఖానీ వేసి బయటికి
వచ్చాడు.

కాస్త తటపటాయించి పోనీ ఎలాగూ వచ్చాను కదా! ఇంటికి వెళ్ళి
కలుసుకొంటేసరి అనుకుని కాస్త దూరంలో వున్న ఎస్.ఐ గారింటికి వెళ్ళాడు.

బొచ్చుకుక్క పిల్లకి స్నానం చేయించి ఒళ్ళు తుడిచి పౌడరు వేస్తోంది శ్యామల.
వున్నట్లుండి చేతుల్లోంచి తప్పించుకుని బయటికి పరిగెట్టింది అది. వెంట పడింది
శ్యామల. వాకిలంతా పరుగులు పెట్టించింది గానీ అందలేదు. గేటు కిందనుంచి
దూరిపోవాలని ప్రయత్నం చేస్తూ సింహం చేతికి దొరికిపోయింది. ఓ చేత్తో పట్టుకుని
గేటు తీసుకుని లోపలికి వచ్చాడు.

"చాలా థాంక్స్. సమయానికి వచ్చారు. లేకుంటే రోడ్ మీదికి పారిపోయేదే."
అంది శ్యామల ఆయాసపడిపోతూ.

తెల్లగా ఊలుబంతిలా కుయ్‌కుయ్‌లాడుతున్న కుక్కపిల్లను చూస్తే ముద్దొచ్చింది
సింహానికి. ముద్దు పెట్టుకుని శ్యామల చేతికి అందించాడు.

"బాగా ఆడించేస్తుంది మిమ్మల్ని. పేరేమిటి?" అడిగాడు.

"నాపేరు శ్యామల. దీని పేరు టామీ." చెప్పింది శ్యామల. నవ్వేశాడు సింహం.
"ఎస్.ఐ గారు ఇంట్లో ఉన్నారా?"

audachan.com

"వున్నారు".

"బిజీగా వున్నారా?"

"అదేం కాదు. ఫ్రీగానే వున్నారు. రండి!" అంటూ లోపలికి ఆహ్వానించింది.

గేటు తీసిన చప్పుడు విని కిటికీలోంచి చూశాడు ఏకదంతం. గేటు దగ్గర కూతుర్నీ, కుక్కపిల్లని ఎత్తుకుని కూతురితో మంతనాలు ఆడుతున్న ఆ యువకుడిని చూశాడు. ఆయన భృకుటి ముడిపడింది. అక్కడే వున్న పీతాంబరాన్ని పిల్చి ఆ దృశ్యం చూపించాడు. ఇద్దరూ మొహమొహాలు చూసుకున్నారు.

అంతలోకే శ్యామల లోపలికి వచ్చింది. "నాన్నా ఈయన మీకోసం వచ్చారు." చెప్పేసి అక్కడి నించి వెళ్ళిపోయింది.

సింహం లోపలికి వచ్చాడు. నమస్కారం పెట్టాడు. గంభీరంగా తల పంకించాడు ఏకదంతం. "కూర్చోండి!" అన్నాడు. సింహం కూర్చున్నాడు.

ఇద్దరూ ఒకరినొకరు నిశితంగా పరీక్షించుకున్నారు. పలకరింపుగా నవ్వేడు సింహం. ఆయన మాత్రం నవ్వలేదు. గంభీరంగానే వున్నాడు.

'కలుపుగోలు మనిషికాడు. బాగా రిజర్వ్‌డ్‌టైప్' అనుకున్నాడు సింహం. ఆయన ఎటువంటివాడైనా అవసరం తనది.

కాబట్టి తనే సంభాషణ ప్రారంభించాలని చూస్తుండగా ఆయనే పలకరించాడు.

"అదివరకు ఎప్పుడూ మిమ్మల్ని చూడలేదు. కొత్తగా వచ్చారా?" అడిగాడు.

"అవునండీ రెండ్రోజులైంది వచ్చి. నాపేరు సింహం."

"సింహమా"?

"పూర్తి పేరు నరసింహం. ఈ ఊరు ఒక ముఖ్యమైన పని మీద వచ్చాను."

"అలాగా? ఏం పని? ఏదైనా ఉద్యోగమా? వ్యాపారమా?"

ఇబ్బందిగా కదిలాడు సింహం. "ఏం పని అంటే ఇప్పుడే అంత ఖచ్చితంగా చెప్పలేను. అయితే నా పని కావాలంటే మీ సహాయం నాకెంతో అవసరం. అందుకే మీతో పరిచయం చేసుకుందామని వచ్చాను."

సాలోచనగా పీతాంబరంవంక చూశాడు ఏకదంతం. "సామాన్యంగా అందరూ పోలీసులకి దూరంగా వుంటారు. అలాంటిది మీరు కోరివచ్చి నాతో పరిచయం చేసుకుంటున్నారంటే నాకు చాలా ఆశ్చర్యంగా వుంది" అన్నాడు.

"నాకు పోలీసులంటే ఏమాత్రం భయంలేదు. పోలీసులని స్నేహితులుగా, మళ్ళీ మాట్లాడితే బంధువులుగా భావిస్తాను నేను. అదీగాక నా పనంతా మీతోనే అని మనవి చేసుకున్నాను కదా!" వినయంగా సమాధానం చెప్పాడు సింహం.

"పనంతా నాతోనే అంటున్నారు. ఆ పనేమిటో నా దగ్గరే దాస్తున్నారు. చాలా తమాషాగా వుంది ఇదంతా!" వ్యంగ్యంగా నవ్వేడు ఏకదంతం.

చివుక్కుమంది సింహం మనసు. ఒక్కక్షణం అంతా చెప్పేద్దామా అనిపించింది. కానీ ఆయన నమ్మడు. కొట్టిపారేస్తాడు. అదీగాక పక్కనే ఇంకో శాల్తీ వున్నాడు. దేగ చూపులూ వాడూనూ. వాడి లక్షణం సింహానికేం నచ్చలేదు. అదీగాక పనిపూర్తయేవరకు అంతా గుట్టుగా సాగిపోవాలి. పెదవి దాటితే పృథివి దాటుతుంది.

"నా పనే అలాటిది. అవసరం వచ్చినప్పుడు నేనే వచ్చి అంతా చెప్తాను. అలా అని నన్ను అపార్థం చేసుకోకండి. నేను చట్టవిరుద్ధమైన పని ఏమీ చెయ్యను, మిమ్మల్ని ఇరుకున పెట్టను." అంటూ లేచి నిలబడ్డాడు.

గుమ్మందాకా వెళ్ళినవాడల్లా ఆగి వెనక్కి తిరిగి, "ఇది ఒక ఆడపిల్ల జీవితానికి చెందిన సమస్య" అంటూ గంభీరంగా చెప్పేసి వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లిపోయాడు.

వాకిట్లో ఎదురైంది శ్యామల. "మీరు మొన్న లక్ష్మీ వాళ్ళింటికి వచ్చారు.. కదూ!" అంటూ అడిగింది.

"అవునండీ పొరబాటుగా వచ్చేశాను. మీరు అప్పుడు అక్కడే వున్నారా?" మొహమాటంగా నవ్వేడు సింహం.

"అవును. లక్ష్మీ నా క్లోజ్‌ఫ్రెండ్. అడగడం మర్చిపోయాను మీ ఫ్రెండ్ ఆరోగ్యం ఎలా వుంది? ఇక్కడికి వచ్చాక ఏమైనా మార్పు కనిపించిందా?"

"బాగానే వున్నాడు. రెండు రోజుల్లోనే మంచి ఇంప్రూవ్‌మెంట్ కనిపిస్తోంది. అదృష్టం బాగుండి వెంకట్రావుగారింట్లో ఆశ్రయం దొరికింది. కన్నతల్లిలా ఆదరిస్తున్నారు శాంతమ్మగారు." చెప్పాడు సింహం.

"దానిదేముందిలెండి. అవసరంలో మనిషికి మనిషి సాయం. అంతేగా. మీకు ఇంకా ఏమైనా అవసరం అయితే నాతో చెప్పండి. చేతనైన సహాయం చేస్తాను". అంది ఆదరంగా.

సింహానికి చాలా సంతోషం వేసింది. "అలాగేనండీ. తప్పకుండా అడుగుతాను. థాంక్యూ వెరీమచ్" అంటూ చెప్పేసి వెళ్ళిపోయాడు.

మాటలైతే వినబడలేదు గానీ కిటికీలోంచి ఇదంతా కనిపిస్తూనే వుంది ఏకదంతానికి, పీతాంబరానికి.

అనుమానంగా మేనల్లుడి మొహంలోకి చూశాడు ఏకదంతం.

"ఏవిట్రా! మరి వీడే వాడంటావా?"

gidachari.com

చిరాకువేసింది పీతాంబరానికి. "ఇంకా మెల్లిగా అడుగుతావేం? ఆడపిల్ల జీవితం, మీతోపని, బంధుత్వం అంటూ స్పష్టంగా చెప్పిపోతుంటే. వాళ్ళిద్దరూ గుసగుసలాడ్డం కళ్ళారా చూశావు కదా! ఇక ఏమాత్రం సందేహం లేదు. వీడే వాడు. వెంటనే అరెస్ట్ చేసి జైల్లో పారేయ్." అన్నాడు పీతాంబరం.

బుర్ర గోక్కున్నాడు ఏకదంతం. "అరెస్ట్ చెయ్యడం అంటే అంత తేలికా? ఏ కారణం లేకుండా అరెస్ట్ చేస్తే నన్ను ఏకిపారెయ్యరూ? అందులోనూ వీడెవడో కాలాంతకుడిలా వున్నాడు. తిన్నగా నా దగ్గరికి వచ్చి తన అభిప్రాయం చెప్పడమే కాకుండా నేనేం చట్టవిరుద్ధమైన పని చెయ్యడంలేదు. నాజోలికి వస్తే జాగ్రత్త అని ఇన్‌డైరెక్ట్‌గా హెచ్చరించాడు." అన్నాడు.

"మరైతే ఏం చేద్దాం?" అసహనంగా ప్రశ్నించాడు పీతాంబరం.

"సమయం కోసం కనిపెట్టి వుందాం. ఏదో పొరబాటు పని చెయ్యక పోతాడా? అప్పుడు తకామని పట్టుకుని జైల్లో పారేస్తాను. నువ్వు వాడిని ఓ కంట కనిపెట్టి వుండు" అన్నాడు ఏకదంతం. మరికొన్ని సూచనలు కూడా ఇచ్చాడు. "అలాగే మామయ్యా నువ్వు చెప్పినట్టే చేస్తాను". హామీ ఇచ్చాడు పీతాంబరం.

* * *

ఎండలోంచి వచ్చిన వెంకట దక్షిణామూర్తి ఇంటికి చేరి నీరసంగా కూలబడ్డాడు. మంచినీళ్ళు ఇచ్చి పాతపుస్తకంతో విసరడం మొదలుపెట్టింది రాజ్యలక్ష్మి.

"ఇక పతిసేవ చాల్లే. అన్నం పెట్టు. ఆకలి మండిపోతోంది." విసుక్కున్నాడతను.

తలవంచుకుని వెళ్ళిపోయింది రాజ్యలక్ష్మి. నిస్సత్తువతో కదలనని మొరాయిస్తున్న శరీరాన్ని బలవంతంగా లేవదీసాడు. పెరట్లోకి వెళ్ళి నీళ్ళు తోడుకుని స్నానం చేసి వచ్చి కంచం ముందు కూలబడ్డాడు.

వడ్డించింది రాజ్యలక్ష్మి. ముతక బియ్యపు అన్నం పట్టెడు. కాస్తంత కొరివి కారం. పక్కన చారుగిన్నె. అది చూసి విపరీతమైన కోపం వచ్చింది దక్షిణామూర్తికి. "ఈ పూట కూడా కూరేమీ లేదా?" కసిరాడు.

"లేదు. ఆ పచ్చడి కూడా పక్కవాళ్ళిచ్చారు" మెల్లిగా సమాధానం చెప్పింది.

"పోనీ మజ్జిగైనా వుందా?" అసహనంగా అడిగాడు.

"లేదు" నూతిలోంచి వచ్చినట్లు వచ్చింది సమాధానం.

కంచం విసిరికొట్టి లేచాడు దక్షిణామూర్తి. "ఛీ. ఈ తిండి కుక్కలు కూడా తినవే. కూరా, మజ్జిగా లేకుండా తినలేనని ఎన్నిసార్లు చెప్పాను నీకు?"

"ఎందుకంత కోపం? పాలవాడు పాలుపొయ్యడం మానేశాడు. కూరకి డబ్బులేవి?" చిరాకువేసింది రాజ్యలక్ష్మికి.

"అన్నింటికీ డబ్బులే అవసరం లేదు. తెలివితేటలుంటే చాలు. ఊళ్ళో జనాల దగ్గర పాడీ పంటా పుష్కలంగా వున్నాయి కదా! ఎవరినైనా అడిగితే కాదంటారా?" నిలదీశాడు.

"ఎన్నాళ్ళని అడగను? ఇవ్వడానికి వాళ్ళకి అభ్యంతరం లేకపోవచ్చు. ఏదో ఓ రోజు అయితే ఫర్వాలేదు. రోజూ వెళ్ళి అడగాలంటే నాప్రాణం చచ్చిపోతోంది." కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి రాజ్యలక్ష్మికి.

అవును పాపం. ఏమీలేకపోయినా మహారాణీగారికి అభిమానం మాత్రం కావలసినంత. కూలివెధవలా చాకిరీ చేసి తెచ్చిపడేస్తుంటే దర్జాగా కూర్చుని తింటానికి సరిపోతోంది. ఛీ.ఛీ సిగ్గులేకపోతే సరి. వెధవ బ్రతుకు" అంటూ లేచివెళ్ళి చాపమీద పడుకున్నాడు దక్షిణామూర్తి. అతనికి దుఃఖం ముంచుకొచ్చింది. అతని వయసు ఇరవై.

మోకాళ్ళలో తలవాల్చుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది పదిహేడేళ్ల రాజ్యలక్ష్మి.

వెంకట దక్షిణామూర్తి మధ్య తరగతికి కాస్త పై మెట్టులో వున్న కుటుంబంలో నలుగురు ఆడపిల్లల తరువాత అయిదవవాడుగా జన్మించాడు. అతి ముద్దు, గారాబం అలవాటై మొండిగా తయారయ్యాడు. మెట్రిక్ పరీక్ష నాలుగుసార్లు తప్పి అయిదోసారి పాసై కాలేజీలో చేరేసరికి పూర్తిగా కళ్ళు నెత్తికి వచ్చేశాయి. చదువుమాట ఎలా వున్నా మిగిలిన విషయాల్లో మహా చురుకు కావడంతో ప్రేమలో పడ్డాడు. ఆ ప్రేయసి టెంత్ చదువుతోంది.

ఈ చదువు చట్టుబండలూ దండగ. దర్జాగా పెళ్ళిచేసుకుని ఝామ్మంటూ డ్యూయెట్లు పాడుకుందాం అనుకున్నారు ఇద్దరూ. ఇద్దరి ఇళ్ళల్లోనూ పెద్దవాళ్ళు ససేమిరా వీల్లేదన్నారు. మన జీవితం గురించి మనం నిర్ణయం తీసుకుంటే వీళ్ళా మనని కాదనేవాళ్ళు అని పౌరుషం వచ్చింది. ఇద్దరూ ఇంట్లోంచి పారిపోయి వచ్చేశారు.

దక్షిణామూర్తి తెచ్చిన డబ్బు చేతుల్లో వున్నన్నాళ్ళు ఇద్దరికీ దివ్యంగా గడిచింది. డ్యూయెట్లు పాడకపోయినా పార్కులకీ సినిమాలకీ బాగానే తిరిగారు. డబ్బు అయిపోయింది. ఇద్దరికీ కళ్ళు పచ్చబడ్డాయి. రాజ్యలక్ష్మి దగ్గరున్న కొంచెం బంగారం అయినకాడికి అమ్మి పట్నంలో అయితే భరించలేమని పక్క ఊరికి మకాం మార్చారు. సినిమాలూ, షికార్లూ లేకపోయినా తిండికి లోపం లేకుండా గడిచిపోయింది.

audiochari.com

ఆ తర్వాత బ్రతుకు దుర్భరం అయిపోయింది. ఉద్యోగం కోసం కాళ్ళరిగేలా తిరగ్గా తిరగ్గా ఒక ప్రెస్‌లో చిన్న ఉద్యోగం దొరికింది. నెలకి రెండొందల యాభై రూపాయల జీతం. వేళాపాళా లేదు. వెట్టి చాకిరీ. తెచ్చుకున్న బట్టలు చిరిగి పోతున్నాయి. తిండికి కటకటగా వుంది.

తాము ఊహించిన జీవితానికి, ప్రస్తుతం ఎదురైన జీవితానికి ఎక్కడా సాపత్యం కుదరక బెదిరిపోతున్నారు ఇద్దరూ. పరస్పరం ప్రేమలు ఏనాడో అంతరించి పోయాయి. దాని స్థానాన ద్వేషం చోటుచేసుకుంటోంది. ఆ క్షణం పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నారు.

సింహాన్ని అతనికి తెలియకుండా ఫాలో అయిన చలం అతను పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళడం, ఇనస్పెక్టర్ ఇంటికి వెళ్ళడం గమనించి భయపడిపోయాడు. వెంటనే వెంకటేశ్వర్లు దగ్గరికి పరిగెట్టుకు వెళ్ళాడు. తను చూసిందంతా చెప్పాడు. "అతడు కచ్చితంగా డిటెక్టివే." అన్నాడు. వెంకటేశ్వర్లు మొహం పాలిపోయింది.

"అయితే ప్రమాదమే. కొన్నాళ్ళపాటు వూరుకుందాం. అతను వూర్లోంచి వెళ్ళాక మళ్ళీ మన పని మొదలు పెడదాం." అన్నాడు.

"సరే. అంతకంటే మనం చెయ్యగలిగింది మాత్రం ఏముంది!" నిరాశ పడ్డాడు చలం.

ఆరోజు రాత్రి పొలం దగ్గరికి వెళ్ళినప్పుడు హనుమంతుతోనూ, సోమయ్యతోనూ బోలెడన్ని కబుర్లు చెప్పి నవ్వించాడు సింహం. అతనితో కాస్త చనువు ఏర్పడింది వాళ్ళకి. ఈయన్ని మంచి చేసుకుంటే మంచిది అనిపించింది. వెంటనే లేచి అవతలికి వెళ్ళి కూడబలుక్కుని సారాసీసా, సిగరెట్లూ పట్టుకుని ఇతని దగ్గరకు వచ్చి భక్తిగా అందించారు. తిరస్కరించాడు సింహం. "ఇవేమీ వద్దు నాకు. నా హద్దుల్లో నేనుంటాను. మంచిగా వుంటే నా అంత మంచివాడు లేడు. వెర్రిమొర్రి వేషాలేస్తే నా అంత చెడ్డవాడూ లేడూ. కాబట్టి నాతో జాగ్రత్తగా వుండండి." అంటూ ఖచ్చితంగా చెప్తూనే వాళ్ళని హెచ్చరించాడు. వాళ్ళ పై ప్రాణాలు పైనే పోయాయి.

రెండు మూడు రోజులు మామూలుగా ఏ మార్పూ లేకుండానే గడిచిపోయాయి. సింహం పగలంతా ఊళ్ళో తిరుగుతూ ప్రయత్నం చేశాడు కానీ అతని పరిశోధన ఏ మాత్రం ముందుకి సాగలేదు. ఇలా లాభం లేదు. మంచి ప్లాన్ వేసుకోవాలి అనుకున్నాడు.

ఆరాత్రి పొలం దగ్గరికి వెళ్ళగానే హనుమంతునీ, సోమయ్యనీ దగ్గరకు పిల్చి 'ఈ పూటకి నేనొక్కడినే కాపలా వుంటాను. మీకు మాత్రం విశ్రాంతి కావద్దా. ఇళ్ళకి పోయి పడుకోండి' అని చెప్పాడు. వాళ్ళు వద్దంటే బలవంతాన పంపించాడు.

తెలతెలవారుతుండగా కబురు తెలిసిపోయింది. సుబ్బారావుగారి తోటకి మళ్ళీ దొంగతనానికి వచ్చారుట. వెంకటేశ్వర్లు నమ్మలేకపోయాడు. సుబ్బారావు నా ఖర్మ ఇంక ఇంతే అని బాధపడ్డాడు. మొండి వెధవ! వాడికేం ఆపద జరిగిందో అని కంగారుపడిపోయాడు మాధవ్.

కాస్త ముందు వెనగ్గా పొలాలవైపు పరిగెట్టారు. అక్కడ ఎదురైన దృశ్యం అందర్నీ ఆశ్చర్య చకితులని చేసింది. పంట భద్రంగా వుంది. నులకమంచం మీద కాలు మీద కాలు వేసుకుని కూర్చుని వున్నాడు సింహం.

అక్కడికి వచ్చినవాళ్ళు "ఏమిటి రాత్రి దొంగతనం జరిగిందట!" అంటూ అడిగితే "పొరబాటు. దొంగలు వచ్చారు కానీ దొంగతనం జరగలేదు" అని చెప్తున్నాడు.

ఒక్కొక్కరే వచ్చి జేరి జరిగినదంతా అతని నోట విని ఆశ్చర్యపోతున్నారు. తమ సందేహాలు తెలిపి సమాధానాలు పొందుతున్నారు. సుబ్బారావు, వెంకటేశ్వర్లు, చలం అక్కడికి జేరేసరికి అదీ దృశ్యం.

వాళ్ళని చూడగానే లేచి నిలబడి ఆహ్వానించాడు సింహం. "ఏం జరిగింది?" అని అడిగారు. విసుగు చెందని విక్రమార్కుడు మళ్ళీ చెట్టు ఎక్కాడులాగా మళ్ళీ మొదలుపెట్టాడు సింహం.

"రాత్రి ఒంటిగంట అయి వుంటుంది. నిద్రపోతూవున్న నేను అలారమ్ వినిపించి లేచాను. ఎదురుగా నలుగురు దొంగలు. వేసులో వచ్చారు. వేను దూరంగా ఆపారు. వెంట గోనెసంచులూ, బుట్టలూ అంతా తయారై వచ్చారు పాపం. నన్ను చూడగానే తెల్లబోయారు. అంతలోనే తేరుకుని దాడి చెయ్యాలని చూశారు. ఆలోగానే పిస్తోల్ తీసేశాను నేను. భయపడిపోయారు. దొంగ పిస్తోలేమో అన్నాడు ఒకడు. గాల్లోకి కాల్చి చూపించాను. కదిలేస్తే కాల్చేస్తానన్నాను. పోలీస్‌స్టేషనుకి పదమన్నాను. వణికిపోయారు.

అమాంతం కాళ్ళమీద పడిపోయారు. వదిలేయమని ప్రార్థించారు. ఇంకెప్పుడూ ఇలాటి పొరబాటు చెయ్యం అని బ్రతిమాలారు. గట్టిగా బుద్ధి చెప్పి హెచ్చరించి వదిలేశాను. ఇక్కడే కాదు. ఈ ఊర్లోనే కాదు. చుట్టుపక్కల ఊళ్ళలో కూడా

vudachan.com

దొంగతనం చెయ్యడానికి వీల్లేదని కచ్చితంగా చెప్పాను. అలాగే అని ప్రమాణాలు చేశారు. దయదల్చి పొమ్మన్నాను." చెప్పడం ముగించాడు సింహం.

సుబ్బారావు ఆదరంగా అతని భుజం తట్టాడు. "ఎంత ప్రమాదం తప్పింది. వాళ్ళు నలుగురూ నువ్వు ఒక్కడివీ. అయినా అతి సమర్థవంతంగా వాళ్ళని ఎదుర్కొంటున్నావు." అన్నాడు. ఇదంతా చూస్తున్న వెంకటేశ్వర్లుకీ, వెంకటాచలానికీ ఒళ్ళు మండిపోయింది.

"ఇదంతా ఏదో పెద్ద కథలా వుంది. వాళ్ళు రావటం, ఈయన బెదిరించడం, వాళ్లు బెదిరిపోవడం అంతా నమ్మశక్యం కాకుండా వుంది. ఎవరైనా దొంగలు రాగానే కేకలు వేస్తారు గానీ తీరిగ్గా కూర్చోబెట్టి ఉపన్యాసాలు ఇస్తారా? వేసి రావడం, గాల్లోకి తుపాకి పేల్చడం ఇవన్నీ నిశ్శబ్దంగా జరగవు కదా! ఆ చప్పుడికి పక్కపొలాల జనం లేవరా! మీరేమైనా అనుకోండి గానీ మీరు చెప్పింది నమ్మలేకపోతున్నాను." అన్నాడు చలం ఆవేశంగా.

చిద్విలాసంగా నవ్వేడు సింహం. "జరిగింది చెప్పాను నేను. మీరు నమ్మకపోతే అది మీ ఇష్టం. ముందే తెలిసుంటే దొంగలు రాగానే మిమ్మల్ని పిల్చుకుని వచ్చేవాడిని. అప్పుడు మీకు నమ్మకం కుదిరేదేమో. ఇకపోతే గొడవ అవడం జనం లేవడం అంటారా. అదీవేళ కొత్తేముంది. గతంలో కూడా చాలాసార్లు దొంగతనం జరిగింది. ఎవరైనా లేచి సాయం వచ్చారా? దొంగలని అడ్డుకున్నారా? ఇప్పుడూ అంతే" తాపీగా చెప్పాడు. గతుక్కుమన్నాడు చలం. మళ్ళీ మాట్లాడలేదు.

వెంకటేశ్వర్లు కలుగజేసుకున్నాడు. "సరే మీరు చెప్పినదే నిజం అనుకుందాం. చేతికి చిక్కిన దొంగలని ఎందుకు వదిలేశారు? పట్టుకుని పోలీసులకి అప్పజెప్తే సరిపోయేదిగా. మీరేదో బెదిరించినంత మాత్రాన వాళ్ళు అతి మంచివాళ్ళై దొంగతనం మానేస్తారా? కొన్నాళ్ళాగి మీరు కాస్త ఏమరుపాటుగా వుండగానే మళ్ళీ విజృంభిస్తే అప్పుడేం చేస్తారు తమరు?" వ్యంగ్యంగా అడిగాడు.

చివాల్న తలెత్తాడు సింహం. కత్తుల్లా వున్న ఆ చూపులకు తట్టుకోలేక తలవంచుకున్నాడు వెంకటేశ్వర్లు.

"పట్టుబడిన దొంగలను పోలీసులకి అప్పజెప్పాలని నాకూ కోరిగ్గానే వుంది. కానీ ఎంత దొంగలైనా వాళ్ళు మనుషులేకదా. వాళ్ళ బ్రతుకులు బయటపడితే నలుగురూ మోహన ఉమ్మేయరూ? వాళ్ళ పిల్లల్ని మీ నాన్న దొంగ అంటూ గేలి చెయ్యరూ? వాళ్ళ భార్యలు సమాజంలో తలెత్తుకుని తిరగ్గలరా? కొడుకు

ప్రయోజకత్వం తెలిస్తే తల్లిదండ్రులకు గుండె పగిలిపోదా! ఇదంతా ఆలోచించి దయతల్చి వదిలేశాను.

ఇకపోతే మళ్ళీ విజృంభించడం అంటారా? అది అసంభవం. నా జాగ్రత్తలో నేనుండే వాళ్ళని వదిలేశాను. ఆ దొంగలెవరో నాకు తెలుసు. వాళ్ళ వివరాలే కాదు జాతకాలూ, జన్మ నక్షత్రాలూ కూడా నాదగ్గరే వున్నాయి భద్రంగా. అవసరం అయితే రుజువులతో సహా క్షణంలో పోలీసులకి పట్టించగలను నేను" గంభీరంగా చెప్పాడు.

వెంకటేశ్వర్లు మొహం మాడిపోయింది. ఒళ్ళంతా చెమటలు పట్టాయి. రాయిలా నిలబడిపోయాడు. చుట్టూ చేరినవారు అంతా సింహం వంక ఆరాధనగా చూశారు. సుబ్బారావు మరోసారి అతని భుజం తట్టాడు.

"పంట పొలంలో వుండటం అంత మంచిది కాదు. చూసిన అందరికీ ఆశ పుడుతుంది. ఎప్పటి కూరలు అప్పుడు కోయించెయ్యండి" అన్నాడు సింహం.

"అలాగే. రెండ్రోజులకి ఓసారి కోయించేలా ఏర్పాటు చేస్తాను" అంటూ అతనికి హామీ ఇచ్చి హనుమంతుని, సోమయ్యని పిల్చి పనులు పురమాయించేశాడు సుబ్బారావు. చూస్తుండగానే కూలీలు పని మొదలుపెట్టారు. జనం అంతా వెళ్ళిపోయారు. సింహం, మాధవ్ కూడా బయలుదేరారు.

"దొంగలు పడ్డారు. నువ్వు వంటరిగా వున్నావని కబురు తెలియగానే నా పై ప్రాణాలు పైనే పోయాయిరా. ఏదో అదృష్టం బాగుండి వాళ్ళు నీ దొంగ రివాల్వర్ చూసి చెదిరిపోయారు. వాళ్ళు నీకంటే ఘనులై అసలు పిస్తోలు వెంట తెచ్చుకుని వుంటే ఎంత ప్రమాదం జరిగేది చెప్పు. ఇలాటి ప్రమాదకరమైన వ్యవహారాల్లో ఎందుకు తలదూరుస్తావురా?" మందలించాడు మాధవ్.

బాధగా నిట్టూర్చాడు సింహం. "నిజంగా దొంగలే వచ్చి నా తల బద్దలు కొట్టినా నేనంత బాధపడేవాడిని కాదురా. నిజం చెప్పాలంటే దొంగలెవరూ రాలేదు. ఆమాటకొస్తే అసలా దొంగలనే వాళ్ళే లేరు."

నోరావలించాడు మాధవ్. అది గమనించి మళ్ళీ మొదలు పెట్టాడు సింహం. "నిజం మాధవ్. దొంగలు ఎవరూ లేరు. సుబ్బారావుగారి కొడుకు వెంకటేశ్వర్లు తన మిత్రుడు చలం సహాయంతో దొంగతనం జరిపిస్తున్నాడు. ఆ డబ్బు గుట్టుగా జేబులో వేసుకుంటున్నాడు. హనుమంతునీ, సోమయ్యనీ డబ్బు ఆశ చూపి లొంగదీసుకుని తన పని చేసుకుపోతున్నాడు." మనసులో దాచుకున్న విషయం చెప్పేశాడు.

Pustaka.org

అదిరిపడ్డాడు మాధవ్. "ఓరి! నీ పరిశోధన ఎప్పుడు చూసినా ఇలా తగులబ
ఏడుస్తుందేం? నాతో అంటే అన్నావుగానీ ఇంకెవరితోనూ అనకు. కాళ్ళు విరిచేస్తారు
అసలే పెద్దవాళ్ళతో వ్యవహారం."

"కాదురా మాధవ్. నేను చెప్పింది నూటికి నూరిపాళ్ళూ నిజం" అంటూ
తను సేకరించిన వివరాలు అన్నీ వివరించాడు.

ఆ షాక్ నుండి తేరుకోలేకపోయాడు మాధవ్.

"ఆర్నెల్లు సొమ్ము చేసి అవ్వను కొట్టినట్లు అంత ప్లాన్లు వేసి, అంత శ్రమప
తన డబ్బు తను దొంగతనం చేసుకోవడం ఎందుకురా?" అన్నాడు.

"ఏమో! కారణం ఏమిటో మరి. లోగుట్టు పెరమాళ్ళకి ఎరుక." అనేశాడు
సింహం.

ఇద్దరూ ఇంటికి చేరారు. అరిగిపోయిన గ్రామఫోన్ రికార్డులా మళ్ళీ అంత
వెంకట్రావు, శాంతమ్మలకి వివరించాడు సింహం. వాళ్ళు కూడా అతని ధైర్యానికి
అభినందించారు. స్నానం చేసి తయారై యథాప్రకారం ఊరిమీద బలూదూరుకి
బయలుదేరాడు సింహం.

యథాప్రకారం శ్రమదానం మొదలుపెట్టాడు మాధవ్. శాంతమ్మగారి ఇంట్లో
కనబడిన పనంతా ఓ రోజులో ముగించేసిన మాధవ్, మర్నాడు ఆవిడ వెంట
పడ్డాడు ఏదైనా పని చెప్పమంటూ. ఓపిగ్గా పనులు వెతికి మరీ అప్పజెప్పిందావిడ.
మధ్యాహ్నానికి అదీ అయిపోయింది. ఇంకేం చెయ్యడం? ఏం పని చెప్పటం? ఏ
పనీ లేదు నాయనా కూర్చో అంటే వినడు. "ఆహా! వూరికే తిని కూర్చుంటానా
అమ్మా! ఏదో ఒకటి చెప్పండి చేస్తాను." అంటాడు. గట్టిగా మందలిద్దామంటే
ఇజ్రాయిల్ జబ్బు కాస్తా తిరగబెడుతుందేమో అని భయం.

అటువంటి పరిస్థితిలో ఏం చెయ్యడమో అని ఆవిడ మీమాంస పడుతూవుండగా
పొరుగింటి వదినగారు వీళ్ళింటికి విజిట్‌కి వచ్చింది. వీళ్ళింటి పరిస్థితి చూసి
ఆనందపడిపోయింది. "మా ఇంట్లో పడక్కుర్చీ మూలబడిపోయింది. దాన్ని గురించి
పట్టించుకునే నాథుడే లేడు" అంది మాటవరసకి. శాంతమ్మకి మంచి ఐడియా
వచ్చింది. "పోనీ మా ఇంటికి పంపించు వదినా! మాధవ్‌తో చెప్పి బాగుచేయిస్తాను"
అంది. అది మొదలు ఆవార్త అలా అలా పాకి మాధవ్‌కి చేతినిండా పని తగిలింది.

అతని పనితనం, కార్యదీక్షా చూసి అందరూ ముచ్చట పడసాగారు. "ఎంత
చురుగ్గా వున్నాడమ్మా కుర్రాడు. నాకొక కొడుకూ వున్నాడు. సోమరిపోతు వెధవ.
వాడికీ ఇజ్రాయిల్ జబ్బు వస్తే బాగుండు." అనుకుంది ఓ ఇల్లాలు.

ఇంకా కరెంట్ బిల్లులు కట్టడం వంటి పన్లు కూడా చేసిపెడతాడేమో అని
వాళ్ళంతా ఆశపడ్డారు గానీ శాంతమ్మ వీల్లేదంది. గేటుదాటి బయటకు వెళ్ళనివ్వను.
అలా అని సింహానికి మాటకూడా ఇచ్చాను అని కచ్చితంగా చెప్పేసింది.

అదే మహాభాగ్యంగా భావించి ఆనందపడ్డారు జనం. ఫలితంగా మాధవ్‌కి
చేతినిండా పని. అతనికీ సుఖంగానే ఉంది. వూరికే ఉండి తినటంకాకుండా ఆవిడకి,
ఆవిడ ఫ్రెండ్స్‌కీ సాయం చేయగలుగుతున్నందుకు ఆనందంగా వుంది అతనికి.

ఊళ్ళోకి వెళ్ళిన సింహం వంక అందరూ ఆరాధనగా చూశారు. రకరకాల
ప్రశ్నలు వేశారు. ఆపూట ఎక్కడికి వెళ్ళినా అదే టాపిక్. హీరో అయిపోయాడు
సింహం.

ఆపూట కోయించిన కూరలు బజార్లో అమ్మించి వచ్చిన డబ్బు చూసుకుని
ఆనందపడిపోయాడు సుబ్బారావు. 'ఎన్నాళ్ళయింది ఇంత డబ్బు కళ్ళజూసి. ఈమధ్య
కాలంలో సగానికి సగం దొంగల పాలై పోవడమేగా! అనుకున్నాడు. టౌన్ నించి
తిన్నగా వెంకట్రావు ఇంటికే వెళ్ళాడు. సింహాన్ని పిలిచి రెండొందల ఏభై రూపాయలు
చేతిలో పెట్టాడు.

"మీరు చేసిన సాయానికి ఇది చాలా తక్కువే. అదృష్టం బాగుండి ఇక దొంగల
బెదద తప్పిపోతే మార్కెట్‌కి కూరలు వేసినప్పుడల్లా తృణమోపణమో ముట్ట
చెపుతాను" అన్నాడు. వినయంగా అందుకున్నాడు సింహం.

అప్పటికి అప్పుడే అక్కడికి అక్కడే అందులోంచి నూటయాభై రూపాయలు
తీసి వెంకట్రావుగారికి ఇచ్చాడు. "మీరు చూపుతున్న ఆదరణకు విలువ కట్టడం
కాదు. మీ ఇంట్లో వుంటున్నాం, తింటున్నాం. ఏదో నా శక్తికి తగినట్లు....."

అతని మాట అతని నోట్లో వుండగానే దూసుకు వచ్చింది శాంతమ్మ. భర్త
చేతిలోని డబ్బు లాగేసుకుని సింహం చేతుల్లో పెట్టేసింది. "ఇక ఎప్పుడూ ఇలాటి
పనిచెయ్యకు." అంది సీరియస్‌గా.

"అది కాదమ్మా!" ఏదో చెప్పబోయిన సింహాన్ని వారించింది.

"చూడు నాయనా. ఏనాడు చేసిన పాపమో కన్నబిడ్డని పోగొట్టుకున్నాం. ఇద్దరం
ఒంటరిగా బ్రతుకుతున్నాం. మీరిద్దరూ వచ్చాక ఇంట్లో కాస్తంత సందడిగా వుంది.
మీరు అమ్మా అమ్మా అని పిలుస్తూ వుంటే అమృతం కురుస్తున్నట్లే వుంది నాకు.
మీరు నాలుగురోజులు వున్నంత మాత్రాన మా ఐశ్వర్యం తరిగిపోదు. మీకు భోజనం
పెట్టి లెక్కకట్టి డబ్బులు వసూలు చెయ్యను నేను. ఇలాటి పన్లు చేసి నా మనసుకి
కష్టం కలిగించకు." అంది దీనంగా.

Gurajada.com

వెంటనే డబ్బులు జేబులో పెట్టుకున్నాడు సింహం. "ఇంకెప్పుడూ ఇ
చెయ్యనమ్మా. మీ మనసుకి కష్టం కలిగించను." అన్నాడు.

ఎప్పటిలాగా భార్య ప్రవర్తనకి కోపగించుకోలేదు వెంకట్రావుగారు. పైపె
ఆవిడని చూసి జాలిపడ్డారు. నిజమే! ఆవిడకి కలిగిన కష్టం సామాన్యమైనది కా
ఏకైక పుత్రుడు రెండేళ్ళ వయస్సులో తిరణాలలో తప్పిపోయాడు. ఎ
ప్రయత్నించినా దొరకలేదు. బిడ్డలు పుట్టకపోతే అదో బాధ. పుట్టి కళ్ళ ఎదుట
చనిపోతే ఇంకోరకం బాధ. అదీ ఇదీ కాకుండా చూస్తు వుండగానే క్షణంలో మాయ
అయిపోయాడు. ఏమయ్యాడో తెలియదు. బ్రతికి వున్నాడో లేదో తెలియదు. బ్ర
వుంటే ఏ స్థితిలో వున్నాడో అసలు తెలియదు. లక్ష సందేహాలు. ఎవరై
తీసుకుపోయి కాలూ చేయీ విరిచేసి ముష్టివాడిని చేశారేమో! లేకపోతే
దొంగలముఠాలోనైనా జేర్పించారేమో! అనే బాధ అనుక్షణం ముల్లులా బాధపెడుత
వుంటే జీవనం సాగించడం దుర్భరం.

జీవచ్ఛవంలా తయారైపోయింది శాంతమ్మ. ఏదో బ్రతకడానికి తినడం, బాధ
అణచుకుని తిరగడం. అటువంటి స్థితిలో ఈ కుర్రాళ్లు రావటంతో ఆవిడకి చైతన్
కలిగించింది. పదేళ్ళు వయసు తగ్గినట్లు కనిపిస్తున్న భార్యని చూసి సంతో
కలిగిందాయనకి. అందుకు కారణం అయినా వారిపట్ల కాఠిన్యత తొలగిపో
కృతజ్ఞత కలిగింది.

వీళ్ళిద్దరూ కొన్నాళ్ళు ఇంట్లో వుంటే బాగుండుననిపించింది. వాళ్ళ దగ్గ
డబ్బు తీసుకోవాలనే ఆలోచన ఆయనకీ లేదు. భార్య రాకుంటే ఆపని తనే చేసేవా

ఆ రాత్రి ఎంతో సంతోషంగా నిద్రపోయాడు సుబ్బారావు. ఆయన కొడు
వెంకటేశ్వర్లుకి మాత్రం కంటిమీద కునుకు లేదు. సింహాన్ని, తండ్రిని దుమ్మెత్తిపో
పడుతూ హైరాన పడిపోయాడు.

* * *

సింహం ఆర్థిక సమస్య తీరిపోయింది. జేబులో సుబ్బారావు ఇచ్చి
డబ్బులున్నాయి. ఫ్రీ లాడ్జింగు ఫ్రీ బోర్డింగు. పై ఖర్చులకి తన దగ్గరున్న డబ్
కోకొల్లలు. ఎప్పుడైతే ఆర్థిక సమస్య తీరిపోయిందో అసలు సమస్యా పరిష్కా
వైపు బుద్ధి మళ్ళించాడు సింహం. ఏం చెయ్యాలా అంటూ తల పగిలిపోయే
ఆలోచించాడు ఆరోజంతా. బుర్ర వేడెక్కి పోయిందే తప్ప సరైన మార్గ
కనిపించలేదు.

సాయంత్రం తలమీద ఓ పది చేదలు దిమ్మరించుకొని స్నానం చేశాడు. కాస్త
హాయిగా అనిపించింది. శాంతమ్మ ఇచ్చిన కాఫీ తాగి యథాప్రకారం ఊరు
చుట్టడానికి బయలుదేరాడు. అలా ఓ రౌండ్ కొట్టి గుడికి వెళ్ళాడు. దేవుడి దర్శనం
చేసుకొని పూజారి ఇచ్చిన తీర్థం తీసుకొని గుడి ఆవరణలో ఓ మూలగా
కూర్చున్నాడు. ఆలోచనలు – ఒకటే ఆలోచనలు.

"నమస్కారం" హఠాత్తుగా వినిపించడంతో ఉలిక్కిపడి చూశాడు. ఎదురుగా
ఉన్న అపరిచిత వ్యక్తి వంక చూసి నమస్కారం అన్నాడు అప్రయత్నంగా. "గుర్తు
పట్టలేదా?"

ఒక్క నిముషం పాటు పరీక్షగా చూసినా గుర్తురాలేదు అతనికి. మొహమాటంగా
బుర్ర గోక్కున్నాడు. అతని అవస్థ గమనించింది. 'ఆ రోజు స్కూటర్ ఆగిపోతే
బాగు చేశారు కదూ!' గుర్తు చేసింది.

నోరావలించాడు సింహం. జీన్స్ పాంట్ షర్టు వేసుకొని తలమీద కేప్ పెట్టుకొని
పక్కా మోడ్రన్ గర్ల్‌లా వున్న ఆ అమ్మాయి, జానెడంచు జరీచీర కట్టుకుని పూలూ,
బొట్టూ, గాజులూ, మొదలైన అలంకరణలతో పదహారణాల తెలుగు పడుచులా
వున్న ఈ అమ్మాయి ఒకరే అంటే నమ్మశక్యం కాలేదు అతనికి.

ఆడపిల్లల తీరే అంత. ఒక్కో అలంకరణలో ఒక్కోరకంగా కనిపిస్తారు. మగవాళ్ళు
అలాకాదు. ఏ బట్టలు వేసుకున్నా అదే అవతారం, అదే మాట అన్నాడు ఆ
అమ్మాయితో. నవ్వేసింది.

"గుడికి వచ్చాను. మీరు కనిపించారు. ఓసారి హలో అందామని ఇలా వచ్చాను.
ఏదో ఆలోచనలో ఉన్నట్లున్నారు. డిస్టర్బ్ చేశానేమో!" అంది.

"అబ్బే అదేం లేదండీ. ఉరికే ఏంతోచక చేసే ఆలోచనలు." అనేశాడు సింహం.
అతనికి కాస్త దూరంలో కూర్చుంది. ఇద్దరూ కాసేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్నాడు.

హఠాత్తుగా గుర్తొచ్చింది సింహానికి. "ఇంతసేపైనా మీ పేరేమిటో అడగనే
లేదు నేను" అన్నాడు.

"వసుంధర !" చెప్పింది. "ఏం చేస్తుంటారు?" మరో ప్రశ్న వేశాడు. "డిగ్రీ
పూర్తి చేశాను. ఇక ఆ తరువాత చదవాలనిపించలేదు. ఉద్యోగం పట్ల కూడా
ఆసక్తి లేదు. ఏదో నా శక్త్యానుసారం కష్టంలో ఉన్నవాళ్ళని ఆదుకోవాలనేది నా
జీవితాశయం. అదే నా వ్యాపకంగా అలవాటు చేసుకున్నాను." చెప్పింది వసుంధర.

అతనికి ఏం అర్థం కాలేదు. వివరంగా చెప్పమన్నాడు.

gurazadi.com

చెప్పాలంటే అదో పెద్ద కథ. వీలైనంత టూకీగా చెప్తాను.

"మా అమ్మ చాలా డబ్బున్న ఇంటివారి అమ్మాయి. మా తాతగా చిన్నతనంలోనే అమ్మకు పెళ్ళి చేశారు. మా నాన్నది చాలా పేద కుటుంబ అయితే ఆయన తెలివితేటలు అమోఘం. తాతగారి సాయంతో నాన్నగా చదువుకున్నారు. పైచదువులకు అమెరికా వెళ్ళారు. అప్పటికి మా అమ్మ నన్ కడుపుతో ఉంది. నేను పుట్టి ఏడాది పిల్లనయ్యాక నన్ను తీసుకుని అమెరి వెళ్ళింది అమ్మ.

అమెరికా తళుకు బెళుకుల పట్ల వ్యామోహం పెంచుకున్న నాన్నగారికి నా రాసి బిగించి జడవేసుకుని కాళ్ళకుపట్టీలు, ముక్కుపుడకతో తిరుగుతూ ఏమాత్ర చదువురాని మా అమ్మను చూస్తే విసుగు కలిగింది. ఆయన అనాదరంగా చూస్తున్నా వేరే స్త్రీలతో సంబంధం పెట్టుకున్నా, సహించింది మా అమ్మ. ఎప్పటికైనా న భర్తలో మార్పు వస్తుందనీ, తన జీవితం బాగుపడుతుందనీ ఆశగా ఎదురు చూసింది కొత్త వాతావరణం, కొత్త మనుషులు, భాషరాదు, భర్త అనాదరణ అన్నీ ఏక అయి ఆవిడకు మనశ్శాంతి దూరం అయిపోయింది. మనోవ్యాధికి లోనై అనారోగ్యా పాలైంది.

అక్కడే కన్నుమూసింది. తాతగారి దుఃఖం వర్ణనాతీతం. ఆయన పదే పదే కోరగా నన్ను ఇక్కడికి పంపేశారు మా నాన్నగారు. అప్పటికి నాకు అయిదేళ్ళు మెడ్రాస్ ఎయిర్‌పోర్టులో నన్ను రిసీవ్ చేసుకున్నారు తాతగారు. అప్పటినించీ ఆయన దగ్గరే వున్నాను. ఆయన దగ్గరే పెరిగాను. తల్లీ తండ్రీ అన్నీ ఆయనే. కూతురి విషయంలో చేసిన పొరబాటు నా విషయంలో జరగకుండా జాగ్రత్త పడ్డారు. ఏ విధమైన ఆంక్షలూ లేకుండా స్వేచ్ఛగా పెంచారు. నా జీవితాన్ని నా ఇష్టం వచ్చినట్లు మలుచుకునే అపూర్వమైన అవకాశం ఇచ్చారు.

చదువు పూర్తి అయింది. పుష్కలంగా డబ్బుంది. ఉద్యోగం చేసి సంపాదించాల్సిన అవసరం లేదు. అందుకని నాకెంతో ఇష్టమైన పని ప్రారంభించాను. కొందరు మంచి మిత్రుల సహాయంతో ఒక సంస్థను ఏర్పాటు చేశాను. సంస్థ పేరు "స్నేహ". ఎవరైనా ఆపదలో వుండి బాధపడుతుంటే వారికి చేతనైన సహాయం చేసి వారిని ఆపద గట్టెక్కించడం మా సంస్థ ధ్యేయం.

మా సంస్థ ప్రారంభించిన వేళావిశేషం ఎటువంటిదోగాని రెండేళ్ళలోనే మంచి పేరు సంపాదించుకున్నాం. చాలామందికి సహాయం చేశాం". చెప్తుంటే వసుంధర కళ్ళు గర్వంగా మెరిశాయి.

ఆవిడ చెప్పినదంతా శ్రద్ధగా విన్నాడు సింహం. "సహాయం అంటే ఏవిధంగా? ఆర్థికంగా సహాయం చేస్తారా?" అడిగాడు.

"కాదు, కాదు. వివరంగా చెప్తాను. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నాళ్లైనా, టెక్నాలజీలో ఎంతో ప్రగతి సాధించినా సగటు ఆడపిల్ల జీవితం మాత్రం అధ్వాన్నంగానే వుంది. కట్నాలు తెమ్మని కాల్చుకు తినడం, తాగివచ్చి భార్యను చావబాదటం వంటి విషయాలు మన సమాజంలో సర్వసాధారణం. అలాటివారికి సహాయం చెయ్యడం మాపని. మా ఫ్రెండ్స్ చాలామంది వున్నారు. వాళ్ళంతా ఈ పనిమీదే వుంటారు. ఇలాటి కేసు ఎక్కడైనా వుందని వారికి తెలిస్తే వెంటనే "స్నేహ"కి తెలియజేస్తారు. వెంటనే మేము వెళ్ళి ఆ వ్యవహారం కూలంకషంగా పరిశీలించి వారికి నచ్చచెప్పి వినకపోతే బెదిరించి, అదీ కాకపోతే దండించి అయినా సరే దారిలో పెడతాం." చెప్పింది వసుంధర. అంతా వింటున్న సింహానికి ఎగిరిగంతెయ్యాలనిపించింది. తను వున్న పరిస్థితిలో వసుంధరతో పరిచయం కలగడం ఏదో నిధి దొరికినంత సంతోషం కలిగింది అతనికి. నమ్మశక్యం కాలేదు.

తను చెప్పినది విని అతనేమీ ఆసక్తి కనబరచక పోయేసరికి అనవసరంగా అతనికి బోరు కొడుతున్నానేమో అనిపించింది వసుంధరకి.

"మిమ్మల్ని బాగా విసిగించినట్లు వున్నాను. మరి వెళ్ళొస్తాను." అంటూ లేచింది.

"అరెరె ఆగండి!" కంగారుగా ఆపేశాడు సింహం. "మీతో చాలెడన్ని విషయాలు మాట్లాడాలి. ఒక్క అరగంట కూర్చోగలరా?" రిక్వెస్ట్ చేశాడు.

"ఓ దానికేం భాగ్యం చెప్పండి" అంటూ అతనికి కాస్త దూరంలో కూర్చుంది.

ఉత్తరం తనకంట పడటం మొదలుకుని ఆనాటివరకు జరిగినదంతా పూసగుచ్చినట్లు చెప్పాడు సింహం.

"ఏం చెయ్యాలో అర్థంకావడం లేదు. ఏ ఒక్క ఆధారమూ దొరకటం లేదు. తీరిగ్గా ఆలోచిస్తూ కూర్చుంటే అవతల అనర్థం జరిగిపోతుందేమో అని భయం. చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏం ప్రయోజనం? ఏ దిక్కూ దోవా తోచని స్థితిలో మీ పరిచయం కలగటం పరమానందంగా వుంది. మీరు అనుభవజ్ఞులు, సమర్థులు. విషయం అంతా మీకు చెప్పాను. ఏదైనా మార్గం చూపించగలరా?" దీనంగా ధ్వనించింది అతని కంఠం.

ఈసారి సంభ్రమాశ్చర్యాలకు గురిఅవడం వసుంధర వంతు అయింది. ఆవిడ స్థితి వర్ణనాతీతం.

dudehari.com

పొరుగూళ్ళో సంస్థను స్థాపించిన తను తన ఊరుని నిర్లక్ష్యం చేశానన్న పశ్చాత్తాపం.

ముక్కూ మొహం తెలియని వ్యక్తి కోసం, ఆవిడ ప్రాణాలు కాపాడటం కోసం తపన పడుతున్న సింహం పట్ల గౌరవం.

అంతకుముందు ఎన్నడూ ఎదురుపడని క్లిష్టమైన ఈ సమస్యని ఎలా పరిష్కరించుకోవాలా అనే ఆలోచన, అన్నీ ఏకమై మౌనంగా వుండిపోయింది.

ఆవిడ సమాధానం కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు సింహం. కాసేపు దీర్ఘంగా ఆలోచించి తల విదుల్చుకుంది వసుంధర. "చూడండి సింహంగారూ!"

ఉత్సాహంగా ముందుకి వంగాడు సింహం.

"సమస్య కొంచెం కఠినమైనదే. అయినా ఫర్వాలేదు. మీ ఉత్సాహం, నా అనుభవం ఏకమైతే పరిష్కారం లభించకపోదు. ఆలోచిద్దాం. వియ్ విల్ డు ఇట్. రేపు నాకో ముఖ్యమైన పని వుంది. ఏడున్నరకల్లా ఇంట్లోంచి బయలుదేరతాను. మీకు వీలైతే మా ఇంటికి రండి. ఇద్దరం కలిసి వెళ్దాం. అక్కడ తీరిగ్గా ఆలోచిద్దాం" అంది.

వెంటనే అంగీకరించాడు సింహం. ఇల్లు గుర్తులు చెప్పి వెళ్ళిపోయింది వసుంధర. భగవంతుడికి మరోసారి మనస్ఫూర్తిగా దణ్ణం పెట్టుకుని బయలుదేరాడు సింహం. ఇంటికి వెళ్ళి భోజనం చేసి పాలం దగ్గరికి వెళ్ళి పడుకున్నాడు.

* * *

ఒకచోట పదిమంది చేరి నివాసం ఏర్పరచుకుంటే అది ఊరు అవుతుంది. ఊరు అనేసరికి కొన్ని సామాన్య సౌకర్యాలు ఏర్పడతాయి. మంచి నీటి వసతి, వాహన సౌకర్యం. బజారు, దేవాలయం, డాక్టరూ, ఇలాటివన్నీ ప్రతి చిన్న ఊళ్ళోనూ వుంటాయి.

అయితే వీటన్నిటితో బాటు దురదృష్టవశాత్తూ మరో ఏర్పాటు కూడా ప్రతి ఊళ్ళోను వుంటుంది. ఎంత చిన్న ఊరైనా సరే తప్పక వుండి తీరుతుంది. మర్యాదస్తులు వెళ్ళడానికి ఇష్టపడని ప్రదేశం. ఇష్టపడిన వారు కూడా రహస్యంగా సందర్శించే ప్రదేశం ఆ ఊళ్ళోనూ వుంది. ఊరికి మూలగా కొన్ని గుడిసెలు. వాటికి మధ్యగా సారా దుకాణం. పగలంతా నిశ్శబ్దంగా వుండే ఆ ప్రదేశంలో రాత్రిపూట సందడి మొదలవుతుంది.

ఓ మూలగా వున్న ఆ గుడిసె బయటికి సామాన్యంగా కనిపించినా లోపల నీట్‌గానే వుంది. నవారు మంచం, పరుపు, మెత్తని దుప్పటి. దానిమీద పవళించి

వున్నాడు మస్తాన్. అతని కాళ్ళ దగ్గర కూర్చుని కాళ్ళు నొక్కుతున్నాడు సింగడు. మస్తాన్ సింహం అయితే సింగడు నక్క. మస్తాన్ ఆ ఊరు వచ్చి నెలరోజులయింది.

అతను తల్చుకుంటే ఊళ్ళోనే పెద్ద మేడలో వుండచ్చు. కానీ పరిస్థితులకు తలవంచి అలా మారుమూల తలదాచుకున్నాడు. అతనో కిరాయి గూండా. పైకి అతి మామూలు పర్సనాల్టీతో సామాన్యంగా కనిపించే మస్తాన్ పరమ కిరాతకుడు. సిగిరెట్ వెలిగించుకున్నంత తేలిగ్గా హత్య చేసి పారేస్తాడు.

డబ్బు పారేస్తే చాలు ఏ పనికైనా సిద్ధమే. అంత సమర్థుడైన మస్తాన్ ఓ పెద్ద తలకాయకి కుడిభుజం. ఆయన ఆస్థానరౌడీ ఇతడే. ఓసారి ఆయనకి అవసరం అయితే ఓ హత్యచేసి పారేశాడు. అలా చేయడం అతనికి కొత్తేం కాదు. అలా ఎన్ని హత్యలు చేశాడో అతనికి గుర్తు లేదు.

అయితే కాలం ఖర్మం కలిసిరాక కాస్త చిరాకు వచ్చిపడింది. పట్టపగలు ఇతడు హత్య చేస్తుండగా చూసిన జనంలో, ఇతడి బాస్‌కి బద్ధ విరోధులైన మరికొందరు పెద్ద తలకాయలు కూడా వుండటంతో గొడవ జరిగింది. వాళ్ళు అదంతా చూశారనీ మస్తాన్‌ని గుర్తుపట్టారనీ మస్తాన్ యజమానికి తెలిసింది. ఆయన గాభరా పడ్డాడు. అవతలివాళ్ళు కూడా సామాన్యులు కారు. గట్టిపట్టుదల మీద వున్నారు. తీగ కదిలిస్తే డొంకంతా కదుల్తుంది. మస్తాన్ పట్టుబడితే ప్రమాదం ముంచుకొస్తుంది. అందుకని మస్తాన్‌ని ఊరికి దూరంగా అజ్ఞాతవాసం పంపించేశాడు. ఈ గొడవ అంతా సద్దుమణిగేదాకా అక్కడే వుండమన్నాడు. కేసు కొట్టించేయగానే పిలిపిస్తాననీ, అతని కష్టానికి ఫలితంగా ఏది కోరితే అది ఇస్తానని మాట ఇచ్చాడు. ఆయన మాట మన్నించి అజ్ఞాతవాసం వచ్చేశాడు మస్తాన్.

డబ్బుకి లోటులేదు. తిండి, తీర్థం, మిగిలిన అవసరాలు అన్నీ తీరిపోతున్నాయి. బాగానే గడిచిపోతున్నాయి రోజులు. డబ్బున్న జల్సారాయుడు కాబట్టి అతని చుట్టూ గుంపు చేరింది. అందులో ముఖ్యుడు సింగడు. మస్తాన్ తినగా మిగిలింది తింటూ, తాగగా మిగిలింది తాగుతూ అతని సేవ చేసుకుంటూ బ్రతుకుతున్నాడు.

సింగడి తర్వాత కాస్త చెప్పుకోదగిన వారిలో ముఖ్యుడు వెంకటాచలం. సింగడిలా కాళ్ళు పట్టకపోయినా తరచూ వచ్చి కాసేపు బాతాఖానీ వేసిపోతూ వుంటాడు. ఎవరెంత దగ్గరైనా మస్తాన్‌కు సంబంధించిన వివరాలు మాత్రం ఎవరికీ తెలియవు. ఎందుకొచ్చాడో ఎన్నాళ్ళుంటాడో ఏమీ తెలియవు.

"ఏవిట్రా ఊళ్ళో కబుర్లు?" అలవాటు ప్రకారం ప్రశ్నించాడు మస్తాన్. ఊళ్ళో అందరిగురించీ క్షుణ్ణంగా తెలుసు సింగడికి. బూరలూ, చిన్న చిన్న బొమ్మలూ,

audachan.com

రిబ్బన్లు మొదలైనవి అమ్మడం వాడి వృత్తి, ఊళ్ళో కబుర్లు, ముఖ్యంగా ఆడవా గురించి పసందుగా కబుర్లు చెప్పడంలో సింగడు ఎక్స్‌పర్ట్. వాడి కబుర్లంటే ప చస్తాడు మస్తాన్.

"ఏవిటీ? నలుగుర్ని ఒక్కడే ఎదిరించాడా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవునండీ. ఆయన దగ్గర పిస్తోలు కూడా వుందిట. ఇలా దొంగలని పట్టడ ఆయనకి బాగా అలవాటేట." చెప్పాడు సింగడు.

అతనెవరో, ఏమిటో అడిగాడు మస్తాన్. వివరంగా చెప్పాడు సింగడు. త పంకించి ఆలోచిస్తూ వుండిపోయాడు మస్తాన్.

* * *

తెల్లవారింది. సుబ్బారావు రోజూకన్న కాస్త ముందే లేచాడు. "అమ్మాయ్ లక్ష్మి లేచిందా? చూడు. లేవకపోతే లేపమ్మా"! అన్నాడు కోడలితో.

రుసరుసలాడింది సావిత్రి. "వున్న చాకిరీ చాలక ఇక మేలుకొలుపులు కూ పాడాలా. నిన్న రాత్రి చెప్పారుగా. లేస్తుందిలెండి. ఆమాత్రం తెలియదా? అం పసిపిల్లేం కాదుగా. "అంటూ వెళ్ళిపోయింది.

ఆయన మనసు చివుక్కుమంది. తనే వెళ్ళాడు. హాయిగా నిద్రపోతున్న కూతు చూసేసరికి బాధ కలిగిందాయనకి. ఏమిటో తల్లి లేని పిల్ల. ఓ ముద్దూ ముచ్చ లేవు సరికదా సాధింపులు, వేధింపులు. "లక్ష్మీ లేమ్మా" మెల్లిగానే లేపాడు.

వెంటనే లేచింది "తెల్లవారింది లే తల్లీ గుడికి వెళ్ళాలి". గుర్తు చేశాడు. లే బద్దకంగా ఒళ్ళు విరుచుకుంది లక్ష్మి. ఎంతకీ పెళ్ళి కుదరకపోతుంటే జాతక తీసుకువెళ్ళి చూపించాడు సుబ్బారావు. "ఆయన చాలా గొప్ప వ్యక్తిట. జాతక చూసి అమ్మాయికి నాగదోషం వుంది. కొన్నాళ్ళపాటు పొద్దునా సాయంత్రం నా ప్రదక్షిణాలు చేయించండి" అని చెప్పాడు.

పొద్దున్నే లేచి స్నానం చేసి గుడికి వెళ్ళి ప్రదక్షిణాలు చెయ్యడం అంటే బద్దక వేసింది లక్ష్మికి. అయినా తప్పదు. తన పెళ్ళికోసం ఏం చెయ్యమన్నా సిద్ధమే తను. ఎందుకంటే తన పెళ్ళైతే తండ్రి బరువు తీరిపోతుంది. ఆయనకి మనశ్శాంతి కలుగుతుంది. బద్ధకం వదిలించుకుని లేచి స్నానం చేసి కాఫీ కూడా తాగకుండా పూజ సామాగ్రి పట్టుకుని గుడికి బయలుదేరింది.

* * *

తెల్లవారగానే లేచి రెడీ అయిపోయి వసుంధర చెప్పిన సమయానికి కాస్త ముందుగానే ఆవిడ ఇంటికి వెళ్ళాడు సింహం. ఆదరంగా ఆహ్వానించింది వసుంధర, తాతగారికి పరిచయం చేసింది. అందరూ కలిసి బ్రేక్‌ఫాస్ట్ తీసుకున్నారు.

సింహం, వసుంధర బయటికి వచ్చారు. "మీరు డ్రైవ్ చేస్తారా?" స్కూటర్ తీస్తూ అడిగింది. "నాకు స్కూటర్ డ్రైవింగ్ రాదండీ! సైకిలింగ్ మాత్రమే వచ్చు." చెప్పేశాడు సింహం. "అదొస్తే ఇది నేర్చుకోడం ఈజీ. వచ్చేటప్పుడు నేర్పుతాను" హామీ ఇచ్చింది వసుంధర.

గంటన్నర ప్రయాణం. సిటీ మధ్యలో ఓ రెండంతస్థుల భవనంలో మేడమీద వుంది "స్నేహ" కార్యాలయం. చాలా సింపుల్‌గా వుంది. టేబిల్ దానికెదురుగా కుర్చీలు, పక్కగా ఒక బెంచ్. బల్లమీద ఫైళ్లు, టెలిఫోన్ గోడమీద దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, సరోజినీ నాయుడు, ఇందిరాగాంధీ, మదర్ థెరీసా చిత్రపటాలు.

ఒక ఆఫీస్ బాయ్ వున్నాడు. అతను వసుంధరకి నమస్కారం పెట్టాడు.

"సింహాన్ని కూర్చోమని చెప్పి ఎటాచ్‌డ్ టాయిలెట్‌లోకి వెళ్ళి మొహం కడుక్కుని రేగిపోయిన తల దువ్వుకుని వచ్చి కుర్చీలో కూర్చుంది. "మీరు కాస్త ఫ్రెష్ అవండి' అని చెప్పింది అతనితో. అతను మొహం కడుక్కుని వచ్చేసరికి కాఫీలు వచ్చాయి.

"ఇంకెవరూ లేరూ? మీరొక్కరేనా?" అడిగాడు.

"వుండటం చాలామంది వున్నారు. కానీ వారందరికీ ఉద్యోగాలూ చదువులూ ఉన్నాయి. అందుకని ప్రతిరోజూ రారు. అసలు రెగ్యులర్‌గా రావాలనే నియమం ఏమీ లేదు మాకు. అవసరం అయినప్పుడు వస్తే చాలు. అదీ వీలవకపోతే కబురు అందిస్తే చాలు. తీరికగా వున్నవాళ్లం ఎవరో ఒకరం ఆ పని చూసుకుంటాం. ఈ పూట ఒక వ్యక్తి వస్తాడు ఇక్కడికి. మావాళ్ళు తీసుకువస్తారు. అతని వివరాలు ఈ ఫైల్లో వున్నాయి చదవండి." అని ఇచ్చింది.

ఆసక్తిగా అందుకున్నాడు సింహం. అందులో వివరాలు క్లుప్తంగా వున్నాయి. అతని పేరు గోపాలకృష్ణ, భార్యపేరు తులసి. వారి వివాహం జరిగి ఏడాది అయింది. కట్నం దబ్బులు తేలేదని భార్యని టార్చర్ చేస్తున్నాడతను. తిట్టడం నుండి కొట్టేస్టేజీకి వచ్చాడు. ఆ విషయం తెలుసుకున్న స్నేహ సభ్యుడు మనోహర్ తులసిని కలుసుకుని తను విన్నదంతా నిజం అని రుజువు చేసుకున్నాడు.

స్నేహ ఫైల్లోకి చేరింది ఆ కేస్.

"ఇప్పుడు ఏం చేస్తారు? అతడిని తీసుకొచ్చి ఏం చేస్తారు నాలుగు తగిలిస్తారా?" కుతూహలంగా అడిగాడు.

gurajada.com

"అది ఆఖరి మెట్టు. అన్ని దారులూ మూసుకుపోయి గత్యంతరం లేకపో అప్పుడు అంతదాకా వెళ్ళడం. మన సమాజంలో పెళ్ళైన స్త్రీకి భర్త అండ వుం లభించే గౌరవం ఒంటరిగా వుంటే లభించదు. అదీగాక మన సంఘంలో వివాహానికి పవిత్రత, విలువ, గౌరవం వున్నాయి. పాశ్చాత్య దేశాలలోలాగా చీటీ మాటికీ విడాకులూ, పునర్వివాహాలూ మనకు లేవు. కాబట్టి వివాహబంధా కాపాడి ఒక సంసారాన్ని నిలబెట్టడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాను." చెప్పిం వసుంధర.

వీళ్ళు మాట్లాడుతూ వుండగానే ఇద్దరు యువకులు వచ్చారు. అందులో ఒకర్ని మనోహర్‌గా పరిచయం చేసింది వసుంధర. రెండో వ్యక్తిని గోపాలకృష్ణగా పరిచయ చేశాడు మనోహర్.

అతి మామూలుగా వున్నాడు గోపాలకృష్ణ. చిరాగ్గా ధుమధుమలాడుతూ వున్నాడు.

"కూర్చోండి" అంటూ మర్యాద చేసింది వసుంధర. "ఏం తీసుకుంటారు? కాఫీ, కూల్‌డ్రింక్!"

"ఏమీ వద్దు నాకు. అవతల నాకు బోలెడన్ని పన్లున్నాయి. ఎందుకు పిల్చారో చెప్పండి త్వరగా. చిరాకుపడ్డాడు గోపాలకృష్ణ.

"మా వల్ల మీకు ఇబ్బంది కలిగిందనుకుంటాను. ఐయాంసారీ. మీతో కాస్త మాట్లాడాలని పిలిపించాను." శాంతంగా చెప్పింది వసుంధర.

"త్వరగా చెప్పండి" విసుక్కున్నాడతను.

"చూడండి గోపాలకృష్ణ గారూ! మీ భార్యతో మీ ప్రవర్తన సరిగ్గా లేదని ఆవిడని బాధలు పెడుతున్నారని మాకు నమ్మకంగా తెలిసింది. దానికి మీరేం సంజాయిషీ చెప్తారు?" సూటిగా అడిగింది.

విసురుగా లేచి నిలబడ్డాడు గోపాలకృష్ణ. "ఇది నా స్వవిషయం. నా భార్యని నేను కొట్టుకుంటానో, చంపుకుంటానో నా ఇష్టం. అడగడానికి మీరెవరు? అసలు ఇలా నన్ను పిలిపించి నిలదీయడానికి మీకెంత ధైర్యం?" మండిపడ్డాడు.

అతని భుజం పట్టి కూలేశాడు మనోహర్. "చూడు చిట్టితండ్రీ. ఆరోజులు పోయాయి నాయనా. కొట్టడానికీ, చంపడానికీ నీ భార్య కుక్కపిల్లో, కోడిపిల్లో కాదు. నీలాటి మనిషి. మీ ఇద్దరూ అన్యోన్యంగా కాపురం చేసుకుంటూ వుంటే నీ కాపురం నీ స్వవిషయమే. ఎప్పుడైతే క్రూరత్వానికి దిగావో నీ బ్రతుకు బజార్

పడినట్లే. నిలదీసి అడగడానికే కాదు, నిన్ను పోలీసులకి పట్టించే అధికారం కూడా మాకు వుంది." అన్నాడు తీక్షణంగా.

అతడిని వారించింది వసుంధర. "చూడండి గోపాలకృష్ణ గారూ, మీరు సారాలు తాగి, బ్రాకెట్లు ఆడి పెళ్ళాన్ని తన్నే రకం కాదు. చదువుకున్నారు. ఉద్యోగం చేసుకుంటున్నారు. అన్నీ తెలిసిన మీరు ఇలా పశువులా ప్రవర్తించడానికి ఏదో బలమైన కారణం వుందని నా అనుమానం. పరిస్థితులు మనిషిని రాక్షసుడిని చేసేస్తాయి. అందుకే మిమ్మల్ని పిలిపించి అడుగుతున్నాను. నన్ను ఒక ఫ్రెండ్‌గా భావించండి. మీ బాధేమిటో చెప్పండి" ఆదరంగా ప్రశ్నించింది.

అంత మండిపడుతున్న వాడల్లా చల్లగా చల్లారిపోయాడు గోపాలకృష్ణ. "ఏం చెప్పమంటారండీ. అంతా నాఖర్మ. నా జీవితమే నాశనం అయిపోయింది". అన్నాడు దీనంగా.

"మాతో చెప్పండి. చాతనైతే సహాయం చేస్తాం." ధైర్యం చెప్పింది వసుంధర. పేలవంగా నవ్వేడు గోపాలకృష్ణ. "నా విషయంలో ఎవరూ ఏమీ చేయలేరు. అయినా ఆదరంగా అడుగుతున్నారు కాబట్టి చెప్తాను." అంటూ మొదలుపెట్టాడు.

అతని తండ్రి అతి సామాన్యుడు. గవర్నమెంటు స్కూల్లో టీచరుగా పనిచేసిన ఆయనకి నలుగురు పిల్లలు. ఇద్దరుకొడుకులు, ఇద్దరు కూతుళ్ళు. కొడుకుల చదువులూ, పెద్ద కూతురిపెళ్ళీ చేసి రిటైరయే నాటికి ఒట్టి చేతుల్తో మిగిలాడు. ఇంకో కూతురి పెళ్ళి కావాలి. పెద్దకొడుక్కి పెళ్ళి చేసి ఆ కట్నంతో చిన్నకూతురి పెళ్ళి చేయాలని ఆశపడ్డాడు. ఆ పెద్దకొడుకు కాస్తా తను ప్రేమించిన పిల్లని రిజిస్టర్ మేరేజ్ చేసుకున్నాడు గుట్టుగా. ఆ సంఘటనతో చెదిరిపోయాడు తండ్రి.

రెండోవాడు కూడా లక్ష్మణస్వామిలా అన్నను అనుకరిస్తాడేమో అని భయపడిపోయి అర్జంట్‌గా గోపాలకృష్ణ పెళ్ళి సెటిల్ చేసేసాడు. నాకొద్దు మొర్రో అని గొడవపెట్టాడు గోపాలకృష్ణ. చదువు పూర్తి చేసి నాలుగు నెలలు కాలేదు. ఉద్యోగం లేదు. నాకప్పుడే పెళ్ళేమిటి దేవుడా అని ఏడ్చినంత పని చేశాడు. "ఉద్యోగం వస్తే నువ్వు మామాట వింటావా? ఎవర్తెనో కట్టుకుంటావు. ఉద్యోగం ఎంతసేపు వస్తుంది. నీకొచ్చే కట్నంతో నీ చెల్లెలి పెళ్ళి చెయ్యాలి. దానికీ వయసు మించిపోతోంది" అని నోరుమూయించి పెళ్ళి చేసేశారు.

అతనికంటె ఘనుడు ఆచంట మల్లయ్య అని అతని మామగారు అతని తండ్రికంటే నాలుగాకులు ఎక్కువ చదువుకున్నాడు. తాళి కట్టేక కట్నం డబ్బు

gudachari.com

సమయానికి సమకూడలేదనీ, త్వరలో ఇస్తాననీ, చావు కబురు చల్లగా చెప్పాడు. చిందులు తొక్కాడు గోపాలకృష్ణ తండ్రి. కట్నం దబ్బిచ్చే మీ అమ్మాయిని కాపురానికి పంపండి అన్నాడు. అలా ఎందుకు త్వరలోనే ఇచ్చేస్తానుగా. ఈలోగా అబ్బాయి వచ్చిపోతూ వుంటాడు అన్నాడు మామగారు. అబ్బాయికి మామగారి ఆలోచన నచ్చింది. అలా వచ్చిపోతూ వుండగానే ఎవరినో తెలిసిన వారిని పట్టుకుని అల్లుడికి ఉద్యోగం వేయించాడు మామగారు. ఇద్దరూ వేరు కాపురం పెట్టారు.

కట్నం తీసుకోకుండా కాలం గడుపుతున్నాడని తండ్రికి కోపం. కట్నం ఇవ్వకపోతే ఏం? ఉద్యోగం వేయించాగా అని మామగారి ఉదాసీనత. ఉద్యోగం ఇచ్చి నిన్నుద్ధరించాడు గానీ నాకు ఒరిగిందేమిటి. కట్నం ఇచ్చేదాకా కాపురం పద్దురా అంటే విన్నావు కాదు. చవట వెధవా. మా వుసురు తగలకపోతుందా నీకు అని తండ్రి శాపనార్థాలు. ఇవ్వక కట్టుకుపోతానా, చచ్చేలోగా ఇచ్చే పోతాడే అని మామగారి విసుగు.

ఈ వ్యవహారాలతో విసిగిపోయాడు గోపాలకృష్ణ. పెద్దవాళ్ళని ఏమీ అనలేక తనకు లోకువ అయిన భార్యమీద తీర్చుకుంటున్నాడు ఆ కోపం అంతా.

అతని గాధ విన్న శ్రోతలంతా జాలిగా చూశారు అతనివంక. పాపం సమాజంలోని ఆచారవ్యవహారాలకు బలైపోయిన సమిధ.

బరువుగా నిట్టూర్చింది వసుంధర. కాసేపు ఆలోచించింది.

"చూడండి. మీ జీవితం ఇలా మారడానికి కారణం మీరు, మీ తండ్రి, మీ మామగారు. కానీ శిక్షను అనుభవిస్తోంది మాత్రం మీ భార్య. ఇదేమైనా న్యాయంగా వుందా చెప్పండి!" నిలదీసింది.

"ఏం చెయ్యమంటారు? మా మామ డబ్బు ఇస్తే గానీ నా చెల్లెలికి పెళ్ళికాదు. ఆయన ఇవ్వడు. మా చెల్లికి వయసు మించిపోతోంది. చదువూ లేదు. ఉద్యోగమూ లేదు. పైగా మా అన్న కులాంతర వివాహం చేసుకున్నాడనే మచ్చ వుండనే వుంది. డబ్బుంటే పెళ్ళి చేసేయచ్చు. తన కూతుర్ని హింసిస్తే బెదిరిపోయి డబ్బిస్తాడేమో మామ అని ఆశ." దీనంగా చెప్పాడు.

"మీరు ఎంచుకున్న పరిష్కారమార్గం చూస్తుంటే నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదు నాకు. చిన్న వయసులో బాధ్యతలు నెత్తిన పడటం వల్ల జరిగిపోయింది ఏదో జరిగిపోయింది. ఇక జరగవలసింది ఆలోచిద్దాం. మీ అందరికీ సమస్య ఒక్కటే. మీ చెల్లెలి వివాహం. ఆ విషయంలో మేము సహాయం చేస్తాం. కాకీ

ఖర్చు లేకుండా పెళ్ళి జరిపించే ప్రయత్నం చేస్తాం. మా దగ్గర ఒక లిస్ట్ వుంది. కట్నం లేకుండా వివాహం చేసుకునేందుకు సిద్ధపడి వున్న వ్యక్తుల వివరాలు వున్నాయి. ఇష్టం అయితే పెళ్ళి జరిపిస్తాం. ఆ వివాహం జరిగిపోతే మీ అందరి సమస్యలూ తీరినట్లేగా. ఇక ఆపైన మీరు మీ భార్యని హింసించడం మానేస్తారా?" సూటిగా ప్రశ్నించింది వసుంధర.

కళ్ళనీళ్ళ పర్యంతరం అయ్యాడు గోపాలకృష్ణ. "మానాన్న, మామ ఇద్దరూ కలిసి నన్ను ఫుట్‌బాల్ తన్నినట్లు తంతుంటే భరించలేక ఆకోపం అంతా దానిమీద తీర్చుకుంటున్నానేగానీ నా భార్యంటే నాకు చాలా ఇష్టం" అన్నాడు గద్గద కంఠంతో.

కట్నం వద్దని చెప్పిన వరుల లిస్ట్ అతని ముందు వుంచారు. నలుగురైదుగురు వున్నారు. వాళ్ళ వివరాలు చదివి పెదవి విరిచాడు గోపాలకృష్ణ. అది గమనించి ముక్కచీవాట్లు వేసింది వసుంధర.

"కలెక్టర్లూ, గవర్నర్లూ, మినిష్టర్లూ కట్నాలు లేకుండా పేద ఆడపిల్లలను వివాహం చేసుకునే రోజులు ఇంకా రాలేదు మనకు. వీళ్ళెనా ఉదారంగా అంగీకరించారని ఆనందపడుతున్నాం. వూరికే అత్యాశలకుపోక ఏదో ఒకటి చూసుకో" అని కసిరింది.

మరోసారి చూసి ఒకటి సెలక్ట్ చేశాడు గోపాలకృష్ణ. అతడి వయసు ఇరవై ఎనిమిది. సెంట్రల్ గవర్నమెంట్‌లో ఉద్యోగం, స్వంత ఇల్లు వుంది. మొదటి భార్య మొదటి డెలివరీలో మరణించింది. పాపకి ఏడాది. తననూ, కూతురినీ మంచిగా చూసుకునే అమ్మాయి అయితే చాలు అన్నాడతను. అన్నింటిలోకి అదే బాగుంది గోపాలకృష్ణకి.

"మీరు ఊరికి వెళ్ళి మీ చెల్లి అభిప్రాయం తెలుసుకుని వచ్చి మాకు చెప్పండి. వాళ్ళిద్దరూ ఒకరినొకరు చూసుకునే ఏర్పాటు చేస్తాం. నచ్చితే పెళ్ళి చేస్తాం". చెప్పింది వసుంధర. అలాగే అని తలూపి లేచాడు గోపాలకృష్ణ. వెళ్తుంటే వెనక్కి పిల్చింది.

"మరో విషయం. ఈ పెళ్ళి మీ చెల్లెలికి ఇష్టం అయితే మీ నాన్నగారు అభ్యంతరపెట్టినా ఆగకండి. పెద్దవాళ్ళకు గౌరవం ఇవ్వాల్సిందే. కాదనను. కానీ అవసరం వచ్చినప్పుడు ధైర్యంగా ఎదిరించడం కూడా అలవాటు చేసుకోవాలి". చెప్పింది. తలూపి వెళ్ళిపోయాడు అతను.

వసుంధర వంక మెచ్చుకోలుగా చూశాడు సింహం. "ఎంత బాగా పరిష్కరించారు! పాపం అతని తప్పేం లేదు. అందరూ చేరి విసిగిస్తుంటే ఏం

suvachan.com

చేస్తాడు? నేను అతడేదో రాక్షసుడనీ, పోలీసులకి అప్పగించాలని అనుకున్నాను అన్నాడు.

"సగానికి సగం కేసులు ఇలాటివే. కూతురి పెళ్లైపోతే చాలని తలకి మించి భారం ఎత్తుకుంటారు. సమయానికి డబ్బు అందక సగం ఇచ్చి సగం ఇవ్వక తంటాలు పడతారు. వాళ్ళేమో కోడలిని కాల్చుకు తింటారు. ఈ పద్ధతి మారాలంటే ఆడపిల్లల తండ్రులు మారాలి. ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతి మానేసి, మేం ఇవ్వగలిగిం ఇంతే. ఇష్టమైతే చేసుకో లేకపోతే పో అని చెప్పే స్థితికి రావాలి". చెప్పింది వసుంధర.

మరికాసేపు ఆ కేస్ గురించి మాట్లాడుకున్నారు. ఇంటి దగ్గర నుండి తెచ్చి లంచ్ బాక్స్‌లోంచి చపాతీలు తీసి అందరికీ వడ్డించాడు బాయ్. తినడం ముగిం కాసేపు రిలాక్స్ అయింది వసుంధర.

"ఊ చెప్పండి. మీ సమస్య గురించి విపులంగా మరోసారి చెప్పండి". అడిగింది

వివరంగా జరిగినది అంతా చెప్పాడు సింహం. ఆ లెటర్ కూడా చూపించాడు. అంతా విని నిట్టూర్చింది వసుంధర. ఎంత అనుభవం సంపాదించినా ఎప్పటికప్పుడు కొత్తరకం కేసు ఎదురవుతూ వుంటుంది.

"ఇది క్లిష్టమైన కేస్. ఏ ఆధారమూ లేదు ఈ ఉత్తరం తప్ప". అంది మెల్లిగా.

"అయితే ఏం చెయ్యలేమంటారా?" నిరాశపడ్డాడు సింహం.

"ఎందుకు చెయ్యలేము? ప్రయత్నం చేస్తాం – ఫలితం సాధిస్తాం. మనసుండాలే కానీ మార్గం లేకపోదు. పరిష్కారం లేని సమస్యంటూ వుండనే వుండదు. సీరియస్‌గా ఆలోచన మొదలు పెడదాం. ఈ ఉత్తరం రాసిన డేటు నుంచి ఇప్పటిదాకా మన ఊళ్ళో ఏ హత్యా జరగలేదు కాబట్టి ఆ ఘోరాన్ని ఆపాలి. అదీ వీలైనంత త్వరగా. అందుకు మనకు కావల్సిన వివరాల్లో ఒకటి ఉత్తరం రాసిన వెంకటి ఎవరు? ఉత్తరంలో వివరించిన లక్ష్మి ఎవరు? అది కనిపెట్టగలిగితే వాళ్ళని పట్టుకుని వారి సమస్య ఏమిటో కనుక్కుని తర్వాత కథ నడపవచ్చు.

మనకున్న ఏకైక ఆధారం ఈ ఉత్తరంలోని దస్తూరి. దీన్ని పట్టుకుని ముందుకు సాగాలి మనం.

మనం చెయ్యాల్సిన మొదటి పని వెంకటి అనే పేరు గల వ్యక్తుల జాబితాను, లక్ష్మి అనే పేరు గల వ్యక్తుల జాబితాను తయారుచెయ్యాలి. మా ఊళ్ళోని వ్యక్తులంతా ఇంచుమించు నాకుతెలుసు. ఉద్యోగరీత్యా వచ్చిపోయే వాళ్ళు ఒకరిద్దరు అటూ ఇటూ అయినా చాలామటుకు గుర్తున్నారు నాకు. చెప్తాను రాసుకోండి" అంటూ అతని చేతికి ఒక తెల్లకాగితం ఇచ్చింది వసుంధర.

శ్రీకారం చుట్టాడు సింహం. "నెంబర్ వన్. వెంకట్రావుగారు." చెప్పింది వసుంధర. చివ్వున తలెత్తాడు సింహం. "ఆయనా! ఆయనలాంటివారు కారు. ఎంతో మంచివారు. పైగా వయసు మళ్ళినవారు. ఆయన ఇలాటిపని చేస్తారా"? లెంపలు వేసుకున్నాడు.

"చూడండి సింహంగారూ! మనం తయారుచేసే లిస్ట్‌లో ఒక్కడు ఒకే ఒక్కడు మాత్రమే దుర్మార్గుడు. మిగిలినవారంతా మంచివారే. మనం కేవలం లిస్ట్ తయారుచేస్తున్నాం అంతే. రాయండి!" విసుక్కుంది వసుంధర. నాలిక కరుచుకున్నాడు సింహం. "సారీ. రాస్తాను, చెప్పండి." అన్నాడు.

బల్లమీద మోచేయి ఆనించి చెంపకు చెయ్యి చేర్చి కళ్ళు మూసుకుని చెప్పుకుంటూ పోయింది వసుంధర. ఆలోచిస్తూ గుర్తు తెచ్చుకుంటూ ఫలాని పేరు రాశారా అని మధ్య మధ్యలో అడుగుతూ మరీ చెప్పంది. ఓ అరగంట పాటు సాగిన కార్యక్రమం ఎట్టకేలకు ముగిసింది. ఓ అరడావు కాయితం రెండు వైపులా నిండిపోయింది.

ఆ లిస్ట్ చూసిన సింహానికి నీరసం వచ్చింది. "ఏడుకొండలవాడా! వెంకటాచలపతీ! ఆపదమొక్కుల వాడా! అనాథ రక్షకా! తండ్రీ" అంటూ దేవుడిని తల్చుకున్నాడు. ఆ లిస్ట్ అంతా మరోసారి పరిశీలించింది వసుంధర.

"గుడ్. నైన్‌టీనైన్ పాయింట్ నైన్ నైన్ పర్సెంట్ పేర్లు లిస్ట్‌లో వచ్చేశాయి." అంటూ ఆనందపడింది.

మరో పేపర్ తీసి అందించింది. "ఇప్పుడు లక్ష్మి అనే పేరుగల వాళ్ళ లిస్ట్ తయారు చేద్దాం. రాసుకోండి." చెప్పింది. మళ్ళీ శ్రీకారం చుట్టాడు సింహం. "నెంబర్ వన్ సినిమాహాలు సీతాపతి గారి తల్లి లక్ష్మాయమ్మ. నెంబర్ టూ రిటైర్డ్ హెడ్ మాష్టారి తల్లి వెంకటలక్ష్మి.

రాయడం ఆపేశాడు సింహం. "వీళ్ళందరూ ముసలివాళ్ళు కదండీ. వీళ్ళ పేర్లు ఎందుకు మనకు?" అడిగాడు.

"ఏం! యవ్వనంలో వున్నవాళ్ళనే హత్య చెయ్యాలని రూలేమైనా వుందా? లిస్ట్‌లో వున్నవాళ్ళందరూ హత్య చేయబడరని, అందులో ఒకరే మనకు కావల్సిన వ్యక్తి అని ముందోసారి మనవి చేసినట్లు గుర్తు. మరోసారి మనవి చేస్తున్నాను. దయచేసి మధ్యలో అడ్డుపడకుండా వుంటారా?" విసుక్కుంది వసుంధర.

మరోసారి నాలిక కొరుక్కుని సారీ చెప్పాడు సింహం.

subachar.com

కళ్ళు మూసుకుని చెప్పుకుంటూ పోయింది వసుంధర. ఈసారి పావుగంటలో పని ముగిసింది. అరతావు పేపరు ఒకవైపు నిండింది. లిస్ట్ మరోసారి చూసి తృప్తి పడింది వసుంధర.

అమ్మయ్య అంటూ కాఫీ తెప్పించింది. కాఫీ తాగాక చర్చ మళ్ళీ ప్రారంభం అయింది.

"జాబితా తయారు చేశాం. తర్వాతి కార్యక్రమం ఏమిటంటారు?" అడిగింది వసుంధర.

"ఈ రెండు జాబితాలనూ అనుసరించి మరో లిస్ట్ తయారు చెయ్యాలి. వెంకట శబ్దం గల పురుషుడు, లక్ష్మి నామధేయం గల స్త్రీ ఒకే కుటుంబానికి చెందిన వారై వుండే కాంబినేషన్ వెతికి వేరుగా రాయాలి" అన్నాడు సింహం.

"సరిగ్గా నాకూ అదే ఐడియా వచ్చించి." ఆనందపడింది వసుంధర.

ముచ్చటగా మూడో లిస్టు తయారు చేయడం మొదలుపెట్టారు ఇద్దరూ. అయితే అదివరకటి జాబితాల్లా ఊరికే పేరు ఒక్కటే రాసుకుంటూ పోడంకాదు.

ముందు వెంకట శబ్దం సుమారుగా వయసు. ఆ తర్వాత లక్ష్మి పేరు వయసు సుమారుగా, చివరగా వారిద్దరి రిలేషనూ. కాబట్టి కాస్త సమయం తీసుకుంటుంది అని ముందే చెప్పింది వసుంధర మళ్ళీ కాయితం అందిస్తూ.

మళ్ళీ శ్రీకారం చుట్టాడు సింహం.

"నెంబర్ వన్, వెంకటరమాపతిగారు వయసు డెబ్భై ఏడు. సీతామహాలక్ష్మి వయసు ఎనభై రెండు. వీరిద్దరూ వదినా మరుదులు." చెప్పింది.

రాయబోతూ తలెత్తి చూశాడు సింహం. అతను యథాప్రకారం అడ్డుకుంటాడేమో అని తలెత్తింది వసుంధర. ఇద్దరికీ నవ్వొచ్చింది. నవ్వుకున్నారు.

"నెంబర్ టూ, పప్పు వెంకటేశ్వర్రావు గారు. వయసు నలభై ఎనిమిది. పప్పు సుబ్బలక్ష్మి. వయసు నలభై. భార్యాభర్తలు.

నెంబర్ త్రీ, వెంకటరమణ వయసు ఇరవైరెండు. ధనలక్ష్మి వయసు యాభై తల్లీ కొడుకులు.

నెంబర్ ఫోర్. నట్‌బోల్ట్ వెంకటేశ్వర్లు వయసు ఇరవై ఎనిమిది. లక్ష్మి వయసు పద్దెనిమిది. భార్యాభర్తలు.

ఇలా సాగిపోయింది లిస్ట్. నిదానంగా గుర్తు తెచ్చుకుంటూ కాస్త అటూ ఇటుగా వయసులు అంచనా వేస్తూ ఇంకెవరూ లేరని నిర్ధారించుకుంటూ పూర్తి చేసేసరికి గంట పట్టింది.

ఇద్దరికీ తలనెప్పి వచ్చినంత పని అయింది. మొహాలు కడుక్కుని రిలాక్స్ అయారు. అంతలోనే పోస్ట్ వచ్చింది. ఉత్తరాలు చూసింది వసుంధర. తమకు చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ వచ్చిన ఉత్తరాలు కొన్ని,తమ వద్ద నిఖార్సైన స్టీల్ ఫర్నిచర్ కన్సెషన్ రేటుకి దొరుకుతుందని ఆఫీసుకే తీసుకొచ్చి అమర్చి పోతామనీ వచ్చింది ఒకటి. ఇలాటివే మరికొన్ని. ముఖ్యమైన లెటర్సు ఏమీ లేవు.

ఫ్రెష్‌గా కాఫీ తెప్పించుకొని తాగేసి మళ్ళీ పని మొదలుపెట్టారు ఇద్దరూ.

"మనం తయారు చేసిన లిస్ట్‌లో అన్నింటిలోకీ అనుమానాస్పదమైన విషయం తేల్చుకోవాలి. మన దగ్గర మొత్తం పదమూడు పేర్లున్నాయి. వాటిని సీరియల్ ఆర్డర్ ప్రకారం అమర్చుకుంటూ రావాలి." అన్నాడు సింహం.

తల పంకించింది వసుంధర. "అదంత తేలికైన పనికాదు. బోలెడంత లాజిక్ వుపయోగించాలి." అంది.

ఇద్దరూ అమిత సీరియస్‌గా చర్చించి, వాదించుకుని ఎలాగైతేనేం నెంబర్లు వేశారు.

చిట్ట చివరి నెంబరు వెంకటరమాపతిరావుగారు, సీతామహాలక్ష్మి. వారితో మొదలుపెట్టి వెనకనించి నెంబర్లు ఇస్తూ లిస్టు తయారు చేశారు. చివరిస్థానం వెంకట దక్షిణామూర్తి, రాజ్యలక్ష్మి వచ్చింది.

అంటే నెంబర్ వన్ వాళ్ళే. తర్వాత వరుస క్రమంలో వున్నారు మిగిలినవారు. అందులో తమ అనుమానానికి తగరు, అనుకున్న వాళ్ళను ఓ పక్కన పెట్టి ఫైనల్ లిస్ట్ తయారు చేశారు.

కుర్చీలో వెనక్కు వాలి కూర్చుంది వసుంధర. "ఆవగింజలో అరభాగం పని అయింది. మన దగ్గర వెంకటి రాసిన ఉత్తరం ఉంది. అది ఎవరు రాశారో కనుక్కోవాలంటే అనుమానాస్పదుల చేతివ్రాతలు కావాలి మనకు." అంది.

"కరెక్ట్. రేపే వెళ్ళి ఆ పని చేసేసుకొస్తాను నేను." చెప్పాడు సింహం.

"జాగ్రత్తగా వుండాలి. ఏమాత్రం అనుమానం వచ్చినా హంతకుడు జాగ్రత్త పడతాడు." హెచ్చరించింది.

"మీరు నిశ్చింతగా వుండండి. ఏమాత్రం అనుమానం రాకుండా పని పూర్తి చేస్తాను." హామీ ఇచ్చాడు సింహం.

gubachari.com

"సరే. అయితే రేపు మీరు ఆ పనిలో బిజీ. నేను ఇక్కడ ఈ గోపాలకృష్ణ చెల్లెలి పెళ్ళి విషయం సెటిల్ చేసేస్తాను. ఇంకో కేసు వుంది. అక్కడికి వెళ్ళి రావాలి. మీరు రేపు సాయంత్రం మా ఇంటికి రండి." చెప్పింది వసుంధర.

సరే నన్నాడతను. మరి కాసేపట్లో పని ముగించేసుకుంది వసుంధర. ఇద్దరూ బయలుదేరి ఊరికి వచ్చేశారు.

"ఎక్కడికి వెళ్ళావయ్యా సింహం! పొద్దునసగా పోయి ఇప్పుడా రావడం! తిండి లేదు, తిప్పలు లేవు! ఎక్కడికి వెళ్ళావ్?" వాకిట్లోనే అడిగేశాడు వెంకట్రావు.

"పనుండి టౌన్‌కి వెళ్ళానండీ" చెప్పాడు సింహం.

"అలా పనిమీద వెళ్ళేటపుడు ఇంట్లో చెప్పి వెళ్ళు నాయనా! అది మధ్యాహ్నం నుండీ కాలుగాలిన పిల్లిలా తిరుగుతోంది." కాస్త నిష్ఠూరంగానే అన్నాడాయన.

లోపలినించి వచ్చేసింది శాంతమ్మ. కాసిని అక్షింతలు వేసింది. టిఫెన్ తిన్నాను, ఇప్పుడొద్దు అన్నా వినకుండా భోజనం చెయ్యమని బలవంతం చేసింది. స్నానం చేసి భోజనం ముందు కూర్చున్నాడు సింహం. అతను వసుంధరతో కలిసి వెళ్ళాడనేసరికి ఆవిడ మొహం అప్రసన్నంగా మారింది.

"ఆ పిల్లతో స్నేహం పెట్టుకోకు నాయనా. ఆ అమ్మాయికి మంచిపేరు లేదు. మగరాయుడిలాగా తిరుగుళ్ళు. బోలెడంతమంది మగస్నేహితులు. అదోరకం మనిషి. ఎందుకైనా మంచిది కాస్త దూరంగానే వుండు." హెచ్చరించింది.

నోటిదాకా వచ్చిన మాటను మింగేశాడు సింహం. ఆవిడ ఆలోచనాపద్ధతి వేరు. ఆవిడకీ వసుంధరకీ జనరేషన్ గాప్. వసుంధర చేసే మహత్తర సేవను ఆవిడ అర్థం చేసుకోవడం అసంభవం. అందుకే మౌనంగా వుండిపోయాడు.

భోజనం చేసి గదిలోకి వెళ్ళేసరికి అక్కడ మాధవ్ కనిపించాడు. దిండులో మొహం దాచుకుని బోర్లా పడుకుని వున్నాడు.

"ఏంట్రా నిద్రపోతున్నావా?" పలకరించాడు. చివాల్న తలెత్తాడు మాధవ్. "నన్ను మాట్లాడించకు. అసలు నాతో మాట్లాడకు. నీకేం హాయిగా పూలరంగడిలా ఊరిమీద పడి బలాదూరు తిరుగుతున్నావు. ఎప్పుడో భోజనం వేళ్టికి వస్తావ్. అయినా నిన్ను పట్టించుకునేవాడు లేడు. నేను ఏం పాపం చేశానో తెలీదు. కాలుకడిపి గడప దాటడం ఆలస్యం రాక్షసుడిలా వెంటపడతాడు సింగయ్య. ఏం చెప్పినా వినిపించుకోడు. పదండి లోపలికి పదండి అంటూ లోపలికి తరుముతాడు. ఎంతసేపని బాలింతరాల్లా ఇంట్లో కూర్చోను. విసుగేస్తోంది. " కళ్ళనీళ్ళ పర్యంతరం అయాడు మాధవ్.

సింహానికి మిత్రుడిని చూస్తే జాలి వేసింది. అవసరార్థం ఇజ్రాయిల్ జబ్బని అబద్ధాలాడి అందరితోనూ చెప్పాడు. వారందరూ తన ఆదేశానుసారం చేతనైన సాయం చేస్తున్నారు. మాధవ్‌కి మాత్రం పాపం ఏమీ తెలియదు. అనవసరంగా అందరిమధ్యా నలిగిపోతున్నాడు. ఏదో మార్గం చూడాలి అనుకున్నాడు.

"అలాగా, మరి ఇంతకాలం నాతో చెప్పలేదేం! పోన్లే ఇప్పటికైనా చెప్పావు. నేను మాట్లాడుతాను వాళ్లతో. అలా నీరస పడిపోకు. హుషారుగా వుండు లే". అంటూ లేపి కూర్చోబెట్టాడు. కాసేపు కబుర్లు చెప్పి నవ్వించాడు. "నేను పొలానికి వెళ్తున్నాను. అక్కడ చల్లగా హాయిగా వుంటుంది. నువ్వూ వస్తావా?" అని అడిగాడు. ఆనందంగా అంగీకరించాడు మాధవ్.

అక్కడినించి శాంతమ్మగారి దగ్గరికి వెళ్ళాడు సింహం.

"మాధవ్ పరిస్థితి కొంచెం మెరుగు పడిందమ్మా. వాడిని కొంచెం ఇంట్లోంచి బయటకు వెళ్ళనివ్వండి. మరీ ఇంట్లోనే కూర్చుంటే విసిగిపోతాడు." అన్నాడు.

ఆవిడ మొహం కళకళలాడింది. "నేనూ అతని విషయం చెప్పాలని అనుకున్నాను. ఇంట్లో వుండి తోచక కొట్టుకుంటున్నాడు. ఎంత సేపూ అమ్మా పని చెప్పండి అంటూ నా వెంట తిరుగుతాడు. ఏం పని చెప్పను? ఇన్నాళ్ళూ ఏదో కష్టం మీద లాక్కొచ్చాను. ఇక మీదట ఏం చెయ్యాలా అనుకుంటూ వుండగా నువ్వే చెప్పేశావు. అతన్ని ఇంట్లోంచి కదలనిచ్చినంత మాత్రాన వచ్చిపడే ప్రమాదం ఏమీలేదు. ఊళ్ళో ఎక్కడ తిరుగుతాడు తిరగనీ అతని ఇష్టం. ఊరు దాటి వెళ్ళకుండా తగిన జాగ్రత్త తీసుకుందాం. కాస్త బస్సు లొచ్చిపోయే సమయంలో ఓ కన్ను వేసి వుంచమని అక్కడ బస్టాండు దగ్గర ఎవరికైనా చెప్తేసరి" అంటూనే సింగయ్యకు ఇన్‌స్ట్రక్షన్స్ ఇవ్వడానికి వెళ్ళిపోయింది ఆవిడ.

మాధవ్ భోజనం అయిన తర్వాత మిత్రులిద్దరూ పొలానికి వెళ్ళారు. అతనికి వసుంధర గురించీ, తాము వేయబోయే పథకం గురించి ఉత్సాహంగా చెప్పేశాడు సింహం. అంతావిని తలబాదుకున్నాడు మాధవ్. "తగ్గ తాళానికి కొయ్యమేళం అని నీకు తోడుబోయిన మేధావి కూడా తోడైందన్నమాట. కానీయ్. నీఖర్మ" అని విసుక్కున్నాడు.

నవ్వేసి వూరుకున్నాడు సింహం.

మర్నాడు పొద్దున్నే పెందలాడే బయలుదేరాడు సింహం. భుజానికి ఓ సంచీ తగిలించుకుని చేతులో ఓ ఫైలు పట్టుకుని బయలుదేరాడు. ఆఫీసులకి వెళ్ళేవాళ్ళ దగ్గరకు ముందుగా వెళ్తే ఇళ్ళల్లో వుండే వాళ్ళ దగ్గరకు తాపీగా వెళ్ళచ్చు.

gudachari.com

ముందుగా నట్‌బోల్ట్ వెంకటేశ్వర్రావుగారింటికి వెళ్ళాడు. తలుపుకొట్టగానే తలుపు తీసింది వసంతలక్ష్మి.

"నేను ఫిల్మ్ ఫిల్మ్ అండ్ ఫిల్మ్ పత్రిక సర్వే కోసం వచ్చానండీ. మీవారు ఐమీన్ వెంకటేశ్వర్రావు గారుంటే పిలుస్తారా?"

"పిలుస్తాను కూర్చోండి." అంటూ అతనికి కుర్చీ చూపించింది వసంత. కూర్చునుదుట పట్టిన చెమట తుడుచుకున్నాడు. వాతావరణం ఉక్కగా వుంది. దానితోడు టెన్షన్. అతన్ని కూర్చోబెట్టి లోపలికి వెళ్ళింది వసంత. క్షణంలో తిరిగొచ్చింది చేతులో లావాటి దుడ్డుకర్ర. అది చూసి అదిరిపడ్డాడు సింహం.

ఇష్టం లేకపోతే, తీరికలేదు తర్వాత రా అని చెప్పొచ్చు. అదీ కాదంటే పొద్దున్నే సర్వే ఏమిటి నీమొహం ఫోఫో అన్నా ఫర్వాలేదు. అంతేకానీ ఇలా లోపలికి రమ్మని మర్యాదచేసి కర్ర తీసుకురావడం!!

అతని భయం పటాపంచలు చేస్తూ కర్ర పుచ్చుకుని స్విచ్ బోర్డ్ దగ్గరికి వెళ్ళి ఓ స్విచ్ నొక్కింది. ఓం అంటూ శంకరాభరణంలో శంకరశాస్త్రి గొంతులాగా ఓంకారం వినిపించసాగింది. ఆ దిక్కుగా చూశాడు సింహం. సీలింగ్‌ఫాన్. కర్ర తీసుకుని తపాతపా నాలుగు తగిలించింది వసంత. దాంతో బద్ధకం వదిలించుకుని తిరగడం మొదలుపెట్టింది. ఝణాఝణా మంటూ శబ్దం ఎక్కువా గాలి తక్కువా. నోరావలించి చూస్తూ వుండిపోయాడు సింహం.

అతని ఎక్స్‌ప్రెషన్ గమనించింది వసంత. ఆవిడకి కోపం దుఃఖం ఏకకాలంలో కలిగాయి. ఇంటికి ఎవరొచ్చినా తన విన్యాసాలు చూసి వెర్రి మొహం వెయ్యడం, చాటుమాటుగా నవ్వుకొనడం ఇదంతా చచ్చే మొహమాటంగా వుంటుంది వసంతకి.

"ఇదంతా నా ఖర్మ. అందరిళ్ళల్లోనూ ఎంచక్కా సుతారంగా స్విచ్ వేస్తే చాలు గిరగిరా తిరిగిపోతాయి ఫాన్లు. చూస్తుంటే కడుపు మండిపోతుంది" సణుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

ఆవిడలా వెళ్ళిందో లేదో ఇలా వచ్చేడు వెంకటేశ్వర్రావు. అతడిని చూడగానే లేచి నిలబడ్డాడు సింహం. "నమస్కారం. ఇలా పొద్దున్నే వచ్చి శ్రమ ఇచ్చినందుకు క్షమించండి." వినయంగా క్షమాపణ చెప్పుకున్నాడు.

"పర్వాలేదు చెప్పండి" అన్నాడు వెంకటేశ్వర్రావు నట్‌బోల్ట్. నిజానికి అతని రాక తనకెంతో ఆనందాన్ని కలిగించింది. ఎందుకంటే ఇంట్లో వాతావరణం ఏ బాగాలేదు. వసంత గత సాయంకాలం నుండి దుమ్ముతూర్పార పడుతోంది. క్రిందటిరోజు ఆఫీసు నించి వస్తూ మిక్సీ ఒకటి కొనుక్కొచ్చాడు. సెకండ్ హాండ్‌దే

అయినా దర్జాగా పనిచేస్తోంది. పైగా అతి చౌకగా దొరుకుతోంది. మూడొందలే. అందుకనే కొని పట్టుకొచ్చి భార్యకి బహుమానంగా ఇచ్చాడు.

నీకు పని చాలా సులువు అవుతుంది. ఇక ప్రతిరోజూ ఇడ్లీలు, దోసెలూ తినొచ్చు అన్నాడు. ముందుగా కాస్త మజ్జిగ చేసి నాకు ఇయ్యి అన్నాడు.

వెంట వెంట వంటింట్లోకి వచ్చి కనెక్షన్ ఇచ్చాడు. ఎలా వాడాలో స్విచ్‌లు నొక్కి చూపించాడు. రెండు గరిటెల పెరుగు జార్‌లో వేసి, ఓ గ్లాసెడు చల్లని నీళ్ళు పోసి చిటికెడు ఉప్పు వేసి మూతపెట్టి స్విచ్ నొక్కింది వసంత. అంతే. మూత లేవిపోయి ఇల్లూ, వళ్ళూ మజ్జిగతో అభిషేకం అయిపోయింది.

మొహం తుడుచుకుని భర్త వంక చూసింది వసంత.

"బావుంది. వాడకం చాతకాక నావైపు మింగేసేలా చూస్తావేం. అయినా మూతపడేసి నీమానాన నువ్వు కూర్చోడానికి ఇదేమైనా అత్తెసరా? దగ్గరుండి చెయ్యి వేసి పట్టుకోవాలి. నే చూపిస్తాను చూడు" అంటూ మరో రెండు గరిటల పెరుగు పోసి, గ్లాసు నీళ్ళు పోసి మూతపెట్టి దానిమీద ఓ చెయ్యి పెట్టి స్విచ్ ఆన్ చేశాడు. అతని చేతిని తొలగించి ఎగిరిపోవాలని ప్రయత్నించింది మూత. దాని స్థానంలో వుంచాలని రెండో చెయ్యి కూడా సాయం తీసుకుని గట్టిగా పట్టి వుంచాడు వెంకటేశ్వర్రావు.

చాలావరకూ నయమే. పొలాల్లో నీళ్ళు జల్లే వాటర్ స్ప్రింకర్‌లాగా మజ్జిగ జల్లుకుంటూ పోయింది. బట్టలు మాత్రమే తడిశాయి. వసంతలాగా మొహంనిండా పోసుకోలేదు. పైగా జార్‌లో మిగిలిన మజ్జిగ అరగుక్కెడు గొంతులో పోసుకుని ఆనందపడ్డాడు.

మజ్జిగ, మంచినీళ్ళు కూడా మిక్సీలో వేస్తే ఇంతే మరి. ద్రవపదార్థాలు కదా. దోసెలపిండీ గట్రా బ్రహ్మాండంగా రుబ్బేస్తుంది అని ధైర్యం చెప్పి వెళ్ళిపోయాడు.

వంటిల్లంతా శుభ్రం చేసుకునేసరికి రెండు గంటలు పట్టింది వసంతకి. ఆ దబ్బాలూ గిన్నెలూ తోమడానికి ఒక గ్లాసెడు సోప్ పొడి ఖర్చు అయింది. రాత్రంతా సాధిస్తూనే వుంది. తెల్లవారినా ఆ జోరు తగ్గలేదు.

అలాటి ఆపత్సమయంలో సింహంరాక ఎంతో రిలీఫ్‌గా అనిపించింది.

"నేను ఫిల్మ్ ఫిల్మ్ అండ్ ఫిల్మ్ పత్రిక నుండి వచ్చాను!" చెప్పాడు సింహం సంచీలోంచి కాగితాలూ వగైరా సరంజామా బయటికి తీసి.

"ఫిల్మ్ ఫిల్మ్ అండ్ ఫిల్మ్ పత్రికా? ఆ పేరెక్కడా వినలేదే!"

siliconindia.com

"ఎలా వింటారు? ఆ పత్రిక ఇంకా రిలీజ్ కాలేదుగా! కొత్త పత్రిక. భారీ ఎత్తున ప్రారంభిస్తున్నాం. అద్భుతంగా అద్వితీయంగా తీసుకురావాలని గట్టి కృషి చేస్తున్నాం." అని చెప్పి, సినిమా పత్రికల పట్ల అతగాడి అభిప్రాయం ఏమిటి మొదలైన ప్రశ్నలు ఓ నాలుగు అడిగాడు. ఓపిగ్గా సమాధానం చెప్పాడు వెంకటేశ్వర్రావు.

చివరిగా మీకే తార అంటే ఇష్టమో చెప్పాలి. చెప్పడం కాదు. ఆవిడమీద మీ అభిప్రాయం రాసి ఇవ్వాలి. ఆ వాక్యం అందంగా వుండాలి. ఇలా వివిధ వ్యక్తుల వద్ద నుండి సేకరించిన అభిప్రాయాలలో అత్యద్భుతంగా వున్న వాక్యం ఎంచుకుని వారి వారి అభిమాన తారని కలుసుకుని మాట్లాడే ఏర్పాటు చేస్తాం. కాబట్టి మంచి వాక్యరూపంలో రాయండి అంటూ కాయితం అతనికి ఇచ్చాడు.

అరమోడ్పు కన్నులతో అయిదు నిముషాలపాటు ఆలోచించాడు వెంకటేశ్వర్రావు.

"నా అభిమాన తార శ్రీదేవి. కళకళలాడే కన్నుల్తో కమనీయమైన రూపంతో యావద్దేశప్రజలనీ సమ్మోహితులను చేస్తున్న అందాల తార శ్రీదేవి." అని పొందికగా రాశాడు.

వంగి చూస్తున్న సింహం ఉపిరి తీసుకున్నాడు. అతని చేతుల్లోంచి కాయితాలు లాగేసుకుని "మరి నేను వెళ్ళొస్తా" అన్నాడు. "అప్పుడేనా! ఇంకాసేపాగండి. ఎలాగూ నేను ఆఫీసుకి వెళ్ళాలి ఇద్దరం కలిసే వెళ్దాం." తెల్లారగానే వచ్చి తనను ఆదుకున్నాడు మరికాసేపాగి తనను కరుణించకపోతాడా అనే ఆశతో అడిగాడు.

కానీ అలా వీల్లేదన్నాడు సింహం. పనుంది నాకు అంటూ లేచి మరో ఇంటికి బయలుదేరాడు. ఒకరితర్వాత మరొకరు. మధ్యాహ్నం పన్నెండున్నర అయేసరికి దాదాపు సగం మందికి పైగా అయిపోయారు.

యువకుల విషయంలో త్వరగా ముసిగిన ఇంటర్వ్యూలు వృద్ధుల దగ్గరకు వచ్చేసరికి నత్తనడక నడిచాయ్.

ఒకాయనికి కాంచనమాల అంటే ఇష్టం. కాంచనమాల జీవించిలేదు కదని మరొకరి గురించి రాయండి అని చెప్తే అంగీకరించలేదు ఆయన. జీవించి వున్నా లేకున్నా ఆవిడే నా అభిమానతార అంటూ అదే రాసిచ్చాడు.

మరో తాతగారికి సూర్యకాంతం అంటే ఇష్టంట. ఒక వాక్యం చాలు మహా ప్రభో అంటున్నా వినిపించుకోకుండా వణుక్కుంటూ అరఠావు రాసి ఇచ్చాడు. మొత్తానికి పొద్దుటి సర్వే వ్యర్థం అయింది. కావలసిన వ్యక్తి దొరకలేదు.

మధ్యాహ్నం భోజనం చేసి కాసేపు విశ్రాంతి తీసుకుని మళ్ళీ బయలుదేరాడు. అలా వెళ్తూ వెళ్తూ పోలీస్ స్టేషన్ దగ్గరికి వచ్చేసరికి ఏకదంతంగారు జ్ఞాపకం వచ్చారు. ఆవేళ వెళ్ళాక మళ్ళీ వెళ్ళలేదు. ఎలాగూ ఇక్కడిదాకా వచ్చాను కాబట్టి ఓసారి చూసేసి హలో అనేసి వెళ్ళిపోతే సరిపోతుంది అనుకుని పోలీస్‌స్టేషన్‌లోకి నడిచాడు.

లోపల అందరూ కునికిపాట్లు పడుతున్నారు. ఏకదంతం దగ్గరికే డైరెక్ట్‌గా వెళ్ళాడు సింహం. ఇతడిని చూడగానే ఎలర్ట్ అయిపోయాడు. ఏమిటని కళ్ళెగరేశాడు ఏకదంతం.

"పనేమీలేదు. ఇలా వెళ్తూ మిమ్మల్నో సారి చూసిపోదామని వచ్చాను." అన్నాడు సింహం మర్యాద పుట్టిపడేలా.

ఏకదంతానికి కోపం వచ్చింది. "ఏమిటితడి గొడవ. చీటికీ మాటికీ వచ్చి నన్ను చూసిపోడానికి నేనేమైనా హాస్పిటల్లో వున్నానా?" అనుకున్నాడు. పైకి మాత్రం "క్రిందటిసారి వచ్చినప్పుడు మీరేదో నా సహాయం కావాలన్నారు. ఏమైంది ఆవిషయం?" ప్రశ్నించాడు.

సింహంకి చాలా సంతోషం వేసింది. గలగలా మాట్లాడకపోతే నేం ఈమాత్రం సామరస్యం వుంటే చాలు. "మంచి ప్లాన్ వేసి పని మొదలుపెట్టేశాను. త్వరలోనే నేను అనుకున్నది నెరవేరుతుందనే ఆశగా వుంది. సమయం రాగానే మీ సహాయం అర్థిస్తాను." ఆనందంగా చెప్పాడు.

ఏకదంతం మొహం నల్లబడింది. ఇంకా ఎక్కువసేపు కూర్చుంటే బాగుండదని లేచాడు సింహం. వెళ్ళొస్తానని చెప్పాడు. వాకిలిదాకా వెళ్ళాక గుర్తొచ్చింది. వెనక్కి తిరిగి "మీ అమ్మాయిగారు ఎలా వున్నారు?" అడిగాడు. అదిరిపడ్డాడు ఏకదంతం.

క్రిందటిరోజునుండీ శ్యామలకి జ్వరం. ఆయన సమాధానం కోసం ఎదురు చూడకుండానే "ఆవిడని అడిగానని చెప్పండి" అనేసి తలవంచుకుని తన దారిన తను చక్కాపోయాడు.

ఉన్నపాటున లేచి ఇంటికి వెళ్ళాడు ఏకదంతం. పీతాంబరాన్ని పిలిపించి గుసగుసలాడాడు. "వాడు వచ్చాడు. పని మొదలుపెట్టాడుట. ప్లాను కూడా పరిష్టంగా వేశాడుట. నాతో బాహాటంగా శ్యామల గురించి అడిగాడు. అంతేకాదు అడిగానని కూడా చెప్పమన్నాడు." అన్నాడు.

"మరైతే ఇంకా ఆలస్యం ఎందుకు అరెస్ట్ చేసేయ్". అన్నాడు పీతాంబరం.

gutabhai.com

బుర్ర గోక్కున్నాడు ఏకదంతం. "ఎలా అరెస్ట్ చెయ్యనురా? మీ అమ్మాయి ఎలా వుంది. అడిగానని చెప్పండి అనడం నేరం కాదు కదా! అన్నాడు దీనంగా.

"వాడి వ్యవహారం నాకేం అంతు పట్టడంలేదు మామయ్యా. అతను ప్రైవేటు డిటెక్టివ్ అంటారు కొంతమంది. సుబ్బారావు పొలాల్లో దొంగలని పట్టాడని ఊరంతా ఒకటే గోల. నిన్న పొద్దున్న మేడింటి గోపాలరావు తాతగారి మనవరాలు వసుంధరతో స్కూటర్‌మీద పోతుంటే చూశాను. ఇవ్వాళ పొద్దున పప్పు వెంకటేశ్వర్రావు గారింట్లో కనిపించాడు. ఇతడు ఇక్కడికెందుకొచ్చాడండీ అని అడిగితే ఏదో సినిమా పత్రిక సర్వే కోసం వచ్చాడుట అన్నాడాయన. రకరకాల అవతారాలు ఎత్తుతున్నాడు. నాకంతా అయోమయంగా వుంది." అన్నాడు పీతాంబరం.

"ఇదంతా నాటకం. కానీలే. ఏదో ఒకనాడు తప్పు చెయ్యకపోతాడా? పట్టుకుని అరదండాలు తగిలించి కటకటాల వెనుక ఫ్లారేయకపోతానా! బీరాలు పలికాడు ఏకదంతం. "నిజమేలే. పాపం పండేవరకూ వేచి వుండాల్సిందే కదూ! అతడిని సమర్థించాడు పీతాంబరం.

సింహం మధ్యాహ్నం సర్వే కూడా పూర్తిచేశాడు. ఆఖరు వ్యక్తిని కలుసుకుని ఉసూరుమన్నాడు. అక్కడినించీ తిన్నగా వసుంధర దగ్గరికి వెళ్ళాడు. అతనికోసమే ఆత్రుతతో వెయిట్ చేస్తోంది వసుంధర.

గేటు దగ్గరకే పరిగెట్టు కొచ్చేసింది. "ఏమైంది?"

"ఏముంది ఆపరేషన్ సక్సెస్ పేషెంట్ డైడ్." అన్నాడు సింహం. "అదేం?" ఆశ్చర్యపోయింది వసుంధర.

టూకీగా చెప్పేశాడు సింహం. మేడమీదికి తీసుకువెళ్ళిందతన్ని. అక్కడ కూర్చోబెట్టి కాఫీ ఇచ్చింది. మరోసారి జరిగిందంతా వివరంగా చెప్పాడు సింహం.

తను సేకరించిన చేతివ్రాతలన్నీ వసుంధరకి అందించాడు.

వసుంధర కూడా శ్రద్ధగా చూసింది. ఉత్తరంలో వున్న చేతివ్రాతకు దగ్గరలో కూడా లేవు ఏవీ.

కాసేపు ఇద్దరూ కలిసి సీరియస్‌గా ఆలోచించారు. ఇలాటి ఉత్తరాలు వేరే ఎవ్వరి చేతా రాయించరు. కాకపోతే చేతివ్రాత మార్చి రాయవచ్చు. లేదా పట్టుబడే ప్రమాదం లేకుండా ఎడం చేత్తో రాసే అవకాశం కూడా వుంది. అలా రాసి వుంటే ఇలాటి సర్వేల ద్వారా కనిపెట్టడం అసంభవం. వేలిముద్రలు సేకరించడంలాంటి కష్టమైన పనులు చెయ్యడం తమకు అసాధ్యం. కాబట్టి ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలి?

ఆలోచించగా సింహానికి ఒక ఐడియా తట్టింది. ఈ కాంబినేషన్ ఇళ్ళకి ఈసారి ఆడవాళ్ళతో అంటే లక్ష్మి పేరు గలవారితో చర్చ జరిపి వారి సంసారం ఎలా సాగుతుంది? ఏమైనా కలతలూ ఘర్షణలూ జరుగుతున్నాయా? మొదలైన వివరాలు సేకరిస్తే సరిపోతుంది.

ఆ ఉపాయం వసుంధరకి కూడా నచ్చింది. ఆడవాళ్ళతో మాట్లాడాలి కాబట్టి వసుంధరనే వెళ్ళమన్నాడు.

"నేనంటే ఈ ఊర్లో ఎవరికీ సదభిప్రాయంలేదు. మాగరాయుడిలా తిరుగుతాననీ, ఎవరిమాటా లక్ష్యం చెయ్యననీ అందరికీ నాపట్ల చిన్నచూపు. కాబట్టి మీరే వెళ్ళండి." అంది.

"వెళ్ళడానికి నాకేం అభ్యంతరం లేదు. కానీ ఇవాళే సినిమా పత్రిక పేరు పెట్టుకుని అందరిళ్ళకి వెళ్ళొచ్చాను. మళ్ళీ రేపే మరో వంకన అందరిళ్ళకీ వెళ్తే వాళ్ళకి అనుమానం వస్తుందేమో అని సంకోచిస్తున్నాను" అన్నాడు.

ఆలోచిస్తే అది నిజమే అనిపించింది వసుంధరకి. "సరే అయితే నేనే వెళ్తాను. కానీ నాకో ముఖ్యమైన పని వుంది. పరమజిడ్డు కేసు ఒకటి వచ్చింది. అది ఎలా పరిష్కారం అవుతుందో ఎప్పుడు అవుతుందో తెలియడంలేదు. అదిపూర్తిచేసి వెళ్ళాలి." అంది.

"ఏమిటా సమస్య?" అడిగాడు సింహం.

కట్నం సమస్యే. లక్ష్మీనారాయణ అనే పెద్దమనిషి కొడుకు శ్రీధరరావు. అతనికి ఏడాది క్రింద పెళ్ళి అయింది. పెళ్ళికి ఘనంగా కట్నం ఆ తర్వాత ఫర్నిచర్ స్కూటర్, అన్నీ ఇవ్వాలని ఒప్పందం కుదిరింది. అయితే హఠాత్తుగా ఒక దుస్సంఘటన జరిగిపోయింది. పెళ్ళిలో పెళ్ళికూతురి తండ్రికి హార్ట్‌ఎటాక్ వచ్చింది. ఆపరేషన్ జరిగింది. వారంరోజుల్లో పోయాడు. అందువల్ల ఇవ్వాలనుకుంది ఇవ్వలేకపోయింది తల్లి.

ఇస్తేగానీ పిల్లని తీసుకువెళ్ళం అని పట్టుబట్టాడు పెళ్ళికొడుకు తండ్రి. ఆ అమ్మాయి ఫ్రెండ్స్ "స్నేహ" కి తెలియజేశారు.

స్నేహ సభ్యులు ఆయనని ఒప్పించడానికి సర్వప్రయత్నాలూ చేశారు. కానీ ఆయన జగమొండి. తాబట్టిన కుందేలుకి మూడేకాళ్ళు అంటూ కూర్చున్నారు. ఆ కొడుకేమో తండ్రి చాటున ప్రగల్భాలు పలుకుతాడు. ఆయన ఎదుట మాత్రం బెల్లం కొట్టిన రాయిలా మాట్లాడడు. ఏం చెయ్యాలో తోచడంలేదు వీళ్ళకి.

pudacheri.com

కాసేపు ఆలోచించాడు సింహం. అతనికి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. వెంటనే వసుంధరతో చెప్పాడు. ఎగిరిగంతేసినంత పనిచేసింది వసుంధర. అయితే రేపే ఈ పని చేసేద్దాం అంటూ సరదా పడిపోయింది.

మర్నాడు పొద్దున్నే చీకటితోనే బయలుదేరారు ఇద్దరూ! టౌన్‌కి వెళ్ళగానే సింహాన్ని స్నేహ ఆఫీసులో కూర్చోబెట్టి అతనికి కావలసిన సరంజామా కొంత ఇచ్చి వెళ్ళిపోయింది వసుంధర. ఆ వెళ్ళడం వెళ్ళడం పదిగంటలకి వచ్చింది. వెంట పదిహేనుమంది గుంపు. అంతా కుర్రగుంపే. నలుగురు అమ్మాయిలు కూడా వున్నారు. అందరూ కూర్చుని తాము వెంట తెచ్చిన పాత డబ్బాల చుట్టూ తెల్లకాగితాలు అంటించి దానిమీద "దయతో ధర్మం చెయ్యండి" అని రాశారు. బానర్లు తయారు చేశారు. అట్టమీద కూడా రాసేశారు. చకచక పనంతా ముగించేసుకున్నారు. పదకొండు కొట్టేసరికి పొలోమంటూ బయలుదేరారు.

తిన్నగా లక్ష్మీనారాయణ ఆఫీసుకు వెళ్ళారు. లక్ష్మీనారాయణ ఆ ఆఫీసుకి హెడ్. మిగిలినవాళ్ళందర్నీ బయట కాస్త దూరంలో ఆగమని చెప్పి సింహాన్ని తోడు తీసుకుని లోపలికి వెళ్ళింది వసుంధర.

లక్ష్మీనారాయణ సీట్లోనే వున్నాడు. వసుంధరని చూడగానే ధాంధూం అంటూ లేచాడు. "మళ్ళీ వచ్చావా? ఇక నాజోలికి రావద్దని చెప్పలేదూ! మళ్ళీ ఏదో చెప్పి నన్ను బెదిరించాలని వచ్చావేమో! ఎత్తులేం సాగవు. నీలాటి వాళ్ళను సమాలక్షమందిని చూశాను. మీకు పనిపాటా లేదు. మమ్మల్ని కూడా సుఖంగా బ్రతకనివ్వరు. నాకు తలమునిగే పనులున్నాయి. వెళ్ళండి." అని కసిరాడు.

వసుంధర ఏదో అనబోతుంటే వారించాడు సింహం. "క్షమించండి. మీరు మమ్మల్ని అపార్థం చేసుకున్నారు. మీ పని చెడగొట్టి విసిగించాలని రాలేదు. మీకు రావలసిన డబ్బు అందించి వెళ్దామని వచ్చాం." శాంతంగా చెప్పాడు. ఆయన మొహంలో కోపం ఎగిరిపోయింది. కళకళలాడింది. "అలాగా! మరైతే చెప్పరేం ఏదీ డబ్బు" అన్నాడు ఆనందంతో కుర్చీలోంచి లేచిపోయి.

"డబ్బుకేం మీరు కోరినంత. అంతా ఏర్పాటు చేసేశాం. అయితే ప్రస్తుతం మాదగ్గరలేదు." చెప్పింది వసుంధర.

మళ్ళీ మండిపడిపోయాడు లక్ష్మీనారాయణ. "మళ్ళీ వాయిదానా? ఏడిసినట్లే వుంది. సరే కానీండి ఏం చేస్తాం. మా ఖర్మ. ఆ ఏర్పాటేవిటో చెప్పండి. అదెంతకాలం పడుతుందో?" విసుక్కున్నాడు.

"ఏర్పాట్లైతే ఏ లోపం లేకుండానే చేశామండీ. ఎంతకాలం పడుతుంది అనే విషయం మాత్రం మేము ఏమీ చెప్పలేం. అది మీ పరపతి మీద ఆధారపడి వుంది. మీపట్ల చుట్టుపక్కల అందరికీ మైత్రిభావం వుందనుకోండి సాయంత్రానికల్లా డబ్బు సమకూరుతుంది. లేదంటే కాస్త ఆలస్యం అవుతుంది." చెప్పింది వసుంధర.

"ఏవిటమ్మా ఈ గొడవ. మీరు ఇచ్చే డబ్బుకి, నాపరపతికీ ఏవిటి సంబంధం?" అర్థంకాలేదు ఆయనకి.

"ఇలా చెప్తే అర్థం కాదు వసుంధరగారూ. వారిని తీసికెళ్ళి చూపిస్తే స్వయంగా చూసి అర్థం చేసుకుంటారు." అన్నాడు. ఇద్దరూ కలిసి అతి మర్యాదగా ఆయనని బయటకి తీసుకొచ్చారు. తిన్నగా ఆ గుంపు దగ్గరికి తీసికెళ్ళారు.

"ఇదుగోనండీ మేము చేసిన ఏర్పాటు." అన్నాడు. మరింత అయోమయంగా అనిపించింది ఆయనకి. డబ్బిస్తానని ఈ జనాన్ని చూపిస్తావేమిటయ్యా! ఏం తమాషాగా వుందా!" కోపం వచ్చిందాయనకి.

"అమ్మమ్మ ఎంతమాట. మిమ్మల్ని హేళన చేస్తామా? ఈ జనం అంతా మీ పని మీదే వచ్చారు". వాళ్ళవైపు తిరిగి "మన ఏర్పాట్లు చూపించండర్రా!" అంది వసుంధర. అప్పటిదాకా ఏమీ ఎరగని వాళ్ళలా నిల్చున్న అందరూ సర్కస్ కంపెనీ వాళ్ళలా చకచక పని మొదలుపెట్టేశారు.

"లక్ష్మీనారాయణగారికి ధర్మం చెయ్యండి!" అని తాటికాయంత అక్షరాలతో రాసి వున్న బ్యానర్ తీసి పట్టుకున్నారు ఇద్దరు. "కట్నం కోసం కటకటలాడిపోతున్న కన్న తండ్రిని కనికరించండి!" "లక్ష్మీనారాయణగారి కొడుకు కాపురం నిలబెట్టడానికి విరివిగా విరాళాలు ఇవ్వండి." ఇలాటి స్లోగన్స్ రాసి వున్న అట్టముక్కలు పట్టుకున్నారు మరికొంతమంది. "ధర్మం చెయ్యండి. పుణ్యం వస్తుంది." అని రాసివున్న డబ్బాలు అందుకున్నారు కొందరు. పక్కనే వుంచిన సైకిల్‌కి వెనక పెట్టి వున్న హార్మణీ తీసి మెడకి తగిలించుకున్నాడో కుర్రాడు. ముందు హేండిల్‌కి తగిలించిన డోలు తీసి మెళ్ళో వేసుకున్నాడు మరో కుర్రాడు.

అదంతా చూసి తత్తరపోయాడు లక్ష్మీనారాయణ. "ఏవిటయ్యా ఏవిటిదంతా"

"ఏమీ కాదండీ మీకేమో డబ్బుకావాలి. అది అందితే గాని కోడలిని కాపురానికి తీసుకురారు. ఆవిడేమో నేనివ్వలేను మొర్రో అంటుంది. పెళ్లైనాడపిల్ల భర్త ఇంటికి రావటం మనసంప్రదాయం. ఏం చేస్తాం! అందుకనే ఈ ఏర్పాటు చేశాం." అన్నాడు సింహం.

gurahari.com

"మండినట్లే ఉంది మీఏర్పాటు. నా ఆఫీసు ముందరికొచ్చి నన్నిలా గొడవ పెడతారా!" ఆక్రోశించాడు లక్ష్మీనారాయణ.

"భలే వారే. మీ ఆఫీసు ముందర అయితే మీ ఫ్రెండ్స్, పరిచయస్తులు ఉంటారు కాబట్టి నాలుగు డబ్బులు రాల్తాయి. ఎక్కడికోపోయి అడుక్కుంటే ఎవరేస్తారు చెప్పండి. మరీ అత్యవసరమైతే అదీ తప్పదనుకోండి. ఇక్కడ నాల్రోజులు చూస్తాం. మనకు కావలసిన రొక్కం సమకూడితే సరే. లేకపోతే అలా నాలుగు వీధులూ తిరుగుతాం" "ఠీవిగా సమాధానం చెప్పాడు సింహం.

"ఇలా అడుక్కోడానికి మీకు సిగ్గెయడం లేదూ!" ఆగ్రహంతో ప్రశ్నించాడాయన.

"ఇందులో సిగ్గు పడేందుకు ఏముంది? అర్థాంతరంగా భర్తపోయి బాధపడుతున్న మీ కోడలి తల్లి దగ్గర అడుక్కునేందుకు మీరు సిగ్గుపడుతున్నారా? మరి అలాటిది అందరి దగ్గరా తలకాస్తే అడుక్కుంటే సిగ్గెందుకు?" సూటిగా ప్రశ్నించాడు సింహం.

"చివరికిలా సాధిస్తారా నన్ను? ఇలా అల్లరి చేసి నా పరువు బజార్న పెడతారా? రేపటినుండి నలుగురిలో తల ఎత్తుకుని తిరగ్గలనా నేను?" దుఃఖం ముంచుకొచ్చేస్తోంది ఆయనకి.

"సర్లేండి. ఎద్దు వుండు కాకికి ముద్దా అన్నట్లు మీ పరువుపోతే మాకేం? ఆ మాటకొస్తే, పెళ్ళి చేసి కూతుర్ని నీ ఇంట్లోనే పెట్టుకున్నావేం? కాపరానికి పంపవా అంటూ కాకుల్లా పొడుచుకు తింటున్నారు ఆవిడని. ఆవిడ బాధ గురించి మీరేమైనా ఆలోచించారా?" నిలదీసి అడిగింది వసుంధర.

"వేలికేస్తే కాలికేస్తావు. కాలికేస్తే వేలికేస్తావు. అసలేమిటమ్మా నువ్వు చెప్పేది నన్నేం చెయ్యమంటావ్?" అడిగేశాడు ఆయన.

"నేను చెప్పేది ఏమీలేదు. వున్న పరిస్థితి వివరిస్తున్నాను. మా సహాయం అర్థించింది ఆవిడ. చాలా బాధల్లో వుంది. మీరు కోరినవి ఏవీ ఆవిడ ఇవ్వలేదు. కూతురి కాపురం సుఖంగా సాగాలని ఆవిడ కోరిక. మీరు ఉదారంగా ఆ అమ్మాయిని సగౌరవంగా మీ ఇంటికి తెచ్చుకోండి. లేదు నాకు డబ్బు కావాలి. నేను అడిగినవి ఇచ్చి తీరాలి అని మీరు పట్టుబడితే ఇంతకంటే మరో మార్గం లేదు. ఇక మీ ఇష్టం." నిర్ణయం ఆయనకే వదిలేసింది.

లక్ష్మీనారాయణ పరిస్థితి వర్ణనాతీతం. ఫ్రీగా రావాల్సిన డబ్బు, వస్తువులు వదులుకోడానికి మనసొప్పటం లేదు. కానీ వేరు మార్గం లేదు. ఈ మొండి ఘటాలు

అన్నింటికీ తెగించి వున్నాయి. ఈ గొడవ జరిగితే జనం అంతా తనని జూలో జంతువుని చూసినట్లు చూస్తారు. ప్రజల సానుభూతి వాళ్ళకే దక్కుతుంది.

ఆయనలా ఆలోచిస్తూ వుండగానే "ఏమిటి సార్ మరి. మమ్మల్ని పని మొదలుపెట్టెయ్యమంటారా?" అడిగాడు సింహం.

హార్మన్, డోలూ శృతి చేసుకోడం మొదలు పెట్టారు ఆ కుర్రాళ్ళు. మిగిలిన వాళ్ళంతా కూడా పరుగు పందెంలో పాల్గొనే వాళ్ళలా రెడీగా స్టెడీగా తయారైపోయారు. అతను 'వూ' అనడమే ఆలస్యం.

వాళ్ళని చూసి ఆయన గుండె ఠారుమంది. "ఇక చాలు ఆపండి మీ అఘాయిత్యం. దేనికైనా మంచీ, మర్యాదా వుండాలి. కుర్రగుంపు అంతా ఏకమై నామీదికి దండెత్తారు. పెద్దవాడిని నన్ను ఏడిపిస్తున్నారు. కానీండి. ఏం చేస్తాను రోజులు మీవి. మీతో నాకెందుకొచ్చిన గొడవ. మంచిరోజు చూసి ఆ అమ్మాయిని కాపురానికి తీసుకొస్తాం!" అన్నాడు రుసరుసలాడుతూనే.

"అంత శ్రమ మీకు అనవసరం. ఈవేళ దశమి. దివ్యంగా వుంది. ఆ అమ్మాయిని మేము తీసుకొచ్చి భద్రంగా మీ ఇంట్లో దించి వెళ్తాం." అంది వసుంధర.

ఆయనకు అంగీకరించక తప్పలేదు. అప్పటికప్పుడే ఆ అమ్మాయి వాళ్ళింటికి వెళ్ళి అరగంటలో పెట్టే బేడా సర్దించి ఆటోలో తీసుకువెళ్ళి అత్తవారింటిలో దించారు. "మీ కోడలిని జాగ్రత్తగా చూసుకోవాలి. మేము వారం వారం వచ్చి చూసి వెళ్తూ వుంటాం. ఏదైనా కంప్లయింట్ వస్తే మళ్ళీ ముష్టైతే కార్యక్రమం మొదలు పెడతాం" అని ఆయనకి ఖచ్చితంగా చెప్పేశారు. కోపం తెచ్చుకునే శక్తి కూడా లేదు ఆయనకి. తలాడించి వూరుకున్నాడు.

వాళ్ళింట్లోంచి బయటికొచ్చి అందరూ షేక్‌హాండ్స్ ఇచ్చుకున్నారు. హమ్మయ్య ఒక మొండికేసు బెడద తీరిపోయింది అనుకున్నారు. ఐడియా ఇచ్చిన సింహాన్ని అభినందించారు. అందరూ ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు. సింహం, వసుంధర స్నేహ ఆఫీసుకి వచ్చారు.

సగంలో వదిలేసిన వ్యవహారం గురించి తీవ్రంగా ఆలోచించారు. అనుకున్న ప్రకారం మర్నాడే సర్వేకి బయలుదేరతానని చెప్పింది వసుంధర. సరేనన్నాడు సింహం. ఇద్దరూ స్కూటర్ మీద ఇంటికొచ్చేశారు.

* * *

చీకటి పడింది. ఆలయం వెనక వున్న చెరువు గట్టున కూర్చుని వున్నాడు మాధవ్. సింహంతో ఆ మొర పెట్టుకుని అతను అంగీకరించాక ఊళ్ళోకి

gudashari.com

బయలుదేరాడు మాధవ్. అలా బయలుదేరినపుడు అతని మనసులో ఒక ఆలోచన వుంది. అతనికా ఊరు, వాతావరణం బాగా నచ్చాయి. అదివరకులా పారిపోవాలని పించడంలేదు. ఇక్కడే ఏదైనా పని దొరికితే ఏదైనా చిన్న ఇల్లు చూసుకుని వుండిపోదాం అనిపిస్తోంది. పట్నంలో కంటే పల్లెటూర్లో అన్నీ చౌక. జీవితం బాగానే ఉంటుంది.

ఇంట్లోంచి బయలుదేరాక ముందుగా బస్టాండు దగ్గరకి వెళ్ళాడు. అక్కడ దుకాణం, హోటళ్ళు, సినిమాహాలు అన్నీ వున్నాయి. ఎవరినైనా పనికోసం అడగచ్చు. ఇతడిని చూడగానే అందరూ ఎలర్ట్ అయిపోయారు. ఎందుకంటే మరో పావుగంటలో టౌన్‌వైపు వెళ్ళే బస్ వస్తుంది. అతడిని హోటల్లో కూర్చోబెట్టి చుట్టూ నలుగురైదుగురు చేరిపోయి అందరూ ఒకేసారి మాట్లాడ్డం మొదలుపెట్టారు. ఎవరేం మాట్లాడుతున్నారో అర్థంకాక అవస్థపడిపోయాడు మాధవ్.

అంతలోనే బస్ వచ్చింది. "బస్ వచ్చింది" అన్నాడు మాధవ్. ఏం మాట్లాడాలో తోచక. "వస్తే వచ్చిందిలే వెధవ బస్....ఛీ... అది మంచిది కాదు. నువ్వది చూడకు. ఇదుగో ఇటు చూడు. ఈ కాఫీ తాగు." అంటూ అందరూ దడి కట్టేశారు. ఊదర పెట్టేశారు. బస్ వెళ్ళగానే హమ్మయ్య అనుకుంటూ ఎవరిదోవన వాళ్ళు చక్కాపోయారు.

అయోమయంగా వుండిపోయాడు మాధవ్. తల విదుల్చుకుని నలుగురైదుగురి దగ్గరికి వెళ్ళి ఏదైనా పని ఇప్పించమని అడిగాడు. "ఓ దానికేం భాగ్యం అలాగే చుద్దాం. అయినా పనికేం తొందర. ముందు బాగా విశ్రాంతి తీసుకో నువ్వు" అన్నారు.

తనకి విశ్రాంతి ఎందుకో అర్థంకాక బుర్ర గోక్కున్నాడు మాధవ్. బస్టాండు దగ్గర్నించి లైబ్రరీకి వెళ్ళాడు. అక్కడ పుస్తకాలు బీరువా నిండా వున్నాయి. నవలలకి మొదలుంటే చివరలేదు. చివరుంటే మొదలులేదు. మొదలూ చివర వున్న పుస్తకం వెతికి పట్టుకుని నాలుగు పేజీలు చదివేసరికి ఆవులింతలు వచ్చేశాయి. విసుగేసి అక్కడినించి వచ్చేశాడు. ఊరంతా తిరుగుతూ ఆలయం దగ్గరికి వచ్చాడు.

ఆలయం, ఆలయం వెనుక చెరువు. పగటిపూట పదకొండు గంటలు అయింది. జనం ఎవరూ లేరు. పూజారి పూజ ముగించి వాకిలి దగ్గర కూర్చుని భగవంతుడి స్తోత్రాలు చదువుతున్నాడు. ఆ వాతావరణం ఎంతో నచ్చింది మాధవ్‌కి. మహా నైవేద్యం పెట్టి ప్రసాదం పంచి గుడి తలుపులు మూసేదాకా అక్కడే కూర్చున్నాడు.

సాయంత్రం కాస్త చల్లబడగానే అక్కడికి వెళ్ళాడు. ఉదయంలా ఖాళీగా లేదు. జనం చాలామంది వున్నారు. ఆడవాళ్ళు, పిల్లలు, ఎక్కువ సంఖ్యలో వున్నారు. చెరువు దగ్గర బాగా సందడిగా వుంది.

లక్ష్మి అన్న కొడుకు బుజ్జిగాడిని వెంటబెట్టుకుని గుడికి వచ్చింది. చెరువు దగ్గర కాళ్ళు కడుక్కుని వెళ్ళి పూజ చేయించి ప్రదక్షిణాలు చెయ్యాలి. చెరువు దగ్గర నీళ్ళలో ఆడుతున్న పిల్లలని చూసి సరదా పడిపోయిన బుజ్జిగాడు అక్కడినించి కదలనని మొరాయించాడు. సరేలే ఓ పదినిముషాలు ఆగి వెళ్దాం అనుకుని గట్టునే కూర్చుంది లక్ష్మి. పక్కనే తిరుగుతూ ఆడుకుంటున్నాడు బుజ్జిగాడు.

కొంతమంది పిల్లలు గట్టుమీదనుంచి నీళ్ళలోకి దూకుతున్నారు. "బుజ్జీ ఆ అబ్బాయిలు ఎలా దూకార్రా?" యధాలాపంగా అడిగింది లక్ష్మి.

దానికి సమాధానంగా, "ఇదిగో ఇలా దూకారు!" అంటూ ధనామని నీళ్ళలోకి దూకేశాడు. కెవ్వున కేకవేసింది లక్ష్మి. నోటమాట రాలేదు.

"బుజ్జి బుజ్జి!" అంటూ చేష్టలుడిగి నిలబడిపోయింది. ఇదంతా చూసిన జనం గోలపెట్టేస్తూ దగ్గరకు వచ్చారు. ఎలా పడిపోయాడని ప్రశ్నలు. అంత నిర్లక్ష్యంగా ఎలా వదిలేశావని మందలింపులు. పిల్లలని జాగ్రత్తగా చూసుకోవాలనే సలహాలు. ఏడుపులు. అంతా గందరగోళంగా తయారైంది.

ఈ గొడవకు పరిగెట్టుకొచ్చిన మాధవ్ క్షణం ఆలస్యం చెయ్యకుండా నీళ్ళలో దూకేశాడు. అదృష్టవశాత్తూ ఒడ్డుకి కాస్త దూరంలో చేతికందాడు పిల్లాడు. జుట్టు పట్టి లేవనెత్తి ఒడ్డుకి లాక్కు వచ్చాడు. గభాల్న పిల్లాడిని అందుకుని నీళ్ళు కక్కించాడు పూజారి. మాధవ్‌ని కూర్చోబెట్టి తల తుడిచేరు కొంతమంది.

అప్పటికి తేరుకుంది లక్ష్మి. ఏడుపొచ్చేసింది. ఏడుస్తూ బుజ్జిగాడి దగ్గరికి చేరింది. పిల్లాడు చెరువులో పడిపోయాడనే వార్త కార్చిచ్చులా పాకిపోయింది.

చేలిలో పని వదిలిపెట్టి పరిగెట్టుకొచ్చారు సావిత్రి, సుబ్బారావు.

లక్ష్మిని శాపనార్థాలు పెట్టేస్తూ కొడుకుని కావలించుకుని ఏడ్చింది సావిత్రి, సుబ్బారావు మాధవ్‌కి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. కాసేపటికి పిల్లాడు తేరుకున్నాడు. వాడిని భుజాన వేసుకుని వెళ్ళిపోయింది తల్లి. బిక్కచచ్చిపోయిన లక్ష్మిని తీసుకుని వెళ్ళాడు సుబ్బారావు.

కూతుర్ని ఇంట్లో దించి వెంకట్రావుగారింటికి వెళ్ళాడు సుబ్బారావు. రెండొందల రూపాయలు మాధవ్ చేతుల్లో పెట్టాడు. 'నీ ఋణం ఏమిచ్చినా తీరదు. ఏదో

subachari.com

పెద్దనాడిని నా సంతోషం కొద్దీ ఇస్తున్నాను తీసుకో' అంటూ బలవంతపెట్టి మరీ ఇచ్చాడు.

ఆ డబ్బు తీసుకుని అప్పటికప్పుడే బజారుకి వెళ్ళి ఒక నేత చీరె కొనుక్కొచ్చాడు. శాంతమ్మకి ఇచ్చాడు. "మీరు కట్టుకునే చీరెల ముందు ఇది ఎందుకూ పనికిరాదమ్మా. ఏదో అభిమానంతో తెచ్చాను. మీరు కట్టుకుంటే సంతోషిస్తాను." అన్నాడు. ఆమె ఆనందం వర్ణనాతీతం. అప్పటికప్పుడే వెళ్ళి ఆ చీరె కట్టుకొచ్చింది. మాధవ్‌ని ఆశీర్వదించింది. అతనికి చాలా సంతోషం వేసింది.

మర్నాడు పొద్దున్నే గుడికి వెళ్ళాడు. లక్ష్మి కూడా వచ్చింది. ఇతడిని చూసి పులకరించింది. "నిన్న షాక్‌లో వుండిపోయి మీతో మాట్లాడనేలేదు. మీ వల్ల ఎంత పెద్ద ఆపద తప్పింది! మీకెలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియడం లేదు" అంది.

మొహమాటపడిపోయాడు మాధవ్. "అబ్బే. నేనేం చేశానండీ. ఏదో చాకపై సాయం అంతేగా. మీరంతా అనవసరంగా నన్ను ఆకాశానికి ఎత్తేస్తున్నారు" అన్నాడు. పూజ చేయించాక ప్రసాదం ఇచ్చింది.

ప్రదక్షిణలు చెయ్యడం మొదలుపెట్టింది.

ఆ పని కాస్త కష్టంగా వుంది లక్ష్మికి. అదేదో మంత్రం చెప్పి అది చదువుతూ ప్రదక్షిణలు చెయ్యాలని చెప్పాడు తండ్రి. భక్తి శ్రద్ధలతో చేస్తే గానీ ఫలితం వుండదు అని కూడా చెప్పాడు. మంత్రం చదువుతుంటే లెక్క కుదరడం లేదు. లెక్కపెట్టుకోవాలంటే మంత్రం సాగడంలేదు. తనప్రాబ్లం తండ్రితో చెప్తే ఆయన వుపాయం చెప్పాడు. శనగలు నూట ఎనిమిది లెక్కపెట్టి తీసుకువెళ్ళి ఒక్కో ప్రదక్షిణం కాగానే ఒకటి చొప్పున పారేయమన్నాడు. అలా చేసి చూసింది. అప్పుడు కూడా దృష్టంతా శనగల మీదే వుంది.

ఇలా కాదని ఆ సాయంత్రం బుజ్జిగాడిని తీసుకువెళ్ళి తనో రౌండ్ తిరగ్గానే ఒక్కో గింజ తీసి పక్కన పెట్టమంది. వాడు సగం గింజలు తినేసి లెక్కంతా గడబిడ చేశాడు. మర్నాడు చింతగింజలు తెచ్చి ఇచ్చింది. కాసేపు లెక్కపెట్టి విసుగేసి పారిపోయాడు. ఎలాగో తంటాలు పడి వాడికి బోలెడు ఆశలు చూపించి ఎలాగో ఎడ్జస్ట్ అవుతున్న తరుణంలో ఆ ప్రమాదం జరిగిపోయింది. వదినగారు తన వెంట కొడుకుని చచ్చినా పంపనంది. మార్గం కోసం వెతుకుతున్న లక్ష్మికి మాధవ్‌ని చూడగానే చక్కటి ఆలోచన వచ్చింది.

అతనెలాగూ గంటల తరబడి గుడిలోనే కూర్చుంటాడు. అడిగితే ఆమాత్రం సాయం చేయకపోడు అనుకుంటూనే వెళ్ళి అడిగింది. అలాగే అన్నాడు మాధవ్. కాస్త దూరంలో కూర్చుని లెక్కపెట్టడం మొదలుపెట్టాడు.

ఆ తర్వాత ఇద్దరికీ అదో దినచర్యగా మారింది. వాళ్ళిద్దర్లో ఎవరు ముందు వచ్చినా రెండోవారికోసం వెయిట్ చేస్తారు. ప్రదక్షిణలు పూర్తికాగానే పూజ చేయించి ఆ ప్రసాదం అతనికి కాస్త పెట్టి వెళ్ళిపోతుంది లక్ష్మి. తనకు ఇష్టం వచ్చినంతసేపు కూర్చుని వెళ్ళిపోతాడు మాధవ్. అలా అని ఇద్దరి మధ్యా స్నేహం ఏమీలేదు. ఒకటి రెండు మాటలు మాట్లాడుకుంటారు. అంతే, ఆ తర్వాత ఎవరిదోవ వారిది.

మాధవ్‌కి కూడా బాగానే వుంది. తెల్లవారి స్నానం పానం చేసేసుకుని శాంతమ్మ గారికి ఏదైనా సహాయం కావాలంటే చేసిపెట్టి గుళ్ళోకి వెళ్తాడు. మధ్యాహ్నందాకా అక్కడే కూర్చుంటాడు. ఇంటికొచ్చి అన్నంతిని ఏమైనా పన్లుంటే చేసేసి, కాసేపు వెంకట్రావుతో బాతాఖానీ వేసి, కాఫీ తాగి ఇంట్లోంచి బయలుదేరతాడు. కాసేపు అక్కడా ఇక్కడా తిరిగి చీకటిపడే వేళ్టికి గుడిదగ్గరికి జేరతాడు. రాత్రి గుడి మూసేశాక ఇంటికి వస్తాడు. భోజనం చేసి మూడ్ వుంటే సింహంతో పొలానికి వెళ్ళి పడుకుంటాడు. లేదంటే ఇంట్లోనే పడుకుంటాడు. రోజులు బాగానే గడిచిపోతున్నాయి.

* * *

మామూలుగా ఆరింటికే లేచింది వసుంధర. ఆవేళ టౌన్‌కి వెళ్ళే పనిలేదు. కాసేపు ఇల్లంతా సర్దింది. తాతగారితో బోలెడు కబుర్లు చెప్పింది. పదింటికి ఇంట్లోంచి బయలుదేరింది.

మొదటి మజిలీ గుండు వెంకటేశ్వర్రావుగారి ఇల్లు. తలుపు తట్టిన పదినిముషాలకి తలుపుతీసింది ఆదిలక్ష్మి. ముక్కుమొహం ఎర్రబడిపోయి వుంది. కళ్ళు వాచిపోయాయి. ఆరోజు పొద్దున్నే లేచి ఎవరి మొహం చూసిందోగానీ నానా గొడవా అయిపోయింది. ఆరోజు గుండు వెంకటేశ్వర్రావుకి ఆఫీసులో ఇనస్పెక్షను. త్వరగా వెళ్ళాలి ఆఫీసుకి. ఆదరాబాదరా పేపరు తిరగేసి గడ్డం సామాన్లు తీసుకుని చూస్తే కత్తెర కనిపించలేదు.

"లక్ష్మీ నా షేవింగ్‌సెట్‌లోంచి కత్తెర తీశావా?" అని కేకపెట్టాడు.

"ఇంటివాళ్ళు తీసికెళ్ళారు". ఇడ్లీ పచ్చడి రుబ్బుతూ సమాధానం చెప్పింది లక్ష్మి.

sudhachari.com

"తీసికెళ్ళిన వాళ్ళు తిరిగి ఇవ్వచ్చుగా! ఎన్నాళ్ళైంది తీసుకెళ్ళి? బుద్ధి లేకపో సరి. ఇంటిమీద ఇల్లు కడతారు. నాలుగు రూపాయలు పెట్టి కత్తెర కొనుక్కోలేర వెధవకాపీనం వాళ్ళూనూ." అని విసుక్కున్నాడు.

"పోనీ పాత కత్తెర ఎక్కడుందో తీసుకురా!" అంటూ మళ్ళీ కేకేశాడు.

"అది కూడా వాళ్ళ దగ్గరే వుంది. వాళ్ళ మనవడికి క్రాఫ్ట్ క్లాస్ వుంది కాగితాలు కత్తిరించుకోవాలని అడిగి పట్టుకెళ్ళారు." పచ్చడి రుబ్బుతూనే సమాధా చెప్పింది.

చిర్రెత్తుకొచ్చింది గుండు వెంకటేశ్వర్రావుకి. చరచర వంటింట్లోకి వెళ్ళా "బుద్ధి లేకపోతే సరి. ఒక్క వస్తువు కూడా సమయానికి కొంపలో వుండదు. పో పోయి తీసుకురా! అని కసిరాడు.

"ఇప్పుడా! అంటూ మొహమాటపడిపోయింది ఆదిలక్ష్మి."

"ఇప్పుడే వెళ్ళు. వెళ్ళి తీసుకురా. నేను త్వరగా వెళ్ళాలి ఆఫీసుకి ఆజ్ఞాపించాడు.

లేచి చెయ్యి కడుక్కుని వెళ్ళింది ఆదిలక్ష్మి. ఆ వెళ్ళడం అరగంట తర్వా తిరిగి వచ్చింది. కాలుగాలిన పిల్లిలాగా తిరుగుతున్నాడు వెంకటేశ్వర్రావు. "ఏమి ఇంత ఆలస్యం? అవతల నాకు టైమైపోతోంది." విసుక్కున్నాడు.

"వాళ్ళు వెతికారు. దొరకలేదుట. అప్పటిదాకా ఇది పట్టుకెళ్ళి గడుపుకోమన్నారు." అంటూ తను తెచ్చిన టైలరింగ్ కత్తెర చూపించింది.

వెంకటేశ్వర్రావుకి పిచ్చికోపం వచ్చేసింది. "బుద్ధిలేని మనుషులు. మన కత్తె పట్టుకెళ్ళి ఎక్కడో పారేసి మీసాలు కత్తిరించుకోడానికి బట్టల కత్తెర ఇచ్చి గడుపుకోమంటారా? అసలైనా నిన్ను అనాలి. ఇవ్వద్దే ఇవ్వద్దే అని బ్రతిమాల్తు వింటావా? వెధవ మొహమాటం నువ్వూనూ! పో పోయి ఇంకెవరింట్లోనైనా ఫెన్సిల్ కత్తిరించే కత్తెర వుందేమో తీసుకురా. నీ పీక కత్తిరిస్తాను. పీడా వదిలిపోతుంది అని నానా తిట్లూ తిట్టి, అలా అడ్డదిడ్డంగా పెరిగిన మీసాలతోనే ఆఫీసు వెళ్ళిపోయాడు.

అప్పటినుంచి ఏడుస్తూనే వుంది ఆదిలక్ష్మి. తలుపుతీసి ఎదురుగా వసుంధర చూసి ఏం కావాలి అన్నట్లు కళ్లెగరేసింది. తను ఒక ఇంగ్లీషు పత్రిక పని మీద వచ్చినట్లు చెప్పింది వసుంధర. చొరవగా ఇంట్లోకి జొరబడిపోయింది కూర్చోమనకుండానే కూర్చుంది. విధా ఖర్మమా అంటూ ఎదురుగా కూర్చుం ఆదిలక్ష్మి.

"నేను ఒక స్త్రీల పత్రికలో వ్యాసం రాయాలనుకుంటున్నాను. కొంచెం ఇన్ఫర్మేషన్ సేకరించాలని వచ్చాను. నేటి సమాజంలో స్త్రీ జీవితం ఎలా వుంది? అనే విషయంపై రీసెర్చిలాటిదన్నమాట. మీవంటి హౌస్‌వైఫ్‌లతో మాట్లాడి కావలసిన సమాచారం సేకరిస్తున్నాను. మీరు చెప్పే విషయాలన్నీ రహస్యంగా వుంచబడతాయి. మీ జీవితం గురించి చెప్పండి. మీ భర్త మిమ్మల్ని గౌరవిస్తున్నారా? లేక ఏ విషయంలోనైనా అసంతృప్తిగా వున్నారా? మిమ్మల్ని నిందించడంగానీ, బాధపెట్టడంగానీ చేస్తారా? మీ ఇద్దరిమధ్యా అభిప్రాయబేధాలు వున్నాయా?"

వసుంధర మాట నోట్లో వుండగా భోరున ఏడిచేసింది ఆదిలక్ష్మి.

"ఏం చెప్పమంటావు తల్లీ నాదో పెద్ద గాధ. నేనేం చేసినా తప్పుగానే కనబడుతుంది ఆయనకి. ఇరుగూ పొరుగుతో సామరస్యంగా వుండటం తప్పా? అదో పెద్ద అపరాధమా? ఆయనంటే పొద్దునే పోయి రాత్రికొస్తారు. పగలంతా ఇంట్లో వుండేదాన్ని నేను. అందరితో మంచిగా వుండకపోతే ఎలా? వాళ్ళకి ఏదో చేసేశాననీ తనను నిర్లక్ష్యం చేస్తున్నానని మండిపడుతుంటారు. ఇవాల్టికివాళ ఇంటివాళ్ళకి కత్తెర అరువిచ్చానని కోపం వచ్చి పీక కత్తిరించేస్తానని బెదిరించారు." ఆవిడ ఏడుస్తూ చాలాసేపు చెప్పినా దాని సారాంశం మాత్రం క్లుప్తంగా అది.

ఆవిడ కామాలు ఫుల్‌స్టాప్‌లు లేకుండా చెప్పుకుపోతూ వుంటే చకచక నోట్‌చేసుకుంది వసుంధర. మొత్తానికి వాళ్ళ సంసారం అంత సామరస్యంగా సాగటంలేదు అనేది స్పష్టంగా తెలిసిపోతుంది. అలా అని ఈవిడ భర్తకి ఈవిడని హత్యచేసేటంతటి బలమైన కారణాలు కూడా కనిపించడంలేదు. అదే రాసేసుకుని వస్తానని చెప్పి లేచింది వసుంధర.

"నా పేరు బయటికి రాకుండా చూడు తల్లీ. వస్తే మళ్ళీ అదో రామాయణం అయిపోతుంది." అంది లక్ష్మి ముక్కు ఎగబీలుస్తూ.

అక్కడి నుండి బయలుదేరి పప్పు సుబ్బలక్ష్మి గారింటికి వెళ్ళింది. ముందర వసుంధరని చూసి మొహం చిట్లించుకున్నా తర్వాత బాగానే మాట్లాడింది. వసుంధర అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఏకధాటిన అరగంట మాట్లాడింది. "ఏవిటోనమ్మా ఓ ఆదివారం లేదు. ఓ శలవుదినం లేదు. ఎప్పుడూ ఒకటే చాకిరీ. నాకన్నా ష్టీదరు గారింటి వంట మనిషి నయం. ఏడాదికి రెండు కొత్త చీరెలు. రెండు పూట్లా టిఫెను, భోజనం, అడిగినప్పుడల్లా శలవులు". అంటూ చెప్పుకుపోయింది.

అందరితోనూ మాట్లాడి అందరి అభిప్రాయాలు సేకరించిన వసుంధర చివరగా రాజ్యలక్ష్మి ఇంటికి వెళ్ళింది. తల పగిలిపోతోంది. వెళ్ళగానే మొహమాటం వదిలేసి

gulachani.com

కొంచెం కాఫీ ఇవ్వమని అడగాలి అనుకుంటూ తలుపు తట్టింది. ఎంతకీ సమాధానం లేదు. గట్టిగా తట్టేసరికి తలుపు తెరుచుకుంది. మెల్లిగా లోపలికి వెళ్ళింది వసుంధర. చాపమీద పడుకుని వుంది రాజ్యలక్ష్మి. తలమీద చెయ్యి వేసి చూస్తే జ్వరం మండిపోతోంది.

పిలవగా పిలవగా నీరసంగా పలికింది. పేషెంట్‌కి మందో మాకో చూద్దామని ఇల్లంతా కలియచూసిన వసుంధరకి మతిపోయినంత పని అయింది. ఇంట్లో ఏమీలేవు. అప్పటికప్పుడు బజారు వెళ్ళి పళ్ళు, హార్లిక్స్, టాబ్లెట్లు కొనుక్కొచ్చింది. రాజ్యలక్ష్మిని బలవంతాన లేపి మందు మింగించి హార్లిక్స్ తాగించింది. అరగంట తర్వాత కొంచెం తగ్గుమొహం పట్టింది. కళ్ళు తెరచి నీరసంగానే మాట్లాడింది. పళ్ళరసం తాగించింది వసుంధర. క్లుప్తంగా వివరాలు అడిగింది. నాలుగు ముక్కల్లో పరిస్థితి వివరించింది రాజ్యలక్ష్మి.

ఆ అమ్మాయి పరిస్థితి చూసి జాలిపడాలో లేక మొహంవాచేలా చివాట్లు వేయాలో తెలియక తికమకపడింది వసుంధర. ఇంటికి వెళ్ళి పదిరోజులకు సరిపడా బియ్యం, పప్పు, ఉప్పు వాళ్ళింటికి పంపించింది. అలసట తీరేలా స్నానం చేసి టిఫిన్ ముందు పెట్టుకుని కూర్చునేసరికి సింహం వచ్చాడు. అతనికీ టిఫిన్ పెట్టింది. ఇద్దరూ చర్చ మొదలుపెట్టారు.

లక్ష్మి పేరు గల అందరి జీవితాల్లోనూ సమస్యలున్నాయి. ఒక రకంగా చూస్తే అందరూ భర్తలతో బాధలు పడుతున్నారు. అయితే ఎవరికీ కూడా హత్యలు చేసేటంత అవసరం గానీ, ఆలోచన గానీ వున్నట్లు అనిపించడం లేదు. అందరిలోకీ దుర్భరంగా వుంది రాజ్యలక్ష్మి జీవితం. ఆవిడ భర్త మరీ కుర్రాడు. హత్యచేసే వయసు లేదు. అందులోనూ అంత పరిష్టంగా ప్లాను వేసి మరీ హత్య చేసే ధైర్యసాహసాలు వున్నట్లు అనిపించటం లేదు.

మిగిలిన వారిలో అంటే తల్లీ కొడుకు, వదినా మరుదులు, ఇలాటి కేసుల్లో కూడా అనుమానాస్పదమైనవి ఏమీలేవు. ఒక్క వెంకటేశ్వర్లు చెల్లెలు లక్ష్మి దగ్గరకు మాత్రం వసుంధర వెళ్ళలేదు. ఎందుకంటే ఆ రెండిళ్ళకీ బద్ధ వైరం. పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది.

వసుంధర చెప్పినదంతా విని నీరుగారిపోయాడు సింహం. "అయితే ఇక మనం చేసేది ఏమీ లేదంటారు!" అన్నాడు.

"ప్రస్తుతానికి అంతే మరి. ఎందుకంటే కేసులో ఏమాత్రం బలంలేదు. ఎవ్వరినీ అనుమానించడానికి వీల్లేకుండా వుంది. ఆ వెంకటి ఏదో ఆవేశంలో వుండి ఆ

ఉత్తరం రాసి వుంటాడు. ఆ తర్వాత తనంతట తానే మనసు మార్చుకున్నాడో లేక ఎవరైన నచ్చ చెప్తే మారిపోయి తన ఆలోచన కట్టిపెట్టాడో. ఇలాటిదే ఏదో జరిగి వుంటుంది. నామటుకు నాకు అలాగే అనిపిస్తోంది. ఇక ఈ కేస్ గురించి మర్చిపోవడం మంచిది. వూరికినే టైమ్ వేస్ట్ చేసుకోడం ఎందుకు? లెటజ్ క్లోజ్ దిస్ కేస్..." అంది.

"అంతేసంటారా"? దిగాలు పడిపోయాడు సింహం.

"మీరలా నిరుత్సాహపడకండి. సహాయం చేసే ఉద్దేశ్యం మీకుండాలే గానీ నిస్సహాయులు కోకొల్లలు. ఆమాటకొస్తే ఈ లక్ష్మి మాత్రం మీకు బంధువా? స్నేహితురాలా? ఏదో కష్టంలో వుంది కాబట్టి ఆదుకోవాలనుకున్నారు అంతేకదా. అటువంటి లక్ష్ములు సవాలక్షమంది ఉన్నారు. అంతదాకా ఎందుకు? ఇక్కడే వుంది రాజ్యలక్ష్మి. పాపం చాలా కష్టాల్లో వుంది. చిన్నతనం. ఏమీ తెలియదు. ఆ అమ్మాయిని ఆదుకోవాలి. ఏదైనా బ్రతుకుతెరువు కల్పించాలి. ఈ జ్వరం తగ్గి ఆరోగ్యం కుదుటపడితే కుట్టు క్లాసులకి పంపించాలని ఆలోచిస్తున్నాను. మా ఫండ్స్‌లో వీలు చూసుకుని ఒక కుట్టు మిషన్ కొనిస్తే సరిపోతుంది. రేపు పొద్దున్నే వెళ్దాం. ఆ గోపాలకృష్ణ చెల్లెలు వస్తుంది రేపు. సవ్యంగా జరిగితే పెళ్ళి చెయ్యాలి. దానికి కొంత ఖర్చు అవుతుంది స్నేహకి. డబ్బు తరిగిపోతోంది. మళ్ళీ ఫండ్స్ రైజ్ చెయ్యాలి. మనకు రెగ్యులర్‌గా విరాళాలు ఇచ్చేవాళ్ళు కొంతమంది వున్నారు. వాళ్ళని కలుసుకోవాలి. పొద్దున పనైపోతే లంచ్ తర్వాత అక్కడికి వెళ్ళాలి. రేపొస్తారుగా మీరు. రేపేకాదు రోజూ వెళ్దాం. మీ అండదండలు మాకెంతో అవసరం." అంటూ అతనికి ధైర్యం చెప్పింది వసుంధర.

నిట్టూర్చి లేచాడు సింహం. "సర్లేండి. రేప్పొద్దున్న వస్తాను" అనేసి రోడ్డుమీదకి వచ్చాడు. అతని మనసంతా చిరాగ్గా వుంది. ఎందుకో వూరికే కోపం వచ్చేస్తోంది. ఎవరిమీదో తెలియదు. ఎందుకో అసలే తెలియదు. అలా నడుచుకుంటూ వెళ్ళి కాఫీ హోటల్లో కూర్చున్నాడు. ఇతడిని చూడగానే లేచి వచ్చి ఎదురుగా కూర్చున్నాడు అయ్యర్. "చూశారా సార్! ఢిల్లీ మార్కెట్లో బాంబు పెట్టారుట. అది పేలి పదిమంది అక్కడికక్కడే చనిపోయారుట. ఇంకా చాలామందికి గాయాలు అయ్యాయిట. చనిపోయిన వారిలో ఆడవాళ్ళూ పిల్లల్లూ కూడా వున్నారుట. ఇందాక వార్తల్లో చెప్పారు. ఎంత ఘోరం కదూ బాబుగారూ! అదివరకు ఎవరిమీదైనా పగ వుంటే వాళ్లను చంపేవాళ్ళు. ఇలా అమాయకులని చంపడం కొత్తగా మొదలైంది." అన్నాడు హోటల్ అయ్యరు.

durgachan.com

అసలే చిరాగ్గా వున్న సింహానికి ఆవేశం ముంచుకొచ్చేసింది. "ఏమయ్ రాక్షసులు. మానవత్వం నశించిపోయింది. అందుకే ఇలా చాటుమాటు వ్యవహారాలు చేస్తున్నారు. ధైర్యం ఉంటే ఎదురుగా వచ్చి చూపించమనండి వాళ్ళ ప్రతాపం. పిరికిపందల్లాగా ఎక్కడోదాక్కుని ఇలాటి పన్లు చెయ్యడం గొప్పగా వుంది వాళ్ళ బ్రతుకులకి. కానీండి. ఎన్నాళ్ళు సాగుతాయి ఇలాటి దొంగచాటు వ్యవహారాలు. ఎక్కడెక్కడో కలుగులో ఎలకల్లా దాక్కున్నవాళ్ళను అందర్నీ బయటికి లాగడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది గవర్నమెంట్. అతి త్వరలోనే హత్యలు, దొంగతనాలు చేసి దాక్కుంటున్న అందర్నీ లాక్కొచ్చి నలుగుర్లోనూ నిలబెడతారు. ఇక అప్పుడు వాళ్ళ పాట్లు భగవంతుడికే ఎరుక. జనం పిచ్చి కుక్కల్ని కొట్టినట్లు కొట్టి చంపుతారు. ఇంకెన్నాళ్ళో లేదు. త్వరలోనే వస్తుంది ఆ సుదినం." అంటూ మొదలుపెట్టి అమిత ఆవేశంగా అరగంట సేపు అనర్గళంగా మాట్లాడి అతి త్వరలోనే దుష్టశిక్షణ శిష్టరక్షణ జరిగేరోజు వస్తుందని ఇక ఆ తరువాత అంతా రామరాజ్యమేననీ తేల్చి చెప్పాడు.

అతడు మొదలుపెట్టింది ఒక శ్రోతతోనే. ముగించే సమయానికి మాత్రం చుట్టూరా జనం. వాళ్ళందర్నీ చూసేసరికి ఆవేశం తగ్గిపోయి మొహమాటం వేసింది సింహానికి. చల్లారి నీళ్ళలా అయిపోయిన కాఫీ గటగటా తాగేసి ముప్పావలా కౌంటర్లో టేబిల్ మీద పడేసి వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు. జనం మాత్రం అతడు మాట్లాడిన విషయం గురించి చర్చిస్తూ వుండిపోయారు.

ఒక్కడు మాత్రం అక్కడినించి చల్లగా జారుకున్నాడు. సింగడు తిన్నగా మస్తాన్ దగ్గరికి వెళ్ళాడు. "ఏవిట్రా అలా వున్నావ్? ఏమిటి హడావిడి?" తాపీగా అడిగాడు మస్తాన్. అంతకుముందు తను విన్నదీ చూసినదీ అంతా తు.చ. తప్పకుండా వివరించాడు సింగడు.

అంతావిని కడుప్పట్టుకుని నవ్వేశాడు మస్తాన్. "ఓరీ నీ కంగారు మండిపోనూ. ఇంతా చేస్తే ఇదా నీ హడావిడిక్కారణం." అన్నాడు ఎగతాళిగా.

"ఇదంత వేళాకోళంగా తీసేయాల్సిందేం కాదు. ఇప్పుడే సింహం, అతడిలా వచ్చినాయనా ఇద్దరూ కూడా మంచి గట్టివాళ్ళలా కనిపిస్తున్నారు. మొన్నీ మధ్య ఈ సింహం దొంగలని పట్టాడా? ఆ తరువాత ఆ ఇంకో ఆయన పిల్లాడు చెరువులో మునిగి పోతుంటే భయం బెదురూ లేకుండా దూకి రక్షించాడు. ఇదంతా చూస్తుంటే బాగా ఆరితేరిన వాళ్ళలా అనిపించడం లేదూ! ఎందుకైనా మంచిది. మీ జాగ్రత్తలో మీరుండటం మంచిది" తనంత సీరియస్‌గా చెప్పిన విషయం అతడంత తేలిగా తీసిపారేయడం నచ్చలేదు సింగడికి.

నవ్వడం ఆపేశాడు మస్తాన్. కాసేపు సీరియస్‌గా ఆలోచించాడు.

"ఏమిటి? ఏమన్నావ్?" మరోసారి అడిగాడు.

"నేరాలు చేసి దాక్కున్నవాళ్ళని బయటికి లాగడానికి ఏర్పాట్లు చేస్తోంది గవర్నమెంటు అన్నాడు" చెప్పాడు సింగడు.

ఇందాకటంత కాకపోయినా కాస్త వ్యంగ్యంగానే నవ్వేశాడు మస్తాన్.

"ఏ పోలీసులు ఏర్పాటు చేసిన మనిషో అయి వుంటాడు. అయినా మరేం ఫర్వాలేదు. తను పట్టుబడితే ఎవరి స్థానానికి ముప్పో వాళ్ళే తన క్షేమం విషయం చూసుకుంటారు. అసలింత త్వరగా తన వునికి వాళ్ళకి తెలియడం అసంభవం. లేకపోతే ఇలా ఊరూరూ గాలించమని ప్రత్యర్థులు తమ మనుషులని పంపించారా! ఏదైనా ఆప్రైల్. మస్తాన్ జోలికి వస్తే ఎవర్నైనా శంకరగిరి మాన్యాలు పట్టించడం ఖాయం. పిల్లకాకికేం తెలుసు ఉండేలు దెబ్బ. బెదిరిస్తే బెదిరిపోతాడు. అంతకీ లొంగకపోతే తన మార్గాలు తనకున్నాయి. లోలోపలే ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాడు మస్తాన్.

"ఓ తెల్లకాయితం తెచ్చిపెట్టు" అంటూ ఆదేశించాడు. అయిదు నిముషాల్లో తెచ్చి అందించాడు సింగడు. ఆ కాయితంలో ఎడంచేత్తో తను రాయదల్చుకున్నది రాసి భద్రంగా మడిచి సింగడి చేతికిచ్చాడు మస్తాన్. 'ఇది తీసుకెళ్ళి వాడికందించు. జాగ్రత్త' అంటూ చెవిలో గుసగుసలాడాడు. తలాడించి వెళ్ళిపోయాడు సింగడు. దీర్ఘాలోచనలో మునిగిపోయాడు మస్తాన్.

* * *

గుడి వెనకనున్న చెరువుగట్టున కూర్చుని వుంది లక్ష్మి. జనాలకు బాగా దూరంగా కూర్చుంది. మధ్యాహ్నం జరిగిన రాద్ధాంతం గుర్తు వచ్చి మనసు వికలమైపోయింది. చెంపలమీదికి జారిన కన్నీళ్ళను పమిటతో ఒత్తుకుంది. మధ్యాహ్నం నుండీ అదే పని చేస్తూ వుండటంతో కళ్ళు, చెంపలు వాచిపోయాయి. "ఛీ! పాడు జీవితం. చావైనా రాదు నాకు!" విసుక్కుంది.

ఆరోజు పొద్దున పెందలాడే భోజనం ముగించుకుని పనిమీద పక్క ఊరికి వెళ్ళాడు సుబ్బారావు. ఆయనలా వెళ్ళిన అరగంట తిరక్కుండానే "అమ్మాయ్ లక్ష్మి ఇలారామ్మా" అంటూ పిలిచాడు అన్నగారు. ఏమిటో అనుకుంటూ వెళ్ళిన లక్ష్మికి అడుగు ముందుకు పడలేదు. హాల్లో వెంకటేశ్వర్లు, సావిత్రి, వెంకటాచలం వున్నారు. వాళ్ళనలా చూడగానే పైప్రాణం పైనే పోయింది. "రావమ్మా మరదలా! ఎందుకా సిగ్గు" అంటూ ఎగతాళి చేసింది వదినగారు.

gudachari.com

"నాకు సిగ్గెందుకు వదినా!" అంటూనే వెళ్ళి కూర్చుంది లక్ష్మి. ఇక మొదలు అరిగిపోయిన రికార్డులా అదేపాట. అన్నా వదినా చెరోపక్కా చేరి "చలా పెళ్ళిచేసుకో. సుఖపడతావ్." నాకొద్దు మొర్రో మంటూ ఎప్పుడూ చెప్పే సమాధానమే చెప్పింది లక్ష్మి. వదినకి చాలా కోపం వచ్చేసింది.

"ఏవిటా తల పొగరు? ఏదో వాడికై వాడు అడుగుతున్నాడని అంత అలుసా? ఏం చూసుకుని ఆగర్వం. నీ అంతటి అందగత్తె మరొకరుండరనా? లేక ఏ రాజకుమారుడో దిగి వస్తాడని కలలు కంటున్నావా? ఆ వైభోగం కూడా చూస్తున్నాం కదా! ఇప్పటికి ఎంతమంది వచ్చి చూశారో లెక్కలేదు. ఇలా విసుగు విరామం లేకుండా వచ్చేవాళ్ళ ఎదురుగా వేషం వేసుకుని అమ్మవారిలా కూర్చోడానికి నీకు సిగ్గులేదేమోగాని, అడ్డమైన వాళ్ళకీ వండి మర్యాదలు చెయ్యలేక నా ప్రాణం చచ్చిపోతోంది.

అటు మీ నాన్నని చూడబోతే అనారోగ్యంతో బాధపడుతున్నారు. దానికి సాయం గుండెలమీది కుంపటిలా నీ బెడద కూడానూ. ఏదో దొరికిన సంబంధంతో సంతోషపడి పెళ్ళి చేసుకుని తండ్రి బాధ్యత తీర్చే మార్గం చూద్దాం అనే ఇంగితం కూడా లేదు నీకు. ఏళ్ళు వచ్చాయి ఎందుకు? ఏం చంటి పాపాయివా? ఆమాత్రం అర్థం చేసుకోలేవా. అయినా చలానికి ఏం తక్కువ? కన్నొంకరా? కాలొంకరా? ఇంకెవరైనా అయితే ఎగిరి గంతేసి మరీ పెళ్ళి చేసుకునేవాళ్ళే.

అయినా నా వెర్రిగానీ అసలు నీ మొహాన పెళ్ళిరాత రాసి వుందోలేదో. ఇలాగే ఇంకొంతకాలం సంబంధాలు వెతికి వెతికి హారీమంటాడు మీనాన్న. వయసుమీరిపోయాక ఎవడు చేసుకుంటాడు నిన్ను. నిష్ప్రాధలా నిన్నెదురుగా పెట్టుకుని మా పిల్లలకు పెళ్ళిళ్ళు చెయ్యలేం కదా. కానీలే ఇదంతా మాఖర్మ. మా గ్రహచారం. పుడుతూనే తల్లిని మింగిన మహాతల్లివి. మమ్మల్నందర్నీ ఏదారి పట్టిస్తావో."

ఎంత మర్చిపోవాలనుకున్నా సాధ్యం కావడంలేదు. వదినగారి మాటలు ములుకుల్లా తగిలి బాధపెడతున్నాయి. బ్రతుకు మీద విరక్తి పుడుతోంది. ఇంట్లో ఊపిరాడక గుడికి వచ్చింది. తీరా వచ్చి చెరువుని చూసేసరికి పిరికితనం అవహించింది. గట్టుమీద కూర్చుని వుండిపోయింది.

అలవాటు ప్రకారం గుడికి వచ్చిన మాధవ్ మండపం దగ్గర కూర్చుని లక్ష్మి కోసం చూశాడు. రాకపోయే సరికి ఏదైనా ఆటంకం వచ్చిందేమో అనుకున్నాడు.

అలా చూస్తే దూరంగా చెరువు గట్టు దగ్గర కూర్చుని కనిపించింది. వెంటనే దగ్గరకు వెళ్ళి ఆవిడ అవతారం చూసి గతుక్కు మన్నాడు.

"అదేమిటండీ! అలావున్నారు? ఆరోగ్యం బాగాలేదా?" అన్నాడు. అతడంత ఆదరంగా పలకరించేసరికి మళ్ళీ ఏడుపొచ్చింది లక్ష్మికి. తను బ్రతుకు మీద ఎలా విరక్తి పెంచుకుందో చెప్పి ఎలా చచ్చిపోదామనుకుంటుందో కూడా చెప్పేసింది. చెప్పి మళ్ళీ ఏడ్చింది.

మాధవ్‌కి ఆశ్చర్యం వేసింది. వడ్డించిన విస్తరిలాటి జీవితమున్న ఈ అమ్మాయికి బ్రతుకు మీద విరక్తా? ఆ మాటే అడిగేశాడు. లక్ష్మికి కోపం వచ్చింది. అంతేలెండి. దూరపు కొండలు నునుపు అంటూతన కష్టాలన్నీ ఏకరువు పెట్టేసింది.

"పోనీ ఆ అబ్బాయినే పెళ్ళి చేసుకోవచ్చు కదా!" సలహా ఇచ్చాడు మాధవ్.

"అతనంటే నాకు అసహ్యం. కంపరం. ఇక పెళ్ళెలా చేసుకుంటాను?" అడిగింది లక్ష్మి.

అదీ నిజమే అని అంగీకరించాడు మాధవ్. "అందుకే వేరే మార్గం లేక చచ్చిపోవాలనుకుంటున్నాను." అంది లక్ష్మి.

ఆవిడతో ఏకీభవించలేదు మాధవ్. పైగా తీవ్రంగా ఖండించాడు. సమస్యలు అందరికీ వస్తూంటాయనీ అసలు సమస్యలు లేనిదే జీవితమే లేదన్నాడు. అసలామాటకి వస్తే లక్ష్మికి ఎదురైన సమస్య అంత తీవ్రమైనదేమీ కాదన్నాడు. అంతకంటే ఎన్నో రెట్లు ఎక్కువగా కష్టాలు అనుభవిస్తున్న వాళ్ళు లక్షల సంఖ్యలో వున్నారన్నాడు. వాళ్ళందరూ ఆత్మహత్యలు చేసుకోవటం లేదు అని తెలియజెప్పాడు. మనిషి జీవితంలో ఆటుపోట్లు సర్వసాధారణం. కష్టాలను ధైర్యంతో ఎదుర్కొని పోరాడితే అందమైన జీవితం అనుభవించవచ్చని ధైర్యం చెప్పాడు. పిరికితనం వదిలించు కొమ్మన్నాడు. గుండె బలంతో ముందుకి సాగి పొమ్మన్నాడు. అలాంటి సాహసవంతులకు భగవంతుడు కూడా సాయం చేస్తాడు అని చెప్పాడు.

అతని హితబోధ విన్న లక్ష్మికి నిజంగానే ధైర్యం వచ్చింది. ఫలితం చచ్చిపోవాలనే ఆలోచనను విరమించుకొని మాధవ్‌కి కృతజ్ఞతలు చెప్పుకొని ఇంటికెళ్ళిపోయింది.

ఆవిడ వెళ్ళిపోయేదాకా అటే చూస్తూ కూర్చున్న మాధవ్‌కి హఠాత్తుగా బోలెడంత భయం వేసింది. ఎందుకంటే తనమటుకు తనకే చచ్చేటంత భయం. పిరికితనం. చచ్చిపోవాలని రోజులో కనీసం రెండుసార్లైనా అనుకుంటాడు. అలాటిది తను

gudachari.com

లక్ష్మికి ధైర్యం చెప్పి పంపించడం. తలుచుకున్న కొలదీ నవ్వువచ్చింది అతనికి ఇదంతా సింహంగాడితో చెప్పాలి అనుకున్నాడు.

అనుకున్న ప్రకారం ఆరాత్రి పొలం దగ్గరికి వెళ్తున్నప్పుడు జరిగినది అంతా చెప్పాడు సింహంతో. సింహం మూడ్ బాగాలేదు. అందుకే ఊరికే ఊకొట్టి ఊరుకున్నాడు. ఆరాత్రంతా కలత నిద్రే అయింది సింహానికి. తెల్లవారు జామున నిద్రపట్టింది. లేచి ఇంటికి వచ్చారు ఇద్దరూ. మొహం కడుక్కొని కాఫీ తాగుతూ వుండగా శాంతమ్మ వచ్చి సింహానికి ఒక ఉత్తరం ఇచ్చింది. తెల్ల కాయితాల్ని ఎనిమిది భాగాలుగా మడిచి కొసలు అంటించి వుంది. కవరూ పాడూలేవు. దాని మీద సింహం అని రాసివుంది. ఆకాయితాన్ని అటూ ఇటూ తిప్పిచూసాడు సింహం. "ఎవరు రాసారో ఏమిటో. గేటుకి పెట్టివుంటే పొద్దున్నే పనిపిల్ల తీసుకువచ్చి ఇచ్చింది." అతను అడగకపోయినా చెప్పేసి వెళ్ళిపోయింది కాంతమ్మ.

జాగ్రత్తగా చింపాడు సింహం. "ఒరే పిల్లకాకి! నువ్వెందుకొచ్చావో నాకు తెలుసు. ఏం చెయ్యాలనుకొంటున్నావో నాకు తెలుసు. నేను తల్చుకొంటే అరక్షణంలో నిన్ను పైకి పంపగలను. పోనీలే అని జాలిపడి వూరుకుంటున్నాను. నాతో తలపడటం చావుని కోరి తెచ్చుకోవడమే. తల క్రిందులుగా తపస్సు చేసినా నన్ను పట్టుకోలేవు. అనవసరం శ్రమమాని నీదారిన నువ్వుపో. ఇదే నాఆఖరి వార్నింగ్" అంతే. కింద సంతకం లేదు. ఆ ఉత్తరాన్ని ఒకటికి పదిసార్లు చదువుకున్నాడు సింహం. వెంటనే లేచి వున్న పాటున వసుంధర దగ్గరికి పరిగెట్టాడు. మేడమీదనించి ఇతడిని చూసిన వసుంధర గబగబ మేడదిగి ఎదురొచ్చింది.

"ఏమిటి రేసు గుర్రంలా పరిగెట్టుకొస్తున్నారు. ఏం జరిగింది?"

"ఏం జరిగిందని మెల్లగా అడుగుతున్నారా, ఇలా చూడండి!" అంటూ ఆ కాయితం అందించాడు. అందుకొని క్షణంలో చదివేసింది వసుంధర. మరుక్షణం సంభ్రమంగా చూసింది సింహం వంక.

"అయితే మీవెతుకులాట వ్యర్థం కాదన్నమాట." సంభ్రమంగా ప్రశ్నించింది. "అవును" అన్నాడు సింహం కూడా సంభ్రమంగా. "ఆ వెంకటి ఇక్కడే వున్నాడు అంతేకాదు నన్ను కనిపెడుతున్నాడు. ఈ పరిశోధనలో నేను అతనికి దగ్గరగా వెళ్ళుంటాను కాబట్టి తను బెదిరిపోయి నన్ను బెదిరించాలని చూస్తున్నాడు. ఇప్పుడు వాడిని ఎలా పట్టుకోవాలి అని ప్లాన్ వేసుకోవాలి".

"అవును. ఇది చాలా సీరియస్ మాటర్. పదండి మాట్లాడుకుందాం!" అంటూ లోపలికి తీసుకువెళ్ళింది. ఇద్దరూ కూర్చుని చర్చ ప్రారంభించారు.

"అదివరకు లాగా ఏదో గుడ్డిగా చీకట్లోకి రాళ్ళు విసరటం కాదు. ప్రత్యర్థికి మన ఉనికి తెలిసిపోయింది కాబట్టి తన జాగ్రత్తలో తనుంటాడు. అందులోనూ అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి. హత్యలు చేయడానికి నడుంకట్టుకున్న దుర్మార్గుడు. ఏదో ఆవేశంలో కాక తను తల్చుకున్నపని చేసితీరాలనే పట్టుదల కలవాడు. పైగా ఒక తప్పు కప్పిపుచ్చుకోడానికి మరిన్ని తప్పులు చేయడానికి సిద్ధపడి వున్నాడు కాబట్టి మనం ప్రతి అడుగూ జాగ్రత్తగా చూసి మరీ వేయాలి". అంది వసుంధర.

ఆవిడతో ఏకీభవించాడు సింహం. "అవును, మనం అమిత జాగరూకతతో వ్యవహరించి వాడిని పట్టుకొని పోలీసులకి అప్పజెప్పాలి" అన్నాడు గంభీరంగా.

"అవును" అంది వసుంధర అంతకంటే గంభీరంగా. అంతలోనే ఇద్దరికీ ఒకే ఆలోచన వచ్చింది. "ఎలా? ఎలా పట్టుకోవాలి?"

అప్పటిదాకా వున్న ఉత్సాహం ఆవిరైపోయి నీరసం వచ్చేసింది ఇద్దరికీ. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు సమస్య అలాగే వుంది. ఈ ఉత్తరం వల్ల ఒరిగిపడిందేమీ లేదు. హంతకుడి ఆచూకీ కనుక్కోడం అదివరకెంత కష్టమో ఇప్పుడూ అంతే కష్టం. వాడెవడో, ఎక్కడున్నాడో తెలియదు. కాకపోతే కలండు కలండను వాడు కలడో లేడో! అని సందేహం లేకుండా కచ్చితంగా కలండని తేట తెల్లమయింది అంతే.

ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. "ఏం చేద్దాం మళ్ళీ మరో సర్వే మొదలుపెడదామా"? అడిగింది వసుంధర.

"ఈసారి సర్వే లాభం లేదు. మరో దారి వెతకాలి." అన్నాడు సింహం. ఇద్దరూ కలిసి సీరియస్‌గా ఆలోచించారు. చివరికి ఉపాయం సింహమే చెప్పాడు. కొంచెం సవరణలు చేసింది వసుంధర.

అప్పటికప్పుడే లేచి వాడకం తక్కువై దుమ్ము కొట్టుకుపోయిన టైప్ మిషన్ ముందు కూర్చుని దాన్ని తుడిచి సరిచేసి పేపర్లు మిషన్‌లోకి ఎక్కించి ధనధన టైప్ చేసి పారేసింది. ఒకటి రెండు చోట్ల దొర్లిపోయిన తప్పులను సవరించి రెడీ చేసేసింది. ఆ తర్వాత కార్యక్రమం సింహానిది. ఆ కాయితాలు పట్టుకుని బయలుదేరాడు. అమిత చాకచక్యంగా తను అనుకున్న ప్రకారం అందరికీ అవి చేరేసరికి అపరాహ్నం అయింది.

అప్పుడు ఇంటిదారి పట్టాడు. నడుస్తూ నడుస్తూ హఠాత్తుగా ఆగిపోయాడు.

gudavalli.com

క్రిందటిరోజు మాధవ్ చెప్పిన మాటలు గుర్తొచ్చాయి అతనికి. అప్పుడు మనసు బాగాలేక సరిగా వినిపించుకోలేదు. లక్ష్మికి జీవితం పట్ల విరక్తి కలిగిందనీ ఆత్మహత్యా ప్రయత్నం చేస్తోందనీ చెప్పినట్లు గుర్తు. ఆ లక్ష్మిని గురించి తన వసుంధర పట్టించుకోలేదు. కానీ ఇప్పుడీ విషయం తెలిసాక లక్ష్మిని గురించిన వివరాలు సేకరించడం అత్యవసరం. ఎలా? ఎవర్నడగాలి? వాళ్ళింటికి వెళ్ళే పేరు పెట్టుకుని వెళ్తే బాగుండదు. నేరుగా వెళ్ళి వివరాలడిగితే అసలు బాగుండదు కాబట్టి వేరే ఎవర్నైనా అడిగి తెలుసుకోవాలి. ఆ వివరాలు చెప్పేవాళ్ళు రహస్యంగా వుంచగలగాలి. ఎవరా! అని ఆలోచిస్తూ వుండగానే గుర్తు వచ్చింది శ్యామల.

వెంటనే వాళ్ళింటికి వెళ్ళాడు. సుభద్ర తలుపు తీసింది. "మీ అమ్మాయి గారున్నారా? ఆవిడతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి". అన్నాడు అతి మర్యాదగా.

అంతలోనే వచ్చేసింది శ్యామల. 'రండి రండి' అంటూ ఆహ్వానించి కూర్చోబెట్టి చల్లటినీళ్ళు ఇచ్చింది. "మీరు అన్యధా భావించకపోతే నాకు మీ నుంచి ఒక సహాయం కావాలి. ఎందుకు? ఏమిటి అని అడక్కండి. అదంతా రహస్యం. సమయం వచ్చినప్పుడు నేను అన్నీ చెప్తాను. అప్పుడోసారి మాటల సందర్భంలో సుబ్బారావుగారి అమ్మాయి లక్ష్మి మీ ఫ్రెండ్ అని చెప్పారు మీరు. ఆవిడ వివరాలివ్వాలి కావాలి. ఆవిడ బ్రతుకు మీద విరక్తి పెంచుకుంటున్నారని నమ్మకంగా తెలిసింది నాకు. కారణం ఏమిటి? ఈ వయసులో ఆవిడకు అలాటి ఆలోచన ఎందుకు కలిగింది? మీకేమైనా తెలుసా?" అంటూ ఆత్రంగా అడిగాడు.

బరువుగా నిట్టూర్చింది శ్యామల. "చెప్పాలంటే చాలా వుంది. పైకి ఎంతో ఆనందంగా కనిపించే లక్ష్మి జీవితం ఉత్త మేడిపండు. ఆ ఇల్లు తన పాలిట నరకం. లక్ష్మి తండ్రి సుబ్బారావుగారికి వివాహం అయిన కొద్ది సంవత్సరాలకే భార్య చనిపోయింది. ఆవిడ కొడుకే వెంకటేశ్వర్లు, రెండోపెళ్ళి సంబంధమే అయినా, ఒక సవతి కొడుకు వున్నా, సుబ్బారావు బుద్ధిమంతుడు, సమర్థుడు కాబట్టి మంచి ఐశ్వర్యవంతుల ఇంట్లో పుట్టిన కౌసల్యని ఆయనకిచ్చి రెండో పెళ్ళి జరిపించారు. కౌసల్య, తల్లిదండ్రులకు ఏకైక సంతానం. యావదాస్తినీ కూతురికి, కూతురికి కలిగే సంతానానికి చెందేట్లు విల్లు రాశాడు ఆవిడ తండ్రి. కౌసల్య సుబ్బారావులది అన్యోన్య దాంపత్యం. వారి సంతానం లక్ష్మి. లక్ష్మికి మూడో ఏడు నడుస్తూ వుండగా మళ్ళీ గర్భం వచ్చింది కౌసల్యకి. కాన్పు కష్టమై తల్లీ బిడ్డా ఇద్దరూ చనిపోయారు.

తల్లిలేని పసిపిల్లను ప్రాణంతో సమంగా పెంచి పెద్ద జేశారు తండ్రి దగ్గర బంధువులు. బాల్యదశ దాటేసరికి లక్ష్మి జీవితం సమస్యల తోరణం అయింది.

కారణం యావదాస్తికి లక్ష్మే వారసురాలు. వెంకటేశ్వర్లు పెళ్ళయేదాకా ఆ విషయం ఎవరినీ బాధించలేదు. వెంకటేశ్వర్లుని వివాహం చేసుకుని కాపురానికి వచ్చిన సావిత్రి ఆ నిజం తెలుసుకుని హతాశురాలైంది. తన భర్తకు ఏమీ లేదు అంటూ ఏడిచింది. మోసం ఏమీ లేదు మధ్యవర్తితో స్పష్టంగా చెప్పాను అన్నాడు సుబ్బారావు. ఏది ఏమైనా సావిత్రి ఆశలు గాల్లో ఎగిరిపోయాయి. ఆడపడుచుని చూస్తే ద్వేషం. రేపు ఈ మహాతల్లికి పెళ్ళై ఆ వచ్చేవాడు తమని పొమ్మంటే కట్టుగుడ్డలతో బయటికి నడవాలి. ఆ ఆలోచన భరించలేక ఆ కసి అంతా చిన్నపిల్ల అయిన లక్ష్మి మీద చూపిస్తూ ఉపశమనం పొందుతూ వుండేది.

లక్ష్మి కొంచెం పెద్దది అయేసరికి సావిత్రికి మరో మంచి ఆలోచన కలిగింది. తనకు తమ్ముడు వరుస అయిన వెంకటచలానికీ, లక్ష్మీకి ముడిపెట్టేస్తే, తమకు స్థానచలనం కలగకుండా వుంటుంది. ఆ ముక్క మామగారి చెవిన వేసింది. చదువు, సంధ్యా మాట అలావుంచి నీతి నిజాయితీ ఎంత మాత్రంలేని ఆ శాల్తీకి కూతుర్ని కట్టబెట్టడానికి ససేమిరా అంగీకరించలేదు. ఆయన మండిపడ్డాడు. మరోసారి ఆ మాట ఎత్తితే మర్యాద దక్కదని హెచ్చరించాడు.

అంతటితో ఆయన్ని వదిలేసి లక్ష్మి వెంట పడింది సావిత్రి. చలం గుణగణాలని వేనోళ్ళ పొగుడుతూ లక్ష్మిని ఒప్పించాలని చూసింది. లక్ష్మి అంగీకరించలేదు. ఇంట్లో మారుతున్న పరిస్థితులని కనిపెట్టి లక్ష్మి వివాహ ప్రయత్నాలు మొదలుపెట్టాడు తండ్రి. అదేం ఖర్మమో ఒక్కటీ కలిసి రావడంలేదు. మొదట్లో మొదట్లో చాలా గొప్ప వాళ్ళకి ఇచ్చి చెయ్యాలని చూశాడు. అది కుదరక, మధ్య తరగతికి చెందిన వాళ్ళ లెవెల్‌కి దిగాడు. అదీ కుదర్లేదు. చివరికి ఆస్తి లేకపోతే పోయింది. బుద్ధిమంతుడైన కుర్రాడు దొరికితే చాలని చూస్తున్నాడు. అదీ కలిసి రావడంలేదు.

కూతురి వివాహం గురించిన దిగులుతో ఆయన ఆరోగ్యం కూడా పాడైపోయింది. తన ఓపిక ఆమాత్రంగా వుండగానే లక్ష్మి జీవితం ఒక దారిన పడేయాలని ఆయన తపన.

ఇలాటిపరిస్థితులలో ఒక ఆడపిల్ల జీవితం నరకంగాక ఏముంది చెప్పండి? లక్ష్మి ఎంతో మంచిది. పసిపిల్ల మనస్తత్వం. చిన్నతనం నుండి నాకు మంచి ఫ్రెండ్. తన కండీషన్ తెలిసినా ఏమీ సహాయం చెయ్యలేని స్థితిలో వున్నాను.

gubbachari.com

దైవం చల్లగా చూసి లక్ష్మికి పెళ్ళయిపోతే బాగుండు." టూకీగా అయినా అన్ని వివరాలు చెప్పేసి ముగించింది శ్యామల.

ఆవిడకు థాంక్స్ చెప్పి లేచాడు సింహం. అతని మనసులో సవాలక్ష ఆలోచనలు. అందుకే గేటు దగ్గర ఎదురైన ఏకదంతాన్ని చూసినా ఎప్పటిలా పలకరించి మాట్లాడలేకపోయాడు. వూరికే చేత్తో విష్ చేసి తలొంచుకుని వెళ్ళిపోయాడు.

ఎటూ గాని వేళ తనింట్లోంచి వస్తున్న సింహాన్ని చూసి అదిరిపడిన ఏకదంతం తనని చూసికూడా ఏమాత్రం నదురూబెదరూ లేకుండా నిర్లక్ష్యంగా ఓ నమస్కారం పెట్టి చక్కా పోవడంతో మండిపడిపోయాడు. చరచరా ఇంట్లోకి వెళ్ళాడు. ఎందుకొచ్చాడతను?" ప్రశ్నించాడు భార్యను. నిశ్చింతగా సమాధానం చెప్పిందావిడ.

విసురుగా కూతుర్ని పిలిచాడు. "ఏవిట్టది? ఎందుకొచ్చాడతను? నిలదీసి అడిగాడు. శ్యామలకి మొదట్నుంచీ తండ్రి పట్ల భయంలేదు. అందులోనూ ఈమధ్య మరీ కోపంగా వుంది. తనకూ ప్రసాద్‌కీ మధ్య అడ్డుగోడలా నిలిచాడని కసిగా వుంది.

"నాతో ఏదో రహస్యం మాట్లాడాలని వచ్చాడు." నిర్లక్ష్యంగా సమాధానం చెప్పింది. "ఏవిటా రహస్యం చెప్పు" మండిపడ్డాడాయన.

"రహస్యం అంటూనే చెప్పమంటావేం?" అంటూ వెళ్ళిపోయింది శ్యామల. కోపం, దుఃఖం ఏకకాలంలో కలిగాయి ఏకదంతానికి. వెంటనే వెళ్ళి పీతాంబరం దగ్గర వాలిపోయి విషయం వివరించాడు.

గుండెలు బాదుకున్నాడు పీతాంబరం. "ఎంత ధైర్యం? ఎంత ధైర్యం? పట్టపగలు ఇంట్లో దూరి దానితోమంతనాలా? ఇంకా చూస్తూ వూరుకుంటే కొంపలంటుకు పోతాయ్. వెంటనే అరెస్ట్ చేసేయ్". అన్నాడు పీతాంబరం.

"ఎలారా? అమ్మాయితో మాట్లాడ్డం నేరమేమీ కాదే. ఈ శనిగొట్టు వెధవ ఒక్కటైనా చట్టవిరుద్ధమైన పని చెయ్యడు కదా!" వాపోయాడు ఏకదంతం.

ధైర్యం చెప్పాడు పీతాంబరం.

* * *

ఏకదంతం గారింట్లోంచి బయటికి వచ్చిన సింహం బుర్రంతా గందరగోళం అయిపోయింది. అమాయకంగా కనిపించే లక్ష్మి వెనక ఇంతటి విషాదగాథ వుందన్నమాట. అయితే అన్నింటిలోకీ అనుమానాస్పదమైన కేసు ఇదే. ఆ వెంకటేశ్వర్లు పరమ దుర్మార్గుడు. డబ్బుకోసం ఏ పనికైనా సిద్ధపడే నీచుడు. తండ్రిని

మోసం చేసి దొంగతనంగా డబ్బు వెనకేసుకోడానికి అలవాటు పడినవాడు ఆస్తికోసం చెల్లెలికే ఎసరు పెడుతున్నాడా? ఏమో. ఏది ఏమైనా చాలా జాగ్రత్తగా మెసలాలి. లేకుంటే మొదటికే మోసం వస్తుంది. తనను పట్టుకుని నాలుగు తన్నినా ఫర్వాలేదు. కానీ ఇంట్లో భార్య సహాయంతో లక్ష్మీకేమైనా ఆపద తలపెడితే! ఆలోచిస్తున్న కొలదీ సింహం గుండె దడదడలాడింది.

వెంటనే చెట్టుచాటుకు వెళ్ళి కాయితం తీసుకుని వంకరటింకరగా రాసేశాడు. వెంకటేశ్వర్లుకి వార్నింగ్ అది.

"నువ్వు తలపెట్టిన పని ఏమిటో నాకు తెలిసిపోయింది. అనుక్షణం నిన్ను కనిపెడుతూనే వుంటాను. పిచ్చివేషాలు వేశావంటే అరదండాలు వేయించి కటకటాల వెనక తోయించేస్తాను. ఖబడ్దార్." ఉదయం నుండి అందరికీ అందిస్తూ వచ్చిన ఉత్తరాలకి అనువాదం రాసి జేబులో పెట్టుకుని బయలుదేరాడు. గూఢచారి టపాలాగా అంచెలంచెలుగా గమ్యం చేరే ఏర్పాటు చేశాడు. మూడు చేతులు సక్సెస్‌ఫుల్‌గా మారి నాలుగో మజిలీ చేరింది ఉత్తరం. సుబ్బారావు గారి పాలేరు కొడుకు బుట్టలోకి సవ్యంగానే జేరింది. ఆ బుట్టలో చామంతి పువ్వులున్నాయి. తోటలో నుండి పువ్వులు తీసుకుని అయ్యగారింటికి బయలుదేరిన వాడు కాస్తా మధ్యలో కుర్రాళ్ళు గోలీలు ఆడుతూ కనిపించేసరికి అక్కడికి వెళ్ళి ఆటల్లో జేరిపోయాడు. ఈలోగా ఓమేక వచ్చి బుట్టలోని చామంతి పువ్వుల్ని దానిమీద పడిన్న కాయితాన్ని కలిపి నవిలేసింది.

* * *

ఆరోజు పిండిమర నుండి వచ్చిన పిండి జల్లిస్తున్న ఆదిలక్ష్మికి జల్లెడకి ఏదో కాయితం కనబడింది. "ఏవిటో మరీ శుచీ శుభ్రం లేకుండా పోతోంది ఆ మరవాడికి. మళ్ళా ముప్పై పైసలు ఖచ్చితంగా పుచ్చుకుంటాడు. పిండి నిండా చెత్తా చెదారం!" విసుక్కుంటూ తీసి అవతల పారేయబోతూ ఆగి ఆ కాయితం ఏమిటో అని చూసింది.

ప్రియమైన సోదరీ! మీరు చాలా అమాయకులు. తెల్లనివన్నీ పాలు నల్లని వన్నీ నీళ్లు అని నమ్మేరకం. మీ అమాయకత్వాన్ని ఆధారంగా తీసుకుని మీ వెనుక కుట్ర జరుగుతూ వుంది. మీ ప్రాణాలు తీసే కార్యక్రమం తయారవుతోంది. ఇంత ఘోరం తలపెట్టింది ఎవరు అని అడక్కండి. మీ దగ్గర మిత్రుడో, బంధువో లేక సాక్షాత్తూ మీ భర్తే కావచ్చేమో. కాబట్టి మీ జాగ్రత్తలో మీరుండండి. భయపడవలసింది ఏమీ లేదు. ముందుగా మిమ్మల్ని హెచ్చరిస్తున్నాం. అంతే. ఆపైన మేం వున్నాం.

gunachari.com

వేయికళ్ళతో కనిపెట్టి వుంటాం. మీకు ఏదైనా ప్రమాదం జరిగే ప్రమాదం వుంటే మీరు పసిగడితే వెంటనే మాకు తెలియజెయ్యండి. "ఎలా తెలియజెయ్యడం అంటారేమో! మీ పక్కింటి పిన్నిగారికో, ఎదురింటి బామ్మగారికో, ఏదీ కాకుంటే మీ పనిమనిషికో చెప్పండి చాలు."

ఇంగ్లీషులో టైప్ చేసి వుంది. అది చదవగానే వెన్నులోంచి వణుకు పుట్టుకొచ్చింది ఆదిలక్ష్మికి. ఆ పిండి అక్కడ పారేసి ఏడుస్తూ కూర్చుంది. కాసేపు అలా ఏడిచాక ఏడుపు ఆపేసి ఆలోచించడం మొదలుపెట్టింది.

ఇలా ఏడిచి లాభం లేదు. ఏడిస్తే ఏం ప్రయోజనం? ధైర్యే సాహసే లక్ష్మీ అన్నారు. అందుకని ధైర్యంగా వుండాలి. అవసరం అయితే ఎదురు తిరగాలి. అసలు తనని చంపాలని ప్లాను వేసింది ఎవరు? బంధుమిత్రుల్లో ఎవరికీ ఆ అవసరం లేదు. పోతే భర్త. అందరికీ అరువులివ్వకే ఆదిలక్ష్మీ అని తిడతాడు గానీ మంచివాడే. తనని చంపడుగాక చంపడు. మరైతే ఉత్తరం ఎందుకొచ్చిందబ్బా! ఏమో ఏ పుట్టలో ఏ పాముందో! జాగ్రత్తగా వుండాలి. అదివరకులా అణిగిమణిగి వుండటం మానేసి ఆయన ఒకటి అంటే తను పది అనేలా వుండాలి. అడ్డంగా దబాయించి పారేయాలి. స్థిరనిశ్చయానికి వచ్చింది ఆదిలక్ష్మి.

ఆరోజు లంచ్‌టైమ్‌లో బయటికి వెళ్ళొచ్చిన గుండు వెంకటేశ్వర్రావుకి బల్లమీద ఓ తెల్ల కవరు కనిపించింది. ఆఫీస్ లెటర్ కాదే. ఎవర్రాశారబ్బా అనుకుంటూ ఓపెన్ చేసి చూశాడు.

> డియర్ ఫ్రెండ్! నీ భార్యకు నువ్వు ద్రోహం తలపెడుతున్నావ్? ఇదేం మంచి పద్ధతి కాదు. నేను కావాలనుకుంటే నీ బండారం బయట పెట్టగలను. కానీ ఎందుకులే అని జాలిదలిచి వూరుకుంటున్నాను. వెధవ ఆలోచనలు మానేయ్. పచ్చని సంసారంలో బుగ్గిపోసుకోకు. నీ శ్రేయస్సు కోరి చెప్తున్నాను. మర్యాదగా నా మాట వింటే సరే. లేదంటే నీ బ్రతుకు బజార్న పెట్టగల శక్తి సామర్థ్యాలు నాకున్నాయ్.
>
> నీ
>
> శ్రేయోభిలాషి

ఇంగ్లీషులో టైప్ చేసి వున్న ఆ ఉత్తరంలోని సారాంశం గ్రహించిన గుండు వెంకటేశ్వర్రావుకి నోరెండిపోయింది. ఒళ్ళంతా చెమటలు పట్టింది. గబగబ వెళ్ళి గ్లాసెడు మంచినీళ్ళు తాగొచ్చి కుర్చీలో కూలబడ్డాడు. ఆ ఉత్తరం మరోసారి చదువుకుని ఆ రాసినవాడిని తిట్టుకున్నాడు. ఆతర్వాత తనని తాను చచ్చేట్టు

తిట్టుకున్నాడు. ఎత్తెత్తి కాలు ఎంగిలాకులోకి వెయ్యడం అంటే ఇదే అని విసుక్కున్నాడు.

గుండు వెంకటేశ్వర్రావు చాలా మంచివాడు. బుద్ధిమంతుడు. అలాటి అతగాడికి ఓరోజు ఆఫీసులో సుగుణమణితో పరిచయం అయింది. ఆవిడ ఏదో ప్రైవేటు కంపెనీలో పనిచేస్తోంది. ఇతనితో పనుండి వచ్చింది. ఆ పరిచయం తర్వాత అయిదారుసార్లు అక్కడా ఇక్కడా ఎదురైంది. ఎదురైనపుడల్లా అరగంటకి తక్కువ కాకుండా మాట్లాడింది. నెల్రోజుల క్రిందట ఇతడి దగ్గరకొచ్చింది. 'మీ వల్ల నాకు సాయం కావాలి. మీకు ఆఫ్కోలో అరువిస్తారు కదా! మీరు తీసుకోకపోతే నేను తీసుకుంటాను. ఇన్‌స్టాల్‌మెంట్ నేను కట్టుకుంటాను' అంటూ అడిగింది. 'ఓ దానికేం భాగ్యం. అలాగే!' అనేశాడతను. ఆవిడ ఇతని పేరు మీద ఓ పట్టుచీరె కొనుక్కుంది. ఆ కొన్నోజున ఇద్దరూ షాపుకి వెళ్ళారు. సెలక్షన్‌లో ఇతని సాయం అడిగింది. షాపింగ్ తర్వాత ఇద్దరూ హోటల్‌కి వెళ్ళి కాఫీ తాగారు. పదే పదే కృతజ్ఞతలు చెప్పింది సుగుణ. ఆరోజు ఓ వెధవ ఆలోచన కలిగింది గుండు వెంకటేశ్వర్రావుకి. సుగుణమణి నెత్తిన బోలెడన్ని బాధ్యతలున్నాయ్. పెళ్ళివయసు దాటిపోతోంది. కాబట్టి కాస్త స్నేహం పెంచుకుని సినిమాలుకీ వాటికీ తిరిగి థ్రిల్ అనుభవిద్దాం అనుకున్నాడు. అలా స్నేహం పెరిగితే ఆ పట్టుచీరెకి డబ్బు తీసుకోకూడదని కూడా అనుకున్నాడు. కాకతాళీయంగా ఈ పట్టుచీర ప్రహసనం జరిగిన మర్నాడు ఆదిలక్ష్మి కూడా ఆఫ్కోలో అరువు పద్ధతిలో పట్టుచీరె కొనుక్కుంటానని అడిగింది. అబ్బే అక్కడ అంతా ఓల్డ్‌స్టాక్. అమ్ముడు పోనివన్నీ మనకు అంటగడతారు. వేరే కొట్లో కొనుక్కో అంటూ అబద్ధం ఆడేశాడు. ఇదంతా జరిగి నాల్రోజులు కాలేదు. సుగుణమణిని మళ్ళీ కలుసుకోనైనాలేదు. అంతలోనే ఈ అవాంతరం.

తన మనసులో అనుకున్న సంగతి ఈ శ్రేయోభిలాషి వెధవకి ఎలా తెలిసిందో అనుకుని ఆశ్చర్యపోతున్నాడు. ఎలాగైతేనేం తెలిసిపోయింది. కాబట్టి అలాటి ఆలోచనలు అన్నీ మానేసి బుద్ధిగా వుండటం మంచిది అనుకున్నాడు.

ఆఫీసునుండి ఇంటికి వెళ్ళాడు. తలుపుతీసింది ఆదిలక్ష్మి. ఇతనివంక సూటిగా చూసింది. కాస్త తడబడ్డాడు గుండు. అయినా తేరుకుని నవ్వేశాడు. ముందుగదిలో టేప్‌రికార్డర్ కనిపించలేదు. "లక్ష్మీ. టేప్‌రికార్డర్ ఏది"? అడిగాడు.

ఎదిరింటివాళ్ళ అమ్మాయికి స్కూల్లో డాన్స్ ప్రోగ్రాం వుందిట. పట్టుకెళ్ళింది." నమరూ బెదరూ లేకుండా సమాధానం చెప్పింది ఆదిలక్ష్మి.

gudachari.com

"కొత్తది కొని ఏడాది కాలేదు. అందులోనూ స్కూల్‌కి తీసికెళ్తే తిన్నగా వాడతారా? తగలబడిపోదూ!" అలవాటుప్రకారం మందలించాడు. "ఏం తగలబడిపోదు! జాగ్రత్తగా తెచ్చి ఇవ్వమని చెప్పాను. ఇంకా అప్పటికీ పాడైపోతే మన ఖర్మ అనుకుందాం. అయినా అలా ఒట్టి పుణ్యానికి పాడైపోడానికి అదేమైనా మనిషి బుద్ధికాదుగా." అంటూ అడ్డంగా డబాయించింది.

గతుక్కుమన్నాడు వెంకటేశ్వర్రావు. శ్రేయోభిలాషిని నిలువునా పాతేయాలి. ఇక్కడక్కూడా ఉప్పు అందించేసినట్లున్నాడు. ఎన్నడూ లేనిది నన్నే దబాయించేస్తోంది." అనుకున్నాడు.

"అబ్బే వూరికే అన్నాను. నువ్వేం అనుకోకు. వాళ్ళు భద్రంగానే తిరిగి ఇచ్చేస్తే అంతగా పాడైపోతే అదవతల పారేసి ఇంకోటి కొనుక్కుందాం!" అన్నాడు అమిత ఆదరంగా.

ఈసారి ఆశ్చర్యపోవడం ఆదిలక్ష్మి వంతు అయింది. 'అమ్మా! ఇదా వీళ్ళ బండారం. బెదిరిపోతే దబాయిస్తారు. నేనే ఎదురుతిరిగితే తగ్గిపోతారు. ఈ విషయం ముందే తెలిస్తే ఎంత బాగుండేది' అనుకుంది. అంతలోనే గతంనాస్తి అనుకుని అప్పుడు దబాయించడం మొదలుపెట్టింది.

ఉత్తరాలు అందుకున్న మిగిలిన వాళ్ళ ఇళ్ళల్లో కూడా ఇలాటి సంఘటనలే జరిగాయి.

అందరు లక్ష్ములనూ హెచ్చరించిన సింహం, అసలు లక్ష్మిని హెచ్చరించలేదు. ఎందుకంటే ఆవిడకు ఒక్కరుకాదు ఇంట్లోనే చాలామంది శత్రువులున్నారు. ఆవిడ మంచిని కోరే ఏకైక వ్యక్తి వయసు మళ్ళినవాడు. దుర్భలుడు. కాబట్టి ఆవిడ భద్రతా భారం మరెవరికైనా అప్పగించాలి. అందుకు తగినవాడు మాధవ్.

మాధవ్‌తో ఇదంతా చెప్పాడు. అంతా విని నిట్టూర్చాడు మాధవ్. "పాపం మనం డబ్బు లేదని బాధపడతామా? ఆ డబ్బే ఆవిడ పాలిట శాపం అయింది. మరిలాటి పరిస్థితులలో జీవితంపట్ల విరక్తి పెంచుకుని ఆత్మహత్యకు తలపడిందంటే ఆవిడ తప్పేముంది? ఆ స్థానంలో ఎవరున్నా అలాగే చేస్తారు. అనవసరంగా ఆవిడని కోప్పడ్డాను." జాలిపడ్డాడు.

"జాలిపడితే ఆవిడకు జరిగేది ఏముందిరా! సహాయం చెయ్యాలి. ఆవిడ జీవితం బాగుపడేలా చూడాలి". అన్నాడు సింహం.

"అవును. నిజమే. ఏం సహాయం చెయ్యాలి?

"ఆవిడకి ధైర్యం చెప్పాలి. ఆపద ముంచుకొస్తోందని, జాగ్రత్తగా వుండమని హెచ్చరించాలి. ఏమాత్రం అపాయం పసిగట్టినా వెంటనే మనకు తెలియజేయమని

చెప్పాలి. ధైర్యంగా వుండమనీ, అవసరం అయితే ఎటువంటి వాడికైనా ఎదురు తిరగమనీ చెప్పాలి". చెప్పాడు సింహం.

ప్రమాదం, అపాయం అనేసరికి కాళ్ళూ చేతులూ ఒణికాయి మాధవ్‌కి. "ఎందుకొచ్చిన గొడవ ఇదంతా! ఇలాటి వ్యవహారాల్లో ఇరుక్కుంటే బయటపడడం కష్టం. మంచికి పోతే చెడు ఎదురైనట్లూ ఇందులో తలదూరిస్తే తనకే ప్రమాదం జరిగితే!" అనుకుని బెదిరిపోయాడు.

మరుక్షణం లక్ష్మి గుర్తు వచ్చింది. అతని మనసు మెత్తబడిపోయింది. పాపం. ఎంతో మంచిది. తనతో స్నేహంగా మాట్లాడుతుంది. అలాటి అమ్మాయి కోసం ఆపదలో దూకడానికి సిద్ధమే అనేసుకున్నాడు.

వెంటనే తన సంసిద్ధత తెలియజేశాడు. సింహం చాలా సంతోషించాడు. ఏం చెయ్యాలో మరికొన్ని మంచి సూచనలిచ్చాడు. శ్రద్ధగా విన్నాడు మాధవ్.

* * *

రాత్రి పొద్దుపోయాక మస్తాన్ దగ్గరికి వచ్చాడు వెంకటాచలం. అలవాటు ప్రకారం సీసా ముందు పెట్టుకుని కూర్చుని వున్నాడు మస్తాన్. పక్కనే కూర్చుని చకోడీలు ఒక్కొక్కటీ అందిస్తూ పసందుగా కబుర్లు చెప్తున్నాడు సింగడు.

చలాన్ని చూడగానే నవ్వేడు మస్తాన్. "రావయ్యా రెండ్రోజులనుండి కనిపించటంలేదేం!" అన్నాడు.

"ఏవో ఇబ్బందుల్లో పడి రాలేదు." నీరసంగా సమాధానం చెప్పాడు చలం.

"ఏవిటయ్యా అలా డీలా పడిపోయావు. నీకేం ఇబ్బందులు? దర్జాగా పరాన్న భుక్కూ బ్రతికేవాడివి నీకేం కష్టం"? అన్నాడు మస్తాన్.

"అదేనండీ నా బాధ. నేను ఆశ్రయించుకున్న చెట్టు ఎండిపోతోంది." సమాధానం చెప్పాడు చలం.

"ఏవైంది వివరంగా చెప్పవయ్యా!" విసుక్కున్నాడు మస్తాన్.

మరోసారి నిట్టూర్చాడు చలం. చెప్పడం మొదలుపెట్టాడు. ఎన్నో ఆశలతో అక్కగారింటికి వచ్చాడు చలం. ఆడపడుచునిచ్చి చేస్తాననీ, ఆస్తంతా కట్టబెడతాననీ ఆశపెట్టింది అక్కగారు. తీరా వచ్చి చూస్తే అది అంత తేలికగా అనిపించలేదు. నల్లే కాలంతోపాటు అన్నీ సర్దుకుంటాయి అనుకుని సరిపుచ్చుకొని అక్కడే మకాం పెట్టేశాడు. చిన్నతనం నుండి జల్సాలకు అలవాటు పడిన మనిషి అవటం వల్ల బావగారి చెవికొరికి ఆ పని మొదలుపెట్టాడు వెంకటేశ్వర్లు. పొలంలో పంట సగానికి సగం అమ్ముకుని ఆ సొమ్ముని తాము జల్సాలు చేస్తూ రాజాలా కాలం

గడపసాగారు. లక్ష్మికి వచ్చే సంబంధాలు ఆవిడ కేరెక్టర్ మంచిదికాదు ఆకాశరామన్న ఉత్తరాల ద్వారా చెడగొడుతూ తృప్తి పడ్డాడు. ఏనాటికైనా అర్థం విసిగిపోయి కూతుర్ని తనకే ఇచ్చి కట్టబెడతాడని అనుకున్నాడు. కాలం సజావు సాగిపోతున్న తరుణంలో శనిలా దిగబడ్డాడు సింహం.

దొంగతనాలు జరగకుండా అడ్డుపడ్డాడు. దాంతో వెంకటేశ్వర్లుకి వెయ్యి చలానికీ, చేతులో డబ్బులాడక కటకటగా తయారైంది. ఖర్చులకు అలవాటు పడ్డ ప్రాణాలు విలవిలలాడసాగాయి. పోనీ ఆ పెళ్ళి విషయం ఏదో తేల్చుకుందా మనుకుంటే లక్ష్మి ఎదురు తిరుగుతోంది. ఆమాట ఎత్తితే పళ్ళు రాలగొడ్తా నంటున్నాడు ఆవిడ తండ్రి. ఇంతకాలం ఎదురుచూసి ఇప్పుడు ఓటమి అంగీకరించి వెళ్ళిపోడానికి మనసొప్పటం లేదు. అలా అని కార్యసాధనకు మార్గం కనిపించడం లేదు.

పరిస్థితి అంతా వివరించాడు చలం. అంతా విని నవ్వేశాడు మస్తాన్. "ఓ! ఈమాత్రం దానికేనా ఇలా ఏడుపు మొహం పెట్టావు. ముందే ఒక్కముక్క నాకు చెవిన వేస్తే ఎంత బాగుండేది. పోన్లే ఇప్పుడైనా చెప్పేవు. ఆలోచించి ఏదైనా మార్గం చూద్దాం!" అన్నాడు.

"ఏం మార్గం చూస్తాం?" నిరాశపడిపోయాడు చలం.

"అలా అని నన్నూ నీతో చేర్చేయకు. అవసరం అయితే కాళ్ళూ, చేతులూ కట్టేసి మరీ పెళ్ళి జరిపేస్తాను. ఎవరైనా అడ్డొస్తే వాళ్ళ అంతు చూసేస్తాను. అది నాకు నల్లేరు మీద బండి నడక". ధీమాగా చెప్పాడు మస్తాన్.

చలం మొహం కాంతివంతం అయింది. "అయితే మీరేదైనా సహాయం చేస్తారా?" ఆశగా అడిగాడు.

"చేస్తారా అని మెల్లిగా అడుగుతావేం? అసలు నా వృత్తే అది. ఏ పనైనా చేసేస్తాను. కాకపోతే శ్రమకు తగ్గ ప్రతిఫలం మాత్రం ఖచ్చితంగా వసూలు చేస్తాను."

"దానికేం భాగ్యం? ఈ పెళ్ళి జరిగితే పెత్తనం నాదేగా, మీరు కోరినంత ఇస్తాను." హామీ ఇచ్చాడు చలం.

"సర్లే ఆలోచించి ప్లాన్ వేద్దాం. ఇక నువ్వు వెళ్ళిరా!" అంటూ గ్లాస్ కింద పెట్టేసి మంచం మీద వాలిపోయాడు.

మరోసారి సలాం పెట్టి హుషారుగా వెళ్ళిపోయాడు చలం.

"ఏవిట్రా వీడి గొడవ. చెప్పినది అంతా నిజమేనా?" అడిగాడు మస్తాన్.

పక్కనించి లేచి పాదాల దగ్గర జేరాడు సింగడు. "నిజమేనండీ!" అన్నాడు.

"వూ. అయితే పెళ్ళైతే ఆస్తి దండిగానే ముడుతుందన్నమాట! ఏమాత్రం వుంటుందేం?" సాలోచనగా ప్రశ్నించాడు.

"దండిగానే వుందండి. పదెకరాల మాగాణి, పదిహేనెకరాల కొబ్బరి తోట, అయిదెకరాల నిమ్మతోట, అయిదెకరాల కూరగాయల పొలాలు. పాతదే అయినా దిట్టమైన లంకంత ఇల్లు, వెండి, బంగారం!" చెప్తూ ఆపి వూపిరి తీసుకున్నాడు సింగడు.

"వెధవ ఆస్తి దానిదేముంది గానీండి అమ్మాయి బంగారం బొమ్మ. ఆ పిల్ల ముందు ఆ డబ్బంతా బలాదూర్!" కుతూహలంగా పక్కకు తిరిగాడు మస్తాన్. "ఆహా అంత బావుంటుందిట్రా"

బావుండటంలో కాస్తా! చిలకలా వుంటుంది. అంత అందమైన పిల్ల ఈ ఊళ్ళోనే లేదు. ఆ మాటకొస్తే ఈ చుట్టుపక్కల ఎక్కడా లేదు. ఆ పిల్ల ముందు జయప్రద, శ్రీదేవి ఏం పనికొస్తారు చెప్పండి! ఆ కళ్ళు ఆ ముక్కు" అంటూ వర్ణన మొదలుపెట్టాడు సింగడు.

కళ్ళు మూసుకుని అతడు వర్ణిస్తున్న మూర్తిని వూహించుకుంటూ వుండిపోయాడు మస్తాన్.

* * *

లక్ష్మి కేసుకి క్రిఫరెన్స్ ఇచ్చినా మిగిలినవారిని కూడా నిర్లక్ష్యం చేయదల్చుకోలేదు సింహం. అసలు నేరస్థుడు పట్టుపడేదాకా అందరూ అనుమానస్థులే. అందరిమీదా ఓ కన్ను వేసి వుంచాలి.

మొట్టమొదటిగా నట్‌బోల్ట్ వెంకటేశ్వర్రావుని కలుసుకోవాలనుకున్నాడు. వెంకటేశ్వర్రావు ఇంటిదగ్గర నించి స్కూటర్ మీదే బయలుదేరతాడు. అది రోడ్ మీద దాకా బాగానే నడిచి అక్కడికొచ్చేసరికి ఆగిపోతుంది. అదృష్టం బాగుండి స్టార్ట్ చేసే ప్రయత్నంలో మరో అరకిలోమీటరు తీసుకుని వెళ్తాడు. అక్కడ వెనక్కి తిరిగి తోసుకుంటూ మళ్ళీ రోడ్ మీదికి వచ్చి, రాములు టీ కొట్టు దగ్గర పెట్టి అతడిని చూస్తుండమని చెప్పి బస్సెక్కి టౌన్‌కి వెళ్ళిపోతాడు. సాయంత్రం వచ్చి ఆ స్కూటర్ తీసుకుని ఇంటికి వెళ్తాడు. అదీ అతగాడి దినచర్య.

బస్‌కోసం నిలబడిన వెంకటేశ్వర్రావు దగ్గరికి వెళ్ళాడు సింహం. విష్ చేశాడు. "ఏరా, బావున్నారా? ఆ మధ్య ఏదో పత్రిక కోసం వచ్చారు. కదూ! ఏమైంది ఆ విషయం?" అంటూ పలకరించాడు వెంకటేశ్వర్రావు.

gudachari.com

"ఆ నా మొహం పత్రిక. మోసం చేశారు నన్ను. ముందేమో ఓ నెల ఫ్రీ పనిచెయ్యి. ఆ తర్వాత నెల నుండీ జీతం కమీషను ఇస్తామన్నారు. తర్వాత అలాకాదు ఓ ఏడాది పాటు జీతం లేకుండా పనిచెయ్యమన్నారు. దాంతో నాక్కోపం వచ్చి మానేశాను. ఏడాది పాటు జీతం లేకపోతే ఏం తింటాం ఎందుగడ్డి?" అన్నాడు

"ఆహా! మరిప్పుడేం చేస్తున్నారు"? అనాసక్తిగానే అడిగాడు వెంకటేశ్వర్రావు.

"సం.తా.ప.సం అనే సంఘంలో పనిచేస్తున్నాను." చెప్పాడు సింహం.

"సం.తా.ప.సం. అంటే సంతాపసభ జరిపే సంఘమా?

"అబ్బే కాదండీ. సం.తా.ప.సం సంసార తాపత్రయ పరిహార సంఘం" చెప్పాడు సింహం.

"ఓహో ఫామిలి ప్లానింగ్ సంఘమా"? అనేశాడు వెంకటేశ్వర్రావు.

"ఛ.ఛ కాదండీ. ఇదో కొత్తరకం సంఘం. సంసారంలోని కలతలను నివారించి సంసారాన్ని స్వర్గమయం చెయ్యడానికి స్థాపించబడింది."

"ఆ నా మొహం. సంసారంలో కలతలొస్తే ఈ సంఘాలేం చేస్తాయి" నిట్టూర్చాడు వెంకటేశ్వర్రావు. అంతలోనే బస్సొచ్చింది. ముందు వెంకటేశ్వర్రావు ఎక్కాడు. అతని వెనకాలే తోకలా వెళ్ళాడు సింహం. అతని పక్కనే ఇరుక్కుని కూర్చున్నాడు.

"ఇప్పుడూ సంసారతాపత్రయ పరిహార సంఘం అంటే ఏమిటంటేనండీ" అంటూ మొదలుపెట్టాడు.

"వీడి సంఘం మండిపోనూ. ఓ చెంప చోటులేక చస్తుంటే వీడొహడు. ఏ శాశ్వత సభ్యత్వమో అంటూ చందా వసూలు చేస్తాడు కాబోలు. అరిచి చచ్చినా పైసా ఇవ్వను." అనుకున్నాడు విసుగ్గా.

"సంసారం అన్నాక సవాలక్ష వ్యవహారాలుంటాయి కదండీ. ఇంట్లో కూర్చున్న భార్యల విషయం ఎలా వున్నా బయట తిరిగే మగాడికి ఎన్నో పన్లు. వాటిల్లో అన్నీ ఇంట్లో చెప్పే విషయాలే వుండవు కదా! కొన్ని రహస్యం వ్యవహారాలుంటాయి. ఈమధ్యేనండీ కొందరు నిరుద్యోగులు ఓ గ్రూప్‌గా ఏర్పడి ఇలాటి రహస్యాలు సేకరించి భర్తలని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. దానికి విరుగుడుగా మేము ఈ సం.తా.ప.సం. స్థాపించాం. అలా ఆకాశరామన్న ఉత్తరాలకు గురై బాధపడుతున్న వారు మా దగ్గరకు వస్తే వారిని ఆ బాధల నుండి విముక్తులను చేస్తాం!

క్రిందటి వారం సిటీలో జగన్నాధరావుగారనే ఆయన ఇంట్లో పెళ్ళాన్ని తెలీకుండా మెడ్రాసు పోయి రేసులాడి వచ్చాడు. పైగా భార్యతో ఆఫీసు పనిమీద

వెళ్ళానని అబద్ధం కూడా ఆడాడు. అది కనిపెట్టి ఆయనకి ఉత్తరం రాసి బెదిరింపులు మొదలుపెట్టారు. ఆయన మా దగ్గరికి వచ్చి మొరపెట్టుకున్నాడు. మేము వెంటనే రంగంలోకి దూకి ఆ బ్లాక్‌మెయిలర్లని పట్టుకుని చావచితక్కొట్టేశాం.

నిన్నగాక మొన్న ప్రసాదరావనే ఆయన అంటూ అయిదారు సంఘటనలు ఆపకుండా చెప్పేశాడు సింహం. విసుగూ చిరాకూ ఎగిరిపోయి తనుకాస్త పక్కకు జరిగి సింహానికి ఇంకాస్త చోటిచ్చి అతను చెప్పేది శ్రద్ధగా విన్నాడు. బస్ గమ్యం చేరింది. అందరూ దిగాక వెంకటేశ్వర్రావు. సింహం దిగారు.

"మీతో ప్రయాణం భలే సర్దాగా గడిచింది. మా సం.తా.ప.సం. గురించి గుర్తుంచుకోండి. ఎప్పుడైనా ఎవరికైనా అవసరం అయితే మా దగ్గరికి పంపండి." అని చెప్పి వెళ్ళిపోయాడు సింహం.

నట్‌బోల్ట్ వెంకటేశ్వర్రావు దీర్ఘాలోచనలో మునిగిపోయాడు.

పదిహేనురోజుల క్రిందట అతని తండ్రి అతనికి ఉత్తరం రాశాడు. అతని చెల్లెలు గురించి రాస్తూ, అలకపాన్పు మీద అల్లుడు హీరో హోండా అడిగిన విషయం గుర్తు చేశాడు. కాళ్ళా వేళ్ళా పడితే కాపురానికి తీసుకు వెళ్ళడానికి అంగీకరించాడు. అయితే కలర్ టి.వి.ఇమ్మని అడిగాడు. ఆ అభిప్రాయం మారి మళ్ళీ తిక్క దొర్లకుండానే దాన్ని కాపురానికి పంపాలి. ఇక్కడ తెలిసినాయన డీలర్‌కి వచ్చే ధరకే ఇస్తానన్నాడు. నాదగ్గర అయిదువేలున్నాయి. మిగిలింది నువ్వు పంపించు. ఈ ఉత్తరం టెలిగ్రామ్‌గా భావించు అంటూ రాశాడు. వెంకటేశ్వర్రావుకి కాళ్ళూ చేతులూ ఆడలేదు. అతని దగ్గర అప్పుడు డబ్బులేదు. ఎక్కడా అప్పు పుట్టలేదు. అవతల అత్యవసరం. ఎకౌంట్లో డబ్బుంది. అది అతని భార్యకి ఆవిడ తండ్రి ఏదైనా కొనుక్కోమని ఇచ్చాడు. ఇదీ విషయం అంటే చచ్చినా ఒప్పుకోదు. దానికో కారణం వుంది. వెంకటేశ్వర్రావింట్లో ఇంపోర్టెడ్ టి.వి. వుంది. చక్కగా విశాలమైన స్క్రీన్. నీడలు కనిపించేలా మెరిసే వుడెన్ కేబినెట్. ఎంతో బావుంటుంది. ఆ టీనర్ ఇండియన్ మేడ్ కలర్ టి.వి. కొనుక్కుంటూ ఇది చవగ్గా అమ్మేస్తుంటే ఇతను కొనుక్కున్నాడు. బ్రహ్మాండమైన సౌండ్. కాకపోతే బొమ్మ మాత్రం రాదు. దాన్లో ఏదో చిన్న పార్టు పోయింది. అది ఇంకెక్కడా దొరకదు బాంబేలో తప్ప. బాంబేకి ఉత్తరాల మీద ఉత్తరాలు రాస్తున్నాడు. రాయిస్తున్నాడు. ఈ వ్యవహారంలో విసిగిపోయింది వసంత. దీన్ని అవతల పారేసి మంచి టి.వి. కొనుక్కుందాం అని గొడవ చేస్తోంది. అలాటి పరిస్థితుల్లో తన పుట్టింటి వారిచ్చిన డబ్బుతో ఆపదుచులకి కలర్ టి వి. కొంటానంటే ఏ ఆడది అంగీకరిస్తుంది?

audachan.com

ఏం చెయ్యాలా అని తల పగల గొట్టుకుని చివరకు భార్యడబ్బు తీసి తండ్రి డ్రాఫ్ట్ పంపేశాడు. పి.యఫ్.లోన్‌కి అప్లికేషన్ పెట్టాడు.

అది రాగానే బాంక్‌లో పడేద్దాం అనుకున్నాడు. అతడలా అనుకున్న వారం తిరక్కుండానే అతనికో లెటర్ వచ్చింది. 'నీ భార్యకు ద్రోహం చేస్తున్నావ్! నీ బండారం బయట పెడతాను జాగ్రత్త' అంటూ. అతని గుండె ఠారుమంది. అసలే వసంతి మహా చిన్న నోరు. ఈ విషయం తెలిస్తే ఆరుబజార్లు వినిపించేలా గోల చేసేస్తుంది. తండ్రిని పిల్చి పంచాయితీ పెట్టేస్తుంది.

ఇంత బ్రతుకూ బ్రతికి మామగారి ఎదుట దోషిగా నిలబడటం ఎంత అవమానకరం? ఇలాటి డెలికేట్ సమస్య నుండి బయటపడాలంటే ఏదో మార్గం చూడాలి. ఈ సం.తా.ప.సం. ఏదో బాగానే వుంది. వాళ్ళు ఎలాగైనా అనుభవజ్ఞులు. ఏదో తంటాలుపడి ఈ ఆపద నుండి తప్పిస్తారు. కాపోతే కాస్తంత ఫీజ్ వసూలు చేస్తారు. అలా కాసేపు ఆలోచించి నిర్ణయానికి వచ్చేశాడు.

ఆ సాయంత్రం స్కూటరు తోసుకుంటూ ఇంటికి వెళ్తూ వుండగా అంతదూరాన కనిపించిన సింహాన్ని కేకేసి పిలిచాడు. మీతో మాట్లాడాలి అంటూనే స్కూటర్ స్టాండ్ వేసి పక్కకి తీసుకువెళ్ళి విషయం అంతా చెప్పాడు.

"ఏదో సంసారం అన్నాక సవాలక్ష సమస్యలుంటాయి. అవసరార్థం భార్య దగ్గర అబద్ధాలు ఆడతాం. అంతమాత్రాన బ్లాక్‌మెయిల్ చేసి సంసారంలో కలతలు తెచ్చిపెడితే ఎంత కష్టం చెప్పండి. ఆ వెధవలకు ఆమాత్రం ఇంగిత జ్ఞానం వున్నట్లు లేదు. మీరెలాగైనా నన్నీ ఆపదలోంచి బయటపడేయాలి." అన్నాడు.

గుండెనిండా వూపిరి పీల్చుకున్నాడు సింహం. "ఓ. అదెంత పని! చిటికెలో సాల్వ్ చేసేస్తాను. అసలా మాటకొస్తే మా వృత్తే అది!" అంటూ హామీ ఇచ్చేశాడు.

మర్నాడు పొద్దున్నే వెళ్ళి వెంకటేశ్వర్రావ్ నట్‌బోల్ట్‌ని కలుసుకుని "ఆ దుండగులను కనిపెట్టి పట్టుకుని గట్టి వార్నింగ్ ఇచ్చేశాం. ఇక వాళ్ళు మీజోలికి రారు." అని చెప్పాడు.

వెంకటేశ్వర్రావు నోరావలించాడు. "ఏవిటి ఇంత త్వరగా పట్టుకున్నారా!" అన్నాడు ఆశ్చర్యంగా.

"మరేమిటనుకున్నారు మా సంఘం అంటే. రాష్ట్రం అంతా మావాళ్ళు విస్తరించి వున్నారు. క్షణాల మీద అంచెలంచెలుగా కబురు అందిపోతుంది" అంటూ ఎదాపెదా కోసి పారేశాడు.

ఆశ్చర్యానందాలతో విన్నాడు నట్‌బోల్ట్ వెంకటేశ్వర్రావు. కృతజ్ఞతలు తెలుపుకుని "మీ ఫీజెంత?" అని అడిగాడు.

చాలా మొహమాటపడిపోయాడు సింహం. అతనెంతకీ చెప్పకపోవడంతో వెంకటేశ్వర్రావే యాభై రూపాయలు తీసి అతని చేతిలో పెట్టేశాడు. చాలా అని అడిగాడు.

"ఓ ఎక్కువ! మీరు మా సంఘం గురించి కాస్త ప్రచారం చెయ్యండి" అని చెప్పి శలవు తీసుకున్నాడు సింహం. ఆ డబ్బుతో మిఠాయి కొని చిన్నపిల్లలకు పంచిపెట్టాడు.

అతనికోరిక ప్రకారం సిన్సియర్‌గా ప్రచారం చేశాడు వెంకటేశ్వర్రావు. ఫలితం మూడోరోజు సాయంత్రానికి గుండు వెంకటేశ్వర్రావు, ఆ మర్నాడు మరో వెంకటేశ్వర్రావు అలా అలా అందరూ సింహం సహాయం అర్థించారు.

ఒక్కొక్కరే తన దగ్గరికి వస్తుంటే వారి వారి పేర్లను లిస్ట్‌లోంచి తొలగిస్తూ వచ్చాడు సింహం. చివరికి తన దగ్గరకు రానివారు ఇద్దరు తేలారు. రాజ్యలక్ష్మి భర్త వెంకట దక్షిణామూర్తి. లక్ష్మి అన్న వెంకటేశ్వర్లు.

దక్షిణామూర్తిని కలుసుకొని అరిగిపోయిన పాత రికార్డులా తమ సం.తా.ప.సం. గురించి చెప్పాడు. అవసరం అయితే సహాయం చేస్తానని కూడా చెప్పాడు. అంతా విని పేలవంగా నవ్వాడు దక్షిణామూర్తి.

"నిండా మునిగిన వాడికి చలేమిటని నన్ను ఏ బ్లాక్‌మెయిలర్ ఏం చేస్తాడు? నా ఉనికి మా వాళ్ళకి తెలియజేస్తాడు. వాళ్ళొచ్చి చావగొడతారు అంతేగా. కానీండి. ఈ వెధవ బ్రతకుకంటే అదే నయం." నిర్లిప్తంగా సమాధానం చెప్పి వెళ్ళిపోయాడు. అతని పరిస్థితి దయనీయంగా తయారైంది. ఉన్న కష్టాలు చాలక ఉద్యోగం కూడా వూడిపోయింది.

అతను వెళ్ళిన వైపే చూసి నిట్టూర్చాడు సింహం. అతని పేరు కూడా లిస్ట్‌లోంచి తొలగించేశాడు. ఇక మిగిలినవాడు వెంకటేశ్వర్లు.

వెంకటేశ్వర్లుని కలుసుకోడం కోసం ప్రయత్నించి సినిమాహాల్లో పట్టుకున్నాడు. అతి మర్యాదగా పలకరించాడు. వెంకటేశ్వర్లుకి సింహం మీద పీకలదాకా కోపంగా వుంది. అతడిని చూడగానే పట్టరానంత కోపం వచ్చింది. అతను పలకరించడం పాపం అన్నట్లు విరుచుకుపడ్డాడు. దుమ్మెత్తి పోశాడు.

అయినా సింహం చలించలేదు. "గతంగతః అదంతా మర్చిపోండి. నేను మీకు స్నేహితుడిని. మీకేదైనా అవసరం అయితే సహాయం చేస్తాను."

pustaka.com

అతని ధోరణికి మరింత ఒళ్ళు మండింది వెంకటేశ్వర్లుకి. "మీ బోడి సలహాలు, సహాయాలు ఎవరికీ అక్కర్లేదు. సమస్య పరిష్కారానికి ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో నాకు బాగా తెలుసు. నాకు సహాయం చేసేవాళ్ళు బోలెడుమంది వున్నారు. ఇక మీరు మీ దారిన పోండి. నాజోలికి వచ్చే ప్రయత్నం చేస్తే మర్యాద దక్కదు." అన్నాడు చిరాగ్గా.

గిర్రున వెనుదిరిగాడు సింహం! "ఎంత ధైర్యం? ఇక వీడిని వెయ్యి కళ్ళతో కనిపెట్టి వుండాలి. అన్నింటికీ తెగించాడు." అనుకున్నాడు.

ఆ సాయంత్రం వసుంధర దగ్గరకు పరిగెట్టాడు. పనుల వత్తిడివల్ల శల మునకలైపోయి వుంది వసుంధర. ఈ విషయం తెలుసుకుని గాభరాపడింది. మనం చాలా జాగ్రత్తగా వుండాలి. ఎందుకైనా మంచిది. అతడినో కంట కనిపెట్టి వుండండి. లక్ష్మికి జాగ్రత్తగా వుండమని కబురు పంపించండి అంటూ సలహాలు చెప్పింది.

* * *

సినిమాహాలులో సింహంతో తగాదా పెట్టుకున్న వెంకటేశ్వర్లు తిన్నగా చలం దగ్గరకు వెళ్ళాడు. జరిగినది అంతా చెప్పాడు. "చేసింది చాలక తగుదునమ్మా అంటూ సహాయం చేస్తాడుట." అన్నాడు ఉక్రోషంగా.

"వూరికే ఉడుక్కుంటే ఏం లాభం? వాడిని దెబ్బకొట్టే మార్గం ఆలోచించాలి. నా మాట విను. ఆయన దగ్గరికి వెళ్దాం. నేను అడిగాను. తప్పకుండా సహాయం చేస్తానన్నారు. నువ్వు కూడా వచ్చి అడిగితే ఇంకా బావుంటుంది". అన్నాడు చలం.

కాస్త తటపటాయించి సరేనన్నాడు వెంకటేశ్వర్లు. "సాయంత్రం వెళ్దాం. ఇప్పుడాయన నిద్రపోతూ వుంటాడు" అన్నాడు చలం.

వసుంధర ఇంటినుంచి వస్తున్న సింహానికి వెంకటేశ్వర్లు, చలం కనిపించారు. ఎప్పుడూలా టౌన్ వైపుకి కాకుండా మరోదారిని వెళ్తున్న ఆ ఇద్దర్నీ చూసి ఎలర్ట్ అయిపోయాడు సింహం. జాగ్రత్తగా వాళ్ళను ఫాలో అయ్యాడు. వాళ్ళు వెళ్తున్న ప్రదేశం చూస్తే ఆశ్చర్యం వేసింది అతనికి.

వాళ్ళిద్దరూ గమ్యం చేరారు. మస్తాన్ మెలకువగానే వున్నాడు. అంతేకాదు మంచి మూడ్‌లో కూడా వున్నాడు. వెంకటేశ్వర్లుని మస్తాన్‌కి పరిచయం చేశాడు చలం. ఆదరించాడు మస్తాన్. తను తాగుతున్న ద్రవం ఆఫర్ చేశాడు. వెంకటేశ్వర్లు వద్దన్నాడు. చలం మాత్రం అందుకున్నాడు.

మరోసారి పరిస్థితి వివరించాడు వెంకటేశ్వర్లు. అంతా విని ధైర్యం చెప్పాడు మస్తాన్. 'ఆ పిల్లని బెదిరించడం, విసిగించడం మానేయ్. ప్రేమగా చూసుకో. రేపు అనుమానం రాకుండా పని జరగాలంటే ఇదే మార్గం. పన్లో పని మీ నాన్నని కూడా కాకా పట్టు అంటూ ఆదేశాలిచ్చాడు.

గుడిసె పక్కన పిల్లిలా జేరి వింటూ వున్న సింహానికి వాళ్ళ మాటలు స్పష్టంగా వినిపించలేదు కానీ లక్ష్మి పేరు మాటల్లో దొర్లడం మాత్రం వినిపించింది. వాళ్ళిద్దరూ వెళ్ళిపోయేదాకా అలాగే వుండి ఆ తర్వాత చల్లగా అక్కడినించి జారుకున్నాడు. ఆ ప్రాంతంలోనే కాసేపు తిరిగి ఇద్దరు ముగ్గుర్ని పట్టుకుని సారాకి డబ్బులిస్తానని ఆశపెట్టి మస్తాన్ వివరాలు రాబట్టాడు. అతని అనుమానం మరింత బలపడింది. అక్కడినించి తిన్నగా ఇంటికి వెళ్ళాడు. ఆలయానికి వెళ్ళబోతున్న మాధవ్‌ని పట్టుకుని మూడుముక్కల్లో పరిస్థితి వివరించాడు.

'లక్ష్మిని హెచ్చరించు. వారి ఇంట్లో వారి ప్రవర్తనలో ఏమాత్రం మార్పు వచ్చినా, ఏ చిన్న సంఘటన జరిగినా మర్చిపోకుండా నీతో చెప్పమను. ఏమాత్రం అసహజ వాతావరణం ఏర్పడినా క్షణం అక్కడ వుండకుండా వెంకట్రావుగారింటికి వచ్చేయమని చెప్పు." అన్నాడు.

కంగారు పడిపోయాడు మాధవ్. "ఏమిటీ ప్రమాదం దగ్గర్లోకి వచ్చేసిందా?" అన్నాడు గాభరాగా.

"చెప్పి దగ్గరికి రావడానికి అదేమైనా రైలా, విమానమా? అదెప్పుడొచ్చి పడుతుందో అని మనమే జాగ్రత్తగా వుండాలి. మరో విషయం నువ్విలా గాభరాపడిపోయి ఆవిడని అదరగొట్టకు. కామ్‌గా వుండు." అన్నాడు సింహం.

మాధవ్‌ని అలా పంపించి ఓ కప్పు కాఫీ గొంతులో పోసుకొని వసుంధర దగ్గరికి పరిగెట్టాడు.

"మళ్ళీ వచ్చారేం?" అంటూ తెల్లబోయింది వసుంధర.

"కొత్త కొత్త విషయాలు బయటపడుతున్నాయ్. నీ బోడి సహాయం నాకక్కర్లేదని వెంకటేశ్వర్లు అంటే వూరికేనేమో అనుకున్నాను. కానీ అతగాడు ఇంకొకరి సహాయం అర్థించాడు.

ఆ వ్యక్తి ఎవరా అని ఆరా తీస్తే వింత విషయాలు తెలిశాయి. అతని పేరు మస్తాన్. నెల్రోజుల క్రింద ఈ ఊరు వచ్చాడు. ఎందుకొచ్చాడో తెలియదు. ఈ ఊర్లో అతనికి సంబంధించిన వాళ్ళెవరూ లేరు. ఏపనీ చెయ్యడు. అసలు

Sulekha.com

గుడిసెలోంచి బయటికి రాడు. ఆ గుడిసెలోనే అన్ని సౌకర్యాలు వున్నాయి. దబ్బు మంచినీళ్ళలా ఖర్చు పెడుతున్నాడు. ఆ చుట్టుపక్కల వాళ్ళందరికీ అతడంటే బోలెడంత ఇష్టం వున్నట్లు కనబడుతోంది." అంటూ వివరాలన్నీ చెప్పాడు.

శ్రద్ధగా వింది వసుంధర. కాస్సేపు ఆలోచించి దీర్ఘంగా నిట్టూర్చింది. "అయితే కేసు రోజు రోజుకీ జటిలం అయిపోతోంది. ప్రత్యర్థి మనం అనుకున్నంత బలహీనుడు కాడు. వెనక సపోర్ట్ వుంది. అయినా ఫర్వాలేదు. మనకేం తక్కువ బలగంలేదు. అవసరం అయితే అన్నింటికీ సిద్ధంఅయి మరీ రంగంలోకి దూకే మెరికల్లాటి వాళ్ళున్నారు." అంది.

"మనం చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. వాళ్ళ ఎత్తుకి పై ఎత్తు వేసుకుంటూ పోవాలి. రెడ్ హేండెడ్‌గా పట్టుకుని చట్టానికి అప్పగించాలి". అన్నాడు సింహం.

ఇద్దరూ చాలాసేపు ఆ విషయం మీదే సీరియస్‌గా మాట్లాడుకున్నారు. తరువాత అక్కడినించి బయలుదేరి తిన్నగా ఏకదంతం గారింటికి వెళ్ళాడు. ఆయన ఊళ్ళోలేడు. టౌన్‌కి వెళ్ళాడు. శ్యామల పలకరించి కూర్చోబెట్టి మంచినీళ్ళు ఇచ్చింది. కాఫీ కూడా ఇస్తానంది గానీ అతనే వద్దన్నాడు. కాసేపు కష్టసుఖాలు మాట్లాడి తను చెప్పాల్సింది చెప్పేసి బయట పడ్డాడు.

ఇతను ఏకదంతం ఇంట్లోంచి రావడం సింగడి కంటపడనే పడింది. వెంటనే మస్తాన్ దగ్గరికి వెళ్ళాడు. వెళ్ళడం వెళ్ళడం ఆదరాబాదరా ఆయాసపడుతూ పాయింట్‌లోకి దిగిపోయాడు." ఆ సింహం ఇందాక ఈ గూడెంలోకి వచ్చి నీ గురించి అందర్నీ అడిగి వెళ్ళాడుట. ఇప్పుడే పోలీస్ ఇనస్పెక్టర్ ఇంట్లోంచి వస్తూ వుంటే నేను స్వయంగా చూశాను." అంటూ చెప్పేశాడు.

తోక తొక్కిన తాచులా లేచాడు మస్తాన్. "పోన్లే పిల్ల వెధవ అని వూరుకుంటూ వుంటే మరీ నెత్తికెక్కుతున్నాడు. వాడి అంతు చూడాలి. కాళ్ళూ చేతులూ విరిచేసి ఎందుకూ పనికిరాకుండా చేసి తమాషా చూడాలి. వాడు ఒంటరిగా ఎక్కడ దొరుకుతాడు" అని అడిగాడు.

"రోజూ రాత్రి పూట సుబ్బారావు పొలానికి కాపలా పడుకుంటాడు వంటరిగా." చెప్పేశాడు సింగడు.

"అయితే ఇంకేం? ఈ రాత్రికే పని పూర్తి చేసేద్దాం." అన్నాడు మస్తాన్.

* * *

సాయంత్రం ప్రదక్షిణాల కార్యక్రమం ముగిశాక అలవాటు ప్రకారం మాధవ్, లక్ష్మి కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. కాసేపు-పిచ్చాపాటీ మాట్లాడి నెమ్మదిగా

సింహం చెప్పమన్న సమాచారం చెప్పాడు. లక్ష్మి బెదిరిపోయి ఏడిచినంత పని చేసింది.

మాధవ్ ధైర్యం చెప్పాడు. "మీకెందుకు మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డం. ఏదైనా అనుమానం తగిలే ఒక్కమాట నాకు తెలియజేయండి చాలు. ఆపైన జరగాల్సింది నేను చూసుకుంటాను" అంటూ హీరోలా ప్రమాణం చేసి పారేశాడు.

"మీకోసం ఒక్క ప్రమాదం కాదు. వెయ్యిసార్లు ప్రమాదంలో తలదూర్చమన్నా సిద్ధమే" అన్నాడు అట్టే ఆలోచించకుండా.

అభిమానంతో, సిగ్గుతో అతనివంక చూసి అందంగా నవ్వింది లక్ష్మి. "ఎందుకు నేనంటే మీకింత ఇది?" అడిగింది మెల్లిగా.

బుర్రగోక్కుని ఓ వెధవ నవ్వు నవ్వేశాడు మాధవ్.

నాకేం లేదు. సింహం చెప్పమన్నాడు అంటూ నిజం చెప్పేద్దాం అనుకున్నాడు గానీ, తన ఇమేజ్ దెబ్బ తింటుందని మానేశాడు. లక్ష్మి వెళ్ళిపోయాక అతని అంతరాత్మ నిలదీసింది. "మన్లో మనమాట! నిజంగా సింహం చెప్పాడనే ఈ వ్యవహారంలో తలదూర్చావా! నిజం చెప్పు!" అంటూ ప్రశ్నించేసరికీ తడబడిపోయాడు మాధవ్. తలవంచుకున్నాడు.

"ఏమిటీ వెర్రి. పూటకు ఠికాణా లేని నువ్వెక్కడ, ఆవిడెక్కడ. నిజంగా ఆలోచిస్తే అవిడ చెప్పలు తుడిచే అర్హత అయినా వుందా నీకు?" మందలించింది అంతరాత్మ.

బరువుగా నిట్టూర్చి శూన్యంలోకి చూశాడు మాధవ్. అంతరాత్మ కూడా నిట్టూర్చింది. "అంతేలే! అందమైన అమ్మాయి పట్ల ఆకర్షితులవడం అబ్బాయికి జన్మహక్కు. ఇక్కడ తారతమ్యాలు గుర్తురావు. ఇనప ముక్కా నువ్వెక్కడా, అయస్కాంతం ఎక్కడా దాని జోలికి పోకమ్మా అంటే ఇనపముక్క వింటుందా? ఏదీ అంతే. కానీయ్ ఏం జరుగుతుందో చూద్దాం!" అంటూ వేదాంతం బోధించింది. మాధవ్ మనసంతా అదోలా అయిపోయింది.

* * *

అందుకే సింహం పడుకోడానికి వెళ్తూ వుంటే "నేనూ రానా? నాకివాళెందుకో మూడ్ బాగాలేదు. కాసేపు నీతో కబుర్లు చెప్పాలని వుంది." అంటూ అడిగాడు మాధవ్.

"నీతో కబుర్లు చెప్పే మూడ్ లేదురా నాకు. నువ్విక్కడే పడుకో!" అని చెప్పేసి వెళ్ళిపోయాడు సింహం.

gudachari.com

మిత్రుడిని కాసేపు తిట్టుకుని ఆరుబైట మంచం వేసుకుని పడుకున్నాడు మాధవ్. అతను అలా ఇంట్లో పడుకోడం ఎంతో మంచిది అయింది. పదిగంటలు అయింది. వెంకట్రావుకి వున్నట్టుండి చిరాకు. ఏదో చెప్పలేని ఆదుర్దా కలిగి భార్యను లేపాడు. ఈ సందడికి మాధవ్ కూడా లేచాడు. వేడిగా పాలు తీసుకొచ్చి ఇచ్చి తాగమంది కాంతమ్మ. తాగలేక పోయాడాయన. నేను వెళ్ళి డాక్టరుగారిని తీసుకొస్తాను అంటా షర్టు వేసుకుని గబగబ డాక్టర్ గారింటికి వెళ్ళాడు. సమయానికి ఆయన ఇంట్లో లేడు. 'పక్క ఊళ్ళో ఎవరో పెళ్ళికి పిలిస్తే వెళ్ళారు. వచ్చేసరికి పొద్దుపోతుంది. రేప్పొద్దున్నే పంపిస్తాను.' అంది ఆయన భార్య. "సరే" అంటూ వెనక్కి తిరిగిన మాధవ్‌కి అడుగు ముందుకి పడలేదు. ఎక్కడికి వెళ్ళారు, ఏమిటి వివరాలు ఆవిడ తెలుసుకొని బయటికి వచ్చాడు.

ఏదో కంగారు, భయం. అప్పటికప్పుడే డాక్టర్ వస్తే బాగుండుననే బలమైన కోరిక! "ఎలా వెళ్ళాలి? సైకిళ్ళూ, స్కూటర్లూ వున్నాయి. కానీ ఎవరిస్తారు? తనకంటే అసలు ఇవ్వరు. వాహనం లేకుండా ఎలా వెళ్ళడం?" కాసేపు తర్జన భర్జన పడి కాళ్ళకు పనిచెప్పాడు.

అయిదు కిలోమీటర్లు పరిగెడుతూనే వెళ్ళాడు. పెళ్ళింట్లో జోరబడి పోయి డాక్టర్ని వెతికి పట్టుకుని పరిస్థితి వివరించాడు.

ఇతడినీ ఇతడి వాలకాన్నీ చూసి మారు మాట్లాడకుండా చేతిలో వున్న అక్షింతలు పక్క వాళ్ళ చేతులో పెట్టి బయటికి వచ్చి స్కూటరెక్కాడు డాక్టర్. ఇంటికెళ్ళి మందులు తీసుకుని వెంకట్రావు గారింటికి వెళ్ళాడు.

అక్కడ పరిస్థితి ప్రమాదంగానే వుంది. ఇరుగూ పొరుగూ గుమిగూడారు. చూడగానే తెలిసిపోయిందాయనకి. స్ట్రోక్. ఆలస్యం కాకుండా చకచక ఇంజక్షన్ ఇచ్చేశాడు. మందులు పనిచేశాయి. వెంకట్రావుగారి పరిస్థితి మెరుగైంది. ఆ యాతన తగ్గి కళ్ళు మూసుకుని నిద్రలోకి జారుకున్నాడు.

అప్పుడు ఊపిరి పీల్చుకున్నాడు డాక్టర్. ఎవరో కాఫీ తీసుకొచ్చి ఇస్తే తాగి స్థిమిత పడ్డాడు. ఇంటికి వెళ్తానని బయలుదేరాడు. వద్దని బ్రతిమాలింది కాంతమ్మ. రిలాక్స్ అయాడు డాక్టర్. అప్పుడు వచ్చాడు మాధవ్ కాళ్ళీడ్చుకుంటూ. అతడిని చూడగానే నాలిక కరుచుకున్నాడు డాక్టర్. 'అరెరె హడావిడిలో మర్చిపోయాను. స్కూటర్ మీద తీసుకురావలిసింది' అని నొచ్చుకున్నాడు. అయితే మాధవ్ మాత్రం బాధపడలేదు. జరిగినది అంతా తెలుసుకుని తన శ్రమ ఫలించినందుకు ఆనందించాడు.

కాంతమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుని మాధవ్ తల నిమిరింది. "కన్న కొడుకులా సమయానికి ఆదుకున్నావు నాయనా! అంది. అతనికీ కళ్ళనీళ్ళు తిరిగాయి. తల వంచుకుని వుండిపోయాడు. ఇతరులకు సాయపడాలని సింహం ఎందుకు తాపత్రయపడతాడో అప్పుడు అర్థం అయింది. ఈ ఆనందం ఇంకెందులోనూ లేదనిపించింది.

ఇక్కడ ఇంట్లో ఇదంతా జరిగిన కాసేపటికి అర్ధరాత్రి దాటాక సింహం మీద దండయాత్ర జరిగింది. తను ఎన్నో సార్లు ప్రయోగించిన ప్రయోగం నిద్రలో వున్న మనిషిని మెడ నులిమి చంపే ప్లాన్ వేసుకుని సింహం దగ్గరకు వచ్చాడు మస్తాన్. కాస్త దూరంలో వుండగానే అలికిడికి కుక్క అరిచింది. దాంతో లేచాడు సింహం. ఎదురుగా మనిషిని చూసి ఎలర్ట్ అయిపోయి మంచం మీదినుంచి దూకాడు. వెనకనించి పట్టుకోవాలని ప్రయత్నించాడు మస్తాన్. కానీ వీలుకాలేదు. అంతలో ఒకదానివెంట మరొకటిగా కుక్కలు అరవడం మొదలుపెట్టాయి. ఇక లాభం లేదని కాలికి బుద్ధి చెప్పాడు మస్తాన్.

వెంట పడబోయిన సింహానికి కనిపించకుండా క్షణంలో చీకట్లోకి మాయం అయిపోయాడు. ఈ గొడవకి చుట్టుపక్కల పొలాల కాపలా వాళ్ళు లేచి పరిగెట్టుకుని వచ్చారు. క్షణాల మీద కబురు ఇంటికి చేరింది.

"భగవంతుడా ఇవ్వాళ లేచి ఎవరి మొహం చూశాం!" అనుకుంది కాంతమ్మ.

మాధవ్ వెంటనే పొలం దగ్గరికి పరిగెట్టాడు. మిత్రుడిని క్షేమంగా చూసిగానీ తృప్తి పడలేదు."

"ఎంత ప్రమాదం తప్పిందిరా!" అంటూ కళ్ళనీళ్ళ పర్యంతం అయిపోయాడు.

"సర్లే నీ మొహం. ఇప్పుడే అసలు యుద్ధం ప్రారంభం అయింది. ఇక ముందు అనుక్షణం ఇలాటి ఆపదలు ఎదురౌతాయి. మరో విషయం. ఇవాళ నాకు అయింది. రేపు నీ మీద కూడా దాడి జరగచ్చు. జాగ్రత్తగా వుండు". అంటూ వున్న విషయం స్పష్టంగా చెప్పేశాడు.

గతుక్కుమని సర్దుకున్నాడు మాధవ్, "మనం అనుకున్న పని సవ్యంగా నెరవేరాలే గానీ ఈ ప్రమాదాలు లెక్క చేస్తామా?" అన్నాడు ధీమాగా.

"స్నేహితుడి ధైర్యం చూసి ఆనందపడిపోయాడు సింహం. ఇంటి దగ్గర జరిగిన హడావిడి గురించి చెప్పాడు మాధవ్. ప్రమాదం తప్పినందుకు భగవంతుడికి కృతజ్ఞతలు తెలుపుకుని మాధవ్‌ని అభినందించాడు సింహం. అప్పుడు టైమ్ మూడుగంటలు అయింది. "పద ఇంటికెళ్దాం!" అన్నాడు మాధవ్.

gudachari.com

"నేనైనాను. ఇప్పుడు ఇక్కడినించి కదిలేత్తే భయపడి పారిపోయినట్లు అవుతుంది. ఏది ఏమైనా నేనిక్కడే పడుకోవాలి." అన్నాడు సింహం.

"మరెలారా? నేను ఇక్కడ వుండిపోతే అక్కడ అమ్మగారు కంగారు పడతారేమో. నిన్ను వంటరిగా వదిలి వెళ్ళడానికి మనసొప్పడంలేదు."అన్నాడు మాధవ్.

"నాకేం భయం లేదు. ఇవాల్టికి మళ్ళీ రాడు వాడు. నిశ్చింతగా వెళ్ళు. మళ్ళీ అక్కడ ఏదైనా అవసరం రావచ్చు. నువ్వెళ్ళు." బలవంతం చేశాడు సింహం.

విధిలేక బయలుదేరాడు మాధవ్. కానీ మనసులో భయంగానే వుందతనికి. ఏం చెయ్యాలా! అని ఆలోచించి హనుమంతు ఇంటికి వెళ్ళి అతడిని నిద్రలేపి పరిస్థితి వివరించాడు. "నేను వెళ్తాను. మీరెళ్ళి ఇంటిదగ్గర పడుకోండి." హామీ ఇచ్చి వెంటనే బయలుదేరాడు హనుమంతు.

నిశ్చింతగా నిద్రపోతానని అన్నాడేగాని సింహానికి నిద్ర పట్టలేదు. హనుమంతు అంత దూరంలో వుండగానే లేచి కూర్చుని పలకరించాడు. దగ్గరకు వచ్చి పక్కనే కూర్చున్నాడు హనుమంతు.

ఎంత ఘోరం జరిగింది అంటూ పరామర్శించి, మీరు పడుకోండి. నేను మేలుకొని వుంటా అన్నాడు. "నిద్ర రావడంలేదు హనుమంతూ! కబుర్లు" చెప్పు అన్నాడు సింహం.

"నా దగ్గరేం కబుర్లుంటాయి బాబూ. నా మొహం. మీరు చెప్పండి. నేను వింటాను." అంటూనే సింహం వంక చూసి "అదేం బాబూ అలా వున్నారేం?" కంగారు పడిపోయాడు.

"నా మనసేం బాగాలేదు హనుమంతూ! నువ్వే కబుర్లు చెప్పు. నీ చిన్నతనం గురించి చెప్పు. సుబ్బారావుగారి దగ్గర నువ్వు ఎన్నాళ్ళ బట్టి పనిచేస్తున్నావో చెప్పు." అన్నాడు.

"నా బుద్ధి తెలిసే సరికే బాబుగారింట్లో గొడ్లు కాచుకుంటూ వున్నాను." అంటూ మొదలుపెట్టి చెప్పుకుంటూ వచ్చాడు. అతని మాటల వల్ల ఆ కుటుంబం పట్ల అతనికెంతో విశ్వాసం అనీ నిజానికి అతనికి వెంకటేశ్వర్లుకంటే కూడా సుబ్బారావు పట్ల గౌరవం ఎక్కువనీ గ్రహించాడు సింహం.

"హనుమంతూ! నువ్వు నాకో సహాయం చెయ్యాలి. ఇప్పుడీ పరిస్థితిలో నీకంటే వేరే ఆధారం లేదు నాకు. " అన్నాడు ఆదరంగా.

"అదేమిటి బాబూ! మీకు నా సహాయమా?" ఆశ్చర్యపోయాడు హనుమంతు.

"అవును హనుమంతూ! నువ్వే నాకు సహాయపడగలవు. నీమీద నాకు నమ్మకం వుంది. నువ్వు వెంకటేశ్వర్లుకి కూరల దొంగతనంలో సహాయం చేశావని నాకు బాగా తెలుసు. అయినా ఆ ఇంటిమీద విశ్వాసం వున్నవాడినీ. అవసరం అయితే వాళ్ళ మంచికోసం ఏమైనా చేస్తావనీ. నమ్మి నీతో ఈ విషయం చెప్తున్నాను. నేను చెప్పేది శాంతంగా విని నాకు సహాయపడతావో, లేక ఈ రహస్యం బట్టబయలు చేసి ఆ పక్షాన పారిపోతావో నీ ఇష్టం". ఉపోద్ఘాతం ఇచ్చి నెమ్మదిగా అసలు విషయం బైట పెట్టాడు.

సింహం చెప్పినదంతా శ్రద్ధగా విన్న హనుమంతు మొహం పాలిపోయింది. "నిజంగానా బాబూ! మీరు చెప్పినదంతా నిజమేనా?" నమ్మలేకుండా అడిగాడు.

"నిజమే హనుమంతూ. ఇది చేదునిజం. డబ్బుకోసం ఈ పనికి పూనుకున్నాడు అతను. ఇన్నాళ్ళూ లక్ష్మికి పెళ్ళి కాకుండా పోడానికి కూడా అతనే కారణం అని నా అనుమానం. ఆవిడ ప్రాణాలకీ ఎసరు పెట్టాడు. నేను హెచ్చరించినా లెక్క చెయ్యలేదు. ఆ ఊరి చివరి గుడిసెలో వుండే మస్తాన్‌తో చేతులు కలిపాడు. ఈపూట నా మీద దండయాత్ర చేశాడు. ఇంతకు తెగించిన వాడు ఏమైనా చేస్తాడు. నాకు నీ సహాయం కావాలి హనుమంతూ. వూరికే నాకు మాట ఇచ్చి అటు మళ్ళటం కాదు. నిజంగా నాకు సహాయం చెయ్యాలి నువ్వు." అర్థించాడు సింహం.

హనుమంతు నోటమాట రాకుండా కాసేపు రాయిలా కూర్చుండి పోయాడు. "ఆ ఇంటి ఉప్పు తిని పెరిగాను. అమ్మగారు పసివాడినని పాచిపోయిన కూడు కాకుండా తను తినేదే నా కడుపు నిండా పెట్టడం నాకింకా గుర్తు. పాలేరు వెధవనైనా స్వంత బిడ్డలా చూస్తారు అయ్యగారు. ఇక లక్ష్మమ్మని ఎత్తుకుని ఆడించాను బాబూ. ఏదో సారా డబ్బులకీ బీడీ డబ్బులకి ఆశపడి అబ్బాయిగారికి సహాయం చేసిన మాట నిజమే. ఇంత మాత్రాన ఆయన చేసే అడ్డమైన పన్లకీ వెంట వుంటానా? నాకే సంగతే తెలీదు. ఏదో పిల్లా జెల్లా గలవాడు చేతి ఖర్చులకి కక్కుర్తి పడుతున్నాడనుకున్నానే గానీ ఆ డబ్బు కోసం చెల్లెలికే ఎసరు పెడుతున్నాడని తెలిసేసరికి ఉప్పు పాతర వేసేవాడిని. అసలు ఆయన్ని కాదు బాబూ, ఆ చలం గాడిని అనాలి. వాడే అబ్బాయిగారిని పాడుచేస్తోంది". ఆవేశపడ్డాడు హనుమంతు.

"కారణం ఎవరైనా ప్రమాదం లక్ష్మికేగా. లక్ష్మిని కాపాడిన తరువాత వాడికి బుద్ధి చెప్పటం తేలికే." అన్నాడు సింహం.

"నా బొందిలో ప్రాణం వుండగా అమ్మాయిగారికేం కాదు బాబూ. ఏం చెయ్యాలో చెప్పండి." సంసిద్ధుడైపోయాడు హనుమంతు.

gudachari.com

"వాళ్ళతో చేరి నమ్మకంగా వుంటూనే వాళ్ళ ప్లానేమిటో కనిపెట్టి నాకు చెప్పాలి. లక్ష్మిని వేయికళ్ళ కనిపెట్టి వుండాలి." రెండు వరాలూ కోరుకున్నాడు సింహం.

రెండు పన్లూ అతిశ్రద్ధగా చేస్తానని హామీ ఇచ్చేశాడు హనుమంతు. గుండెనిండా ఊపిరి పీల్చుకున్నాడు సింహం. నిశ్చింతగా నిద్రపోయాడు.

* * *

అక్కడ లక్ష్మి కూడా చాలా రోజుల తర్వాత నిశ్చింతగా నిద్రపోయింది. అందుకు తగిన కారణమే వుంది. ఆరోజు సాయంత్రం అన్నయ్య బయటనించీ వచ్చీ రాగానే "అమ్మాయ్ లక్ష్మీ!" అంటూ ఆదరంగా పిలిస్తే మళ్ళీం హితబోధ వినాలో! అని భయపడుతూ వెళ్ళింది. దగ్గర కూర్చోబెట్టుకుని ఆదరంగా మాట్లాడాడు. తనకిష్టమైన జిలేబీలు తినమని ఇచ్చాడు. ఇదంతా చూసి అలవాటు ప్రకారం మాతి వంకరు తిప్పకుండా వదినగారు కూడా ఆప్యాయంగానే మాట్లాడింది. విశేషం ఏమిటంటే మాట్లాడినంత సేపూ చలం ప్రసక్తి కూడా ఎత్తలేదు. చాలారోజులుగా ఇంట్లోని కలుషిత వాతావరణంతో బాధపడుతున్న లక్ష్మి మనసు చల్లబడింది.

వసుంధర మాత్రం నిద్ర ఆలోచన మానేసి హడావిడిగా తిరుగుతోంది. టౌన్‌కి బాగా దూరంగా ఓ చిన్న ఫాక్టరీ వుంది. ఆ ఫాక్టరీలో పనిచేసే వర్కర్లకి జీతాలు బాగానే ఇస్తారు. కానీ ఏం లాభం. రాబడిలో సగం ఆ పక్కనే వున్న సారా కొట్టుకే సరిపోతోంది. ఫలితం వాళ్ళ కాలనీ ప్రత్యక్ష నరకంలా తయారైంది. ఆ వర్కర్లలో ఒకరి భార్య కాస్త చదువుకుంది. ఆ అమ్మాయి స్నేహని సహాయం కోరింది. స్నేహ వాళ్ళకు అభయం ఇచ్చింది.

ప్రతిరోజూ సాయంత్రం గ్రూప్‌గా వెళ్ళి తాగుడు వల్ల కలిగే నష్టాలను, అది మానేస్తే కలిగే లాభాలనూ వివరించి చెప్పారు. ఆవేళ జీతాల రోజు కాబట్టి స్నేహ సభ్యులందరూ గుంపుగా వెళ్ళి సారా కొట్టు ముందు బైఠాయించారు. వస్తున్న ప్రతివారినీ బ్రతిమాలి బామాలి బెదిరించి వెనక్కి పంపించే ప్రయత్నం చేస్తున్నారు.

ఇలా ఓ నాలుగైదు రోజులు బైఠాఇస్తే వాళ్ళ దగ్గర డబ్బులు ఖర్చైపోతాయి. ఆ తర్వాత తాగినా మరీ సగం జీతం తాగేసే అవకాశం వుండదు. అదీ వసుంధర ఆశ. స్కూటరేసుకుని సారా కొట్టుకీ, కాలనీకి తిరుగుతూనే వుంది.

* * *

ఏకదంతంగారి పరిస్థితి కూడా ఇంచుమించు అలాగే వుంది. ఇంట్లోంచి వాకిట్లోకి వాకిట్లోంచి ఇంట్లోకి పచార్లు చేస్తున్నాడు. రాత్రి ఇంటికి రాగానే వాకిట్లో ఎదురైంది కూతురు. అక్కడికి అక్కడే ఆపేసి "నాన్నా ఇందాక అతనొచ్చాడు నీకోసం.

తన పని చివరిదశకి వచ్చేసిందట. నీ సహాయం కోసం వచ్చాడు. రాగానే నీకు చెప్తాడుట. నువ్వు వెంటనే అతను కోరినట్లు చేయాలిట." అంటూ చెప్పేసింది.

చిర్రెత్తు కొచ్చిందాయనకి. "ఎప్పుడొచ్చాడు?" కరిచినట్లు అడిగాడు.

"ఏమో! కరెక్ట్‌గా టైం చూడలేదు." చెప్పింది.

"ఏమిటా పెడసరం సమాధానం? సరిగ్గా చెప్పలేవూ?" కసిరాడు.

"వార్తలైపోతూ వుండగా వచ్చాడు. మీకోసం వెయిట్ చేస్తానని ఇప్పటిదాకా కూర్చున్నాడు. మీరెంతకీ రాకపోయేసరికి వెళ్ళిపోయాడు." అంటే గంటపైగా కూర్చున్నాడా. ఒళ్ళుమండిపోయింది. కూతుర్ని చీవాట్లు వేశారు. ఇదంతా చూసి లోపలినుంచి వచ్చేసింది సుభద్ర. ఆయన్ని చివాట్లు వేసేసింది. ఏం చెయ్యాలో తోచక అటునించి ఇటు ఇటునించి అటు తిరుగుతున్నాడు.

* * *

తెల్లవారింది. దెబ్బతిన్న పులిలా వున్నాడు మస్తాన్. సింహం తప్పించుకోవడం చిన్నతనంగా అనిపించింది మస్తాన్‌కి. "వాడిమీద ఎలాగైనా దెబ్బ తీయాలి." కుమిలిపోతూ వుండగానే సింగడు వచ్చాడు. చాలామందికి తెలిసిపోయింది ఈ విషయం. అందరూ అతగాడిని హీరోగా పొగిడి మిమ్మల్ని పిరికిపంద అంటున్నారు అంటూ చెప్పేసరికి, కోతి నిప్పు తొక్కినట్లు అయింది.

గంతులేశాడు. 'ఇవాళ చూపిస్తాను నా తడాఖా అన్నాడు. అతనలా చూపించి వుంటే సింహానికి ముప్పు వాటిల్లేదేమో. కానీ అలా జరగలేదు. ఉదయం తొమ్మిది గంటలకు ఒక గడ్డం మనిషి మస్తాన్ దగ్గరకు వచ్చాడు.

అతడిని గుర్తు పట్టి లోపలికి తీసికెళ్ళాడు మస్తాన్. "గురువా! నిన్ను అర్జెంటుగా రమ్మన్నాడు దొరగారు." అన్నాడు ఆ గడ్డంవాడు.

"మరైతే కేసు?" అడిగాడు మస్తాన్.

"కేసు మాఫ్ చేయించేందుకు గట్టిగా చూస్తున్నాడు దొర. అయినా ఇప్పుడా కేసు ఎవడికీ పట్టదులే. ఎలక్షన్ వస్తోంది. కిందటిసారి గెలిచినాయన్ని చంపి రానికోసం తంటాలు పడ్డాం కదా! ఈసారి అవన్నీ కాకుండా మనమే గెలవాలనుకుంటున్నాడు దొర. నువ్వు రావాల్ట." చెప్పాడు.

"ఎప్పుడు రమ్మన్నాడు?" అడిగాడు మస్తాన్.

"మంగళవారం రాత్రి బండి తీసుకొస్తాం. అంటే ఇంకా నాల్రోజులుంది. లోగా అన్ని ఏర్పాట్లూ చేసేస్తానన్నాడు." అని చెప్పి వెళ్ళిపోయాడు ఆ గడ్డం మనిషి.

భలే సంతోషం వేసింది మస్తాన్‌కి. ఈ దిక్కుమాలిన బ్రతుకు ఇక చెల్లు. మళ్ళీ రాజా బతుకు. కారు, వెంట సైన్యం. ఓహ్ దర్జా మే దర్జా. ఆ మూడ్‌లో సింహం గురించి ఆలోచించడం మానేశాడు. వేరే విషయం మీదికి మళ్ళింది అతని బుద్ధి.

ఆ మధ్యాహ్నం సింగడు వచ్చినప్పుడు ఈ కబురు చెప్పేశాడు. దిగాలు పడిపోయాడు సింగడు. "ఇంతర్జంటుగానా? ఇంకొన్నాళ్ళుంటానన్నారుగా?" దీన్నంగా అడిగాడు.

"అర్జంటు పనొచ్చింది. మా ఏరియా నాయకుడు అర్ధాంతరంగా చచ్చిపోయాడు. సీటు ఖాళీ అయింది. ఇప్పుడు బై ఎలక్షన్. నే వెళ్ళాలి. వెళ్ళేముందు మా దొరగారికి మీ ఊర్నించి మంచి ప్రెజెంటు తీసుకుపోయి ఇవ్వాలను కుంటున్నాను." అన్నాడు మస్తాన్.

ఎలాగూ వెళ్ళిపోతున్నాడు. ఈ రెండ్రోజులూ బాగా కాకాపట్టి లాభం పొందాలనుకున్నాడు సింగడు.

"తప్పకుండా తీసికెళ్ళండి. రోడ్డుమీద అద్దాలబండి సాంబయ్య మాంచి పెద్ద జిలేబీ చేస్తాడు. అది తీసికెళ్ళండి. ఫస్ట్‌క్లాసైన నెయ్యి దొరుకుతుంది. అలాటిది సిటీల్లో గాలించినా దొరకదు. ఇకపోతే కూరలు."

సింగడి మాట పూర్తి కాకుండానే పగలబడి నవ్వేశాడు మస్తాన్.

"ఓరి నిన్ను తగలెయ్యా! బహుమతులంటే ఇవా? మండినట్లే వుంది నీ తెలివి" ఎగతాళి చేశాడు.

"మరింకేం తీసికెళ్తారండీ?" బుర్ర గోక్కున్నాడు. "చెప్తారా"! అంటూ దగ్గరికి రమ్మని చెవిలో గుసగుసలాడాడు మస్తాన్.

"ఓర్నాయినో" గుండె బాదుకున్నాడు సింగడు.

"అదంతేలే! నువ్వు అర్జెంటుగా వెళ్ళి ఆ చలాన్ని పిల్చుకురా! ఆ వెంకటేశ్వర్లు రాకుండా చూడు. ఆ చలంగాడిని వంటరిగా పట్రా!" ఆజ్ఞాపించాడు.

గంటలో హాజరయాడు చలం. "ఎందుకో అర్జెంటుగా పిలిచారుట!"

"నేను నాల్రోజుల్లో ఊరు వదిలి వెళ్ళిపోతున్నాను." చల్లగా చెప్పాడు మస్తాన్.

అదిరిపడ్డాడు చలం. "వెళ్ళిపోతున్నారా? మరి నాగతి? ఈలోగా నా పెళ్ళి చేయించేస్తారా?" ఏడుపొక్కటే తక్కువ.

"ఆ విషయం మాట్లాడదామనే పిలిపించాను. నువ్వు నాకు ఎంతో నచ్చావు. మాకు నీలాటి మనుషుల అవసరం ఎంతైనా వుంది. నిన్ను నాతో తీసుకెళ్తాను. వస్తావా?"

చలం తెల్లబోయాడు. అతని గేంగులోని మనుషులు ఎలా వుంటారో, దబ్బుని మంచినీళ్ళలా ఎలా ఖర్చు పెడతారో! వాళ్ళ జీవితం ఎంత విలాసభరితమో మస్తాన్ నోట చాలాసార్లు విన్నాడు. అదంతా వింటూ వుంటే చిన్నప్పుడు విన్న కాశీమజిలీ కథలా వుంటుంది అతనికి. అలాటిది తనకు ఆ అవకాశమా? నమ్మశక్యం కాలేదు.

"నిజంగానా?" అనుమానంగానే అడిగాడు.

"అక్షరాలా నిజం. నిన్ను తీసుకువెళ్ళి మా బాస్‌కి పరిచయం చేస్తాను." ఖచ్చితంగా చెప్పాడు మస్తాన్.

"మరి లక్ష్మి?" అంత ఆనందంలోనూ లక్ష్మిని మర్చిపోలేదు చలం.

"లక్ష్మి కూడా మనతో వస్తుంది. అయితే నీ భార్యగా మాత్రం కాదు." అతను చెప్పేది ఏమిటో అర్థంకాలేదు చలానికి. వెర్రిమొహం వేసిన అతడిని పక్కన కూర్చోబెట్టుకుని అర్థంఅయేలా చెప్పాడు. అదిరిపడి లేచిన చలాన్ని కూర్చోబెట్టేశాడు.

"కంగారుపడకు. నిదానంగా ఆలోచించు. నేను చెప్పేది శ్రద్ధగా విను. నువ్వు అనుకున్న ప్రకారం నా సహాయంతో లక్ష్మి కాళ్ళూ, చేతులూ కట్టేసి పెళ్ళిచేసేసుకున్నావే అనుకో. ఆ తర్వాత ఏం చేస్తావ్? నీతో కాపురం చెయ్యను పొమ్మంటే ఏ గంగలో దూకుతావ్? ఇదంతా బలవంతంగా జరిగిందని ఆవిడ మీద కేస్ పెట్టిందనుకో. పట్టుకుపోయి కటకటాల్లో పారేస్తారు. సరే అలా కొన్నాళ్ళపాటు అఘోరించాక నిన్ను దయదల్చిందే అనుకో. నీకు ఒరిగి పడేది ఏముంది? ఆస్తి ఎలాగూ ఆవిడది. ఆ తర్వాత పిల్లలది. నీది ఎప్పుడైనా అడుక్కుతినే పొజిషనే. జీవితాంతం పెళ్ళాం విదిల్చే దబ్బుతో బ్రతకాలంటే నరకం కదుటయ్యా మగాడికి?

మరి ఇది చూడు. రాజాలాటి జీవితం. నీ బతుకునీది. కోరినంత తిను. తాగు. లక్ష్మిని తలదన్నే వాళ్ళు రోజుకొకరు. నీకు వంగి సలాములు పెట్టేవాళ్ళు తప్ప ఛీ కొట్టే వాళ్ళే వుండరు. ఆలోచించుకో మరి నీఇష్టం." హితబోధ చేసాడు మస్తాన్.

అంతా విన్న చలానికి అది నిజమే అనిపించింది. మరైతే ఇకా లక్ష్మి విషయం మర్చిపోయి మీతే వచ్చేయనా?" అడిగాడు అమాయకంగా.

"అమ్మమ్మా మర్చిపోతే ఎలా? లక్ష్మిని భద్రంగా తీసికెళ్ళి బహుమతిగా అందజేద్దాం. బాస్ నిన్ను అందలం ఎక్కిస్తాడు." అన్నాడు మస్తాన్.

audachari.com

తటపటాయిస్తున్న చలానికి ధైర్యం చెప్పి అతడిని ఒప్పించాడు. ఏం చెయ్యాలో వివరించాడు. అంతా విని తలూపాడు చలం. "జాగ్రత్త ఏమాత్రం అటూ ఇటూ అయినా మొదటికే మోసం వస్తుంది. హెచ్చరించాడు మస్తాన్.

* * *

ఆరోజు ఉదయమే ఆలయంలో కలుసుకున్నారు లక్ష్మీ మాధవ్. లక్ష్మి చాలా ఉత్సాహంగా వుంది. మా అన్నయ్య, వదినల్లో చాలా మార్పు వచ్చింది. నన్నెంతో ఆదరంగా చూస్తున్నారు అంటూ సరదాగా చెప్పింది. గుండె నిండా ఊపిరి పీల్చుకున్నాడు మాధవ్. అతనికెంతో రిలీఫ్‌గా అనిపించింది. ఇంటికి రాగానే ఆ వార్త సింహం చెవిన వేశాడు ఆనందంగా. సింహం మొహం పాలిపోయింది.

హఠాత్తుగా ఇంత మార్పు. ఇంపాజిబుల్! ఇది ఖచ్చితంగా తుఫాను ముందరి ప్రశాంతత. ఏం చెయ్యాలో తోచలేదు. సమయానికి వసుంధర కూడా లేకపోవడంతో మరింత టెన్షన్‌గా వుంది అతనికి. కానీ కంగారుపడి లాభంలేదు. అలా కంగారు పడితే సమయానికి వున్న తెలివి కూడా వూడిపోతుంది. ధైర్యం తెచ్చుకున్నాడు. ఏం ఫర్వాలేదు. అక్కడ ఏం జరిగినా తెలియజేసేందుకు హనుమంతు వున్నాడు. అవసరం అయితే ఆదుకునేందుకు ఏకదంతంగారున్నారు. వసుంధర రానే వస్తుంది. ఇంతమంది వుండగా ఇంకేం భయం?!

* * *

వెంకటాచలాన్ని లొంగదీసుకున్న మస్తాన్ అంతటితో సంతృప్తి పడలేదు. అలాంటి బహుమతులే ఇంకా మరేం దొరుకుతాయేమోనని ప్రయత్నం మొదలు పెట్టాడు. సింగడిని పిల్చి మీటింగ్ పెట్టాడు. మస్తాన్ పాచిక మరింది. మరో ప్రాణి దొరికింది రాజ్యలక్ష్మి. మరో గంటలోగానే వెంకట దక్షిణామూర్తి మస్తాన్ ముందు హాజరు పరచబడ్డాడు.

వెంకటాచలం కేసులోలాగా నచ్చచెప్పడాలూ వగైరా లేకుండా క్లుప్తంగా "నీకు ఉద్యోగం ఇప్పిస్తాను వస్తావా?" అని అడిగాడు. ఉద్యోగం పోయి కొత్త ఉద్యోగం కోసం వెర్రివాడిలా తిరుగుతూ వున్న దక్షిణామూర్తికి చెవుల్లో అమృతం పోసినట్లు అయింది. కాళ్ళమీద పడిపోయాడు.

"రెడీగా వుండు. నేను కబురు పెట్టగానే సామాన్లు, ఫేమిలీని తీసుకుని వచ్చేయ్." అంటూ ఆర్డర్ వేశాడు.

చేతులు నులుముకుని బుర్రగోక్కుని తటపటాయించి చివరకు మొహమాటం వదిలి అడ్వాన్స్ అడిగాడు దక్షిణామూర్తి. అదోలా నవ్వి ఓ యాభై రూపాయిల నోటు అతని మొహాన పారేశాడు మస్తాన్. అది అందుకుని కళ్ళకద్దుకున్నాడు దక్షిణామూర్తి.

నిధి దొరికినట్లు వుంది అతని ప్రాణానికి. తిన్నగా హోటల్‌కి వెళ్ళి కడుపు నిండా తిన్నాడు. భార్య కోసం పార్సిల్ చేయించుకున్నాడు. ఇంటికి వెళ్ళాడు. అతడు వస్తున్న అలికిడి విని జరగబోయే రాద్ధాంతం తల్చుకుని చిగురుటాకులా వణికిపోయింది రాజ్యలక్ష్మి.

"లక్ష్మీ! ఏం చేస్తున్నావ్? నీకో గుడ్‌న్యూస్" అంటూ లోపలికొచ్చిన భర్తను చూసి ఆశ్చర్యపోయింది. ఎన్నో రోజుల తరువాత అతని ఆదరాన్ని చవిచూసి ఆనందంతో తలమునకలైపోయింది.

ఇద్దరూ సరదాగా కబుర్లు చెప్పుకున్నారు. ఆ తర్వాత ఇద్దరూ కలిసి సినిమాకి వెళ్ళారు. ఆవేళ ఆదివారం సాయంత్రం షో, రష్‌గా వుంది. అయినా టికెట్లు సంపాదించాడు. ఇద్దరూ కలిసి సినిమా చూసి ఇంటికి చేరి చాలాకాలం తర్వాత నిశ్చింతగా నిద్రపోయారు.

* * *

తెల్లవారింది. సోమవారం. ప్రతివారం శివాలయానికి వెళ్ళి అభిషేకం చేయించి రావడం వెంకట్రావుకి అలవాటు. ఆరోగ్యం బాగాలేదు వద్దన్నా వినకుండా బయలుదేరిన ఆయనను వెంట వుండి తీసుకువెళ్ళారు సింహం, మాధవ్.

చెరోవైపు అండగా నిలబడి వున్న ఆ ఇద్దర్నీ అప్యాయంగా చూసుకున్నాడు వెంకట్రావు. తన అనారోగ్యం తర్వాత వాళ్ళిద్దరి మీదా మరింత అభిమానం కలిగింది అతనికి. మరీ మాధవ్‌ని చూస్తే స్వంత కొడుకుని చూసినట్లే వుంది. ఆలయంలో పూజ ముగిశాక భద్రంగా ఇంటికి తీసుకొచ్చారు మిత్రులిద్దరూ.

మాధవ్ మళ్ళీ ఆలయం దగ్గరకే వెళ్ళాడు. సింహం వసుంధర ఇంటికి వెళ్ళాడు. ఇంకా ఇంటికి చేరలేదు వసుంధర. వసుంధర కోసం వెయిట్ చేస్తూ తాతగారితో కబుర్లు చెప్తూ కూర్చున్నాడు సింహం.

పన్నెండు దాటాక వచ్చింది. స్కూటరూ మనిషీ కూడా దుమ్ము కొట్టుకుపోయారు. శక్తి అంతా హరించి పోయినట్లు అలసటగా వుంది. మాట్లాడ్డానికి కూడా ఓపిక లేనట్లు వుంది. వస్తూనే సోఫాలో కూలబడి పోయింది. సింహాన్ని చూసి ఉత్సాహం తెచ్చుకొని మాట్లాడబోయింది కానీ అతనే వారించాడు.

gudaeran.com

"వెళ్ళి కాస్త స్నానం చేసి భోజనం కానివ్వండి. తర్వాత తాపీగా మాట్లాడుకుందాం" అన్నాడు. భోజనాలు అయాక మాట్లాడాలని చాలా ప్రయత్నించింది కానీ కళ్ళు మూసుకుపోయి సోఫాలో పడుకుని నిద్రపోయింది. ఓ వారపత్రిక వెతుక్కుని అది చదువుతూ అక్కడే కూర్చున్నాడు సింహం.

* * *

సోమవారం తెల్లవారగనే వెంకటేశ్వర్లుని వెంటబెట్టుకుని మస్తాన్ దగ్గరికి వెళ్ళాడు చలం. వాళ్ళిద్దర్నీ ఆదరంగా ఆహ్వానించాడు మస్తాన్. "నేను త్వరలోనే ఈ ఊర్నించి వెళ్ళిపోతున్నాను. వెళ్ళేముందు ఇచ్చిన మాట ప్రకారం నీ పని పూర్తి చేసి వెళ్తాను" అన్నాడు.

ఆనందించాడు వెంకటేశ్వర్లు. "రేపు రాత్రి ముహూర్తం బాగుంది. ఊరికి దూరంగా వున్న పోలేరమ్మ ఆలయంలో పెళ్ళి చేయిస్తాను. అక్కడ పగలే అంతగా జనసంచారం వుండదు. రాత్రిపూట అయితే చెప్పనవసరం లేదు. పిట్టపురుగు వుండదు. కాబట్టి మన పని తేలిక అవుతుంది. రాత్రి పన్నెండు గంటలకి నువ్వు నీ చెల్లెల్ని తీసుకుని అక్కడికి రా." అన్నాడు.

"మరైతే పూలదండలు, పురోహితుడు, పెళ్ళి సామగ్రి?" వెంకటేశ్వర్లు అడిగాడు.

"ఆ విషయాల్నీ చలానికి వదిలేయ్."

"సరే అయితే నేను మా ఆవిడని, మా అత్తయ్యనీ, లక్ష్మినీ తీసుకొస్తాను" అన్నాడు వెంకటేశ్వర్లు.

చిర్రెత్తుకొచ్చింది మస్తాన్‌కి. "అలాగే ఓ బాండు మేళం కూడా వెంటబెట్టుకురా. తెలివి తక్కువ ఘటం. ఎక్కడో దొంగతనంగా పెళ్ళి చేయిస్తూ వుంటే వాళ్ళందరూ ఎందుకూ? ఆ అమ్మాయిని తీసుకుని గుట్టుగా వచ్చేయ్. ఏదో సాకు చెప్పి ఇంట్లోంచి బయలుదేరు." కసిరాడు.

ఇక నోరు మూసుకున్నాడు వెంకటేశ్వర్లు. "ఇక నువ్వెళ్ళు. చలం వెనకనించి వస్తాడు" అనేశాడు. నమస్కారం పెట్టి వెళ్ళాడు వెంకటేశ్వర్లు. అతనికి ఒక పక్క ఆనందం, మరో పక్క భయం. తిన్నగా ఇంటికెళ్ళి భార్యతో అంతా చెప్పేశాడు. "నాకేవిటో భయంగా వుంది. పోనీ నాన్నగారికి లక్ష్మికి నచ్చచెప్పి" చెప్తుండగానే వారించింది సావిత్రి.

"ఇన్నేళ్ళబట్టి నచ్చజెప్తూనే వున్నాంగా. ఇంతదాకా వచ్చాక మళ్ళీ వెనక్కి తియ్యొద్దు. ఐనా మనం ఏం పాపం చేస్తున్నాం? పెళ్ళిగాని పిల్లకి పెళ్ళి చేయిస్తున్నాం. అది పుణ్యకార్యమే" ధైర్యం చెప్పింది.

అదీ నిజమే అనిపించింది వెంకటేశ్వర్లుకి. అక్కడినించి లేచి తండ్రి దగ్గరకు వెళ్ళాడు. దగ్గర కూర్చుని ఆయన ఆరోగ్యం గురించి విచారించాడు. "మీరేం బాధపడకండి. లక్ష్మి పెళ్ళి విషయం నేను చూసుకుంటానుగా. ఓ మంచి సంబంధం చూశాను. రేపు నా స్నేహితుడి ఇంట్లో పెళ్ళి. అక్కడికి ఆ అబ్బాయి వాళ్ళూ కూడా వస్తారు. లక్ష్మిని నాతో తీసుకువెళ్తాను. అక్కడే అమ్మాయిని చూస్తారు. ఏవిటో ఇంట్లో పెళ్ళిచూపులు ఎన్నిసార్లు చూపించినా కలిసి రావటంలేదని ఈసారి ఇలా చేద్దామనిపించింది. అందుకే ఈ ఏర్పాటు చేశాను" అన్నాడు.

సుబ్బారావు చాలా సంతోషించాడు. "పోన్లే ఈనాటికైనా నీకు మంచి బుద్ధి కలిగేలా చేశాడా భగవంతుడు. లక్షణంగా తీసుకెళ్ళు.కోడలు కూడా వస్తుంది కదా" అడిగాడు.

"ముగ్గురం వెళ్ళడం ఎందుకని సావిత్రిని వద్దన్నాను. నేనూ లక్ష్మీ వెళ్తాం."

"సరే క్షేమంగా వెళ్ళి లాభంగా రండి" ఆశీర్వదించాడాయన. వెంటనే లక్ష్మికి తెలియజేయబడింది ఆ విషయం. ఉసూరుమంది లక్ష్మి. 'హే భగవాన్! మళ్ళీ పెళ్ళిచూపులా! లక్ష్మికీ మధ్య పెళ్ళి గురించి ఆలోచన రాగానే మాధవ్ కళ్ళముందు మెదలుతున్నాడు. తన మనసులోని మాట ఎవరికి చెప్పుకోవాలో తెలియక లోలోపలే మధన పడుతోంది. రేపు శ్యామల వస్తుంది. తనతో చెప్తే ఏమైనా సలహా ఇస్తుందేమో. చెప్పి చూడాలి అనుకుని నిశ్చింతగా నిద్రపోయింది.

* * *

వెంకటేశ్వర్లుని సాగనంపి, చలాన్ని దగ్గర కూర్చోబెట్టుకున్నాడు మస్తాన్. "చెప్పేది శ్రద్ధగా విను. విన్నది బాగా జ్ఞాపకం పెట్టుకో. రేపు రాత్రి వెంకటేశ్వర్లు చెల్లెలిని వెంటబెట్టుకుని పోలేరమ్మ గుడి దగ్గరకు వస్తాడు. అక్కడ వెంకటేశ్వర్లు మీద దెబ్బతీసి నువ్వు లక్ష్మిని తీసుకుని సరివితోట దగ్గరకు రావాలి. నేను అక్కడ వెహికిల్‌తో రెడీగా వుంటాను. నువ్వురాగానే వెళ్ళిపోదాం!" ప్లాన్ చెప్పాడు.

తల అడ్డంగా ఆడించాడు చలం. "అసాధ్యం. నా ఒక్కడివల్లా ఏమౌతుంది? గుడికీ, సరివి తోటకీ కిలోమీటరు పైనే వుంది దూరం. వాళ్ళిద్దరూ నేనొక్కడిని. కేకలేసి గొడవ చేస్తే మొదటికే మోసం వస్తుంది. మీరు చెప్పిన పని సవ్యంగా సాగాలంటే నాకు మరో ఇద్దరు సాయం వుండాలి." అన్నాడు.

తలపంకించాడు మస్తాన్. నిజమే చలం చెప్పింది. వెధవది అప్పుడు ఆ కబురు తెచ్చినవాడితో ఓ పదిమంది మనుషుల్ని కూడా వెంట తీసుకురా అని చెప్తే

gudachari.com

సరిపోయేది. అప్పుడు ఈ బహుమానాల విషయం ఆలోచన రాలేదు. మట్టిబుర్ర అని విసుక్కున్నాడు.

"సర్లే నీకు తోడు సింగడిని పంపిస్తాను". అన్నాడు.

"వాడా! గాలేస్తే ఎగిరిపోతాడు. మాటలు చెప్పడం తప్ప చేతలకి పనికిరాడు వాడు. పోనీ మీరే వుండకూడదూ!"

"ఏడిసినట్లుంది. నేనే వుండేందుకు వీలైతే నువ్వు సలహా చెప్పేదాకా ఆగుతానా? నాకు వేరే పనుంది." రెండో బహుమానం రాజ్యలక్ష్మిని తీసుకుని అక్కడికి వస్తాడు దక్షిణామూర్తి. అతడిని పైకి పంపించాలి.

"పోనీ నీకు తెలిసిన వాళ్ళు ఈ పనికి పనికొచ్చేవాళ్ళు ఎవరైనా వున్నారా? వుంటే చూడు. కావలసినంత డబ్బు మొహాన పారేద్దాం!" మరో ఉపాయం సూచించాడు మస్తాన్.

ఆలోచించాడు చలం. "వెంకటేశ్వర్లు గారింట్లో పనిచేసే హనుమంతు వున్నాడు. ఆబోతులా దిట్టమైన మనిషి, డబ్బుకోసం గడ్డి తినేరకం. వాడిని తీసుకురావచ్చు" చెప్పాడు.

"మరైతే ఇంకేం. డబ్బాశ పెట్టి తీసుకురా!" సంతోషించాడు మస్తాన్. ఇద్దరూ కలిసి మరోసారి ప్లాను పరిష్టం చేసుకున్నారు. "ఇక వెళ్తాను. రేపొద్దున ఓసారి కనిపిస్తాను" అని చెప్పి వెళ్ళిపోయాడు చలం.

* * *

వసుంధర నిద్ర నుండి లేచేసరికి ఐదుగంటలయింది. అంతసేపు నిద్రపోయినందుకు క్షమాపణ చెప్పుకుంది. తను పడిన శ్రమ వివరించింది. ఈపూట రేపు గడిస్తే గొడవ కాస్త సర్దుకుంటుంది అంది.

ఆవిడ చెప్పినదంతా శ్రద్ధగా విని తన కేస్ గురించి చెప్పాడు సింహం. వసుంధరకి కూడా అనుమానం కలిగింది. అంత కఠినంగా ప్రవర్తించే వెంకటేశ్వర్లుకి ఒక్కసారిగా చెల్లెలిపట్ల ప్రేమానురాగాలు జనించడమే ఆశ్చర్యం అయితే అమిత గయ్యాళి అయిన అతడి భార్య అతనితో సహకరించడం మరీ ఆశ్చర్యం. కాబట్టి జాగ్రత్తగా వుండాలి.

అదే సింహంతో చెప్పింది. "అన్ని వైపుల నుండి జాగ్రత్త పడుతూనే వున్నారు కదా! ఏమాత్రం అటూ ఇటూ అయినా హనుమంతుడున్నాడు. మరేం ఫర్వాలేదు. నేనివ్వాళ మళ్ళీ టౌన్‌కి వెళ్ళాలి. నేనసలు మిమ్మల్ని కూడా వెంట తీసుకెళ్దామనుకున్నాను. కానీ పరిస్థితి చూస్తే మీరిక్కడ వుండటం అవసరం అనిపిస్తోంది. నేను మళ్ళీ రేపొద్దున్న వస్తాను. రాగానే మిమ్మల్ని కలుస్తాను" అని చెప్పి వెళ్ళిపోయింది. ఊరంతా ఒక చక్కర్ కొట్టి ఇంటికి చేరాడు సింహం.

* * *

గుడి ఆవరణలో కూర్చున్నారు లక్ష్మి, మాధవ్. ప్రదక్షిణల కార్యక్రమం ముగిసింది. పూజ కూడా ముగిసింది. అలవాటు ప్రకారం ప్రసాదం అతనికి అందించింది. అందుకుంటూ లక్ష్మి వంక చూశాడు మాధవ్.

"ఏమిటలా వున్నారు? మళ్ళీ ఇంట్లో ఏదైనా గొడవ జరిగిందా?" ఆదరంగా ప్రశ్నించాడు.

"గొడవలేం లేవు. ప్రశాంతంగా వుంది. చెప్పానుగా అన్నయ్య ఇటీవల చాలా మారిపోయాడు. నన్ను ఎంతో ఆదరంగా చూసుకుంటున్నాడు" చెప్పింది.

"మరి మీరు అలా వున్నారేం? ఆరోగ్యం బాగుందా?" మరింత ఆదరంగా అడిగాడు.

లక్ష్మి కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. మొహం పక్కకి తిప్పేసుకుంది.

"రేపు నేనూ అన్నయ్యా పక్క ఊరికి వెళ్తున్నాం. అన్నయ్య స్నేహితుడి ఇంట్లో పెళ్ళిట. ఆ పెళ్ళికి ఎవరో అబ్బాయి కూడా వస్తాడుట. అతనికి నన్ను చూపించాలిట. అందుకే తీసుకువెళ్తున్నాడు" కొంచెం స్థిమితపడి మెల్లిగా చెప్పింది.

మాధవ్ మనసు చివుక్కుమంది. ఎందుకో కళ్ళనీళ్ళు తిరిగాయి. తలొంచుకున్నాడు.

"కంగ్రాట్స్! ఇంత మెల్లిగా చెప్తారేం? ఈసారి తప్పకుండా సెటిల్ అయిపోతుంది. మీ సమస్యలన్నీ తీరిపోతాయి. ఇకముందు అంతా సంతోషం, ఆనందం" మనసు గట్టిపరచుకొని అభినందించాడు.

బరువుగా నిట్టూర్చింది లక్ష్మి. "నా పెళ్ళంటే మీకు చాలా సంతోషంగా వుంది కదూ!"

తడబడిపోయాడు మాధవ్.

"భలేవారే! పెళ్ళంటే ఎవరికి సంతోషంగా వుండదు చెప్పండి? బోలెడంత సందడి, సరదా, విందు భోజనాలు. నామటుకు నాకు పెళ్ళంటే చెప్పలేనంత ఇష్టం!" తెచ్చిపెట్టుకున్న సంతోషంతో సరదాపడిపోయి అంతలోనే దుఃఖం చప్పేస్తుంటే చివాల్న లేచి నిలబడి "మరి వెళ్తానండీ!" అనేసి వెనక్కి తిరిగి చూడకుండా వేగంగా వెళ్ళిపోయాడు.

gudaavari.com

అయోమయంగా చూసి తనూ లేచింది లక్ష్మి. భగవంతుడికి మరోసారి నమస్కారం చేసి ఇంటిదారి పట్టింది.

మాధవ్ ఇంటికి చేరేసరికి ఎదురయ్యాడు సింహం. "ఏమిటి విశేషాలు? లక్ష్మి ఎలా వుంది? వాళ్ళింట్లో వాతావరణం ఎలావుందిట?" ప్రశ్నల వర్షం కురిపించాడు.

పలకరించటం పాపం అన్నట్లు విరుచుకు పడ్డాడు మాధవ్. "నాకిదే పని? ఎవరెట్లా వున్నారో కనుక్కుని నీకు చెప్పడానికి నేనేం నీ నౌకర్నా? ఏదో స్నేహితుడివని నీవెంట రావడం నాదే బుద్ధి తక్కువ. లక్షణంగా ఉద్యోగం చేసుకుంటూ నాదారిన నేను బ్రతికేవాడిని. నన్ను తీసుకొచ్చి ఈ గొడవల్లో ఇరికించావు. ఇదంతా నా ఖర్మ." అతని ధోరణికి తెల్లబోయాడు సింహం. "ఏమైందిరా? ఇప్పటిదాకా బాగానే వున్నావుగా? ఎవరైనా ఏమైనా అన్నారా? ఆరోగ్యం బాగుందా? కంగారుపడి పోయాడు.

అది చూసి మరింత దుఃఖం ముంచుకొచ్చింది మాధవ్‌కి. తలొంచుకుని గదిలోకి వెళ్ళిపోయాడు. వెంటే వెళ్ళాడు సింహం. దగ్గర కూర్చున్నాడు. 'ఎందుకలా వున్నావ్?' అని ఆదరంగా అడిగాడు.

ఆ ఆప్యాయతకి కరిగిపోయాడు మాధవ్. తన ప్రవర్తనకి క్షమించమన్నాడు. తన మనసేం బాగాలేదన్నాడు.

"ఇదంతా నీకు ఇష్టంలేదని తెలుసు. నాకోసం తంటాలు పడుతున్నావ్. ఇంతకాలం నాకు సహాయం చేశావ్. చివరికొచ్చాక నువ్వింలా మనసు పాడుచేసుకుని కూర్చుంటే నాకు కాళ్ళూ చేతులూ ఆడవు. ఈ పని పూర్తి అవనీ. ఆ తర్వాత నువ్వేం చెప్తే అదే చేస్తాను. నీకు ఇక్కడ వుండటం ఇష్టం లేకపోతే వెళ్ళిపోదాం!" బ్రతిమాలాడు సింహం.

మొహమాటపడిపోయాడు మాధవ్. "అదేం కాదురా! ఏమిటో విసుగేసింది. నీమీద అరిచేశాను. ఇకా విషయం మర్చిపో. ఇందాక లక్ష్మి గురించి అడిగావు కదా! వాళ్ళింట్లో పరిస్థితి బ్రహ్మాండంగా వుందిట. రేపు వాళ్ళ అన్నయ్యతో పెళ్ళికి వెళ్తోందిట. అక్కడే ఆవిడని చూడ్డానికి ఎవరో వస్తున్నారట". చెప్పాడు.

సింహం భృకుటి ముడిపడింది. "చెల్లెల్ని వెంట తీసుకువెళ్ళి ఇంకెవరింట్లో పెళ్ళిచూపులు చూపిస్తాడా? ఏవిటతడి ప్లాను? మరి చలానికి పెళ్ళి చేసే ఆలోచనకి స్వస్తి చెప్పాడా?" దీర్ఘాలోచన మొదలుపెట్టాడు. అనుమానం వేసిందతనికి.

"ఎవరెవరు వెళ్తున్నారు? వెంట సుబ్బారావుగారు కూడా వెళ్తున్నారా?" కదిగాడు.

"నేను అంత వివరంగా అడగలేదు. నేనూ, అన్నయ్య వెళ్తున్నాం అని చెప్పింది."

తల పంకించాడు సింహం. హనుమంతుని కలవాలి. ఈ వివరాలన్నీ తెలుసుకోవాలి. వెంటనే బయలుదేరాడు. వెనకనించి పిల్చింది శాంతమ్మ.

"వేళ్ళకి తిండి తినవు. ఎప్పుడు చూసినా కాకిలా తిరుగుతూనే వుంటావ్. పంటయిపోతోంది. వేడిగా భోజనం చేసి అప్పుడు వెళ్లు" అని పట్టుబట్టింది.

పంటయిపోతోందని చెప్పినా ఆ వంట ముగిసి, భోజనాలు అయేసరికి మరో గంట పట్టింది. ఎనిమిది దాటింది. చెయ్యి కడుక్కుంటూనే బయలుదేరాడు సింహం.

తిన్నగా హనుమంతు ఇంటికి వెళ్ళాడు. హనుమంతు ఇంటి దగ్గర లేడు. "వస్తే నేనొచ్చానని చెప్పు." అని అతడి భార్యతో చెప్పి వెనక్కి తిరిగాడు. ఇంటికి వస్తుంటే ఎదురయ్యాడు హనుమంతు.

ఇతడిని చూడగానే మహా సంతోషపడిపోయాడు. "ఎక్కడికెళ్లారు బాబూ! పొద్దున్నుంచీ తిరుగుతున్నాను మీకోసం. ఇప్పుడే ఇంటికొచ్చా వెళ్ళాను. మీరు లేరు." అన్నాడు.

"నేనూ నీకోసమే వెతుకుతున్నాను. ఏమిటి విశేషం?" అడిగాడు సింహం.

"ఇక్కడొద్దు. ఎవరైనా చూస్తారు. పొద్దుపోయాక పొలం దగ్గరికి వస్తాను" అని చెప్పి వెళ్ళిపోయాడు హనుమంతు.

* * *

ఆలయం నించి తిరిగివచ్చింది లక్ష్మి. మనసంతా అదోలా అయిపోయింది. పని కుర్రాడిని పిల్చి శ్యామలకు కబురు పెట్టింది. పావుగంటలో తిరిగొచ్చాడు వాడు. "రేపు వస్తానన్నారు." అని చెప్పాడు. కాసేపు అటూ ఇటూ తిరిగింది. ఆకలి లేకపోయినా నాలుగు మెతుకులు తిని తండ్రి పక్కన జేరింది.

"ఏవిటమ్మా" ఆదరంగా అడిగాడాయన.

"ఏమిటో దిగులుగా వుంది నాన్నా నాకు!" దీనంగా చెప్పింది. ఆయన మనసు కరిగిపోయింది.

"ఎందుకమ్మా దిగులు? నువ్వేం బాధపడకు. రేపు అన్నయ్యతో వెళ్ళు. ఎందుకో ఈ సంబంధం తప్పనిసరిగా కుదురుతుందని నమ్మకంగా వుంది నాకు. ప్రదక్షిణాలు కూడా చేస్తున్నావు కదా! తప్పకుండా ఫలితం కనిపిస్తుంది. ఆ దేవుడు నిన్ను

sudachandra.com

చల్లగా చూస్తాడమ్మా. చూశావుగా అన్నయ్యలో ఎంత మార్పు వచ్చిందో, ఇదంతా మన మంచికే." ధైర్యం చెప్పాడు.

మనసులోని మాట చెప్పలేక, మనసులోనే దాచుకోలేక ఉక్కిరిబిక్కిరైపోయింది లక్ష్మి. దిగులుగా కూర్చున్న కూతురికి బాధ మర్చిపోయేలా ఎన్నో కబుర్లు చెప్పాడు తండ్రి. చిన్నతనం కబుర్లు, తల్లి గురించిన విశేషాలు ఎన్నో పాత సంఘటనలను గురించి చెప్పాడు. రాత్రి బాగా పొద్దుపోయేదాకా ఇద్దరూ మేలుకునే వున్నారు.

రాత్రి సందడి సద్దుమణిగాక రహస్యంగా సింహం దగ్గరికి వచ్చాడు హనుమంతు. నిద్రపోకుండా అతనికోసం కాచుకుని కూర్చున్నాడు సింహం.

వచ్చీ రాగానే మొదలుపెట్టేశాడు హనుమంతు. "చిన్నయ్యా, ఆయన పెళ్ళాం పొద్దుటినించి తెగ గుసగుసలాడేసుకుంటున్నారు. పొద్దున మాట్లాడుకుంటుంటే చాటునించి విన్నాను. బాగా వినిపించలేదు. అర్ధరాత్రి పోలేరమ్మ గుడి, పెళ్ళి అంటూ ఏవిటో మాట్లాడుకుంటున్నారు. రేపు రాత్రికి పెళ్ళిట. ఆయన ముందు వెనకలాడుతుంటే, ఆవిడ ధైర్యం చెప్తోంది. లక్ష్మమ్మని వెంట తీసుకువెళ్తాడుట."

హనుమంతు చెప్పినది విని ఉలిక్కిపడ్డాడు సింహం. "ఏమిటది? ఏవిటీ ప్లాన్. మాధవ్ మాటలను బట్టి చూస్తే వెంకటేశ్వర్లు చెల్లెల్ని తీసుకుని పొరుగూరు ఎవరింట్లోనో పెళ్ళికి వెళ్తున్నాడని తెలిసింది. మరి అదే నిజం అయితే పోలేరమ్మ గుడి ప్రసక్తి ఎందుకొచ్చింది. ఈమాత్రం విషయానికి గుసగుసలాడుకోడం ఎందుకు? మంచిగా నటిస్తూ వెనకాల గోతులు తవ్వుతున్నాడా? హనుమంతుని పంపించేసి ఆ విషయమే ఆలోచిస్తూ కూర్చున్నాడు చాలాసేపటిదాకా!

తెల్లవారగానే సుబ్బారావుగారింటికి వెళ్ళాడు. సుబ్బారావు వాకిట్లో అరుగు మీద కూర్చుని వున్నాడు. సింహాన్ని చూడగానే నవ్వుతూ ఆహ్వానించాడు. పొలం గురించి, పంట గురించి ఆయన్తో మాట్లాడుతూ కూర్చున్నాడు సింహం. కాసేపటి తర్వాత సింహం ఎదురుచూస్తున్న క్షణం వచ్చింది. వెంకటేశ్వర్లు ఇంట్లోంచి బయటకు వచ్చాడు. సింహాన్ని చూడగానే మొహం మాడ్చుకుని లోపలకు వెళ్ళిపోబోయాడు.

అతనికా అవకాశం ఇవ్వలేదు సింహం. "బాగున్నారా వెంకటేశ్వర్లు గారూ!" అంటూ పలకరించాడు. తండ్రి అక్కడే వుండటంతో మామూలుగా ప్రవర్తించక తప్పలేదు వెంకటేశ్వర్లుకి. విధిలేక నవ్వు తెచ్చిపెట్టుకుని 'బాగానే వున్నాను' అని సమాధానం చెప్పాడు.

"అసలు మీకోసమే వచ్చాను. టౌన్‌లో మాంచి పిక్చర్ రిలీజ్ అయింది. ఇవ్వాళ ఫస్ట్‌షోకి రెండు టికెట్లు కొన్నాను. మాధవ్ రాడుట. మీరొస్తారా వెళ్దాం ఆదరంగా అడిగాడు.

"నేనాను నాకు వేరే పనుంది" కట్టె విరిచినట్లు చెప్పేశాడు.

ఇంటికొచ్చిన అతిథితో అలా పెడసరంగా మాట్లాడటం సుబ్బారావుకి నచ్చలేదు.

"అబ్బాయి ఇవాళ సాయంత్రం పెళ్ళికి వెళ్తున్నాడు." మర్యాదగా చెప్పాడు.

"అందరూ వెళ్తున్నారా?" ప్రశ్నించాడు సింహం.

"లేదు. మా అబ్బాయి అమ్మాయి వెళ్తున్నారు." చెప్పాడాయన.

"అలాగా! మరి మీరు, మీ కోడలుగారూ వెళ్ళరా?" అడిగాడు సింహం.

"లేదు వాడి స్నేహితులింట్లో మేమందరం ఎందుకు?"

"అయితే మాత్రం ఏం? ఈ మధ్య మీరు ఎక్కడికీ వెళ్ళడంలేదు. నలుగుర్లోకీ వెళ్తే బాగుంటుంది కదా! మీరూ వెళ్ళి రండి." బలవంతం చేశాడు.

చిర్రెత్తుకొచ్చింది వెంకటేశ్వర్లుకి. "మా ఏడుపు మేం ఏడుస్తాం. మీకెందుకు? ప్రతి విషయంలోనూ దూరిపోయి సలహాలిస్తారేం?" కసురుకున్నాడు.

చిన్నగా నవ్వాడు సింహం. "ఏదో మాటవరసకి అన్నాను. మీకు కోపం వచ్చినట్లుంది. ఐయాం సారీ. ఇంతకీ పెళ్ళి ఎక్కడ? ఎవరింట్లో?" శాంతంగా ప్రశ్నించాడు.

"మీకెందుకండీ ఆ వివరాలన్నీ" విరుచుకు పడబోతున్న కొడుకుని వారించాడు సుబ్బారావ్. "ఏమిట్రా అది? ఆయన అన్నదాంట్లో తప్పేముంది? చనువుకొద్దీ అడిగాడు. మెల్లిగా సమాధానం చెప్పరాదా"? మందలించాడు.

"పక్కూళ్లో పెళ్ళి. నా స్నేహితుడు రామనాధం తమ్ముడు సోమేశ్వరావు పెళ్ళి రాత్రి పదింటికి" విసురుగానే చెప్పాడు వెంకటేశ్వర్లు.

"ఓ ఆ పెళ్ళికా? మరి చెప్పారు కాదేం? నాకూ శుభలేఖ వచ్చింది. పెళ్ళి కొడుకు నాఫ్రెండ్. సినిమా వద్దులెండి. మీతో నేనూ వస్తాను. ఎన్నింటికి బయలుదేరుతున్నారు"? సరదాపడిపోయాడు సింహం.

తడబడిపోయాడు వెంకటేశ్వర్లు. ఏం చెప్పాలో తోచక తికమక పడిపోయాడు. "మేమూ, మరికొంతమంది స్నేహితులం కలసి వెళ్తున్నాం. ఎన్నింటికి వెళ్తామో, ఎలా వెళ్తామో మాకే తెలీదు" చెప్పేశాడు.

pustakam.com

"అలాగా సర్లేండి. నేను విడిగా వెళ్తాను. అక్కడ కలుద్దాం"! అనేసి లేచాడు. వెళ్ళబోతూ వెనక్కి తిరిగి "పెళ్ళికొడుకు" అన్నయ్య పేరేమిటన్నారు?' హఠాత్తుగా అడిగాడు.

మరింత కంగారుపడిపోయాడు వెంకటేశ్వర్లు. "నాగభూషణం" ఏదో నోటికొచ్చిన పేరు చెప్పేసి అక్కడే వుంటే ఇంకేం అడుగుతాడో అనే భయంతో గిర్రున వెనక్కి తిరిగి ఇంట్లోకి వెళ్ళిపోయాడు.

వాళ్ళింట్లోనించి బయటపడ్డాడు సింహం. అతని బుర్ర చురుగ్గా ఆలోచిస్తుంది. వెంకటేశ్వర్లు అబద్ధం ఆడుతున్నాడనే విషయం స్పష్టంగా తెలిసిపోయింది. అతడే పెళ్ళికీ వెళ్ళడం లేదు. కానీ చెల్లెల్ని తీసుకుని ఎక్కడికి వెళ్తున్నాడు? ఎక్కడికి తీసుకు వెళ్తున్నాడు? హనుమంతు చెప్పిన ప్రకారం పోలేరమ్మ గుడికి తీసుకువెళ్ళి బలవంతంగా పెళ్ళి చేయిస్తాడా? ఏమిటితడి ప్లాన్! ఏది ఏమైనా ఈ రాత్రికి ఏదో జరుగుతుంది. తను అప్రమత్తంగా వుండాలి.

ఇది చాలా జటిలమైన సమస్య. ఎందుకంటే లక్ష్మికి ద్రోహం తలపెట్టినవాడు స్వయానా ఆవిడ అన్నగారు. చివరి క్షణాన పట్టుబడినా ప్లేటు మార్చి మా కుటుంబ విషయాల్లో తలదూర్చి నన్ను అనవసరంగా అల్లరి పెడుతున్నాడు అని గొడవ చేస్తే అందరూ తననే నిందిస్తారు. కాబట్టి ఋజువులు, సాక్ష్యాలు బలంగా వుండేలా చూసుకోవాలి. అంటే కెమేరా, టేప్‌రికార్డర్‌లాటి వస్తువులూ, నలుగురు తెలివైన మనుషులూ కావాలి. ఏం చెయ్యాలి, ఎలా చెయ్యాలి అని ఆలోచిస్తూనే వసుంధర ఇంటికి వెళ్ళాడు. ఆవిడ ఇంకా రాలేదు.

వెంటనే ఆవిడకోసం వెయిట్ చెయ్యకుండా బస్ పట్టుకుని టౌన్‌కి వెళ్ళాడు. స్నేహ ఆఫీసులో లేదు వసుంధర. ఎక్కడికి వెళ్ళిందో కచ్చితంగా తెలియదు. అందుకని ఆవిడకోసం వెయిట్ చేస్తూ అక్కడే కూర్చున్నాడు.

పది దాటాక వచ్చింది వసుంధర. ఇతడిని చూసి ఆశ్చర్యపోయింది. పరిస్థితి అంతా వివరించాడు సింహం. "చంపడానికి ఎత్తు వేస్తున్నాడో, లేక బలవంతంగా పెళ్ళి చేయిస్తున్నాడో అర్థం కావటంలేదు" అన్నాడు.

"రెండూ ప్రమాదకరమైనవే. మరణశిక్ష ఒకటైతే, యావజ్జీవ కారాగారం మరొకటి." అంది వసుంధర.

"కరెక్ట్. సమస్య చాలా క్లిష్టంగా వుంది. ముళ్ళ కంచె మీద బట్టలా వుంది పరిస్థితి. జాగ్రత్తగా వ్యవహరించాలి. అతడిని రెడ్‌హాండెడ్‌గా పట్టుకోవాలి. అందుకోసం మనకు మెరికల్లాటి మనుషులు కావాలి." అన్నాడు సింహం.

తల పట్టుకుంది వసుంధర. అనుకోకుండా అన్ని కేసులూ ఒకేసారి క్లైమాక్సుకి వచ్చేశాయి. ఇక్కడ మనవాళ్ళందరూ యమ బిజీగా వున్నారు. వేరేవేరే పనుల్లో తలమునకలై వున్నారు. ఎవరెక్కడ వున్నారో కూడా తెలియడంలేదు నాకు."

ఉసూరుమనిపించింది సింహానికి. "పోనీ నేనేమైనా సహాయం చెయ్యనా? ఎక్కడుంటారో చెప్తే వెళ్ళి తీసుకొస్తాను." అన్నాడు.

"వద్దు. వారించింది వసుంధర. "మీకీ ఊరు కొత్త. వెతుక్కుని వెళ్లటం అనవసర శ్రమ. శ్రమమాట అలావుంచి ప్రస్తుతం టైంలేదు మనకు. మీరు వెనక్కి వెళ్ళిపోండి. వెళ్ళి అక్కడ సాయం చేసే వాళ్ళెవరైనా దొరుకుతారేమో ప్రయత్నం చెయ్యండి. నేనిక్కడ ప్రయత్నించి చూస్తాను. అలా చేస్తే సేఫ్. ఇద్దరం సైన్యాన్ని సమకూర్చామనుకోండి. అధికస్య అధికం ఫలం కాదూ. ఎవరో ఒకరి ప్రయత్నం ఫలించినా అవసరం గడిచిపోతుంది." సలహా చెప్పింది.

ఆ సలహా సింహానికి ఎంతో నచ్చింది. వెంటనే తిరుగు బస్‌లో బయలుదేరాడు.

* * *

సింహం, వసుంధర సీరియస్‌గా చర్చిస్తున్న సమయంలోనే లక్ష్మి, శ్యామల కూడా చాలా సీరియస్‌గా ఆలోచిస్తున్నారు. లక్ష్మి ఇంటి ఆవరణలో మూలగా వున్న గడ్డివాము దగ్గర చేరారు ఇద్దరూ.

"ఎందుకంత అర్జెంట్‌గా రమ్మని కబురు చేశావ్" అంటూ అడిగిన శ్యామల ప్రశ్నకు అరగంట సేపు సంకోచించి, మరో పావు గంట నీళ్ళు నిమిలి, తరువాత పది నిముషాలు సిగ్గుపడి ఎలాగైతేనేం తన మనసులోని మాట చెప్పేసింది లక్ష్మి.

అది విని చాలా సంతోషించింది శ్యామల. "పోన్లే ఇప్పటికైనా తెలివైన పనిచేశావు" అని మెచ్చుకుంది.

మరుక్షణమే ఆ రాత్రి అన్నగారితో కలసి పెళ్ళి చూపులకి వెళ్తున్న సమాచారం చెప్పేసరికి నవ్వాలో ఏడవాలో తోచలేదు శ్యామలకి.

"మళ్ళీ ఇదేమిటే?" విసుక్కుంది.

"ఏం చెయ్యను? అన్నయ్య రమ్మన్నాడు. అయినా నాకు అతనంటే ఇష్టమే. కానీ అతనికీ నేనంటే ఇష్టముండాలిగా" చెప్పింది లక్ష్మి.

"ఉందో లేదో అడిగి చూశావా నువ్వు!" నిలదీసింది. "నిన్న గుళ్ళో కనిపించినపుడు ఈ పెళ్ళిచూపుల విషయం చెప్తే 'అలాగా చాలా సంతోషం' అంటూ ఆనందపడిపోయాడు" ఉక్రోషంగా చెప్పింది లక్ష్మి.

gudaeshani.com

"ఇది మరీ బావుంది. నాకు మళ్ళీ పెళ్ళి చూపులండీ అని నువ్వు చెప్తే ఆనందించక బావురుమని ఏడుస్తాడా? ఇదా అతని అభిప్రాయం తెలుసుకునే పద్ధతి?" విసుక్కుంది.

"ఏమో నాకేం తెలుసు ఆ పద్ధతులు. అందుకే నిన్ను పిలిచింది. నన్నేం చేయమంటావో నువ్వే చెప్పు."

"అలా అడిగావ్ బాగుంది. చెప్తానాగు" అనేసి కాసేపు సీరియస్‌గా ఆలోచించి రెండు మూడు ఉపాయాలు చెప్పింది. అవి లక్ష్మికి ఎంతమాత్రం నచ్చలేదు.

"సరే, అయితే. ఆఖరు మాట చెప్పేస్తున్నాను. అతడిని కలుసుకున్నప్పుడు డైరెక్టుగా అడిగెయ్" సలహా ఇచ్చింది.

"చచ్చినా అడగను, నాకు సిగ్గు, భయం."

"సరే పోనీ డైరెక్ట్‌గా మాట్లాడ్డానికి సంకోచంగా వుంటే లెటర్ రాయి" మరో దారి సూచించింది.

"అమ్మో! అందరికీ తెలిస్తే అల్లరైపోనూ!"

ఇక ఓర్పు నశించిపోయింది శ్యామలకి. "పోనీ ఓపని చెయ్. చారెడు తాడు తీసుకుని ఉరేసుకో" తిట్టింది.

"శ్యామలా?" దీనంగా ఆక్రోసించింది లక్ష్మి.

"లేకపోతే ఏం చెయ్యమంటావ్? నేనేం చెప్పినా అందులో తప్పులు ఏరుతున్నావ్. నా మాట విని లెటర్ రాయి. నాకు ఇవ్వు. నేను అతడికి అందిస్తాను. నీకూ, నాకూ, మాధవ్‌కి తప్ప నాలుగో కంటివాడికి తెలియదు.

అతను చాలా మంచివాడు. ఇష్టం అయితే సరేనంటాడు. లేకపోతే వూరుకుంటాడు. అంతేకాని ఫలానా అమ్మాయి నాకు ఉత్తరం రాసిందో అని టాం టాం చేసేటంత కుసంస్కారి కాదు. కాబట్టి ప్రమాదం ఏమీలేదు. నీ అభిప్రాయం అతనికి తెలియజేయాలని నువ్వనుకుంటే అదే ఉత్తమమైన మార్గం. నీఇష్టం."

కాసేపు ఆలోచించి, చివరికెలాగైతేనేం కాయితం కలం తీసుకొని నాలుగు ముక్కలు రాసింది లక్ష్మి. శ్యామల చేతికి అందించింది. "జాగ్రత్త సుమా!"

"నీకెందుకు ధైర్యంగా వుండు. భద్రంగా అందజేస్తాను. అంతేకాదు అటు నుండి సరేననే సమాధానం కూడా నేనే తీసుకొస్తాను" హామీ ఇచ్చింది శ్యామల.

వెళ్ళబోతున్న శ్యామలను వెనక్కి పిలిచింది లక్ష్మి. "అడగటం మర్చిపోయాను మీ హీరో ఎలా వున్నాడు? ఈ మధ్య ఏం చెప్పడం లేదు నువ్వు."

చిర చిర లాడింది శ్యామల. "అతగాడి గురించి నాదగ్గర ఎత్తకు. ఇదుగో వచ్చేస్తా, మీ నాన్నకు తగిన శాస్తి చేస్తా అంటూ ఉత్తర కుమార ప్రజ్ఞలు పలుకుతూ ఉత్తరం రాశాడు. ఆ తర్వాత ఉలుకూ లేదు. పలుకూ లేదు. ఏమైపోయాడో మరి. ఎవరైనా కిడ్నాప్ చేసి తీసుకుపోయారేమో అనుకుంటున్నాను" సమాధానం చెప్పేసి వెళ్ళిపోయింది.

* * *

ఆదరా బాదరా పరిగెత్తు కొచ్చిన సింహానికి తీరా వచ్చాక ఏం చెయ్యాలో తోచలేదు. ఎవరి సాయం అడగాలి? తనకు తెలిసిన వారిలో నమ్మకమైనవారు, తనకు సాయపడగల వారు ఎవరున్నారు? మాధవ్‌ని వెంటబెట్టుకెళ్ళటం అనవసరం. బెదిరిపోయి తనని కూడా బెదరగొట్టేస్తాడు.

హనుమంతు, వెంకట్రావుగారి పనివాడు రాములు, టీకొట్టు నాయరు వీళ్ళంతా నమ్మకమైన వారే. హనుమంతు ఆర్లెడీ డ్యూటీలో ఉన్నాడు. గూఢచారిగా శత్రుశిబిరంలో ఉన్నవాడిని ఆఖరి క్షణంలో పిలిపించడం అసంభవం.

మిగిలినవారు కూడా పన్లో సహాయపడే తెలివి తేటలున్నవాళ్లు కాదు. ఏం చెయ్యాలా భగవంతుడా అని ఆలోచిస్తూ వుండగా అంతదూరంలో స్కూటర్‌తో వస్తున్న నట్‌బోల్ట్ వెంకటేశ్వర్రావు కనిపించాడు.

అలవాటుకి విరుద్ధంగా స్కూటర్ నడిచేస్తుంది. అతడిని చూడగానే సింహం ప్రాణం లేచి వచ్చింది. మంచివాడు, విద్యావంతుడు. తన వల్ల గతంలో సహాయం పొందిన వాడు కాబట్టి తను సహాయం కోరితే కాదనడు. ఆనిర్ణయానికి రాగానే ఆలోచించి ఓ ప్లాను వేసేశాడు.

వెంటనే వెంకటేశ్వర్రావుకి ఎదురెళ్ళాడు. ఇతడిని చూసి స్కూటరాపేశాడు వెంకటేశ్వర్రావు. "ఏవిటి సింహంగారూ! బావున్నారా? ఎలా ఉంది మీ సం.తా.ప.సం.?" ఆదరంగా పలకరించాడు.

"ఆ! బాగానే నడుస్తోందట. నేనిప్పుడా సంఘంలో పని చెయ్యడంలేదు. అలాటిదే మరో సంఘం వుంది. ప్ర.ధ.సం.సం. అంటే ప్రజా ధన సంరక్షక సంఘం అని అర్థం. అది సరే దాని విషయం కాసేపు వదిలేయండి. మీరెలా వున్నారు? మీ స్కూటర్ భలేగా నడుస్తోందే. ఈ మధ్య కొత్తగా ఏమైనా కొన్నారా?, ఎలాగైనా ఇంత చక్కగా చౌకలో వస్తువులు కొనటంలో మీకు మీరే సాటి" అంటూ మొదలుపెట్టి అయిదు నిముషాలు ఆపకుండా పొగిడేశాడు సింహం.

dvachan.com

చాలా ఆనందించాడు వెంకటేశ్వర్రావు. "కావాలంటే మీక్కూడా కొనిస్తాను." అన్నాడు.

"ప్రస్తుతానికి వద్దులెండి. కావల్సినప్పుడు నేనే చెప్తాను. ప్రస్తుతం మీరు నాకు ఓ సహాయం చెయ్యాలి" అడిగాడు.

"ఓ! దానికేం భాగ్యం చెప్పండి" అభయం ఇచ్చేశాడు వెంకటేశ్వర్రావు.

"మీకు చెప్పాను చూడండి ప్రజాధన సంరక్షణ సంఘం అని. ప్రజాధనాన్ని దుండగులు కాజేయకుండా చెయ్యడం మా సంఘం ఆశయం. రైలు పెట్టెల్లోనూ, సినిమా హాళ్ళలోనూ, బస్టాండ్‌లలోనూ వస్తువులు ఎత్తుకుపోయేవారిని కనిపెట్టి పట్టుకోడం మా ధ్యేయం.

'ఇప్పుడీ ఊళ్ళో ఓ దొంగతనం జరగబోతోంది. పోలేరమ్మ గుళ్ళో విగ్రహం అపహరణ జరుగుతుందని నమ్మకంగా తెలిసింది. నేనొక్కడినే వున్నాను. మావాళ్ళకి తెలియజేసి వాళ్ళని పిలిపించే వ్యవధి కూడా లేదు. ఈ రాత్రికే దొంగలొస్తారట. కాబట్టి మీ సహాయం కావాలి నాకు."

వింటూన్న వెంకటేశ్వర్రావు మొహంలో రంగులు మారాయి. "ఇందులో ప్రమాదం లేదు గదా!" భయంగా అడిగాడు.

"ఎంతమాత్రం లేదు. ఇలాటి కేసులు డీల్ చెయ్యడం నాకు అలవాటై పోయింది. అంతదాకా ఎందుకు? మీ బ్లాక్ మెయిలర్ల కేస్ డీల్ చెయ్యలేదూ? అలాగే ఇదీను. ప్రమాదం ఏమాత్రం లేదు. పైగా వాళ్ళను పట్టి ప్రభుత్వానికి ఇస్తే పేరు, ప్రతిష్ఠ, నలుగుర్లో హీరో అయిపోతారు మీరు". అంటూ చెప్పి ఒప్పించాడు.

ఆనందంగా అంగీకరించాడు వెంకటేశ్వర్రావు. అంతేకాదు సింహంతో మరికాసేపు మాట్లాడి, అతడికి కావలసిన కెమేరా, టేప్‌రికార్డరూ తనే తీసుకొస్తానన్నాడు, "ఇక మనుషుల మాటకొస్తే మన గుండు వెంకటేశ్వర్రావు గారున్నారు. ఆయన మీకూ పరియమేగా. మంచివాడు, ధైర్యస్థుడు. ఆయన్ని కూడా సాయం రమ్మందాం. నేను చెప్తాను ఆయన్తో" అని హామీ కూడా ఇచ్చాడు.

అతనికి కృతజ్ఞతలు చెప్పి, ఎప్పుడు ఎక్కడికి ఎలా రావాలో తను తర్వాత వచ్చి చెప్తానని చెప్పి అక్కడినించి కదిలాడు. వెంకట దక్షిణామూర్తి దగ్గరికి వెళ్ళి సహాయం అడిగితే 'నాకు వేరే పనుంది, రాత్రికి ఊరెళ్తున్నాను.' అని చెప్పాడతను. మరో ఇద్దర్ని అడిగి చూసాడు కానీ వాళ్ళు వీలు కాదన్నారు. ఈ పనులన్నీ ముగించుకుని ఇంటికి చేరేసరికి రెండు గంటలయింది.

గేటు దగ్గర ఎదురయింది శ్యామల. "ఎక్కడికి వెళ్ళారు మీరు? ఇంట్లో అందరూ ఎలా కంగారు పడుతున్నారు." అడిగింది.

అప్పుడు గుర్తుకి వచ్చిందతనికి. ఉదయం ఇంటికి రాకుండా పొలంనించి అటే వెళ్ళిపోయానని. ఇంట్లోకి అడుగు పెట్టగానే శాంతమ్మగారు తల వాచేలా వీవాట్లు పెట్టింది. వెంకట్రావుగారు కూడా బాగా మందలించారు. మాధవ్ కూడా వచ్చి మందలిస్తాడేమో అనుకున్నాడు సింహం. కానీ అసలు అతను గదిలోంచి బయటికే రాలేదు.

చివాట్లు తిన్నాక స్నానం చేసి, భోజనం చేసి మళ్ళీ బయలుదేరాడు సింహం. ఒక లక్ష్యం, గమ్యం లేకుండా ఊరంతా తిరిగాడు. హనుమంతు కోసం వెళ్తే అతను లేడు. మస్తాన్ విషయం ఓసారి చూసొద్దామని అటుగా వెళ్ళాడు. వివరాలేం తెలియలేదు. అనుమానాస్పదమైన సమాచారం ఏమీ అందలేదు. కాసేపు కాఫీ హోటల్లో కూర్చున్నాడు. మరి కాసేపు గుళ్ళో కూర్చున్నాడు. అలా కాలుగాలిన పిల్లిలా తిరుగుతూ వున్నాడు.

* * *

ఏకదంతంగారు కూడా అలాగే తిరుగుతున్నారు ఇంట్లో.

లక్ష్మీ దగ్గర నుండి ఉత్తరం తీసుకుని బయలుదేరిన శ్యామల టైం చూసుకుని కంగారు పడింది. చాలాసేపైంది వచ్చి. అమ్మ కంగారుపడుతూ వుంటుంది. ఎలాగూ దారే గనుక ఇంట్లో చెప్పి వెళ్దామనుకుంది. ఇంటికొచ్చి తల్లితో చెప్పి వెంకట్రావుగారింటికి వెళ్ళింది. ఆ వెళ్ళటం వెళ్ళటం వాళ్ళింట్లోనే భోజనం కూడా చేసి రెండు దాటాక ఇంటికొచ్చింది.

మామూలు వేళ్టికే భోజనానికి వచ్చిన ఏకదంతం అమ్మాయేది అని అడిగాడు అలవాటు ప్రకారం. "లేదు వెంకట్రావుగారింటికి వెళ్ళింది!" చెప్పింది సుభద్ర అన్నం వడ్డిస్తూ.

"వెంకట్రావుగారింటికి వెళ్ళిందా? ఎందుకెళ్ళింది? పోనీ సుబ్బారావు ఇంటికి వెళ్ళిందంటే అర్థం వుంది. వెంకట్రావు ఇంట్లో దీనికేం పని? అసలు నన్నడక్కుండా ఎందుకు పంపించావ్?" విసుక్కున్నాడు.

"ఏం పంపిస్తే? నాకామాత్రం అధికారం లేదా? ప్రతిదానికీ మిమ్మల్ని అడగాలా? వెంకట్రావుగారింట్లో వుండే అబ్బాయితో ఏదో మాట్లాడాలట. వెళ్ళనా అని అడిగింది. వెళ్ళమన్నాను". విసుక్కుంది.

gudachari.com

"ఏవిటి! ఆ అబ్బాయితో మాట్లాడాలా? బాగానే వుంది వ్యవహారం. దానికి బుద్ధిలేకపోతే నీకుండద్దా!" అంటూ అన్నం మధ్యలోనే లేచాడు. శ్యామల రాగానే ఛడామడా తిట్టాడు. శ్యామల ఏడుస్తూ లోపలికి వెళ్ళిపోయింది. అది చూసి ఆవిడకి ఒళ్ళుమండింది. ఆయన్ని ఛడామడా తిట్టేసింది.

జరిగిన రాద్ధాంతం వల్ల మనసు పాడైపోయి ఒకటే తిరిగేస్తున్నాడు ఏకదంతం.

* * *

ఊరంతా తిరిగేసి మళ్ళీ ఇంటికి జేరాడు సింహం. పని అయినా కాకపోయినా చీకటి పడేలోగా ఇంటికొచ్చేస్తాను అని హామీ ఇచ్చింది వసుంధర. ఆ వేళికి ఆవిడ ఇంటికి వెళ్ళాలి. ఇటునించి ఇటేపోతే శాంతమ్మగారు కంగారు పడుతుందని ఇంటికి వచ్చాడు.

గదిలో మంచం మీద కూర్చుని వున్నాడు మాధవ్. చూపులు శూన్యంలో చిక్కుపడి పోయాయి. అతడి వాలకం చూసి తెల్లబోయాడు సింహం. "ఏమిట్రా ఏమిటిలా వున్నావ్"? అడిగాడు.

వెర్రినవ్వు నవ్వేశాడు మాధవ్. "నన్ను వంటరిగా వదిలెయ్ కాసేపు." అన్నాడు. అలాగే వదిలేసి హాల్లోకి వచ్చాడు. శాంతమ్మగారు అతడిని పక్కకి తీసుకెళ్ళింది. "మధ్యాహ్నం నుండి అదోలా వున్నాడు నాయనా మాధవ్. కొంపతీసి ఆ జబ్బుగాని తిరగబెట్టలేదు కదా! డాక్టరుకేమైనా చూపిద్దామా?" అంది గుసగుసగా.

నవ్వాపుకున్నాడు సింహం. "ఏం లేదమ్మా బాగానే వున్నాడు. అవసరం అయితే రేపు చూద్దాం!" అని చెప్పాడు. కాసేపు ఇంట్లో కాలక్షేపం చేసి మళ్ళీ బయలుదేరాడు. తిన్నగా సుబ్బారావు గారింటికి వెళ్ళాడు. దూరంగా మంచం మీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు వెంకటాచలం, వెంకటేశ్వర్లు. ఇతడిని చూడగానే మాటలాపేశారు.

వాళ్ళని పలకరించే ప్రయత్నం కూడా చెయ్యలేదు సింహం. తలొంచుకుని వెళ్ళి అరుగుమీద కూర్చుని వున్న సుబ్బారావుని విష్ చేశాడు. "ఈ రాత్రి నేను పొలానికి కాపలా పడుకోనండీ. ఊరెళ్తున్నాను" అని చెప్పాడు.

"అవును. పెళ్ళికెళ్తున్నానని చెప్పారుగా. పొలం దగ్గరికి హనుమంతుని పంపిస్తాను. మీరు వెళ్ళిరండి" అన్నాడు ఆయన.

వెనక్కి తిరిగి వెంకటేశ్వర్లు వైపు ఓ చూపు విసిరేసి వెళ్ళిపోయాడు సింహం.

"చూశావా చూశావా ఎలా చూశాడో! వీడి మొహం మండ. వీడి వాలకం చూస్తే నాకేదో అనుమానంగా వుంది. పోనీ ఓ పని చేద్దామా? ఇవ్వాళ వీడెలాగూ

పొలంలో వుండడుట. ఈ కార్యక్రమం మరోరోజుకి వాయిదా వేసి పొలంలో కూలు కోయించేద్దామా?" అన్నాడు వెంకటేశ్వర్లు.

"ఏం వద్దు. అనుకున్న ప్రకారం ఈ పని చేసేద్దాం. వీడి విషయం నాకొదిలెయ్. మస్తానుగారుండగా మనకేం భయం! నువ్వు ధైర్యంగా వుండు. లక్ష్మిని తీసుకొచ్చి నాకు అప్పగించు చాలు. ఆ తర్వాత అంతా చూసుకుంటాను." హామీ ఇచ్చాడు చలం. మరికాసేపు కబుర్లు చెప్పిలేచాడు చలం. "చెప్పింది గుర్తుందిగా జాగ్రత్త!" అనిచెప్పి వెళ్ళిపోయాడు. అక్కడినించి హనుమంతు ఇంటికెళ్ళాడు.

* * *

సుబ్బారావుగారింటి నించి తిన్నగా వసుంధర ఇంటికి వెళ్ళాడు సింహం. అప్పటికి అయిదు నిముషాల ముందే వచ్చింది వసుంధర. ఇతడిని చూడగానే ఎదురొచ్చింది. "పని బ్రహ్మాండంగా అయింది. మెరికల్లాటివాళ్ళు దొరికారు. వాళ్ళపనులు వేరే వాళ్ళకప్పగించి ఇక్కడికి వచ్చేస్తున్నారు. ఇక మనకేం భయం లేదు. ఆ దుర్మార్గుడిని పట్టుకుని తగిన విధంగా బుద్ధి చెప్దాం". అంది సరదాగా. గుండెనిండా ఊపిరి పీల్చుకున్నాడు సింహం. దైవానికి కృతజ్ఞత చెప్పుకున్నాడు. "నేనూ ఇక్కడ ఓ ముగ్గుర్ని ఏర్పాటు చేశాను. అయితే ఇలాటి వ్యవహారానికి అందరూ కొత్తవాళ్ళే." అంటూ తనెలా బోల్తా కొట్టించింది చెప్పేశాడు. నవ్వేసింది వసుంధర.

"మొత్తానికి మీది భలే బుర్ర" అని మెచ్చుకుంది వసుంధర. "మరైతే వాళ్ళని కూడా మనతో జేర్చుకుందామా?" అడిగింది.

"వద్దు. అసలైన వాళ్ళతో మళ్ళీ వచ్చి ఫైనల్‌గా మాట్లాడతానని చెప్పాను. కాసేపాగి వెళ్ళి ఏదో చెప్పేసి వస్తాను" అన్నాడు సింహం.

"మావాళ్ళు ఎనిమిది లోగానే వచ్చేస్తారు. మీరీలోగా వీలైతే హనుమంతుని కలవడానికి ప్రయత్నించండి. ఇంకా ఏవైనా వివరాలు దొరికితే మనపని మరింత సులువు అవుతుంది. మీరిక్కడికి వచ్చేస్తే అందరం కలిసి ఫైనల్‌గా ప్లాన్ వేసేద్దాం!" అని చెప్పింది వసుంధర.

సరే అనేసి అక్కడినించి బయలుదేరాడు. ఆరున్నర దాటింది. ఆరోజు లక్ష్మి, మాధవ్ ఇద్దరూ ఆలయానికి వెళ్ళలేదు.

హనుమంతు కోసం బయలుదేరిన సింహం అతనింటికి కాస్త దూరంలోనే ఆగిపోయి ఓ కుర్రాడిచేత కబురంపించాడు. వాడు గోడకి కొట్టిన బంతిలా తిరిగొచ్చాడు. ఇంట్లో ఎవరూ లేరు.

gulachari.com

ఓసారి నిట్టూర్చి అక్కడినించి ఇంటికి చేరుకున్నాడు సింహం. "వచ్చావా, నాయనా? ఒక్కక్షణం కుదురుగా కూర్చోవుకదా! కాళ్ళలో చక్రాలున్నాయో ఏమిటో గానీ ఎప్పుడూ తిరుగుడే" నవ్వుతూ పలకరించాడు వెంకట్రావు.

నవ్వేసి లోపలికి వెళ్ళిపోయాడు సింహం. మాధవ్ పక్కన చేరాడు. "మాధవ్! దేవుడు మేలుచేస్తే ఈరాత్రికి మనం వచ్చిన పని పూర్తయిపోతుంది. రేపటినుండి ఫ్రీ. కావాలంటే ఈ ఊరునుండి వెళ్ళిపోవచ్చు". అన్నాడు.

మాధవ్‌కి కళ్ళనీళ్ళు తిరిగాయి. "మనపని ఇంకా రెండ్రోజులు ముందే పూర్తయిపోతే ఎంత బాగుండేదిరా. మనం నిన్ననే ఊరొదిలి వెళ్ళిపోతే ఎంత బాగుండేది?" అన్నాడు దీనంగా.

"ఏం ఇప్పుడేమైంది"? ఆశ్చర్యంగా ప్రశ్నించాడు సింహం.

చెప్పలేక చెప్పలేక చెప్పేశాడు మాధవ్. స్థాణువైపోయాడు సింహం. "ఏమిట్రా ఇది! నిజమేనా?"

"నిజమేరా! మధ్యాహ్నం ఆవిడ ఫ్రెండ్ లెటర్ తీసుకొచ్చి ఇచ్చింది. అది చూడగానే మతిపోయిందిరా నాకు. నేనెక్కడా! ఆవిడెక్కడా! ఆవిడ దరిదాపులకు కూడా వెళ్ళే అర్హత లేనివాడిని! అలాటిది" ఇకాపైన మాట్లాడ లేకపోయాడు మాధవ్. ఆషాక్ నుండి మెల్లిగా బయటపడిన సింహానికి సంతోషం కలిగింది.

"అదేమిట్రా మాధవ్! ఇలాటి శుభవార్త విని ఎగిరిగంతేయాల్సిందిపోయి దిగాలు పడిపోతావేం? నాకెంత సంతోషంగా వుందో తెలుసా?" అంటూ సంతోషపడిపోయాడు.

"సంతోషించాలా? ఎందుకు? ఏం చూసుకుని? ఇది జరగడం అసంభవం. పూర్తిగా అసంభవం. ఆవిడ అమాయకంగా ఏదో వూహించుకున్నంత మాత్రాన నేను కూడా తెలివితక్కువగా ఆనందపడిపోనా?

ఆనందం అనుభవించడానికి కూడా అర్హత వుండాలి. నాకేం వుందని. చదువుకోలేదు. ఆస్తి లేదు, కులం గోత్రం లేవు. మరి ఏం వుందని ఈ అదృష్టం అందుకోగలను. ఈ విషయం ఎవరికైనా తెలిస్తే నన్ను కుక్కను కొట్టినట్లు కొట్టి ఊర్లోంచి తరిమేస్తారు" తలపట్టుకున్నాడు మాధవ్.

ఆదరంగా భుజం తట్టాడు సింహం. "నిజమే. ఆస్తీ అంతస్తూ వగైరాలు ఏమీలేవు నీకు. కానీ అంతకంటే విలువైన మనస్తత్వం వుంది. మంచితనం వుంది. తెలివితేటలున్నాయి. అవి చాలు ఒక అమ్మాయిని ఆకర్షించడానికి.

"లక్ష్మి నువ్వనుకుంటున్నంత అమాయకురాలు కాదు. ఆవిడ జీవితం అంత అందమైనది కాదని నీకూ తెలుసు. ప్రస్తుత పరిస్థితులలో ఆవిడకు కావలసింది ఆస్తి, అందం వున్న భర్త కాదు. ఆవిడకు అండగా నిలబడి జీవితాన్ని నడిపించగల వ్యక్తి కావాలి. అతడిని నీలో చూసుకుంది. తెలివిగా ప్రవర్తించింది. తన అభిప్రాయం నీకు తెలియజేసింది.

మరోమాట కూడా చెప్పేస్తున్నాను. లక్ష్మి జీవితంలో ఈ రాత్రి ఓ ప్రమాదం జరగబోతోంది. నువ్వు నిన్న చెప్పినట్లు వాళ్ళ అన్నయ్య పెళ్ళికి తీసుకువెళ్ళడం అక్కడ పెళ్ళిచూపులు ఇదంతా హంబక్. వెంకటేశ్వర్లు కల్పించిన కట్టుకథ. నా అనుమానం నిజమే అయితే ఈ రాత్రికి లక్ష్మికి బలవంతంగా పెళ్ళి చేయించే ప్రయత్నం జరుగుతోంది.

నా కంఠంలో ప్రాణం ఉండగా అలా జరగనివ్వను. అడ్డుపడి వాడి బ్రతుకు బయటపెడతాను. దానితో ఒక ఘట్టం ముగిసిపోతుంది. పరిస్థితులు మారిపోతాయి. ఆ తరువాత ఏం జరుగుతుందో ఏం చెప్పగలం? నిన్ను కుక్కను కొట్టినట్లు కొడతారో, నెత్తిన పెట్టుకుని ఆదరిస్తారో ఎవరు చూడొచ్చారు? ఆశ మనిషికి బలాన్నిస్తుంది. అంతా సవ్యంగా జరిగిపోతుందని అనుకో. దైవం నీకు తప్పక సహాయం చేస్తాడు. ఆయనని వేడుకో. సంతోషంగా వుండు" శాంతమ్మ రాకతో సింహం హితబోధకి అంతరాయం కలిగింది.

"నీకోసం ఆదెమ్మ వచ్చిందయ్యా!" అని చెప్పి వెళ్ళిపోయిందావిడ.

ఆదెమ్మ అంటే హనుమంతు భార్య. వెంటనే లేచి వాకిట్లోకి వెళ్ళాడు సింహం. గేటు బయట నిలబడి వుంది ఆదెమ్మ.

సింహాన్ని చూసి గేటుదాటి లోపలికి వచ్చింది. "బాబుగారూ! ఇప్పుడే మా మావ ఇంటికొచ్చాడు. మిమ్మల్ని రాత్రి పన్నెండు గంటలకి సరివితోట దగ్గరికి రమ్మన్నాడు." మెల్లిగా చెప్పింది.

తెల్లబోయాడు సింహం. "సరివితోపు దగ్గరగా? సరిగ్గా విన్నావా? అసలేం చెప్పాడు? ఎక్కడున్నాడు?

"సరిగానే విన్నాను. సరివితోట దగ్గరికే రమ్మన్నాడు. మీర్రాకపోతే చాలా ప్రమాదం జరుగుతుందట. అంతకన్నా ఇంకేం చెప్పలేదు. మనిషి వణికిపోతున్నాడు. ఏడుస్తున్నాడు. ఇందాక ఆ చలం బాబుగారొచ్చి మామని పిల్చుకెళ్ళారు. మళ్ళీ ఇద్దరూ కలిసి ఇంటికొచ్చారు. ఆయన్ని వాకిట్లో నిలబెట్టి మామ లోపలికొచ్చాడు.

gudachari.com

ఈ ముక్క చెప్పి మళ్ళీ ఆయనతో వెళ్ళిపోయాడు. మీతో చెప్పమన్నాడు. మీకు కాకుండా ఇంకెవరు అడిగినా చెప్పద్దన్నాడు." వీలైనంత వివరంగా చెప్పింది ఆదెమ్మ.

విన్నదంతా మననం చేసుకున్నాడు సింహం. "ఇది పెళ్ళీకాదూ! ఏమీ కాదూ. ఏదో ప్రమాదమే."

అంతకాలంగా ఆ కేస్ డీల్ చేస్తున్నా ఏదో ఒక ఆడపిల్లని రక్షించాలి అనే భావన తప్ప ఇంకో విధమైన ఆలోచన లేదు. మాధవ్‌తో మాట్లాడాక లక్ష్మి పట్ల ఆప్యాయత కలిగింది.

ఎంతోమందికి వైద్యం చేసిన డాక్టర్ తన పిల్లలు జబ్బుపడితే నెర్వస్ అయినట్లు ఒక్కసారి భయపడిపోయాడు సింహం. అంతలోనే తల విదుల్చుకుని సిద్ధమైపోయాడు. ఆదెమ్మని పంపించి లోపలికి వచ్చాడు.

మాధవ్ దగ్గరకు వెళ్ళాడు. "మాధవ్. నేను వెళ్తున్నానురా! లక్ష్మి ప్రాణం అపాయంలో వుంది. కాపాడాలి. నువ్వు" సింహం మాట పూర్తికాకుండానే చివాల్న లేచాడు మాధవ్.

"లక్ష్మికి ప్రాణాపాయమా? వీల్లేదు. నేను బ్రతికుండగా అలా జరగడానికి వీల్లేదు. పద. నేనూ వస్తాను. నువ్వేం చెయ్యమన్నా చేస్తాను. లక్ష్మి క్షేమంగా వుండాలి. అందుకోసం నాప్రాణం పోయినా సరే. పద వెళ్దాం."

అతని ధైర్యం చూసి ముచ్చటపడిపోయాడు సింహం. "పద వెళ్దాం!" అన్నాడు. ఇద్దరూ కలిసి శాంతమ్మగారితో "రేపు తెల్లారేదాకా రాము." అని చెప్పి ఇంట్లోంచి బయటపడ్డారు.

కాస్త దూరం వెళ్ళేసరికి హఠాత్తుగా గుర్తొచ్చింది సింహానికి. పగలంతా పనీపాటా లేకుండా తిరిగాడు కానీ ఏకదంతంగారి దగ్గరకే వెళ్ళలేదు. ఆయన్తో చెప్పటం ఎంతైనా అవసరం. "నువ్విక్కడే వుండు. నేను ఇప్పుడే వచ్చేస్తాను." అనేసి మాధవ్‌ని రోడ్డుమీదే వదిలేసి ఏకదంతంగారి దగ్గరకు పరిగెట్టాడు.

స్టేషన్లో కూర్చుని వున్నాడు ఏకదంతం. ఆయనకి ఎదురుగా పీతాంబరం. ఇద్దరూ శ్యామల గురించే తెగ సీరియస్‌గా మాట్లాడుకుంటున్నారు.

ఆదరాబాదరా వచ్చేశాడు సింహం. "నమస్కారం సార్!" అంటూ విష్ చేశాడు. "మీతో అర్జెంట్ పనుండి వచ్చాను". చెప్తూ పీతాంబరాన్ని చూసి ఆగిపోయాడు.

"మీతో కొంచెం పర్సనల్‌గా మాట్లాడాలి." అన్నాడు.

పీతాంబరం అక్కడి నించి లేచి వెళ్ళిపోయాడు.

"మీతో ఎన్నో రోజుల నుండి చర్చిస్తున్న కేస్‌కి ఇవాళే ముగింపు. మీరు రాత్రి పన్నెండు గంటలకి పోలేరమ్మ గుడికి రావాలి." అన్నాడు.

ఆయన మొహం ఎర్రబడింది. "పూర్వాపరాలు తెలియకుండా నేనెలా వస్తాను. అది చట్టవిరుద్ధం కదా! వివరంగా చెప్తే వస్తాను" అన్నాడు సీరియస్‌గా. ఈ కేసు అధోరకం కేసు. "పూర్వాపరాలు నాకే తెలియవు. మీకేం చెప్తాను? నాకు తెలిసినంత వరకూ చెప్పాలంటే అయితే పెళ్ళి, కాకపోతే హత్య. ఏదైనా మీరు రావటం తప్పనిసరి. ప్లీజ్ రండి." అని చెప్పేసి మరోసారి నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

ఏకదంతం ఉచ్ఛ్వాస నిశ్వాసాల వేగం పెరిగింది. సింహం అటు వెళ్ళగానే వచ్చేశాడు పీతాంబరం. "ఏవిటి? ఏం మాట్లాడాడూ?" అంతా చెప్పాడు ఏకదంతం.

"అయితే పెళ్ళి. కాకపోతే హత్య అన్నాడా? అంటే అన్నాడులే. రెండూ చట్టవిరుద్ధమైన పన్లు కావుగా. ఏం చేస్తాం? కొన్నాళ్ళాగి చూద్దాం. ఇప్పుడు కాకపోతే మరో పదేళ్ళ తర్వాత వాడు ఏదో చట్టవిరుద్ధమైన పని చెయ్యకమానడు. అప్పుడు అరెస్ట్‌చేసి లాకప్‌లో వేసేయ్. అంతదాకా వాడేం చేసినా గుడ్లు అప్పగించి చూస్తూ కూర్చో!" హేళన చేశాడు పీతాంబరం.

ఏకదంతానికి బోలెడంత కోపం వచ్చింది. "ఇన్నాళ్ళూ ఏదో పోన్లే అని ఆగాను. ఇక సహించను. వాడి అంతు చూస్తాను. ఏదో నేరం మోపి అరెస్ట్ చేస్తాను" అన్నాడు పౌరుషంగా.

సింహం ఏకదంతం దగ్గరకు రావడానికి ఓ అరగంట ముందుగా శ్యామల ఫ్రెండ్ శ్యామల కోసం వచ్చింది. తన కోసం పొరుగూరునించీ వచ్చిన ఫ్రెండ్‌ని చూసి చాలా ఆనందపడింది శ్యామల. గలగల్లాడుకుంటూ కబుర్లు చెప్పుకున్నారు ఇద్దరూ. పొద్దుటనుండీ ఏడుస్తూ కూర్చున్న కూతురు అలా సంతోషించడం చూసి ఆనందపడింది తల్లి. "ఎప్పుడూ నేను రావడమే. శ్యామల ఒక్కసారి కూడా మాఇంటికి రాలేదు. పంపించండి." అడిగింది ఆ అమ్మాయి.

"దానికేం భాగ్యం. తప్పకుండా పంపిస్తాను." అందావిడ.

"అయితే నాతో పంపించండి. తీసుకువెళ్ళి రేపు పంపిస్తాను." అంది ఆ అమ్మాయి.

"ఇప్పటికిప్పుడంటే ఎలాగమ్మా. వాళ్ళ నాన్నగారిని అడిగి వీలు చూసుకుని తర్వాత ఎప్పుడైనా వస్తుందిలే." అందావిడ.

Sudachari.com

ఆ అమ్మాయి విన్లేదు. తరువాత అంటూ వాయిదాలు వేస్తే ఎప్పటికీ కుదరదు. పంపించండి అని పట్టుబట్టింది. శ్యామల కూడా బ్రతిమాలింది. "విసుగ్గా వుంది నాకు వెళ్తాను." అంది.

ఆవిడకి జాలేసింది. పాపం ఇల్లు దాటి వెళ్ళి చాలాకాలం అయింది. ఇంట్లో ఈయన గొడవ. పోనీ వెళ్తే కొంచెం మార్పుగా వుంటుంది. సరే! అలాగే వెళ్ళు అనేసింది. మళ్ళీ ఆవిడెక్కడ మనసు మార్చుకుంటుందోనని అయిదు నిముషాల్లో తయారైపోయింది శ్యామల. ఇద్దరూ వెళ్ళిపోయారు.

ఎనిమిదింటికి ఇంటికొచ్చాడు ఏకదంతం. "అమ్మాయేది? అనడిగాడు అలవాటు ప్రకారం.

ఆవిడ చెప్పిన సమాధానం విని మండిపడ్డాడు. నానా చీవాట్లు పెట్టాడు.

"ఇప్పుడేం కొంపలంటుకుపోయాయని ఈ రాద్ధాంతం? పిల్ల తన స్నేహితురాలింటికి వెళ్ళింది. ఈ మాత్రం దానికి అది ఇంట్లోంచి పారిపోయినట్లు మండిపడతారేం?" అంటూ విరుచుకుపడింది ఆవిడ.

* * *

సింహం, మాధవ్ కలిసి వసుంధర ఇంటికి వెళ్ళారు. వసుంధరకి మాధవ్‌ని పరిచయం చేశాడు సింహం. ఆ తర్వాత హనుమంతుద్వారా తనకు అందిన సమాచారం వివరించాడు.

వసుంధర కూడా గతుక్కుమంది. దీర్ఘాలోచనలో మునిపోయింది. ఆవిడ ఆలోచనల నుండి బయటపడక ముందే హోరున శబ్దం చేస్తూ నాలుగు మోటార్ బైక్స్ వచ్చి వాకిట్లో ఆగాయి.

వసుంధర సైన్యం వచ్చేసింది. ఎదురేగి ఆహ్వానించింది వసుంధర. పరిచయాల కార్యక్రమం, టీ తాగడం అన్నీ చకచక ఓ పావుగంటలో ముగిసిపోయాయి.

అందరూ మేడమీద సమావేశం అయ్యారు. కేసును అందరికీ అర్థం అయ్యేలా ఆద్యంతం వినిపించింది వసుంధర.

"సో ఫ్రెండ్స్. ఈ కేసులో వెంకటేశ్వర్లు మస్తాన్‌ని ఆశ్రయించాడు. వాడిని చూస్తే అన్నింటికీ తెగించినవాడిలా వున్నాడు. కాబట్టి మనం జాగ్రత్తగా వ్యవహరించి పని చక్కబెట్టుకోవాలి. అందరం కలిసి ప్లాన్ చేసుకుందాం.

తోటను పెంచాలంటే మొదటి పాఠం కంచె కట్టడం. అలాగే ఇందులో కూడా మనం మొట్టమొదటిసారిగా జాగ్రత్త వహించవలసింది ప్రొటెక్షన్.

నేరస్తులు పారిపోకుండా చూడాలి. అన్నిదారులూ కాపలా కాయాలి. మనం పదకొండుమంది మనుషులం వున్నాం. వాహనాలున్నాయి."

చెప్తున్న వసుంధరకు అడ్డు తగిలాడు సింహం. "మరి గుండు వెంకటేశ్వర్రావూ వాళ్ళూ కూడా వస్తానన్నారుగా. వాళ్ళ సహాయం అవసరం లేదని చెప్పేద్దామా?"

"రైట్. బాగా గుర్తు చేశారు. మనకు ఇప్పుడు మనిషి సహాయం ఎంతైనా అవసరం. వాళ్ళనుకూడా రానివ్వండి. పులుసులో ముక్కలా చిన్నపన్లకి వాడుకుందాం." అంది వసుంధర.

"సో. ఏం చెప్తున్నాను? గుండు వెంకటేశ్వర్రావు వగైరాలు కలిసి పదమూడు మంది మనుషులం వున్నాం. వాహనాలు అయిదు. ఈ జరగబోయే ఘోరం ఎక్కడ జరుగుతుందో మనకు కచ్చితంగా తెలియదు. ఒకటి పోలేరమ్మ గుడి, రెండు సరివి తోపు. ఈ రెండు స్థలాలను కనిపెట్టి వుండాలి. ఊర్నించి బయట పడాలంటే దారులు రెండు. ఆ రెండింటినీ కాపలా కాయాలి. వెంకటేశ్వర్లుని ఫాలో అవ్వాలి" అంటూ పాయింట్ బై పాయింట్ చెప్పుకొచ్చింది. మరికొన్ని సలహాలు, మార్పులు చేర్పులూ జరిగాయి.

పరిష్టమైన వ్యూహం తయారైపోయింది. చర్చ ముగించి లేచారు అందరూ. సింహం అక్కడినించి గుండు వెంకటేశ్వర్రావు గారింటికి వెళ్ళాడు.

నట్‌బోల్ట్ వెంకటేశ్వర్రావు అప్పటికే భోజనం గట్రా ముగించేసి డ్రెస్ అయి అన్నీ సర్దుకుని సిద్ధంగా కూర్చున్నాడు. సింహాన్ని చూడగానే ఎదురొచ్చేశాడు. మొదట్లో ఏదో మామూలుగా వున్నా తరువాత చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది అతనికి.

"ఏవిటంత ఆలస్యం చేశారు? మీకోసం సాయంత్రం నుండీ చూస్తున్నాను. కెమెరా లోడ్ చేయించాను. టేప్‌రికార్డర్‌లో కేసెట్ పెట్టి సిద్ధం చేశాను. అన్నట్లు చెప్పడం మర్చిపోయాను. మా ఫ్రెండ్‌నడిగి డమ్మీ రివాల్వర్ కూడా సంపాదించాను. గుండు వెంకటేశ్వర్రావుగారు కూడా సిద్ధంగా వున్నారు." అన్నాడు.

అతని ఉత్సాహం చూసి సంతోషించాడు సింహం. "పదకొండుగంటలకి అటూఇటూ మీరిద్దరూ పోలేరమ్మ ఆలయం దగ్గరికి రండి. నేనూ అక్కడే వుంటాను. ఒక్కసారి అక్కడికి చేరాక ఇంకేమీ ఆలోచించకండి. ధైర్యంగా మీకేవి అనుమానాస్పదంగా కనబడినా శకామని ఫోటో తీసేయండి. అవకాశం ఉంటే సంభాషణలు రికార్డ్ చేయండి. మరోమాట. వచ్చేటప్పుడు డార్క్‌కలర్ బట్టలు వేసుకుని మరీ రండి." అంటూ సూచనలు ఇచ్చేసి వసుంధర ఇంటికి వెళ్ళాడు.

sudachar.com

ఇతనికోసమే ఎదురు చూస్తున్నారు అందరూ. అందరికీ భోజనాలు అక్కడే ఏర్పాటు చేయించింది వసుంధర. అందరూ కలిసి చపాతీలు కూరా తినేశారు. టి.వి.లో ఇంగ్లీషు వార్తలు మొదలయ్యాయి. అందరూ రిలాక్సింగ్‌గా కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ టి.వి. చూశారు. వార్తలు ముగిశాయి. ఇద్దరూ ఒకేసారి మాధవ్ వంక చూశారు.

గుండెనిండా వూపిరి పీల్చుకుని లేచాడు మాధవ్. "వెళ్ళొస్తాను." అన్నాడు. "ఆల్ ది బెస్ట్" అన్నారందరూ. ఇంట్లోంచి బయలుదేరాడు మాధవ్. తిన్నగా సుబ్బారావుగారింటి వైపు వెళ్ళాడు. ఇంటిగేటు, వరండా మొదలైన పోర్షన్ అంతా బాగా కనిపించే చోటు ఎంచుకుని చీకట్లో కాపు వేశాడు. వాకిట్లో ఒక ఎద్దుల బండి ఆగి వుంది. మరో పావు గంట తర్వాత వరండాలోకి వచ్చారు ఇంట్లో జనాభా అందరూ. ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూడసాగాడు మాధవ్.

వెంకటేశ్వర్లు చేతుల్లో చిన్న సూట్‌కేస్ వుంది. అతని వెనక లక్ష్మి. ఆవిడను చూడగానే మాధవ్ గుండె ఝల్లుమంది. వెళ్ళొస్తాను నాన్నా అని చెప్పింది. క్షేమంగా వెళ్ళి లాభంగా రా తల్లీ అన్నాడాయన. అన్నాచెల్లెలు బయటికి వచ్చారు. చెల్లెల్ని భద్రంగా బండిలోకి ఎక్కించి భార్యతో వెళ్ళొస్తానని చెప్పి బండెక్కాడు వెంకటేశ్వర్లు. ఆ ఊర్లో రిక్షాలు లేవు. ఆటోలూ గట్రా అసలే లేవు. లోకల్ ట్రాన్స్‌పోర్టు ఎద్దు బళ్ళే. అందుకనే వెంకటేశ్వర్లుని ఫాలో అవడానికి మాధవ్‌ని నియమించారు. బండి అంతదూరం వెళ్ళాక తాపీగా కదిలాడు మాధవ్. బండి సందులూ గొందులూ తిరిగి ఊరికి ఆ చివరగా ఒక తాటాకు ఇంటి ముందు ఆగింది.

"ఇక్కడికి వచ్చామేం అన్నయ్యా. ఇది ఎవరిల్లు?" అడిగింది లక్ష్మి.

"నాకు తెలిసిన వాళ్ళ ఇల్లు. ఇంకా కొంతమంది రావాలి. అందరం కలిసి వెళ్దాం." సమాధానం చెప్పాడు వెంకటేశ్వర్లు.

ఇద్దరూ ఇంట్లోకి వెళ్ళారు. లోపల ఒక ఆడమనిషి వుంది. వీళ్ళను చూడగానే మంచినీళ్ళు ఇచ్చి మంచం వాల్చింది. గ్లాసులతో పాలు తీసుకొచ్చి ఇద్దరికీ అందించింది. ఇద్దరూ తాగారు. "కాసేపు పడుకో అమ్మాయ్. వాళ్ళొచ్చాక లేపుతాను." అన్నాడు వెంకటేశ్వర్లు.

"అలాగే అంటూ మంచం మీద నడుం వాల్చింది లక్ష్మి. అయిదు నిముషాలు తిరక్కుండానే కళ్ళు మూతలు పడిపోయాయి. గాఢనిద్రలో మునిగిపోయింది. తృప్తిగా నిట్టూర్చి లేచాడు వెంకటేశ్వర్లు. పదకొండు కొట్టేసరికి పోలేరమ్మ గుడికి చేరుకున్నారు గుండు వెంకటేశ్వర్రావు, నట్‌బోల్ట్ వెంకటేశ్వర్రావు. నట్‌బోల్ట్‌కి ఉత్సాహంగానే

వుంది గానీ గుండుగారికి మాత్రం చిరాగ్గా వుంది. దేశసేవ, పేరు ప్రఖ్యాతులు అంటూ వూదరపెట్టి లాక్కొచ్చాడు కాబట్టి వచ్చాడతను.

ఇద్దరూ ఇంటినుండి స్కూటర్ మీదే బయలుదేరారు. ఇంకా అంతదూరాన వుండగా ఇక కదలనని మొరాయించింది స్కూటరు. అక్కడినించి నెట్టుకుంటూ గమ్యం చేరారు. అక్కడి వాతావరణం చాలా భయంకరంగా వుంది. నిశ్శబ్దంగా వున్న పరిసరాలు, జీబురు మంటూ చెట్లు, కీచురాళ్ళ చప్పుడు. గుడి ముందర ఒక ట్యూబ్ లైట్ వెలుగుతూ ఆరుతూ వుంది. నేలమీద చెత్తచెదారం, కోరలు కనిపించేలా నిలబడి వున్న ద్వారపాలకుల విగ్రహాలు. ఎటువంటి వారికైనా భయం కలిగించేలా వుంది. వెంకటేశ్వర్రావు లిద్దరికీ వెన్నులోంచి వణుకు పుట్టుకొచ్చింది.

"నాకు చాలా భయం వేస్తోంది వెంకటేశ్వర్రావుగారూ! వెళ్ళిపోదామా?" అన్నాడు గుండు.

అతను భయపడుతున్నాడని తెలిసేసరికి ఇతడికి ఎక్కడలేని ధైర్యమూ వచ్చేసింది. "వెళ్ళడం ఎందుకు వెంకటేశ్వర్రావుగారూ. నేను లేనూ! మీ ప్రాణానికి నా ప్రాణం బద్ధం. అదీ గాక నా దగ్గర దొంగ పిస్తోలు వుంది కదా! అది దొంగదని దొంగకి ఎలాగూ తెలియదు. కాబట్టి వాడు రాగానే అది పేల్చేస్తే వాడు భయపడిపోతాడు. అప్పుడు మనం ఫోటోలు అవీ తీసుకోవచ్చు. అసలు ఈలోగా సింహం రానే వస్తుందుగా!" ధైర్యం చెప్పాడు.

ఆ తర్వాత ఇద్దరూ కలిసి ఆంజనేయ దండకం చదువుకుంటూ కూర్చున్నారు.

పదకొండు కొట్టగానే ఇంట్లోంచి కదిలారు వసుంధర, సింహం, వారి సైన్యం. ఒక మోటార్ సైకిల్ ఊరి పొలిమేర వైపు వెళ్ళింది. ఊర్నించి బయటపడే రోడ్డుకి కాస్త దూరంలో చీకట్లో ఆగింది. దానికి ఆపోజిట్ డైరెక్షన్ మరో బైక్ ఇద్దరు మనుషులతో పోలేరమ్మ గుడినుండి సరివి తోపుకు వెళ్ళే దార్లో పోలేరమ్మ గుడినుండి కూతవేటు దూరంలో ఆగింది. నాలుగవ బైక్ ఇద్దరు మనుషులతో సరివితోపు నుండి పోలేరమ్మ గుడికి వెళ్ళే మార్గంలో సరివి తోపుకు కూతవేటు దూరంలో ఆగింది. వసుంధర, సింహం స్కూటర్ మీద బయలుదేరారు. ఊరంతా ఓ చుట్టు చుట్టారు. మస్తాన్ ఇంటికి కొంచెం దూరంలో దిగాడు సింహం.

"మీరు వెళ్ళండి అన్నాడు. "సరే" అనేసి తిన్నగా ఊరి బయటికి వెళ్ళిపోయింది వసుంధర. అక్కడ కాపలా కాస్తున్న వాళ్ళని పలకరించి అనుమానించవలసింది ఏదీలేదని తెలుసుకుని మరో డైరెక్షన్‌లో బయలుదేరింది.

gubaahari.com

సింహం మెల్లిగా పిల్లిలా మస్తాన్ ఇంటికి దగ్గరకు వెళ్ళాడు. లోపల ఏమీ అలికిడి లేదు. గుడిసె దగ్గరకు వెళ్ళి కన్నంలోంచి చూశాడు. మస్తాన్ ఒక్కడే మంచం మీద పడుకుని వున్నాడు. అయిదు నిముషాలు గడిచినా ఏమీ మార్పులేదు. ఇక ఇక్కడ వెయిట్ చెయ్యడం అనవసరం అనుకుని మళ్ళీ పిల్లిలా నడుస్తూ వచ్చేశాడు. చకచక పోలేరమ్మ ఆలయంవైపు దారితీశాడు.

* * *

ఏకదంతం గంజిపెట్టి ఇస్త్రీ చేసిన యూనిఫాం వేసుకుని బెల్ట్ పెట్టుకుని తలమీద టోపీ పెట్టుకుని, రివాల్వర్ పట్టుకుని బయలుదేరాడు. మందీ మార్బలంతో రమ్మని సింహం చెప్పాడు గానీ వంటరిగానే వెళ్ళాలని నిర్ణయించుకున్నాడు ఏకదంతం. పీతాంబరాన్ని మాత్రం వెంటి తీసుకువెళ్ళాలనుకున్నాడు. పదకొండున్నరకి ఇంట్లోనుంచి బయలుదేరారు ఇద్దరూ.

సింహం మస్తాన్ ఇంటి దగ్గర నుండి వచ్చేసిన అయిదు నిముషాలు గడవకుండానే భార్యని వెంట బెట్టుకుని అక్కడికి జేరాడు దక్షిణామూర్తి. 'రా!రా!' అంటూ ఆహ్వానించాడు మస్తాన్. అతని చూపులు రాజ్యలక్ష్మి మీద నిలిచాయి. 'ఫర్వాలేదు. బాగానే వుంది పిల్ల. సరైన పోషణలేక ఇలా వుందిగానీ, నాల్రోజులు రెండుపూట్లా తిండి పెడితే పజ్రపు తునకలా వుంటుంది' తృప్తిపడ్డాడు.

'అలా కూర్చోండి' అన్నాడు. వాళ్ళిద్దరూ కూర్చున్నారు. వాళ్ళు వచ్చిన అయిదు నిముషాలకి చలం, హనుమంతు లోపలికి వచ్చారు. తిక్క తిక్కగా వుందంటే హనుమంతుని సారా కొట్టుకి తీసుకెళ్ళాడు చలం. 'పనిపూర్తి అయి మనం ఊర్నించి బయటపడే వరకూ వాడిని ఒక్కక్షణం కూడా వదలకు.' అని మస్తాన్ చలానికి ఆదేశం ఇచ్చాడు. అందుకే విషయం వాడికి చెప్పిన దగ్గరనుండి వెంటబెట్టుకునే తిరుగుతున్నాడు చలం. లోపలికి రాగానే "ఇంకా ఎప్పుడొస్తారు మీవాళ్ళు?" అంటూ అడిగేశాడు. నోరుమూసుకుని అక్కడ కూర్చోమని సైగ చేశాడు మస్తాన్.

ఆ చిన్న గుడిశెలో అయిదుగురు మనుషులు వున్నా నిశ్శబ్దం ఆవరించింది.

* * *

పీతాంబరం సమేతంగా ఏకదంతంగారు పోలేరమ్మ ఆలయం దగ్గరికి వచ్చారు. వాళ్ళు నడుస్తుంటే ఎండుటాకులు శబ్దం చేశాయి. అది విని ఎలర్ట్ అయిపోయారు వెంకటేశ్వర్రావులు.

"ఎవరో వస్తున్నారు వెంకటేశ్వర్రావుగారూ!" అన్నాడు గుండు భయంగా. "అవును వెంకటేశ్వర్రావుగారు. బహుశా ఆ సింహం వస్తున్నాడేమో" అన్నాడు నట్‌బోల్ట్.

వెలిగి ఆరిపోతున్న లైట్ వెలుగులో వచ్చిన వ్యక్తి సింహం కాదని గ్రహించాడు నట్‌బోల్ట్. వెంటనే రెండు చేతులూ పైకి ఎత్తేసి "హాండ్స్ అప్". అన్నాడు.

అదిరిపడి రివాల్వర్ కేసులో పెట్టేసి చేతులెత్తేశాడు ఏకదంతం. అంతలోనే గుర్తొచ్చి "హాండ్సప్" అన్నాడు. దాంతో బెదిరిపోయిన గుండు చేతులెత్తేశాడు. అలా అందరూ చేతులు పైకెత్తేసి కాసేపు నిలబడ్డారు.

ఓ రెండు నిముషాల తర్వాత ఎదురుగా వున్న మనిషిని ఇనస్పెక్టరు ఏకదంతంగా గుర్తించాడు నట్‌బోల్ట్.

"హల్లో సార్ మీరా? మేము దొంగలేమో అనుకున్నాం!" అన్నాడు.

"ఎవరు నట్‌బోల్ట్ వెంకటేశ్వర్రావుగారా? మీరిక్కడ ఏం చేస్తున్నారు?" ఆశ్చర్యపోయాడు ఏకదంతం.

"మేము ప్రజాధన సంరక్షక సంఘం వారికి సహాయం చెయ్యడానికి వచ్చాం. మళ్ళీ సింహం రమ్మన్నాడు." చెప్పాడు వెంకటేశ్వర్రావు.

అయనకి చెడ్డకోపం వచ్చేసింది. "ఏవయ్యా పెద్దమనిషీ! దొంగతనంగా పెళ్ళి చేసుకుంటూ పిలవడానికి అతనికి బుద్ధి లేకపోతే తగుదునమ్మా అని సహాయం చెయ్యడానికి నీకు బుద్ధి లేదుటయ్యా" అన్నాడు. వెంకటేశ్వర్రావులకి చాలాకోపం వచ్చేసింది. "మాటలు జాగ్రత్తగా రానివ్వండి. మేము పెళ్ళికి రాలేదు. విగ్రహాలు దొంగిలించుకుపోతుంటే పట్టుకుందామని వచ్చాం." అన్నారు ముక్తకంఠంతో.

వీళ్ళిలా దెబ్బలాడుకుంటూ వుండగానే సింహం వచ్చేశాడు. అతడిని చూడగానే ఏకదంతానికి చాలా కోపం వచ్చేసింది.

"హాండ్స్ అప్. యూ ఆర్ అండర్ అరెస్ట్!" అని అరిచాడు. సింహం బెదిరిపోయాడు. "నేనెందుకు అండర్ అరెస్టూ? నేనేం చేశాను?"

"ఇంకా నాటకాలు కట్టిపెట్టు. నీ ఆలోచన ఏమిటో మాకు అర్థం అయిపోయింది. ఏది శ్యామల? ఎక్కడుంది'? గర్జించాడాయన.

* * *

ముఖ్యమైన ప్రదేశాలు గస్తి తిరుగుతున్న వసుంధర ఊరి చివరకు వెళ్ళేసరికి ఒకడి కాపలా వాళ్ళు ఆపేశారు. "ఇంతకు ముందు ఒక జీప్ వచ్చింది. అందులో

sivaachi.com

నలుగురైదుగురు మనుషులు వున్నారు. తిన్నగా వెళ్ళి కుడిచేతివైపు తిరిగి వెళ్ళిపోయింది." అంటూ సమాచారం అందించారు.

తలపంకించింది వసుంధర. వాళ్ళు చూపించిన దారి సరివితోపు దగ్గరికి వెళ్తుంది. వెంటనే స్కూటర్ వెనక్కి తిప్పుకుని ఆ తోవన వెళ్ళింది.

నలుగురైదుగురితో వున్న ఆ జీప్ తిన్నగా వెళ్ళి సరివితోటకు దగ్గరగా ఆగింది. అందులోంచి అందరూ దిగారు. ఇద్దరు వ్యక్తులు ఊరివైపు వెళ్ళారు. మిగిలినవాళ్ళు అక్కడే వుండిపోయారు.

మస్తాన్ గుడిసెలోకి వెళ్ళారు ఇద్దరూ. "సలామ్ గురువా!" అన్నాడు అంతక్రితం వచ్చిన గడ్డం మనిషి. పక్కనున్న వాడు కూడా విష్ చేశాడు. మస్తాన్ లేచివచ్చి వాళ్ళిద్దర్నీ కావలించుకున్నాడు. తిరిగి లోపలికి వెళ్ళాడు. దక్షిణామూర్తిని దగ్గరకు రమ్మని సైగ చేశాడు. "నువ్వూ, నీ భార్యా ఇతనితో వెళ్ళండి. నాకో చిన్న పనుంది. అది చూసుకుని వచ్చేస్తాను" అన్నాడు. తలాడించాడు వెంకటదక్షిణామూర్తి. గడ్డం మనిషి పదండి అన్నాడు. అతని వెనకాలే బయలుదేరారు ఇద్దరూ.

"నాకెందుకో భయంగా వుంది!" అంది రాజ్యలక్ష్మి భయంగా. "బావుంది. భయం ఎందుకు? దర్జాగా వాహనంలో ఎక్కించి తీసుకెళ్తుంటే!" తనకూ భయంగానే వున్నా భార్యకు ధైర్యం చెప్పాడు దక్షిణామూర్తి.

వాళ్ళను అటు పంపించి మస్తాన్, ఆరెండో వ్యక్తి, హనుమంతూ బయలుదేరారు. హనుమంతు గుండె దడదడలాడిపోతోంది. వెయ్యి దేవుళ్ళకి మొక్కుకుంటూ ముందుకి నడిచాడు.

* * *

సరివి తోటకి కొంచెం దూరంలో వుండగానే ఇంజనూ, లైటూ ఆపేసుకుని వచ్చింది, వసుంధర. అక్కడ కాపలా కాస్తున్న ప్రభాకర్ వసుంధర దగ్గరకు వచ్చాడు. "ఇందాక ఏదో వెహికల్ వచ్చింది. అదుగో అటుపక్క ఆగింది. చూస్తానని వెళ్ళాడు శాస్త్రి" అన్నాడు. "సరే అతను వచ్చేదాకా ఆగుదాం" అంది వసుంధర.

కాసేపు నిరీక్షించాక అడుగుల శబ్దం వినిపించింది. వేగంగా నడుస్తూ వచ్చేశాడు శాస్త్రి. "ఆ వచ్చింది జీప్. అందులోంచి అయిదుగురు దిగారు. అందరూ దిట్టంగా వున్నారు. ముగ్గురు జీప్ దగ్గరే వున్నారు. ఇద్దరు ఊరివైపు వెళ్ళారు. కాసేపటి తర్వాత వెళ్ళిన వారిలో ఒకడు తిరిగొచ్చాడు. వాడివెంట ఒక అమ్మాయి ఒక మగమనిషి కూడా వచ్చారు." తను చూసింది చెప్పాడు.

కంగారు పడిపోయింది వసుంధర. "ఆ అమ్మాయి అంటే లక్ష్మి. వెంట వుంది ఎవరు? జీప్‌లో ఎక్కడికైనా తీసికెళ్ళి అక్కడ హత్య చేస్తారా?" ఇక ఆలోచించదల్చుకోలేదు.

"శాస్త్రీ నువ్వూ ప్రభాకర్ జీప్ దగ్గరకు వెళ్ళండి. సింహం గుడివైపు వెళ్ళాడు. నేను వెళ్ళి అతడిని అక్కడ ఉన్న మనవాళ్ళని తీసుకొస్తాను. ఈలోగా వాళ్ళు వెళ్ళకుండా చూడండి. జాగ్రత్త" అని చెప్పేసి స్కూటర్ మీద గుడివైపు దూసుకుపోయింది.

* * *

హఠాత్తుగా శ్యామల ప్రసక్తి వచ్చేసరికి తెల్లబోయాడు సింహం.

"శ్యామలా? ఆవిడ గురించి నన్నడుగుతారేం? నాకేం తెలుసు?"

"ఇంకా బుకాయించాలని చూడకు. నీకు అంతా తెలుసు. నువ్వూ శ్యామలా ప్రేమించుకోలేదా? నువ్వు ఈ ఊరు వచ్చింది శ్యామల కోసం. మాకు అంగీకారం కాకపోయినా పెళ్ళి చేసుకుందామని నీ ఆలోచన! ఇక నీ ఆటకట్టు. మావయ్య నిన్ను అరెస్టు చేసి లాకప్‌లో వేసేస్తాడు." అన్నాడు పీతాంబరం.

టపటప లెంపలు వాయించుకున్నాడు సింహం. "ఛ! నోరుముయ్యండి. ఏవిటా ప్రేలాపన. ఒక ఆడపిల్ల విషయంలో అలా నోటికొచ్చినట్లు మాట్లాడ్డానికి సిగ్గులేదూ మీకు? మీరు చెప్పినదంతా అబద్ధం."

"ఏంకాదు. నేను చెప్పిందే నిజం! నువ్వు రాసిన ఉత్తరం చదివాం? నువ్వు వచ్చిన దగ్గర్నుంచి నిన్ను గమనిస్తూనే వున్నాం. చీటికీ మాటికీ నువ్వొచ్చి మావయ్యతో ఏదో పిచ్చిగా మాట్లాడి, శ్యామలతో కబుర్లాడి వెళ్ళడం మాకు తెలీదనుకున్నావా?" నిలదీశాడు పీతాంబరం.

తల బాదుకున్నాడు సింహం. "వినండి మహా ప్రభో! నాకూ మీ శ్యామలకీ ఎటువంటి సంబంధం లేదు. ఈ ఊరు వచ్చేక మొదటిసారి ఆవిడని చూశాను. అసలే మీ మామయ్య దగ్గరకు నేను రావటంలో గలకారణం ఏమిటంటే!"అంటూ మొదలుపెట్టబోతూ వుండగానే స్కూటర్ దూసుకొచ్చేసింది.

"సింహంగారూ! రండి అర్జెంట్. వాళ్ళు లక్ష్మిని సరివితోట దగ్గరికి తీసుకొచ్చే కారుట. శాస్త్రి, ప్రభాకర్‌లను కాపలాపెట్టి వచ్చాను. రండి వెళ్దాం." పొలికేక పెట్టింది వసుంధర.

నోరావలించాడు సింహం. "లక్ష్మిని అక్కడికి తీసుకొచ్చారా? మరైతే లక్ష్మిని పోలి వున్న మాధవ్ ఏడి? హనుమంతు ఏమయ్యాడు? వెంకటేశ్వర్లు ఏడి?

gudachari.com

చలం కూడా అక్కడే వున్నాడా?" అతని ధోరణికి చిర్రెత్తుకొచ్చింది వసుంధరకి. "ఆ వివరాలన్నీ నాకు తెలీవు. కావాలంటే వాళ్ళని అడిగొచ్చి చెప్తాను. ముందు మీరు రండి" అంటూ కసిరింది.

తెలివి తెచ్చుకుని అటు పరిగెట్టాడు సింహం. అంతలోనే వెనక్కు వచ్చి ఏకదంతంగార్ని కూడా లాక్కెళ్ళాడు. ముగ్గురూ స్కూటర్ మీద బయలుదేరారు. పోలేరమ్మ గుడికి దగ్గర్లో కాపలా వున్న మనోహర్ మారుతీరావుల దగ్గరికి వెళ్ళారు. "పదండి అర్జెంట్" ఒక్క క్షణం స్లో చేసి చెప్పింది వసుంధర. సింహంలా ప్రశ్నించకుండా వెంటనే బైక్ స్టార్ట్ చేసేశారు వాళ్ళు. తనకు తెలిసిన వివరాలు దార్లో చెప్పింది వసుంధర.

"మామయ్యని సింహం లాక్కు వెళ్ళగానే "మావయ్యా నేనూవస్తా" అంటూ వెంటబడ్డాడు పీతాంబరం.

పోలేరమ్మ ఆలయంలో మిగిలిపోయారు వెంకటేశ్వర్రావులు. వాళ్ళిద్దరికీ కోపం వచ్చింది.

"ఏమిటిది? మనతోనేమో విగ్రహాలు దొంగతనాలు అని చెప్పాడు. తీరా ఇక్కడికొచ్చాక ప్రేమా పెళ్ళి అంటూ జుట్టూ జుట్టూ పట్టుకుంటున్నారు. ఇదంతా చూస్తుంటే మనం ఇలా రావడం మన బుద్ధి తక్కువేమో అనివిస్తోంది వెంకటేశ్వర్రావుగారూ!" అన్నాడు నట్‌బోల్ట్.

"మధ్యలో నన్ను కూడా ఎందుకు కలుపుతారు వెంకటేశ్వర్రావుగారూ? ఇది ఖచ్చితంగా మీ తెలివి తక్కువతనమే. భార్యా, పిల్లలు కలవాళ్ళం మనకెందుకండీ ఈ గొడవలంటే విన్నారా? ఇప్పుడు అనుభవించండి" విసుక్కున్నాడు గుండు.

"ఇప్పుడు మాత్రం ఏం మునిగిపోయింది? ఇంటికి వెళ్ళిపోదాం. రేపు ఆ సింహాన్ని పట్టుకుని బుద్ధి చెప్పేద్దాం!" అన్నాడు నట్‌బోల్ట్. మరో నిముషం వుంటే వెళ్ళి పోయేవారే. అంతలోనే ఎవరో వస్తున్న అలికిడి అయితే భయపడిపోయి గబగబ చాటున దాక్కున్నారు.

మస్తాన్, హనుమంతు, చలం, మస్తాన్ అనుచరుడు కోటి వచ్చారు. "సింహం చెప్పింది నిజమేనండోయ్. వీళ్ళే విగ్రహాల దొంగలు." గుసగుసలాడాడు నట్‌బోల్ట్.

"నాబొంద. వీళ్ళు మనవూరివాళ్ళేగా!" విసుక్కున్నాడు గుండు.

"అవునవును. వెళ్ళి పలకరిద్దామా!"

ఒక అడుగు ముందుకి వేసిన అతడిని వెనక్కి లాగేశాడు గుండు.

"వాళ్ళతో ఎవరో కొత్తవాళ్ళు కూడా వున్నారు. పలకరింపులూ వద్దూ పాడూ వద్దూ. ఇలాగే నిలబడదాం." అన్నాడు.

గుళ్ళోకి వచ్చిన మస్తాన్ నలుదిక్కులా చూశాడు. "ఏడయ్యా, మీ బావగారూ? ఇంకా రాలేదేం? కొంపతీసి చెల్లెలితోపాటు గుర్రెట్టి నిద్రపోతున్నాడా ఏం?" అన్నాడు.

"అబ్బే. అలా చెయ్యడులెండి వస్తూనే ఉంటాడు." హామీ ఇచ్చాడు చలం.

"వాళ్ళు రాగానే ఏం చెయ్యాలో గుర్తుందిగా?" అడిగాడు మస్తాన్. ముగ్గురూ తలలూపారు.

లక్ష్మి వెంకటేశ్వర్లు వస్తున్న బండి మధ్య దార్లో వుంది. నిద్రమత్తులో వున్న లక్ష్మి అన్నయ్య లేపితే మత్తుగానే లేచివచ్చి బండి ఎక్కింది. కళ్ళుమూసుకుపోతూ వుంటే అలాగే కూర్చుని కునికిపాట్లు పడుతుండగానే గుర్తొచ్చింది. "వాళ్ళెవరో వస్తారన్నావుగా రాలేదేం"? అంటూ అడిగింది. "ఏమో మరి రాలేదు." చెప్పాడు వెంకటేశ్వర్లు.

మరో అయిదు నిముషాలు గడిచాక మళ్ళీ మత్తు వదిలించుకుంది "మనం ఎక్కడికి వెళ్తున్నాం?" అడిగింది.

"పట్లోకి. వెధవ ఆరాలూ నువ్వూనూ. ఎక్కడికో అక్కడికి. నేను తీసుకు పోతున్నాను కదా! నోరు మూసుకుని కూర్చో." అసలే టెన్షన్‌లో వున్న వెంకటేశ్వర్లు విసుక్కున్నాడు. అతనిలో పాత అన్నయ్యను చూసి అదిరిపడింది లక్ష్మి. మత్తు వదిలిపోయింది. భయం భయంగా కూర్చుంది. కాస్త దూరంలో బండిని ఫాలో అవుతూనే వున్నాడు మాధవ్.

గుడికి అంత దూరంలోనే బండి ఆపించాడు వెంకటేశ్వర్లు. బండిదిగి "దిగు" కసిరాడు. "ఇక్కడికెందుకొచ్చాం అన్నయ్యా?" భయంగా అడిగింది లక్ష్మి. "చెప్తాను దిగు" అంటూనే బండిలోంచి దింపేసి చెయ్యి పట్టుకుని లాక్కుపోసాగాడు.

"నాకు భయంగా వుందన్నయ్యా, వెళ్ళిపోదాం" బ్రతిమాలింది లక్ష్మి. విననట్లే ఆలయం దగ్గరికి లాక్కొచ్చాడు వెంకటేశ్వర్లు.

అక్కడ ఆ వెలుగులో చలాన్ని మరో ఇద్దరు అపరిచితులను చూసి అదిరిపడింది లక్ష్మి.

లక్ష్మిని చూసి రెప్పవెయ్యడం మర్చిపోయాడు మస్తాన్. అప్రయత్నంగా దగ్గరకు వచ్చేశాడు. ఆపాదమస్తకం కళ్ళింత చేసుకుని చూస్తుంటే వణికిపోయింది లక్ష్మి. "అన్నయ్యా! భయంగా వుంది. ఇంటికి వెళ్ళిపోదాం" అంటూ అన్న వెనక్కి వెళ్ళిపోయింది.

pustaka.org

అతని చూపులు వెంకటేశ్వర్లుకి కూడా నచ్చలేదు. "ఏమిటిది? అన్ని ఏర్పాట్లూ చేయిస్తానన్నారు? ఏమీ చేయలేదేం? విసుగ్గా అడిగాడు.

అతగాడి అధార్టీ చూసి ఒళ్ళుమండింది మస్తాన్‌కి. "అన్ని ఏర్పాట్లూ చేసేశాం. నువ్వెళ్ళు" అన్నాడు.

తెల్లబోయాడు వెంకటేశ్వర్లు. "నేను వెళ్ళడం ఏమిటి? పెళ్ళయ్యాక ఇద్దర్నీ తీసుకుని వెళ్తాను" అన్నాడు.

"పెళ్ళిలో నువ్వుండి ఏం చేస్తావ్? అసలైనా ఇక్కడ పెళ్ళి చెయ్యం. మా ఊరు తీసుకెళ్ళి అక్కడ పెళ్ళి చేస్తాం!" లక్ష్మిని చూపుల్తో తాగేస్తూ నిర్లక్ష్యంగా చెప్పాడు మస్తాన్.

అతని ధోరణి మాత్రం ఎంతమాత్రం నచ్చలేదు వెంకటేశ్వర్లుకి. "అలా వీల్లేదు. నేను ఒప్పుకోను. చలం, హనుమంతూ పదండి వెళ్దాం" అంటూ చెల్లెలి భుజం మీద చెయ్యివేసి వెనక్కి తిరిగాడు వెంకటేశ్వర్లు.

చలం, హనుమంతు అంగుళం కూడా కదల్లేదు. మస్తాన్ సైగనందుకుని కోటి ముందుకు కదిలాడు. నాలుగడుగులు వేసిన వెంకటేశ్వర్లుకి ఏదో అనుమానం వచ్చి వెనక్కి తిరగబోయాడు. అప్పటికే ఆలస్యం అయిపోయింది. బలంగా మెడమీద కొట్టాడు కోటి. నిలువునా కూలిపోయాడు వెంకటేశ్వర్లు. కెవ్వున అరిచింది లక్ష్మి. అరవబోతూ నోళ్ళు నొక్కేసుకున్నారు వెంకటేశ్వర్రావులు.

"ఏమిటీ ఘోరం వెంకటేశ్వర్రావుగారూ!" వణికిపోతూ అడిగాడు గుండు.

"అదే నాకూ అర్థం కావడం లేదు వెంకటేశ్వర్రావుగారూ" వాపోయాడు నట్‌బోల్ట్.

"ఏదైనా కానివ్వండి ఫోటోలు తీద్దాం. మీరు ఫోటోలు తియ్యండి. నేను ఈ గొడవంతా రికార్డ్ చేస్తాను." అన్నాడు ధైర్యం తెచ్చుకుని, సరేనన్నాడు గుండు.

భుజాన తగిలించుకున్న సంచీలోంచి కెమెరా తీసి గుండుకి ఇచ్చాడు. "ఫోటో తీసేముందు కెమేరాని టానిక్‌సీసాలాగా బాగా కదిలించి అప్పుడు తీస్తే రిజల్ట్ బావుంటాయి." అని చిట్కా చెప్పి తను టేప్‌రికార్డర్‌పై నాలుగు వాయించి రికార్డింగ్ స్విచ్ నొక్కాడు.

వెంకటేశ్వర్లు పడిపోగానే లక్ష్మి దగ్గరగా వచ్చి చెయ్యి పట్టుకున్నాడు మస్తాన్. "పద వెళ్దాం" అన్నాడు అతి ప్రేమగా. విదిలించి కొట్టింది లక్ష్మి. పులివాత పడ్డ లేడికూనలా వణికిపోయింది. మళ్ళీ దగ్గరకు రాబోయాడు మస్తాన్. ఇదంతా గమనిస్తున్న మాధవ్ రక్తం మరిగిపోయింది. ఒక్క ఉదుటున ముందుకి ఉరికాడు.

అతడిని చూడగానే పరిగెత్తుకుంటూ అతని దగ్గరకు వచ్చేసింది లక్ష్మి. అతని వెనకాల దాక్కుంది. "జాగ్రత్త! లక్ష్మి జోలికి వచ్చావంటే మర్యాద దక్కదు!" బెదిరించాడు మాధవ్.

విసుగ్గా చూశాడు మస్తాన్. "ఎవడ్రా వీడు?"

"ఆ సింహం లేదూ. వాడి స్నేహితుడు వీడు" చెప్పాడు చలం.

"ఓ అలాగా. వీడెక్కడి నుండి వూడిపడ్డాడు?" ఎగతాళిగా చూశాడు మస్తాన్.

"చలం నువ్వు ఆ పిల్లికూనని ఇలా లాక్కురా. హనుమంతూ నువ్వు వీడి సంగతి చూసుకో." సిగరెట్ అంటించుకుంటూ ఆర్డర్లు వేశాడు మస్తాన్. చలం ఉత్సాహంగా కదిలాడు. హనుమంతుకూడా ముందుకి వచ్చాడు. అయితే మస్తాన్ ఆదేశించినట్లు మాధవ్ పనిపట్టలేదు. రెండు చేతులూ గట్టిగా బిగించి లక్ష్మిని సమీపించిన చలం తలమీద బలం అంతా ఉపయోగించి ఒక్క దెబ్బ కొట్టాడు. సుత్తితో తలమీద బాదినట్లు అయింది చలానికి.

కళ్ళు మసకలు కమ్మాయి. కుప్పకూలిపోయాడు.

మస్తాన్ నోట్లోంచి సిగిరెట్ జారి కిందపడిపోయింది. "ఓరి దుర్మార్గుడా!" ఆశ్చర్యపోయాడు. అతని ఆగ్రహం అవధులు దాటింది.

"ఒరే కోటిగా చూస్తావేం. వీళ్ళిద్దర్నీపైకి పంపించు". అన్నాడు.

చిరతపులిలా ముందుకు దూకాడు కోటిగాడు. మాధవ్ మెడ పట్టుకున్నాడు. హనుమంతు మాధవ్‌కి సహాయం వచ్చాడు. కోటిగాడు అన్నింటికీ తెగించిన మనిషి పైగా ఇలా తన్నడాలూ అవీ వృత్తిగా పెట్టుకున్నవాడు. ఇద్దర్నీ చావగొట్టేస్తున్నాడు.

సహాయం కోసం అరిచాడు మాధవ్. ఎవరూ రాలేదు. అతనికి బలంగా దెబ్బలు తగుల్తున్నాయి. "లక్ష్మీ పారిపో" అరిచాడు. స్థాణువులా నిలబడిపోయిన లక్ష్మి తెలివితెచ్చుకుని పరిగెట్టింది. మస్తాన్ వెంటబడ్డాడు.

* * *

ప్రతి పావుగంటకీ వచ్చి కనపడవలసిన వసుంధర పావుగంట దాటినా రాకపోయేసరికి ఊరిబయట కాపలా కాస్తున్న వాళ్ళకి అనుమానం వచ్చింది. మరో అయిదు నిముషాలు చూసి వసుంధర చెప్పిన గుర్తుల ప్రకారం బైకుల మీద బయలుదేరారు.

ఏకదంతాన్ని అక్కడే వుంచి వసుంధర, సింహం బృందం ఆ జీప్ దగ్గరకు వెళ్ళారు.

"ఎవరు మీరు? ఎవరికోసం వచ్చారు? మర్యాదగానే అడిగింది వసుంధర.

jibachan.com

పొగరుగా సమాధానం చెప్పారు వాళ్ళు. బాగా దగ్గరగా వెళ్ళారు వీళ్ళు. రాజ్యలక్ష్మిని గుర్తించింది వసుంధర. "రాజ్యలక్ష్మీ నువ్వా? ఇక్కడేం చేస్తున్నావ్? ఎవరు వీళ్ళు?" ఆశ్చర్యంగా అడిగింది.

"మా ఆయనకి ఉద్యోగం దొరికింది. ఊరు వెళ్తున్నాం!" చెప్పింది రాజ్యలక్ష్మి.

"ఏ ఊరు ? ఏం ఉద్యోగం?" దక్షిణామూర్తిని వివరాలు అడిగాడు సింహం.

"ఏమో నాకు తెలియదు. మస్తాన్‌గారు ఉద్యోగం ఇప్పిస్తానంటే వెళ్తున్నాను" చెప్పాడు. "మరి వీళ్ళంతా ఎవరు?" అడిగాడు సింహం.

"మస్తాన్ గారి మనుషులు" సమాధానం చెప్పాడు.

"అలాగా? ఎక్కడ ఉద్యోగం? నాకూ ఉద్యోగం కావాలి. నన్నూ తీసుకెళ్తారా?" వినయంగా అడిగాడు సింహం.

సమాధానంగా అతని భుజం మీద చెయ్యివేసి తోశాడు ఒకడు. "మాగోల నీకెందుగ్గానీ, నీదోవన నువ్వు ఫో. మాకు తిక్కరేగిందంటే నీతోవున్న ఈ రవ్వలడ్డుని కూడా జీప్‌లో వేసి తీసుకుపోతాం!" అన్నాడు.

ఏదో అనబోతున్న వసుంధరని వారించాడు సింహం. బుద్ధిగా వెనక్కు తిరిగారు నలుగురూ. "లక్ష్మి ఏది? అక్కడా లేదు. ఇక్కడా లేదు. వీళ్ళెవరు. జీప్‌లో వేసి తీసుకుపోతానంటాడేమిటి?" అన్నీ ప్రశ్నలే. నలుగురూ బయలుదేరిన చోటికే చేరారు. ఏకదంతం చాలా అసహనంగా పచార్లు చేస్తున్నాడు. వీళ్ళని చూడగానే చిరాకుపడబోయి వాళ్ళు చాలా సీరియస్‌గా వుండటంతో ధైర్యం చాలక వూరుకున్నాడు.

ఇప్పుడేం చెయ్యాలి అని ఆలోచిస్తూ వుండగానే మరో బైక్ ఇద్దరు మనుషులతో వచ్చేసింది. "మీరెంతకీ రాకపోయేసరికి మేమే వచ్చేశాం." అన్నారు. 'వెల్‌డన్' మెచ్చుకుంది వసుంధర. ఇంతలోనే మరోవైపునించి పీతాంబరం కూడా వచ్చేశాడు. "ఏమిటి మామయ్యా నన్నొక్కడినే వదిలేసి వచ్చావ్?" అన్నాడు ఆయాసపడిపోతూ. ఇంతమందిని చూసేసరికి ధైర్యం వచ్చింది వసుంధరకి. "మీరంతా జాగ్రత్తగా పొంచి వుండండి. అవసరం అయితే ఎటాక్ చెయ్యండి" అని చెప్పి సింహం వైపు తిరిగింది. "పదండి ఒకసారి ఆ టెంపుల్ దగ్గరికి వెళ్ళొద్దాం." అంది.

"పదండి" అన్నాడు సింహం.

* * *

లక్ష్మి పారిపోగానే మస్తాన్ వెంటపడటం చూసి బెదిరిపోయాడు మాధవ్. "హనుమంతూ నువ్వెళ్ళు. అమ్మాయిగారు వంటరిగా వున్నారు వెళ్ళు హనుమంతూ"

అంటూ బలవంతపెట్టి కోటిగాడితో తలపడ్డాడు. అయిష్టంగానే అటు వెళ్ళాడు హనుమంతు. అర్భకుడైన మాధవ్ ఆబోతులా వున్న కోటిగాడి చేతుల్లో చిక్కిపోయాడు. కసిదీరా చావగొట్టేస్తున్నాడు వాడు. ఇదంతా చూస్తున్న వెంకటేశ్వరావులకి కళ్ళు తిరిగాయి.

"వెంకటేశ్వరావుగారూ. పాపం ఎలా కొడుతున్నాడో! నేను చూడలేక పోతున్నాను." అన్నాడు బాధగా నట్‌బోల్ట్. "నాకూ బాధగానే వుంది కానీ ఏం చేస్తాం వెంకటేశ్వరావుగారూ!" అన్నాడు గుండు.

మరో అర నిముషం గడిచేసరికి ఇక చూస్తూ వూరుకోలేక పరికరాలు భద్రపరిచే కోటిగాడి దగ్గరకు పరిగెట్టారు. సినిమాలో హీరోలా ఫైట్ చెయ్యకపోయినా కోటిగాడి బారినుండి మాధవ్‌ని తప్పించగలిగారు.

వాళ్ళు రెండు తిన్నా ఎదురుతిరిగి వాడిని ఒకటి కొట్టగలిగారు.

లక్ష్మి ప్రాణభయంతో పరిగెడుతోంది. వెంబడించాడు మస్తాన్. ఎంత? వంద గజాలు కూడా పోకుండానే పట్టేసుకున్నాడు. "వదులు. వదులు నన్ను" గొడవపెట్టేస్తోంది లక్ష్మి. వాళ్ళిద్దరికోసం వచ్చిన హనుమంతుకి ఆ కేకలు వినిపించాయి. అటు పరిగెడుతూ వుండగానే స్కూటర్ శబ్దం వినిపించింది. అరక్షణంలో దగ్గరకొచ్చేసింది స్కూటర్. దానిమీద నుండి దూకేశారు సింహం, వసుంధర. "హనుమంతూ!" అంటూ దగ్గరకు వచ్చాడు.

"ఏవైపోయారు బాబూ! లక్ష్మమ్మని పట్టుకెళ్ళిపోతున్నారు. గుళ్ళో మాధవ్ బాబుని చంపేస్తున్నారు. కాపాడండి బాబూ. లక్ష్మమ్మని ఎక్కడికో తీసుకుపోయి వాడికెవరికో బహుమతిగా ఇస్తారుట. నిలబడతారేం బాబూ రక్షించండి బాబూ!" ఏడిచేశాడు హనుమంతు.

అంతా అర్థం అయిపోయింది వాళ్ళిద్దరికి. లక్ష్మివైపు పరిగెట్టబోయిన సింహాన్ని వారించింది వసుంధర. "నేను వెళ్తాను. మీరు మాధవ్‌ని చూడండి" అనేసి స్కూటర్ ఎక్కి స్టార్ట్ చేసింది.

హెడ్‌లైట్ వెలుగులో కనపడ్డాడు మస్తాన్. లక్ష్మిని తీసుకువెళ్ళి ఎవరికో బహుమతిగా ఇస్తాడుట అని చెప్పిన హనుమంతు కంఠం చెవుల్లో మారు మ్రోగింది. కళ్ళు చింతనిప్పుల్లా తయారయ్యాయి. రాస్కెల్! ఎంత ధైర్యం? ఆడపిల్ల అంటే అంత తేలికా వీడికి. రక్తం సలసలా మరిగింది. ఏనాడూ రానంత కోపం వచ్చేసింది వసుంధరకి.

gudachari.com

హఠాత్తుగా వాహనం లైట్ మొహాన పడేసరికి అప్రయత్నంగా లక్ష్మిని వదిలేసి కళ్ళకు చేతులు అడ్డం పెట్టుకున్నాడు మస్తాన్. ఆ అవకాశం వినియోగించుకుని దూరంగా వెళ్ళిపోయింది లక్ష్మి.

అమితవేగంతో వెళ్ళి మస్తాన్‌కి డాష్ ఇచ్చింది వసుంధర. ఎగిరిపడ్డాడు మస్తాన్. మరోసారి. ఇంకోసారి. డాష్ ఇచ్చి పడగొట్టింది. లేవలేకపోయాడు మస్తాన్. అప్పుడు స్కూటర్ దిగి దగ్గరకు వచ్చింది. శాండల్ కాలుతో చాచి మొహం మీద తన్నింది. మరోసారి. ఇంకోసారి. ఆవిడ ఆవేశం చూస్తే చంపేస్తుందేమో అని భయం వేసింది హనుమంతుకి. "ఆగండమ్మా ఆగండి. చచ్చిపోయేలావున్నాడు. పోలీసులకి అప్పగిద్దాం. వాళ్ళే వీడికి తగినశాస్తి చేస్తారు" వారించాడు.

పోలీసులనగానే ఏకదంతంగారు గుర్తొచ్చారు. ఏకదంతంగారు గుర్తురాగానే సరివితోట, జీప్, రాజ్యలక్ష్మి గుర్తొచ్చారు. వెంటనే ఒక్క అంగలో స్కూటర్ దగ్గరకి వెళ్ళి పక్కకు పడి వున్న స్కూటర్ నిలబెట్టి స్టార్ట్ చేసుకుని దూసుకుపోయింది. వసుంధర ఇక్కడ బయలుదేరిన టైములో నాలుగో మోటర్‌సైకిల్ కూడా సరివితోట దగ్గరకు వచ్చేసింది.

అందరూ ఏకం అయిపోయారు. వసుంధర ఇంకా రాలేదేం? వెళ్ళి చూద్దామా అని బయలుదేరుతూ వుండగానే దూరంగా లైట్ కనిపించింది. వస్తూనే "ఎటాక్" అంటూ పాలికేక పెట్టింది వసుంధర. "వాళ్ళు ఆడపిల్లల్ని తీసుకెళ్ళి అమ్మే వెధవలు. ఒక్కడినీ వదలద్దు" అంతే. ఒక్కనిముషంలో జీప్ దగ్గరికి చేరిపోయారు అందరూ.

అక్కడున్న మస్తాన్ బృందానికి ఏం జరుగుతుందో అర్థం అయేలోపలే వాళ్ళమీద విరుచుకు పడ్డారు వసుంధర సైన్యం. కసిగా వున్నారేమో నిర్దాక్షిణ్యంగా చావగొట్టేశారు.

* * *

గుడి దగ్గరకు వచ్చిన సింహం మిత్రుడి దశ చూసి బావురుమన్నాడు. పట్టరానంత ఆగ్రహం కలిగింది అతనికి. అతడి వాలకం చూసి బెదిరిపోయారు వెంకటేశ్వర్రావులు. "వీడేనండీ ఇతన్ని ఇలా కొట్టింది. అప్పటికీ మేము అడ్డుపడ్డాం కాబట్టి సరిపోయింది. లేకపోతే ఈపాటికి చంపేసేవాడే." అన్నారు ముక్తకంఠంతో.

ఎగిరి కోటిగాడి మీదికి దూకాడు సింహం. మాధవ్‌కి సహాయం చేశాక ఇతడిని గాలికొదిలేస్తే బాగుండదని మళ్ళా రంగంలోకి దూకారు వెంకటేశ్వర్రావులు. అంతలోనే లక్ష్మిని వెంటబెట్టుకుని వచ్చేశాడు హనుమంతు. ఎంత బలవంతుడైనా అప్పటికే చాలాసేపటినుండి పోట్లాడి అలసిపోయిన కోటిగాడు నలుగురు ఒకేసారి

తలపడేసరికి తట్టుకోలేకపోయాడు. అతడి బలహీనత కనిపెట్టి మరీ వాయించేశారు నలుగురూ.

లక్ష్మి మాధవ్ దగ్గరికి వెళ్ళింది. అతనికి స్పృహ లేదు. అతడిని ఆ స్థితిలో చూసిన లక్ష్మికి దుఃఖం ఆగలేదు.

సరివితోట దగ్గర యుద్ధం ముగించి రౌడీలని అందర్నీ జీప్‌లో వేసుకుని మోటార్ బైక్స్, స్కూటర్ అన్నీ తీసుకుని పొలోమంటూ వచ్చేశారు అందరూ.

అక్కడి పరిస్థితి అర్థం చేసుకుంది వసుంధర. రౌడీలని లాగి బయట పడేయించింది. మాధవ్‌ని, చలాన్ని, వెంకటేశ్వర్లునీ జీప్‌లో ఎక్కించారు. సింహం కూడా జీప్‌లో ఎక్కాడు. వసుంధర డ్రైవింగ్ సీట్లో కూర్చుంది. ఏకదంతంగారు బైక్ మీద వెంట వచ్చారు. తిన్నగా డాక్టర్ దగ్గరికి వెళ్ళి ఆయన్ని నిద్ర లేపారు.

ఆయన గవర్నమెంట్ డాక్టర్ కాబట్టి కేసు అవుతుందని, అదనీ, ఇదనీ వంకలు పెట్టకుండా పాంటు తగిలించేసుకుని బనీనుతోనే బండెక్కేశాడు. హాస్పిటల్‌కి వెళ్ళి నర్స్‌కీ, కాంపౌండర్‌కీ కబురుపెట్టాడు. పేషెంట్లని పరీక్ష చేసి చూశారు. "ఫర్వాలేదు. ప్రాణాపాయం ఏమీలేదు. వీళ్ళిద్దరికీ ఇంకొంచెంసేపట్లో తెలివి వస్తుంది. రేపటికల్లా బాగైపోతారు. ఇతనికే బాగా దెబ్బలు తగిలాయి. చాలారోజులు పడుతుంది కోలుకోడానికి". అన్నాడు.

డాక్టర్‌తో మాట్లాడి ఫార్మాలిటీస్ పూర్తిచేశాక ఏకదంతం జీప్‌లో మళ్ళీ పోలేరమ్మ గుడి దగ్గరకు వెళ్ళాడు. యధాప్రకారం డ్రైవర్ వసుంధరే. వీళ్ళు అక్కడికి వెళ్ళేసరికి నేరస్థులందర్నీ ఒకచోట కుప్పవేసి రకరకాల ఏంగిల్స్ నుండి ఫొటోలు తీస్తున్నాడు గుండు వెంకటేశ్వర్రావు. ఆ కార్యక్రమం ముగించి అందర్నీ జీప్‌లో వేసి పోలీస్ స్టేషన్‌కి తీసుకువచ్చారు.

స్టేషన్లో కునికిపాట్లు పడుతున్న స్టాఫంతా హడావిడిగా లేచారు. ఆ స్టేషన్ లాకప్‌లో ఎంతోకాలంగా ఎవరూ రాలేదు. అలాటిది ఒకేసారి అంతమందిని తీసుకొచ్చి పడేసరికి కళకళలాడిపోయింది స్టేషను. ఏకదంతం కేస్ రిజిష్టర్ చేశాడు.

స్టాఫ్ అంతా లాకప్‌రూమ్ దగ్గర చేరారు. మస్తాన్ మొహం చూసిన ఒక కానిస్టేబుల్‌కి ఏదో అనుమానం వచ్చింది. వీడి మొహం ఎక్కడో చూసినట్లు వుంది అనుకున్నాడు. కుతూహలం ఆపుకోలేక వెళ్ళి నేరస్థుల ఫైల్ తీసి చూశాడు. చూడగానే కీచుమంటూ అరిచి ఎస్.ఐ గారి దగ్గరకు పరిగెట్టాడు. వణికే చేతులతో ఫైల్‌ని ఎస్.ఐ గారికి అందించాడు. అది చూసి కెవ్వుమన్నాడు ఏకదంతం.

gutchari.com

ఏకదంతం దగ్గర శెలవు తీసుకుని వెళ్ళిపోతున్న వసుంధర బృందం వాకిలిదాక వెళ్ళినవారల్లా అతనికేక విని వెనక్కు తిరిగి వచ్చారు. "ఏమిటండీ? ఏమైంది?" అడిగింది వసుంధర.

ఆ ఫైల్ ఆవిడకదించాడు ఏకదంతం. అందుకుంది వసుంధర. అందులో మస్తాన్ ఫొటో వుంది. వివరాలు కూడా వున్నాయి.

మస్తాన్ వురఫ్ మరిదయ్య. వచ్చినెత్తురు తాగే రాక్షసుడు. ఇంతవరకూ లెక్కలేనన్ని హత్యలు చేసి చట్టానికి దొరక్కుండా తప్పించుకున్నాడు. కొద్దిరోజుల క్రిందట పట్టపగలు హత్య చేస్తూ పట్టుబడిపోయి పోలీసుల కళ్ళలో కారం కొట్టి పరారి అయిపోయాడు. అతడిని పట్టి ఇచ్చినా, ఆచూకి తెలియజేసినా పదివేలు బహుమానం ప్రకటించింది ప్రభుత్వం.

ఒక్కొక్కరే అందుకుని చదివారు. టేబిల్ మీద వున్న ఫోన్ రిసీవర్ తీసి ఏకదంతానికి అందించింది వసుంధర. "మీ పైవారికి తెలియజెయ్యండి" అని చెప్పింది. వణికే చేతులతో డయల్ చేశాడు ఏకదంతం.

అంతే! క్షణాలమీద అరగంటలోపలే జీపుల్లో వచ్చేశారు పోలీసు అధికార్లు. ప్రెస్‌వాళ్ళు వచ్చేశారు. వెంకటాపురం పత్రికల్లోకి ఎక్కింది.

"స్నేహ" వారి ధైర్యసాహసాలు, ఇనస్పెక్టర్ ఏకదంతం సమయస్ఫూర్తి, ఒక సామాన్య యువకుని సాహసం, దుండగుని ఆటకట్టు, వంటి హెడ్డింగులతో ఈ వార్త అన్ని ప్రముఖ పత్రికలలోనూ వచ్చేసింది.

పోలీస్ ఎస్.పి. ఏకదంతానికి అభినందనలు అందజేశాడు. ప్రమోషన్ వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చాడు. వసుంధరకీ, సింహానికీ అభినందనలు వర్షంలా కురిశాయి. కేసంతా ఒక ఎత్తు అయితే ఫొటోలు ఒక్కటీ ఒక ఎత్తు.

నేరం జరిగిన తరువాత ఫొటోలు తియ్యడం సర్వసాధారణం. కానీ నేరం జరుగుతూ వుండగా ఫొటోలు తీసిన కేసు ఇదొక్కటే. ఆ ఘనతకు పాత్రులైన వెంకటేశ్వర్రావులకు బోలెడు డబ్బిచ్చి ఫొటోలు కొనుక్కున్నారు పత్రికలవాళ్ళు. వెంకటాపురం అంతా సందడే సందడి. మస్తాన్ నిజస్వరూపం తెలియగానే పత్రికలవారు వస్తారని ముందే వూహించింది వసుంధర. లక్ష్మికి వెంకటేశ్వర్లు ద్రోహం తలపెట్టిన విషయం బయటకు రావడానికి వీల్లేదని అందర్నీ ముందే హెచ్చరించింది. ఫలితంగా సుబ్బారావుగారింటి ప్రతిష్ఠ పేపర్లకి ఎక్కలేదు.

కానీ కూతురి ద్వారా అసలు విషయం అంతా తెలుసుకున్న తర్వాత కృంగిపోయాడాయన. ఎవరితోనూ మాట్లాడకుండా మౌనంగా వుండిపోయాడు.

కొడుకుని మందలించలేదు. తండ్రి మందలించకపోయినా చేసిన వెధవపనికి పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు వెంకటేశ్వర్లు, ఎంత దాచాలని చూసినా అందరికీ తెలిసిపోయిందా విషయం. నలుగుర్లోనూ తలెత్తుకు తిరగలేక భార్యాపిల్లలని వెంటబెట్టుకుని అత్తవారింటికి వెళ్ళిపోయాడు.

లంకంత ఇంట్లో వంటరిగా మిగిలిపోయారు తండ్రీ కూతుళ్ళు. ఆ వంటరితనం మరింత బాధించింది సుబ్బారావుని. తనుకూడా కన్నుమూస్తే కూతురి జీవితం ఏమైపోతుందోననే దిగులుతో కృంగిపోయాడు. అతడి పరిస్థితి గమనించి వాళ్ళిద్దర్నీ కొన్నాళ్ళపాటు తన ఇంట్లో వుండమని తీసుకువచ్చాడు వెంకట్రావు. అలా తీసుకురావడంలో ఆయన స్వార్థం కూడా వుంది. మాధవ్‌కి దెబ్బలు తగిలాయని తెలియగానే శోకాలు పెట్టి ఏడ్చింది శాంతమ్మ. ఆ తర్వాత కూడా డాక్టరు ప్రమాదం లేదని చెప్పినా ఆవిడ మనసు శాంతించలేదు. పిచ్చిదానిలా అయిపోయిన భార్యకు ఇంట్లో ఎవరైనా తోడు వుంటే కాలక్షేపం అవుతుందని వాళ్ళను తీసుకొచ్చాడు.

శాంతమ్మ బలవంతంమీద నాలుగు రోజుల తర్వాత మాధవ్‌ని ఇంటికి తీసుకొచ్చారు. ఒళ్ళంతా కట్లే. కన్నతల్లిలా సేవచేయసాగింది శాంతమ్మ. ఆవిడకి తోడు లక్ష్మి. మాధవ్ క్రమంగా కోలుకోసాగాడు. లక్ష్మి కోరిక ప్రకారం శ్యామల సుబ్బారావుగారితో లక్ష్మి కోరికను తెలియజేసింది.

ఆయన స్థాణువైపోయాడు. "ఏం బాబాయ్‌గారూ! అతను అనాథ అని సంకోచిస్తున్నారా? కులం గోత్రం లేనివాడికి ఎలా ఇవ్వడం అని బాధపడుతున్నారా? ఆస్తీ అంతస్తూ లేవనా? ఏమీ లేకపోయినా మంచివాడు, బుద్ధిమంతుడు. అన్నింటినీ మించి లక్ష్మి అతడిని ఇష్టపడుతూంది. మరి ఇంకెందుకు మీ ఆలోచన?" అడిగింది శ్యామల.

కాసేపు మౌనంగా ఆలోచిస్తూ వుండిపోయాడు సుబ్బారావు.

"నిజమేనమ్మా, నువ్వు చెప్పింది. మంచి వంశంలో పుట్టి పెరిగిన నా కొడుకు ఏం చేశాడు? స్వంత చెల్లెలి ప్రాణానికి ఎసరుపెట్టాడు. సమయానికి ఇతను అడ్డు పడకుండా వుంటే ఎంత అనర్థం జరిగేదో! నా బిడ్డ నాకు దక్కేదికాదేమో. నాకు కావలసింది నా బిడ్డ సుఖం, సంతోషం. అందుకోసం ఏం చెయ్యడానికైనా సిద్ధమే. అతనికి కూడా అంగీకారం అయితే వాళ్ళిద్దరికీ వివాహం జరిపిస్తాను". అన్నాడు.

వెంటనే లేచి వెళ్ళి వెంకట్రావుతో ఈ విషయం మాట్లాడాడు. "అబ్బాయికి ఆస్తి లేకపోవచ్చు. అనాథే కావచ్చు. కానీ మంచివాడు. అతడిని పెళ్ళిచేసుకున్న అమ్మాయి సుఖపడుతుంది. మంచి నిర్ణయమే తీసుకున్నావ్." అన్నాడు వెంకట్రావు.

gudachari.com

శాంతమ్మ ఆనందం వర్ణనాతీతం. చిన్నపిల్లలా సరదాపడిపోయింది. అప్పటికప్పుడే వెళ్ళి మాధవ్‌ని అడిగేసింది. సిగ్గుపడి మొహం తిప్పేసుకున్నాడు మాధవ్. పరిగెట్టుకుంటూ వచ్చి ఆవార్త సుబ్బారావుకి చెప్పేసింది. "అబ్బాయి వైపున ఎవ్వరూ లేరని అనుకుంటావేమో తమ్ముడూ. మేం వున్నాం. ఏమాత్రం లోపం జరిగినా వూరుకునేది లేదు". ఫక్తు మగపిల్లవాడి తల్లిలా మారిపోయింది.

ఇదంతా చూస్తూ వున్న శ్యామల లోపలికి పరుగుపెట్టింది. లక్ష్మిని కావలించేసుకుని అభినందనలు తెలియజేసింది. సిగ్గుపడిపోయింది లక్ష్మి. "ఇదంతా నీ చలవే. స్వంత అక్కలాగా ఆదుకున్నావ్." అంటూ కృతజ్ఞత తెలియజేసింది.

"ఆ పప్పులు వుడకవ్. నేను నీకు అక్కని ఎంత మాత్రం కాదు. ఇకనించీ నీ ఆడపడుచుని జాగ్రత్త". బెదిరించింది.

నవ్వేసింది లక్ష్మి. "ఓ అలాగే" ఒప్పేసుకుంది. చాలారోజుల తర్వాత హాయిగా మాట్లాడుకున్నారు ఇద్దరూ. "అన్నట్లూ అడగడం మర్చిపోయాను. నీ స్వప్న సుందరుడి విశేషాలేమైనా తెలిశాయా?" హఠాత్తుగా అడిగింది లక్ష్మి.

శ్యామల మొహం వెలిగిపోయింది. "చూశావా ఈ హడావిడిలో పడి మర్చేపోయాను. ఉత్తరం రాశాడు. పాపం! స్కూటర్ మీదనుండి పడి కాలు విరగ్గొట్టుకున్నాడట. పదిహేనురోజులు హాస్పిటల్లో వున్నాడట. అందుకే రాలేకపోయాను. వీలుచూసుకుని వచ్చేస్తాను అంటూ రాశాడు. కాబట్టి ఇవ్వాళో రేపో దిగుతాడు." సంతోషంతో చెప్పింది.

సింహానికి కూడా తెలిసిపోయింది ఈ శుభవార్త. ఒక్క పరుగున వెళ్ళి మాధవ్ మంచం మీద కూర్చున్నాడు. "నిన్నెలా అభినందించాలో అర్థం కావడంలేదురా! నాకెంతో సంతోషంగా వుంది. నిజం చెప్పాలంటే జీవితంలో ఇంత సంతోషం నాకెప్పుడూ కలగలేదు." అన్నాడు.

మాధవ్‌కి ఆనందంతో కళ్ళనీళ్ళు వచ్చేశాయి. "ఇదంతా నీవల్లనే సాధ్యం అయింది. సమయానికి నువ్వు తెలివిగా లక్ష్మిని రక్షించకుండా వుండి వుంటే ఎంతో అనర్థం జరిగిపోయి వుండేది. అదివరకు ఎప్పుడూ నిన్ను ఏడిపించాను. ఎగతాళి చేశాను. నన్ను క్షమించరా. నిజంగా నువ్వు చాలా గొప్పవాడివి. మేధావివి. నీ మేలు ఈ జన్మకి మర్చిపోను. జీవితాంతం నిన్ను తల్చుకుంటాను."

గిల్టీగా తలవంచుకున్నాడు సింహం.

మస్తాన్ పట్టుపడిన తర్వాత అందరూ ఏకమై సింహాన్ని, వసుంధరనీ ఆకాశానికి ఎత్తేశారు. వాళ్ళిద్దరికీ ఏమాత్రం సంతోషం కలుగలేదు.

ముఖ్యంగా వసుంధర చాలా బాధపడింది. "ఏవిటో నా మొహం. అంతసేపు అందరం తలలు బద్దలు గొట్టుకుని ప్లాన్ వేశాం. చివరికి అంతా గందరగోళం అయిపోయింది. ఇంతా చేసి సమయానికి ఎవరం అక్కడ లేము. మాధవ్ వంటరిగా మిగిలిపోయాడు. సమయానికి ఆ వెంకటేశ్వర్రావులు ఇద్దరూ అడ్డుపడకపోతే ఎంత ప్రమాదం జరిగేది?

అసలైనా నాది బుద్ధితక్కువ. సరివితోట దగ్గర రాజ్యలక్ష్మిని చూసివచ్చి చెప్పగానే పూర్తిగా కన్‌ఫ్యూజ్ అయిపోయాను. కనిపించిన వాడే పెళ్ళికొడుకు అన్నట్లు ఆడపిల్ల అన్నేసరికి లక్ష్మే అనుకున్నాను. నేను కంగారుపడిపోయి అందర్నీ కంగారు పెట్టేశాను. ఏమిటో వెధవ బుర్ర. సమయానికి సరిగ్గా పనిచేసి ఏడవదు. ఈ అనుభవంతో బుద్ధి వచ్చింది. ఈసారినుండి జాగ్రత్తగా వుండాలి. ఎలాటి పరిస్థితిలోనైనా కంగారుపడకుండా స్థిమితంగా ఆలోచించడం నేర్చుకోవాలి." అనుకుంది.

వసుంధర బాధ అది. సింహం బాధ ఇంకొకటి. నేరస్థులు పట్టుబడిన తరువాత వెంకటేశ్వర్లుని, చలాన్ని విడివిడిగా ప్రశ్నించి వివరాలు రాబట్టాడు. తనకు కావలసిన నేరస్థుడు అతడు కాదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తన సమస్య మాత్రం అలాగే వుండిపోయింది.

మరో నాలుగు రోజులు గడిచాయి. మాధవ్ పరిస్థితి మరింత మెరుగుపడింది. మంచం మీద నుండి లేచి మనిషి సాయంతో నడవగలుగుతున్నాడు.

మస్తాన్ బృందం అరెస్ట్ అవడం ఒకపెద్ద సంచలనం సృష్టించింది. తీగ కదిపితే డొంకంతా కదిలినట్లు ఎన్నో నమ్మలేని నిజాలు బయటపడ్డాయి. ఎంతోమంది పెద్దమనుషుల జాతకాలు ప్రజలకు తేటతెల్లం అయిపోయాయి.

ముందు మామూలుగా అలవాటు ప్రకారం డబ్బు పారేసి కేసు కప్పెట్టేద్దామనే ప్లాన్లు వేశారు. కానీ ఈ కేసులో "స్నేహ" పాత్ర వుంది. అన్నింటినీ మించి ప్రజల అభిమానాన్ని చూరగొన్నవారు. ఇక వాళ్ళ నోళ్ళు మూయటం ఎవరికి సాధ్యం? పోలీసులు, లాయర్లు, ఎవరు మాత్రం ఏం చెయ్యగలరు?

ఆ కేస్ సంచలనం సృష్టించడంతో ప్రతిరోజూ వింత వింత నిజాలు ప్రచురించసాగాయి పత్రికలు. ప్రజలంతా ఎంతో కుతూహలంతో కేస్‌ని ఫాలోఅవుతూ వుంటే ఇక వెంకటాపురం వాసుల గురించి వేరే చెప్పాలా!

అందరికీ అదే దినచర్య. ఆరోజు కూడా స్నానం పానం ముగించి పేపర్ ముందుపెట్టుకుని మాధవ్ పక్కన కూర్చున్నాడు సింహం.

* * *

gudachari.com

అంతకు గంట క్రితమే బస్ దిగాడు వెంకట నాగదుర్గావరప్రసాద్. లోగడ ఒకసారి వెంకటాపురం వచ్చాడు. అంతే. ఆ తర్వాత మళ్ళా ఇదే రావటం. అయినా ఊరేం మారలేదు. చేతికర్ర సాయంతో నడుస్తూ గమ్యం చేరాడు. కబురు చేశాడు. కబురు అందుకుని పరుగున వచ్చేసింది శ్యామల.

ఇద్దరూ ఒకరినొకరు చూసుకుంటూ వుండిపోయారు. ఆ తర్వాత తన్మయత్వం నుండి బయటపడి ఇద్దరూ ఒకేసారి కలగాపులగంగా మాట్లాడేసుకున్నారు. ఆ తరువాత విడివిడిగా మాట్లాడారు. తన ఏక్సిడెంట్ గురించి చెప్పాడు ప్రసాద్. చాలా బాధపడింది శ్యామల. తను పడిన బాధ గురించి చెప్పింది శ్యామల. చాలా విచారించాడు ప్రసాద్.

సరే గతం గతః ఇప్పుడేం చేద్దాం అనుకున్నాకు ఇద్దరూ.

"వచ్చి మా నాన్నగారితో మాట్లాడి ఏమిటేమిటో చేసేస్తానని ప్రగల్భాలు పలికావుగా. మరి నాన్నగారితో మాట్లాడి అటో ఇటో తేల్చేయ్." అంది శ్యామల.

"అవును. అప్పుడలా అన్నమాట నిజమే అనుకో. కానీ అదంత మంచి పద్ధతి కాదని శ్రేయోభిలాషులు సలహా చెప్పారు. ఆయన పెద్దవాడు. కాబోయే మామగారు. ఆయనతో నీకెందుకు వైరం? నెమ్మదిగా నచ్చచెప్పి పని జరిగేలా చూడు అన్నారు. ఆలోచిస్తే నాకూ అదే మంచిదనిపించింది." అన్నాడు.

"సరే ఇది ఇంకా బాగుంది. అలాగే వెళ్ళి నాన్నగారితో మంచిగా మాట్లాడి ఒప్పించు." రిలీఫ్‌గా అంది శ్యామల.

"అవుననుకో. కానీ పెళ్ళికొడుకే మామగారి దగ్గరకు వెళ్లకూడదురా! అలా వెళ్తే బాగుండదు అన్నాడు మా బాబాయ్. ఎవరైనా నీ తరఫున వెళ్ళి మాట్లాడితే బాగుంటుంది అని సలహా చెప్పాడు." అన్నాడు ప్రసాద్.

"'పోనీ మరి ఆ బాబాయ్‌గారిని పంపించలేకపోయావా? ఆయనే వచ్చి మాట్లాడేవారుగా?" అసహనంగా అడిగింది.

"నిజమే. కానీ బాబాయ్‌గారు ఇలా అన్నారని ఓ ఫ్రెండ్‌తో చెప్పాను. వాడేమన్నాడంటే నీవైపు వాళ్ళెవరూ మధ్యవర్తిగా వద్దురా. ఆయనేమో అసలే తిక్కమనిషి అంటున్నావా? ఈ మధ్యవర్తి ఎవరి దగ్గరైనా నీ గురించి ఏదైనా అమర్యాదగా మాట్లాడాడనుకో. అప్పుడు నీ పరువు పోతుంది. రేపు నీ పెళ్ళి అయినాక కూడా ఆ మచ్చ అలాగే వుండిపోతుంది. ఫలానా ప్రసాదు పెళ్ళి మాటలకోసం వెళ్తే ఆయన మామగారు నానామాటలు అన్నారుట అని అందరూ చెప్పుకుంటారు. కాబట్టి అలా వద్దు అని సలహా చెప్పేడు. నాకు నచ్చింది."

వింటున్న శ్యామలకి ఓర్పు నశించిపోయింది. "సలహాలడిగే జాడ్యం ఈ జన్మకి పోదు. సినిమాకెళ్ళాలంటే సలహా, షికారు కెళ్ళాలంటే సలహా, చివరకి వేరుశెనక్కాయలు తినాలన్నా ఇతరులను సలహా అడగాల్సిందే. ఇంకెవరినైనా సలహా అడుగు. గంగలో దూకు అని చెప్తారు. అప్పుడు జంటగా గంగలో దూకుదాం." విసుక్కుంది.

"కోపం తెచ్చుకోకు శ్యామా. దానికోసం ఉపాయం ఆలోచించాగా! ఇక్కడ నీకు తెలిసిన వారెవరైనా, అంటే నీఫ్రెండ్‌గానీ, మరో వెల్‌విషర్‌గానీ వుంటే వారిని అర్థిద్దాం. వాళ్ళు ఓసారి వెళ్ళి మాట్లాడితే చాలు. ఆ తర్వాత నేనే వెళ్ళి మీ నాన్నగారిని ప్రసన్నం చేసుకుంటాను." అన్నాడు ప్రసాద్.

ఆలోచించింది శ్యామల. "ఇలాటి సహాయం చేసే ఫ్రెండ్స్ ఎవరూ లేరు కానీ సింహంగారని ఒకాయన వున్నారు. ఆయన మహా ఇంటలిజెంట్. వేలికేస్తే కాలికి, కాలికేస్తే వేలికీ వేసి వ్యవహారం చక్కబెట్టగల దిట్ట. ఆయనకి ఓసారి నేను హెల్ప్ చేశాను. నీలాటి తిక్కమనిషికి ఆయనే సరి. అడ్రెస్ ఇస్తాను వెళ్ళి మాట్లాడు." అని చెప్పింది.

పేపరు చదువుకుంటున్న సింహం శాంతమ్మగారు ఓ మనిషిని వెంటబెట్టుకు రావడంతో తలెత్తి చూశాడు. "ఇతను నీకోసం వచ్చాడు." అనేసి వెళ్ళిపోయింది ఆవిడ.

"నేనే సింహాన్ని. చెప్పండి ఏం కావాలి"? ఈ కేస్ అయాక ఎవరో ఒకరు రావడం అలవాటు అయిపోయింది సింహానికి. తనని పరిచయం చేసుకున్నాడు ప్రసాద్. తనొచ్చిన పని వివరించాడు.

ఎగాదిగా అతనివంక చూశాడు సింహం. అది గమనించి కంగారు పడ్డాడు ప్రసాద్. "నాకాలు బాగానే వుందండీ. ఈమధ్య ఏక్సిడెంట్ అయి ఇలా తయారైంది. ట్రీట్‌మెంట్ జరుగుతూంది. ట్రాక్షన్ తీసుకుంటున్నాను. మరో పదిరోజుల్లో పూర్తిగా బాగైపోతుంది. మీరు ఏం సందేహించకండి. నాకు సహాయం చెయ్యండి. ఏకదంతంగారితో మాట్లాడండి" బ్రతిమాలాడు.

చిన్నగా నవ్వేశాడు సింహం. "అలాగే దానికేం భాగ్యం? ప్రత్యక్షంగా మిమ్మల్ని ఇప్పుడే కలుసుకున్నా పరోక్షంగా మీ వల్ల ఎంతో మేలు జరిగింది నాకు. నన్ను చూసి, మీరే అనేసుకున్నారు మీ మామగారు." అంటూ అంతా చెప్పుకొచ్చాడు.

అంతా విని నవ్వేశాడు ప్రసాద్." మరి ఆయనతో మాట్లాడ్డానికి ఎప్పుడు వెళ్తారు?" అన్నాడు.

gunachari.com

"ఎప్పుడో ఏం ఖర్మ. ఇప్పుడే వెళ్తాను. మీరు మా మాధవ్‌తో మాట్లాడుతూ వుండండి." అని చెప్పి వెళ్ళిపోయాడు సింహం.

మాధవ్ మంచం మీద పడుకుని వున్నాడు. రెండు కాళ్ళకీ బరువులు తగిలించి వున్నాయి. దగ్గర కూర్చుని పరామర్శించాడు ప్రసాద్. "ఇదో పెద్ద న్యూసెన్స్ కదండీ. నేనూ పడ్డాను. ఇంకా ఇప్పుడు కూడా రాత్రిపూట ఇసక సంచీ తగిలించుకుని పడుకుంటున్నాను." అంటూ తన బాధ చెప్పుకున్నాడు. ఇద్దరికీ మాటలు బాగానే సాగాయి.

ఎవరికెలా దెబ్బలు తగిలాయో చెప్పుకున్నారు. ఇంకా ఏవిటేవిటో మాట్లాడుకున్నారు. "మీరు ఎక్కడ వుండే వారు". మాటల మధ్య అడిగాడు ప్రసాద్. చెప్పాడు మాధవ్. "ఆ ఊళ్ళో నా ఫ్రెండ్ వుండేవాడు రామకృష్ణ అనీ, ఇప్పుడు దుబాయ్‌లో వున్నాడు". అన్నాడు ప్రసాద్.

ఉలిక్కిపడ్డాడు మాధవ్. "రామకృష్ణా? ఎక్కడ వుండేవాడు?"

"సరిగా గుర్తులేదు" అంటూనే గుర్తు తెచ్చుకుని చెప్పాడు ప్రసాద్.

అదిరిపడి లేచి కూర్చున్నాడు మాధవ్. "రామకృష్ణ మీరూ లెటర్స్ రాసుకునేవాళ్ళా?"

"ఆహా నిక్షేపంలా రాసుకుంటాం!"

"అతని అడ్రెస్ మాకు కావాలి. ఓ ముఖ్యమైన విషయం అడగాలి. అతను మీ ఫ్రెండ్ అన్నారు కదా. అతని ఫ్రెండ్స్ మీకూ తెలిసే వుంటారు. వెంకటి అనే మనిషి గురించి మీకేమైనా తెలుసా? ఈ వెంకటి అనే అతను రామకృష్ణకి ఒక లెటర్ రాశాడు."

నవ్వేశాడు ప్రసాదం. "భలేవారే తెలియకపోవడం ఏమిటి? నేనేగా వెంకటిని. వాడికా పేరుతో నేనే లెటర్స్ రాసేది" ఆనందంగా చెప్పాడు.

"మీరేనా! మీరు ఒకసారి లక్ష్మి గురించి రాశారు. లక్ష్మిని చంపేస్తానని రాశారు కదూ!" ఆగ్రహంగా ప్రశ్నించాడు మాధవ్.

ప్రసాద్ మొహం మాడిపోయింది. బరువుగా నిట్టూర్చాడు. "అవును. నేనే రాశాను. వాడు చంపమన్నాడు. నేనూ చంపుదామనే అనుకున్నాను కానీ ఆ అవసరం రాలేదు. లక్ష్మి చచ్చిపోయింది". అన్నాడు బాధగా.

అతని ధోరణికి చిరాకువేసింది మాధవ్‌కి. "సిగ్గులేదూ మీకు. చంపుదామనుకోవడమే బుద్ధి తక్కువ పని. పైగా చంపకుండా తనే చచ్చిపోయిందని దిగులొకటా?" అన్నాడు.

అతనలా మాట్లాడ్డం నచ్చలేదు ప్రసాద్‌కి. "బాగానే వుంది. మాకు మాత్రం సరదానా? ఏదో పరిస్థితులు అలా వచ్చాయి". అన్నాడు.

"ఏవిటో అంత గొప్ప పరిస్థితులు! ఎంత విషమ సమస్య అయితే మాత్రం చంపేయాలనుకుంటారా"?

"అంతా వింటే మీరూ మాతో ఏకీభవించక మానరు. చెప్పాలంటే అదో పెద్ద కథ. మా ఇంట్లో ఎప్పుడూ కోడెదూడలే పుట్టేవి. అలాటిది ఎన్నో ఏళ్ళ తర్వాత మా గౌరికి లక్ష్మి పుట్టింది. తెల్లటి తెలుపు, నల్లటికళ్ళు, చెంగుచెంగున ఆడుతూ వుండే లక్ష్మి మా అందరికీ ప్రాణం అయిపోయింది. రెండేళ్ళు వచ్చేసరికి దిష్టి తగిలేలా తయారైంది. పసిమ్మడి గోవులా వుండనేవారు చూసిన వాళ్ళందరూ. ఒకరోజు మేతకి వెళ్ళి పాడుపడిన నూతిలోపడిపోయింది. వెనకకాళ్ళు రెండూ విరిగిపోయాయి. వైద్యాలు చేయించాం కానీ ఫలితం లేకపోయింది. పడుకున్న చోటినించీ అంగుళం కూడా కదల్లేకపోయేది. ఆ యాతన చూడలేకపోయాం అందరం. ముఖ్యంగా మా అమ్మగారు, నాయనమ్మ. వాళ్ళిద్దరి బాధ వర్ణనాతీతం. అలాటి పరిస్థితులలో రామకృష్ణకి రాస్తే వాడు సమాధానం రాశాడు. వున్నకొద్దీ దానికీ నరకం. మీకూ నరకం. చంపేసేయ్ అన్నాడు. నాకూ అదే అనిపించింది. చూస్తూ వూరుకోలేం. ఏమీ చెయ్యలేం. చివరకి మాకు ఆ పాపం అంటకుండానే వాతం కమ్మి చచ్చిపోయింది మా లక్ష్మి" చెప్తూ వుంటే దుఃఖం వచ్చింది అతనికి. జేబులోంచి రుమాలుతీసి కళ్ళు తుడుచుకున్నాడు.

"మీది ఈ ఊరుకాదుగా. మరి ఈ ఊర్నించి ఉత్తరం రాశారేం?" ఆశ్చర్యం నుండి తేరుకుని మరో సందేహం బయటపెట్టాడు మాధవ్.

"ఈ ఊర్నించి రాశానా? లేదే?" ఆశ్చర్యపోయాడు ప్రసాద్.

"కాదు గుర్తు తెచ్చుకోండి. ఇక్కడినించే రాశారు". అన్నాడు మాధవ్.

"ఆరోజుల్లో ఈ ఊరు ఒకసారి వచ్చాను శ్యామలకోసం. మరి అప్పుడేమైనా రాశానేమో! అది సరే ఇదంతా మీకెలా తెలుసు?" అప్పుడొచ్చింది అతనికి అనుమానం.

గతుక్కుమన్నాడు మాధవ్. "అదా! మీ రామకృష్ణ ఖాళీ చేసిన రూమ్‌లోనే వుండేవాడిని నేను. అక్కడికొచ్చింది మీ లెటర్. ఏదైనా అడ్రెస్ దొరుకుతుందేమో అని ఓపెన్ చేసి చూశాం. ఏం దొరకలేదు. చించేశాం" అనేశాడు.

* * *

gutechari.com

సింహాన్ని ఆదరంగా ఆహ్వానించాడు ఏకదంతం. మస్తాన్ కేస్ అనంతరం తన పేరు డిపార్ట్‌మెంట్‌లో మారుమ్రోగటం అందరూ తనను అభినందించటం, అన్నింటినీ మించి భార్య ఎంతో మెచ్చుకోవటం జరిగాక అందుకు కారకుడైన సింహంపట్ల ఎంతో గౌరవం కలిగింది ఆయనకి. అంతే కాదు. అదివరకటి మొండితనం, వగైరాలు కూడా తగ్గాయి.

అందుకే సింహం ప్రసాద్ గురించి చెప్పినప్పుడు ముందే ససేమిరా వీల్లేదని అన్నా తర్వాత మెత్తబడ్డాడు. "అదికాదు సింహంగారూ! మా మేనల్లుడు పీతాంబరానికి ఎన్నాళ్ళ క్రిందటో మాట ఇచ్చేశాను." అన్నాడు.

"పెళ్ళిచేసుకునేది మీరా? మీ అమ్మాయా? ఎవరిమాటకి విలువ ఇవ్వాలో మీకే తెలుసు. ఇంకేమీ ఆలోచించకండి. అంగీకరించి వాళ్ళిద్దర్నీ ఆశీర్వదించండి" అన్నాడు. సరే అన్నాడు ఏకదంతం.

"నేను వెళ్ళి అతడిని పంపిస్తాను. అతడిని చూసి ఇంకెవరో అనేసుకోకండి." అనేసి లేచాడు సింహం. ఇంటికొచ్చి ప్రసాద్‌కి శుభవార్త చెప్పేసి అభినందలు అందజేసి కృతజ్ఞతలు అందుకున్నాడు.

"త్వరగా వెళ్ళండి. మీ మామగారు ఎదురుచూస్తున్నారు అన్నాడు." మరోసారి థాంక్స్ చెప్పి చేతికర్ర సహాయంతోనే వేగంగా వెళ్ళిపోయాడు ప్రసాద్.

అతనటు వెళ్ళటం ఆలస్యం జరిగినదంతా చెప్పేశాడు మాధవ్.

తలచేత్తో పట్టుకుని కూర్చున్నాడు సింహం. చచ్చేంత మొహమాటం అనిపించింది అతనికి. శాంతమ్మ బలవంతపెడితే వెళ్ళి కూర్చుని నామకార్థం నాలుగు మెతుకులు తిని లేచాడు.

మాధవ్ పక్కన కూర్చున్నాడు. "మాధవ్. నేను వచ్చినపని అయిపోయిందిరా. నీకు పూర్తిగా నయం కాగానే వెళ్ళిపోదామనుకుంటున్నాను." మెల్లిగా చెప్పాడు.

పక్కలో బాంబు పడినట్లు అదిరిపడ్డాడు మాధవ్. "వెళ్ళిపోతావా? ఎక్కడికి?"

ఎక్కడికో నాకే తెలియదు. ఇక్కడి నుండి మాత్రం వెళ్ళిపోతాను". అన్నాడు.

మాధవ్‌కి కోపం వచ్చింది. వద్దన్నాడు. కోప్పడ్డాడు. బ్రతిమాలాడు. భంగపడ్డాడు. చివరకు శాంతమ్మగారిని పిల్చి ఆ విషయం ఆవిడ చెవిన వేసి వూరుకున్నాడు.

ఆవిడ గొడవ చేసేసింది. "ఎక్కడికి వెళ్తావ్? ఎవరున్నారని వెళ్తావ్?" నిలదీసి అడిగింది.

"ఎక్కడున్నా నేను అనాథనే కదమ్మా." అన్నాడు సింహం.

ఏదీ నామొహంలోకి చూసి ఆ మాట మళ్ళీ అను. మేము నీకేమీ కామా?" అంటూ దెబ్బలాడింది.

"రావటం పోవటం అంతా నీ ఇష్టమేనా? మా ప్రసక్తి ఏమీ లేదా? ఎక్కడికీ వెళ్ళొద్దు. ఇక్కడే వుండు. అయినా పెద్దవాళ్ళు చెప్పటం చిన్నవాళ్ళు వినటం అనేది లేకుండా పోయింది" అంటూ మందలించాడు వెంకట్రావు.

"కష్టంలో కన్నకొడుకు కంటే ఎక్కువగా సహాయపడి ఆదుకున్నావ్. మా ఆపదలో ఆదుకుని అదికాగానే నా దారిన నేను పోతాను అంటే మేం ఎలా ఒప్పుకుంటాం? నీరుణం తీర్చుకునే అవకాశం ఇవ్వు. ఇక్కడే వుండు." అన్నాడు సుబ్బారావు.

లక్ష్మి సరేసరి. ఏకంగా కళ్ళనీళ్ళు పెట్టేసుకుని ప్రాధేయపడింది. ఏం చెయ్యాలో తోచలేదు సింహానికి. వసుంధర దగ్గరికి వెళ్ళాడు. అంతా వివరించాడు.

సీరియస్‌గా చూసింది వసుంధర. "వెళ్ళిపోవాలనే ఆలోచన ఎందుకొచ్చింది మీకు? ఇందులో మొహమాట పడాల్సింది ఏముంది? ఫూలిష్‌గా బిహేవ్ చేశాననీ, ఆ ఉత్తరం పట్టుకుని వెర్రి వెధవలా ప్రవర్తించాననీ అన్నారు మీరు!

ఒక్కసారి ఆలోచించి చూడండి. మీరు అలా రావటం వల్ల ఎంతమందికి మంచి జరిగింది! సుబ్బారావు గారి సంసారం బాగుపడింది. పందికొక్కుల్లా పట్టుకున్న చలం బెడద వదిలిపోయింది. లక్ష్మి జీవితం దారిన పడింది. బిడ్డకు దూరమై బాధపడుతున్న శాంతమ్మగారికి మనశ్శాంతి కలిగింది. మాధవ్‌కి అంతటి అదృష్టం కలిగింది.

అన్నింటినీ మించి పరమ కిరాతకుడు మస్తాన్ చట్టం చేతికి చిక్కాడు. తద్వారా ఏకదంతంగారు లాభం పొందారు.

ఇదంతా అటు వుంచి మన స్నేహకు మంచి పేరు వచ్చింది. మరింక మీరాక వ్యర్థం అయిపోయిందని మీరెందుకు అనుకుంటున్నారు? మీరాక వల్ల ఎంతో మేలు జరిగింది. ఈ కేస్ తర్వాత "స్నేహ" గురించి అందరికీ తెలిసిపోయింది. ఎంతోమంది లెటర్స్ రాస్తున్నారు. ధనసహాయం అందిస్తామని ముందుకి వస్తున్నారు. ఇలాటి సమయంలో స్నేహని వదిలేసి మమ్మల్నందర్నీ వదిలి వెళ్ళిపోతాననటం మీకు ధర్మం కాదు. స్నేహ కార్యక్రమాలని చూసుకునేందుకు మిమ్మల్ని ఎప్పాయింట్ చెయ్యాలని మేము అందరం ఏకాభిప్రాయానికి వచ్చాం. మీరు అంగీకరించాలి తప్పదు" అని చెప్పింది.

gudachari.com

తలవంచుకుని ఆలోచిస్తూ వుండిపోయాడు సింహం. వసుంధర చెప్పింది నిజమే. తను బాధపడటం అనవసరం. తన రాక వల్ల ఎవరికీ ఏమాత్రం నష్టం కలుగలేదు. పైగా మంచే జరిగింది. "మీరు చెప్పింది నిజం. నేనేదో అనవసరంగా వూహించుకుని బాధపడ్డాను. చెప్పండి స్నేహలో నాకేం ఉద్యోగం ఇస్తున్నారు? నేనేం చెయ్యాలి? ఉత్సాహంగా అడిగాడు.

అంతా వివరించింది వసుంధర. అతనికెంతో సంతోషం కలిగింది. తనకెంతో ఇష్టమైన పని చాతనైనంతలో ఇతర్లకు సహాయం చెయ్యడం. అదే ఉద్యోగం దొరికితే యిక చెప్పేది ఏముంది.?

"మంచి వార్త వినిపించారు. నాకెంతో సంతోషంగా వుంది!" అన్నాడు. అతని వంక చూసింది వసుంధర.

"సమయం వచ్చినప్పుడు ఇంకా మంచి వార్త వినిపించి ఇంకా సంతోషించేలా చేస్తాను" అంటూ తలవంచుకుంది.

చివాల్న తల ఎత్తాడు సింహం. కుర్చీలోంచి లేచింది వసుంధర.

"మీకు తెలుసుగా. ఆర్. హెచ్. నెగిటివ్ చాలా రేర్ బ్లడ్ గ్రూప్. ఆ గ్రూప్ బ్లడ్ అవసరం అయితే పరుగులు పెట్టడం, టి.వి. ఎనౌన్స్‌మెంట్ చేయించటం, హడావిడి, ఆదుర్దా. అలాకాకుండా సర్వే చేసి ఆ గ్రూప్ బ్లడ్ కలవాళ్లను నలుగురైదుగురిని వెతికి పట్టుకుంటే ఎమర్జెన్సీలో ఉపయోగపడుతుంది. ఈ పనిచేద్దామని ఎన్నాళ్ళనించో ప్లాన్. ఏదీ తీరిక దొరికితేనా? ఇప్పుడు ఫ్రీగా వున్నాను కదా. వెళ్దామనుకుంటున్నాను." అని చెప్పింది.

సింహం కూడా లేచాడు. "గుడ్ ఐడియా. పదండి నేనూ వస్తాను. కలిసే వెళ్దాం" అన్నాడు.

ఇద్దరూ కలిసి స్కూటర్ మీద సర్వేకి బయలుదేరారు.

- శుభం -

gudaalam.com